

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 173

శనివారం 13-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

నమ్మకంతో నక్షత్రాలై!

'స్థిరమైన ఉద్యోగం ఉంటే చాలు' అనుకునే మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రుచి కల్రా డిక్షనరీలో 'ఇక చాలు' అనే మాట ఎప్పుడూ లేదు. సక్సెస్‌ఫుల్ కన్సల్టెంట్ నుంచి సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారింది. మొదట 73 మంది ఇన్వెస్టర్‌ల నుంచి ఆమెకు తిరస్కారం ఎదురైంది. ఒకే ఒక్క ఇన్వెస్టర్ నమ్మాడు. ఆ నమ్మకమే గొప్ప విజయం అయింది.



– వివరాలు IIలో

గెలుపు దారి

‘స్థిరమైన ఉద్యోగం ఉంటే చాలు’ అనుకునే మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రుచి కల్రా డిక్షనరీలో ‘ఇక చాలు’ అనే మాట ఎప్పుడూ లేదు.

సక్సెస్‌ఫుల్ కన్సల్టెంట్ నుంచి సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారింది. మొదట 73 మంది ఇన్వెస్టర్‌ల నుంచి ఆమెకు తిరస్కారం ఎదురైంది. ఒకే ఒక్క ఇన్వెస్టర్ నమ్మాడు. ఆ నమ్మకమే గొప్ప విజయం అయింది.

పేషెంట్లు, హాస్పిటల్స్ మధ్య దూరం ఉందని గ్రహించిన గరిమ సానే ‘ప్రిస్టిన్ కేర్’తో హెల్త్‌కేర్ రంగంలోకి అడుగు పెట్టింది. మొదట్లో ఆమె మాటలను పెద్దగా ఎవరూ విశ్వసించలేదు. అయినా ఆమె ప్రయాణం ఆపలేదు. విశ్వసనీయతే జీవనాడిగా ప్రయాణం ప్రారంభించిన ప్రిస్టీన్‌కేర్ హెల్త్‌కేర్ రంగంలో సరికొత్త సంచలనం అయింది.

‘సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్’గా పేరు తెచ్చుకోవాలనే ఉత్సాహంతో ఒక స్టార్టప్‌తో ప్రయాణం మొదలుపెట్టిన వినీతా సింగ్‌కు అపజయాలు హాయ్ చెప్పాయి. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలంటే ఉత్సాహం ఒక్కటే సరిపోదని వ్యూహం కూడా కావాలని గ్రహించి మేకప్ బ్రాండ్ ‘షుగర్ కాస్మొటిక్స్’తో తిరుగులేని విజయాన్ని సాధించింది.

దేశీయ యూనికార్న్ క్లబ్‌లో కొన్ని స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను కోల్పోయాయి. కొన్ని మాత్రం ఆ హోదాను స్థిరంగా నిలుపుకుంటూనే, ఔత్సాహికులకు స్ఫూర్తినిస్తున్నాయి.

‘వైవిధ్యమైన రంగాలలో మహిళా వ్యాపారవేత్తలు అద్భుత విజయాలు సాధించారు’ అంటూ గరిమ సానే (ప్రిస్టీన్ కేర్), రుచి కల్రా (ఆఫ్ బిజినెస్), వినీతా సింగ్ (షుగర్ కాస్మొటిక్స్) పేర్లను ప్రస్తావించింది ఏఎస్‌కె ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా యూనికార్న్ అండ్ ఫ్యూచర్ యూనికార్న్–2025 నివేదిక.

ఈ ముగ్గురు ఎవర్‌గ్రీన్ యూనికార్న్ స్టార్‌ల సక్సెస్ మంత్రా గురించి...



వినీతా సింగ్



గరిమ సానే

పరాజయాల తరువాత ఘన విజయం

నమ్మకంతో నక్షత్రాలై!

లక్నోకు చెందిన వినీతాసింగ్ చదువులో ఎప్పుడూ ముందుండేది. స్కూల్, కాలేజి రోజుల్లో బంగారు పతకాలు అందుకుంది. ఐఐటీ, మద్రాస్‌లో చదువుకున్న వినీత బ్యాడ్మింటన్‌లో సత్తా చాటేది. ఎన్నో టోర్నమెంట్స్‌లో విజయం సాధించింది. పరుగు పందేలలో కూడా దూసుకుపోయేది. ఒక్కమాటలో చెప్పాలంటే చురుకుదనానికి కేరాఫ్ అడ్రస్‌లా ఉండేది.

ఇన్వెస్టింగ్ బ్యాంకింగ్‌లో విలువైన అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని వదులుకొని ‘క్వెజాల్’ వెంచర్ మొదలు పెట్టింది. ఆ స్టార్టప్ విజయం సాధించలేదు. ఆ తరువాత ప్రారంభించిన ‘ఫ్యాబ్–బాగ్’ అంతంతమాత్రమే అనిపించింది. అయినప్పటికీ ‘ఇక చాలు’ అనుకోలేదు. గట్టి విజయం కోసం తపన పోలేదు.

‘షుగర్ కాస్మొటిక్స్’ స్టార్టప్‌తోతో అసలు సిసలు విజయాన్ని అందుకుంది.

‘రకరకాల స్కిన్ టోన్‌లను దృష్టిలో పెట్టుకొని అధిక నాణ్యతతో కూడిన, అందుబాటు ధరల్లో ఉండే ప్రాడక్ట్స్‌ను తీసుకువచ్చాం’ అంటుంది వినీతాసింగ్.

‘షుగర్ కాస్మొటిక్స్’లో పనిచేస్తున్న 75 శాతం మంది ఉద్యోగులు మహిళలే కావడం విశేషం.

రియాలిటీ షో ‘షార్క్ ట్యాంక్ ఇండియా’ కార్యక్రమంలో జడ్జీ, ఇన్వెస్టర్‌గా రెండు బాధ్యతలు నిర్వహిస్తోంది వినీత. ఈ కార్యక్రమం ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్ కావాలనుకునే ప్రతిభావంతులకు విలువైన సలహాలు ఇస్తోంది. వారి కలలు సాకారం చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తోంది.

యూనికార్న్ స్టార్‌గా వినీతాసింగ్ విజయం ఎన్నో విషయాలను చెప్పకనే చెబుతుంది. అందులో ఒకటి....

‘కష్టపడితే... కాలంతో పాటు నడిస్తే ఏదీ అసాధ్యం కాదు’

డెబ్బైమూడు మంది తిరస్కరించారు!



రుచి కల్రా

పంజాబ్‌లోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రుచి కల్రా కెమికల్ ఇంజినీరింగ్ చదువుకుంది. అయినప్పటికీ ఆర్థికవిషయాలపై ఆసక్తి ఉండేది. ఆ ఆసక్తితోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఎంబీఏ చేసింది. చదువు పూర్తయిన తరువాత మెకెన్జీ అండ్ కంపెనీలో తొమ్మిది సంవత్సరాల పాటు పనిచేసింది. ఆ కంపెనీలో పనిచేసిన అనుభవం తనలోని నైపుణ్యాలను మెరుగు దిద్దుకునేలా చేసింది. ఆ నైపుణ్య బలమే వ్యాపారవేత్తగా తన ప్రయాణానికి ఇంధనం అయింది. మెటల్స్, కెమికల్స్, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన బీ2బీ కామర్స్ ప్లాట్‌ఫామ్ ‘ఆఫ్‌బిజినెస్’కు శ్రీకారం చుట్టింది. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలకు ముడి సరుకును అందించే కంపెనీ ఇది. మొదట్లో 73 మంది ఇన్వెస్టర్‌ల నుంచి తిరస్కారం ఎదురైంది. ఒకే ఒక్క ఇన్వెస్టర్ నమ్మాడు.‘ఆఫ్‌బిజినెస్’ను సక్సెస్‌ఫుల్ వెంచర్‌గా తీర్చిదిద్దిన రుచి కల్రా ఆ తరువాత ఈ కంపెనీకి అనుబంధంగా ‘ఆక్సీజో’ పేరుతో ఫైనాన్షియల్ సర్వీసెస్ మొదలుపెట్టింది.

బలమైన నాయకత్వ సామర్థ్యానికి అంకితభావం తోడైతే ఎంత విజయం సాధించవచ్చో నిరూపించింది రుచి. ‘ఆఫ్‌బిజినెస్’ విజయంతో ఎంతోమంది ఔత్సాహికులు, వ్యాపార రంగంలోకి రావాలని కలలనే కనే యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది.

మొదట్లో ఎవరూ విశ్వసించలేదు!

గైనకాలజిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకున్న డా. గరిమ సానే ‘ప్రిస్టీన్ కేర్’తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారింది. తన వైద్య వృత్తి ద్వారాఎన్నోరకాల నైపుణ్యాలను సొంతం చేసుకున్న గరిమకు ఓపిక ఎక్కువ. తొందరపాటు లేదు. ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటుంది.

అధిక పనిభారం, తక్కువమంది సిబ్బంది, పేషెంట్లపై సరియైన శ్రద్ధ చూపకపోవడం... కొన్ని హాస్పిటల్స్‌లో ఈ పరిస్థితిని చూసిన గరిమ ‘ప్రిస్టీన్ కేర్’తో హెల్త్‌కేర్ రంగంలోకి అడుగుపెట్టింది. హాస్పిటల్స్‌కు, పేషెంట్లకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించాలి, పేషెంట్లు కోరుకునే క్వాలిటీ సర్జికల్ కేర్‌ను అందించాలి అనే లక్ష్యంతో ప్రయాణం మొదలు పెట్టింది.

వైద్యుల ఎంపిక, క్లినిక్‌లో అపాయింట్‌మెంట్, డయాగ్నోస్టిక్ కేంద్రాలలో టెస్ట్‌లు బుకింగ్ చేయడం, ఇన్సూరెన్స్ పేపర్ వర్క్, హాస్పిటల్ అడ్మిషన్–డిశ్చార్జీ ప్రాసెస్, సర్జరీ తరువాత ఫాలో–అప్ కన్సల్టేషన్, రకరకాల డిపార్ట్‌మెంట్‌లతో సమన్వయం... మొదలైన పనులు ప్రిస్టీన్ కేర్ జాబితాలో ఉన్నాయి. అందుకే పేషెంట్ల సర్జరీని సులభతరం చేసే అత్యాధునిక హెల్త్‌కేర్ కంపెనీగా ‘ప్రిస్టీన్ కేర్’ పేరు తెచ్చుకుంది.

ప్రస్తుతం ప్రిస్టీన్ కేర్ 150కి పైగా క్లినిక్స్, 800కి పైగా పార్ట్‌నర్ హాస్పిటల్స్, 400కి పైగా సూపర్ స్పెషలిస్ట్ సర్జన్‌లను ఆపరేట్ చేస్తుంది.

మొదట్లో చాలామంది వైద్యులు, హాస్పిటల్స్ గరిమ చెప్పే మాటలను పెద్దగా విశ్వసించలేదు. ఆ తరువాత వారికి ప్రిస్టీన్ కేర్ అంకితభావం, కష్టం అర్థమయ్యాయి.

‘హెల్త్‌కేర్ అనేది కేవలం సైన్స్ మాత్రమే కాదు నమ్మకం, భావోద్వేగాలు కూడా అందులో మిళితమై ఉన్నాయి’ అంటున్న గరిమ మార్కెటింగ్ వ్యూహాలను బాగా అర్థం చేసుకుంది. ఆ వ్యూహాలతో కంపెనీని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లింది. ‘సర్జరీ సింప్లిఫైడ్’ అనేది పిస్టీన్ కేర్ ట్యాగ్‌లైన్.

● వైరల్

వెళ్లకోయి పరదేశీ..!



అనుబంధాలు, ఆప్యాయతలకు భాష, సరిహద్దులతో పనిలేదు అని చెప్పడానికి ఈ వైరల్ వీడియో నిదర్శనం. విదేశీ పర్యాటకురాలిగా బెంగళూరుకు వచ్చిన అరీనా అక్కడే పదిహేను రోజులు ఉన్నది. ఆ రోజులు తనని మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లాయి.

పర్యాటక ప్రదేశాలు మాత్రమే కాదు రద్దీతో నిండిన మార్కెట్లు, పండగ ఉత్సవాలు, జాతరలు, కష్టజీవుల జీవితాలను దగ్గరి నుంచి చూసింది. ఈ క్రమంలో తనకు ఎంతోమంది పరిచయం అయ్యారు.

‘బెంగళూరులో పదిహేను రోజులు ఉన్న నేను ఈ దేశంతో పూర్తిగా ప్రేమలో పడిపోయాను. ఇండియా అనేది ఆధ్యాత్మిక శక్తితో కూడిన అద్భుతం దేశం’ అని తన పోస్ట్‌లో రాసింది అరీనా.

బెంగళూరులోని వైవిధ్య భరిత సాంస్కృతిక సౌరభాన్ని ప్రశంసించింది.

‘బెంగళూరు వీధుల్లో అలా నడుచుకుంటూ పోతే చాలు ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తుంది. ప్రతి మూల ఏదో ఒక ప్రత్యేకత కళ్లకు కడుతుంది’ అంటున్న అరీనా బెంగళూరులో ఉన్నన్ని రోజులు సంప్రదాయ దుస్తులే ధరించింది. మతసంబంధమైన కార్యక్రమాలు, ప్రార్థనలలో పాల్గొనేది.

‘ఈ దేశాన్ని విడిచి వెళ్లాలంటే మనసుకు చాలా కష్టంగా ఉంది’ అని భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకుంది అరీనా.


బుక్ కార్నర్



అక్షర ప్రియ

నటిగా సుపరిచితురాలైన ప్రియాంక చోప్రా సింగర్, రైటర్ కూడా. పుస్తకాలు బాగా చదివే అలవాటు ఉన్న ప్రియాంక, తాను చదివిన పుస్తకాల గురించి తన అభిప్రాయాలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా ‘మీరు ఈ పుస్తకాలు చదివితే బాగుంటుంది’ అంటూ కొన్ని పుస్తకాల పేర్లు సూచించింది. అవి...

వాయిసెస్ ఆఫ్ పవర్‌ఫుల్ ఉమెన్– జోయి సలీస్
లాంగ్ వాక్ టు ఫ్రీడమ్ – నెల్సన్ మండేల
హోమ్‌గోయింగ్ –యా గ్యాసీ
అన్‌టేమ్‌డ్ –గ్లెనన్ డోయల్



లాంగ్ వాక్ టు ఫ్రీడమ్


నెలన్స్ మండేల అనే పేరులోనే పిడికిలి బిగించిన దృశ్యం ఆవిష్కారం అవుతుంది. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని సంవత్సరాలు జైలుపాలైనా ఎప్పుడూ రాజీపడలేదు. మడమ తిప్పలేదు. జాత్యహంకారంపై నిరంతర పోరాటం చేశాడు. ‘లాంగ్ వాక్ టు ఫ్రీడమ్’ ఆయన జీవితానికి అద్దం పట్టే పుస్తకం. బాల్యం నుంచి అధ్యక్షుడి వరకు మండేలా జీవితంలోని ఎన్నో ఘట్టాలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి.



వాయిస్ ఆఫ్ పవర్‌ఫుల్ ఉమెన్

ఎన్నో కష్టాలు, ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిన స్ఫూర్తియకమైన మహిళల గురించి రాసిన పుస్తకం ‘వాయిస్ ఆఫ్ పవర్‌ఫుల్ ఉమెన్’. మహిళా సాధికారత, వారి నాయకత్వ పటిమ, స్త్రీవాద భావజాలం, వ్యక్తిత్వ వికాసానికి అద్దం పట్టే పుస్తకం ఇది. ఇసాబెల్ అలెండే, జంగ్ చాంగ్, మారి కొల్విన్, కార్ల డెల్ పాంటే, శామి చక్రవర్తి, బేనజీర్ భుట్టో, స్వానీ హంట్, వంగారి మాథాయి, ట్రేసీ ఎమిన్... మొదలైన నలభైమంది స్ఫూర్తిదాయక మహిళల జీవితకథలు ఈ పుస్తకంలో కనిపిస్తాయి. ఈ నలభైమంది మహిళలలో రాజకీయ నాయకులు, పర్యావరణ ఉద్యమకారులు, సంగీతకారులు, వ్యాపారవేత్తలు, సంఘసేవకులు... వివిధ రంగాలకు చెందిన మహిళలు ఉన్నారు.


హోమ్ గోయింగ్



యా గ్యాసీ రాసిన ‘హోమ్‌గోయింగ్’ కాల్పనిక చారిత్రక నవల. బ్రిటిష్ వలసవాద కాలంలోని బానిసల జీవితానికి అద్దం పట్టే పుస్తకం ఇది. ఈ నవల కాలం 18వ శతాబ్దం. అక్క, చెల్లెళ్ల ఈ నవలలో ప్రధాన పాత్రలు. అక్క బానిస. చెల్లి ఒక బ్రిటిష్ గవర్నర్‌ను వివాహం చేసుకుంటుంది. పద్నాలుగు పాత్రలు కేంద్రంగా నడిచే ‘హోమ్‌గోయింగ్’ వందల సంవత్సరాల చారిత్రక ఘట్టాలను గుర్తు తెస్తుంది.

‘చిన్న కథలతో కూడిన పెద్ద నవల’ అని ఈ పుస్తకం గురించి చెబుతుంటారు.

అన్‌టేమ్‌డ్



గ్లెనన్ డియోల్ ‘అన్‌టేమ్‌డ్’ సండే టైమ్స్ నంబర్ వన్ బుక్ సెల్లర్‌గా నిలిచింది. స్వీయశోధన తాలూకు ప్రయాణంలో రచయిత్రి జ్ఞాపకాల సమాహారమే... అన్‌టేమ్‌డ్. ఈ పుస్తకానికి అక్షర బలం... స్త్రీ సాధికారత.

‘మీ మనసులో భూంకంపం పుట్టించే పుస్తకం ఇది’ అంటాడు ఒక విశ్లేషకుడు. ‘మిమ్మల్ని మీరు ప్రేమించుకోగలిగినప్పుడే అనంతమైన శక్తి మీలోకి వచ్చి చేరుతుంది. అలాంటి శక్తి మీలోకి రావాలంటే ఈ పుస్తకం చదవండి’ అంటాడు మరో విమర్శకుడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ‘అన్‌టేమ్‌డ్’ చదవడమంటే... మన మనసుతో చేసే మౌనసంభాషణ.

‘చదవండి... సాధన చేయండి’ అనేది ఈ పుస్తకం ఇచ్చే నినాదం.

వంటిల్లు

డిప్ చేయండి.. లాగించేయండి!

వయసు తేడాలు లేకుండా అందరికీ నచ్చేది. ఎవరికైనా కానుకగా ఇవ్వాలన్నా సరైన ఎంపికగా ఉండేది. భావోద్వేగాల అదుపుకు సహాయకారిగా మారేది. నలుగురిలో ఉన్నప్పుడు ఆనందపు సంబరాన్ని క్షణాల్లో మూటగట్టి తెచ్చే నేస్తం... చాక్లెట్. పండ్ల ముక్కలతో, డ్రై ఫ్రూట్స్‌తో చాక్లెట్‌ను సులువుగా తయారు చేసుకుందాం. ఆరోగ్యకరమైన ఆనందాన్ని ఇంటర్నేషనల్ చాక్లెట్ డే సందర్భంగా మన వంటింటి నుంచే పంచుకుందాం.



ఫ్రూట్ - నట్స్ చాక్లెట్

కావల్సినవి: **దార్క్ చాక్లెట్** – 350 గ్రా.లు; **జీడిపప్పు** – 50 గ్రా.లు / అర కప్పు; **బాదం పప్పు** – 50 గ్రా.లు / అర కప్పు; **కిస్మిస్** – 50 గ్రా.లు / అరకప్పు; **టూటీ ఫ్రూటీ** – అరకప్పు (నారింజ – ఆకుపచ్చవి); **నచ్చిన అచ్చు** – 1; **బటర్** – అచ్చులపైన రాయడానికి టీస్పూన్;

తయారీ: ● ముందుగా నచ్చిన అచ్చు తీసుకొని, దానిని బటర్‌తో రాసి, కాసేపు పక్కన ఉంచాలి. ● డబుల్ బాయిలర్ పద్ధతిలో చాక్లెట్‌ను కరిగించి, పక్కన పెట్టాలి. ● నట్స్, డ్రై ఫ్రూట్స్‌ని సన్నని ముక్కలుగా కట్ చేయాలి. వీటిని కరిగిన చాక్లెట్‌లో వేసి బాగా కలపాలి. ● ఈ మిశ్రమాన్ని స్పూన్‌తో తీసుకొని, సిద్ధంగా ఉంచిన అచ్చును నింపి, పైన డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించి, గంటసేపు డీప్ ఫ్రీజర్‌లో ఉంచాలి. ● మిశ్రమం పూర్తిగా గట్టి పడిందని నిర్ధారించుకున్నాక, దానిని ఆస్వాదించవచ్చు. గిఫ్ట్‌గానూ ఇవ్వచ్చు.

చాక్లెట్ కవర్డ్ ఫ్రూట్



కావల్సినవి:
సెమీ స్వీట్ కోకో చాక్లెట్ చిప్స్ – కప్పు
బటర్ – 2 టేబుల్ స్పూన్లు
ఫ్రూట్స్ (స్ట్రాబెర్రీ/ఆరెంజ్/ ద్రాక్ష / అరటి పండు,..) స్లైసులుగా కట్ చేసుకోవాలి – తగినన్ని
బేకింగ్ షీట్ – 1

తయారీ:
చాక్లెట్‌ను డబుల్ బాయిలర్ పద్ధతిలో కరిగించాలి. (స్టెయిన్‌లెస్ లేదా గాజు గిన్నెలో చాక్లెట్ వేసి, మరుగుతున్న నీటిలో ఆ గిన్నెను ఉంచి, కలుపుతూ ఉండాలి. చాక్లెట్ కరిగాక ఆ గిన్నెను బయటకు తీసి, ఒక్కో స్ట్రాబెర్రీ లేదా నచ్చిన పండు ముక్కను ఆ మిశ్రమంలో ముంచి, ప్లేట్‌పై పరిచిన బేకింగ్ షీట్‌పై ఉంచాలి. దానిని డీప్ ఫ్రీజర్‌లో ఉంచి, అరగంట తర్వాత బయటకు తీసి సర్వ్ చేయాలి.

చాక్లెట్ బాల్స్



కావల్సినవి:
డ్రై ఆప్రికాట్స్ – 125 గ్రా. (తరగాలి);
ఎండుద్రాక్ష – అర కప్పు (తరగాలి);
ఆరెంజ్ తొక్క తరుగు – 2 టీ స్పూన్లు;
డార్క్ చాకోలెట్ తరుగు – 75 గ్రా.;
డార్క్ చాకోలెట్ (అదనంగా) – 200 గ్రాం.లు;
బటర్ – 75 గ్రా.;


తయారీ:
ఒక గిన్నెలో ఆప్రికాట్, ఎండుద్రాక్ష, ఆరెంజ్ తొక్క తరుగు, డార్క్ చాకోలెట్ తరుగు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని టీ స్పూన్ అంత తీసుకొని బాల్స్‌లా చేయాలి. వీటిని డీప్ ఫ్రీజర్‌లో రాత్రంతా ఉంచాలి. అదనంగా తీసుకున్న 200 గ్రా.ల చాకోలెట్‌ను ముక్కలుగా చేయాలి. ఒక గిన్నెలో బటర్, చాకోలెట్ ముక్కలు వేయాలి. పాన్‌లో నీళ్ల పోసి, మరిగించి, ఆ నీటిలో ఈ గిన్నె ఉంచి చాకోలెట్ కరిగించాలి. మిశ్రమం మృదువుగా అయ్యాక దించాలి. ఫ్రిజ్ నుంచి తీసిన ఫ్రూట్ బాల్స్‌ని చాకోలెట్ మిశ్రమంలో ముంచి, తీయాలి. ఆరాక ఫాయిల్ పేపర్‌లో ఒక్కో చాకోలెట్ బాల్‌ని ఉంచి, చుట్టాలి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచి అరగంట తర్వాత సర్వ్ చేయాలి.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) సెప్టెంబర్ 12న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,14,200	బంగారం (24 క్యారెట్లు)	1,13,300	బంగారం (24 క్యారెట్లు)	1,11,280
బంగారం (22 క్యారెట్లు)	1,07,270	బంగారం (22 క్యారెట్లు)	1,02,000	బంగారం (22 క్యారెట్లు)	1,02,000
వెండి	1,33,000	వెండి	1,32,200	వెండి	1,42,000

రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,11,280	బంగారం (24 క్యారెట్లు)	1,13,200	బంగారం (24 క్యారెట్లు)	1,11,700
బంగారం (22 క్యారెట్లు)	1,02,000	బంగారం (22 క్యారెట్లు)	1,04,140	బంగారం (22 క్యారెట్లు)	1,02,400
వెండి	1,42,000	వెండి	1,31,60	వెండి	1,42,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 173

శనివారం 13-9-2025



'పసిడి' పోరుకు జైస్మీన్, నుపుర్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరిన భారత మహిళా బాక్సర్లు -15లో



భవిష్యత్ భారత్‌దే

తయారీ హబ్‌గా ఎదగొచ్చు.. మారుతీ సుజుకీ ఇండియా ఎండీ తకేయూచి -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేడు మణిపూర్‌కు ప్రధాని...

ప్రధాని మోదీ శనివారం మణిపూర్‌లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.


- వివరాలు 6లో▶



జస్టిస్ సుశీల కర్కీకే పీఠం

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల కర్కీ ఎంపికయ్యారు.

- వివరాలు 6లో▶



బొల్సొనారోకు 27 ఏళ్ల జైలు

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారోకు ఆ దేశ సుప్రీంకోర్టు 27 సంవత్సరాల 3 నెలల జైలు శిక్ష విధించింది.

- వివరాలు 6లో▶



మందలించాడని తల నరికేశాడు

అమెరికాలోని డాలస్‌లో చంద్రమౌళి నాగమల్లయ్య అనే భారతీయుడిని ఓ హోటల్ కార్మికుడు కిరాతకంగా హత్య చేశాడు.

- వివరాలు 6లో▶

'ఫీజు'కు ఎంత కోత పెట్టొచ్చు?



75% హాజరు లేని విద్యార్థులకు 'ఫీజు'లో కోత పెట్టాల్సిందేనని వివిధ వర్సిటీల వీసీలతో సమావేశమైన ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి పేర్కొన్నట్లు తెలిసింది

- వివరాలు 2లో▶

ప్రైవేటు కాలేజీలు బంద్



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సాధించుకునే దిశగా ఆందోళన చేపట్టాలని రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు 'ఫతి' ప్రతినిధులు ఉన్నత విద్యామండలికి లిఖితపూర్వకంగా తెలిపారు.

- వివరాలు 2లో▶

పైసలకు కటకట..
పాలన వెలవెల



కొత్త మున్సిపాలిటీల్లో సవాలక్ష సమస్యలు

- ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక ఇబ్బందులు
- పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి
- మున్సిపాలిటీలుగా అప్ గ్రేడ్ అయినా పాత వేతనాలే
- కమిషనర్ల వేతనాలు కూడా జనరల్ ఫండ్ నుంచే
- ఇంజనీరింగ్, ఇతర పాలనా సిబ్బంది కోసం వెయిటింగ్
- ప్రత్యేక గ్రాంట్లు ఇస్తే తప్ప మున్సిపాలిటీల మనుగడ కష్టమే అంటున్న స్థానికులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక సిబ్బందికి నెలల తరబడి వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం కేటాయించకపోవడంతో పాలన కుంటుపడుతోంది. వివిధ శాఖల నుంచి రావాల్సిన సెస్సులు, గ్రాంట్లు రాకపోవడంతో ఆర్థికంగా సతమతం అవుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు దఫాలుగా 20 కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. ప్రత్యేక గ్రాంట్లు ఇస్తే తప్ప ఈ మున్సిపాలిటీలు మనుగడ సాగించే పరిస్థితి లేదని స్థానికులు అంటున్నారు.

సిబ్బంది, మౌలిక వసతుల లేమి..

కొత్త మున్సిపాలిటీల్లో సిబ్బంది, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన స్థిర, చరాస్తులు.. భవనాలు, లే ఔట్ అనుమతులు, పన్నుల వసూలుకు సంబంధించిన ఫైళ్లను కమిషనర్లు స్వాధీనం చేసుకుంటున్నారు. కొత్త మున్సిపాలిటీల్లో కమిషనర్, మేనేజర్ వంటి ఒకటిరెండు మినహా మిగతా పోస్టుల్లో సమీప మున్సిపాలిటీలకు చెందిన అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు కొత్త మున్సిపాలిటీలకు అరుదుగా వచ్చి వెళ్తున్నారు. మేనేజర్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ వంటి పోస్టులు భర్తీ కాకపోవడంతో పాలనపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు మున్సిపల్ కార్యాలయాలుగా బోర్డులు మార్చినా ఫర్నిచర్ కొరత వేధిస్తోంది. రికార్డులను భద్రపరచడం సమస్యగా మారింది. మున్సిపల్ కార్యాలయాలకు వచ్చే వారు కనీసం కూర్చునే పరిస్థితి లేదు.

ఆదాయానికి, ఖర్చుకు కుదరని లంకె..

కొత్త మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయానికి, ఖర్చుకు పొంతన కుదరక మిగతా 2వ పేజీలో ▶

ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

- ఆయనతో ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, షా, మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్
- కార్యక్రమానికి రాని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీ

3 లో



శుక్రవారం ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

16 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్

- 16,620 మంది ర్యాంకర్లతో ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల
- స్టేట్ టాపర్‌గా నీట్‌లో 144వ ర్యాంకు సాధించిన ఎస్.ప్రజ్ఞేశ్వర్‌రావు

- వివరాలు 16లో

ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణలు

ఫిర్యాదుదారులకు..

మూడురోజుల్లోగా సమాధానం ఇవ్వాలన్న స్పీకర్ 12 లో

గోదావరి పుష్కరాలకు శాశ్వత ఏర్పాట్లు



- ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు మొదలు పెట్టాలి
- దక్షిణాది కుంభమేళా అన్నట్లుగా నిర్వహణ ఉండాలి
- గోదావరి తీరంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాలి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

- వివరాలు 5లో

క్లుప్తంగా...

పదేళ్లు విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు

కేసీఆర్ కేవలం కుటుంబం కోసమే పనిచేశారు: మంత్రి అడ్లూరి



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కేవలం తన కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. ప్రజాప్రభుత్వం ఏర్పాటు తర్వాత గురుకుల విద్యా సంస్థలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను భారీగా పెంచి, నాణ్యమైన డైట్‌ను అందిస్తున్నామన్నారు. బకాయిలు లేకుండా గురుకుల సొసైటీలు, సంక్షేమశాఖలకు నిధులు విడుదల చేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సంక్షేమ శాఖల పర్యవేక్షణను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్, పార్ట్‌టైమ్, సబ్జెక్ట్ అసోసియేట్స్‌కి వేతనాలను పూర్తిస్థాయిలో విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వం ప్రగతి భవన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు కట్టుకోవడానికి నిధులు ఖర్చు చేసిందని, కానీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వసతి గృహాల కోసం సొంత భవనాలు నిర్మించలేదని అన్నారు. స్కూళ్లు, పిల్లల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దని సూచించారు.

నేడు అంబేడ్కర్ వర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశపరీక్ష

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను ఎల్బీనగర్ సర్కిల్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్ (ఐడీజెడ్)- (1577) రంగారెడ్డి, హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయ పోర్టల్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్ లేదా 040-23680411/498/240లో సంప్రదించవచ్చని సూచించారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ/ బీకాం/బీఎస్సీ/ ఎమ్మెస్సీ, ఎంబీఏ) కోర్సులు, బ్యాచిలర్ ఆఫ్ లైఫ్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, డిప్లొమా తదితర సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల గడువును సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం, సందేహాల నివృత్తికి సమీపంలోని అధ్యయన కేంద్రంలో లేదా విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నంబర్లు 040-23680333/ 444/ 555, టోల్‌ఫ్రీ నంబర్ 18005990101 లో సంప్రదించాలని సూచించారు.

ఇదండీ సంగతి



విశ్వపరిశోధనాలయాలు

భారత్‌లో ఆవిష్కరణల వేగం పుంజుకొంది. దానికి తగ్గట్టుగా మేధో సంపత్తి హక్కుల (ఐపీ) కోసం దరఖాస్తులూ వెల్లువెత్తుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం దేశంలో దాఖలైన పేటెంట్లలో భారతీయ సంస్థల వాటా 20% కంటే తక్కువ. 2023కి వచ్చేసరికి ముఖచిత్రం మారిపోయింది. మొత్తం పేటెంట్ ఫైలింగ్స్‌లో ఏకంగా 57 శాతం వాటాతో మన సంస్థలు సత్తా చాటాయి. దరఖాస్తుల్లో దేశీయ యూనివర్సిటీలు ముందంజలో ఉండడం విశేషం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

- విద్యా సంస్థల నుంచి పేటెంట్ దరఖాస్తులు
- మొత్తం అప్లికేషన్లలో వీటిదే అగ్రస్థానం
- 2009తో పోలిస్తే మూడురెట్లు పెరుగుదల



పెరిగిన వేగం

రెండేళ్లలో దాఖలైన దాదాపు 80% పేటెంట్లు ఇప్పటికీ నమోదు కోసం వేచి ఉన్నాయి. అయితే 2000ల ప్రారంభంలో ఒక్కో పేటెంట్ మంజూరుకు 8-10 సంవత్సరాలు పట్టింది. 2020లో చాలావరకు 2-3 ఏళ్లలోపే అయిపోయాయి. కొన్ని దరఖాస్తు చేసిన ఏడాదిలోనే మంజూరయ్యాయి.

పేటెంట్ దరఖాస్తుల తీరు.. విభాగాల వారీగా పెరిగిన శాతం..

విభాగం	2000	2023
కంప్యూటర్ సైన్స్	1.27	26.5
ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్	8.27	16.41
భౌతిక శాస్త్రం	2	4
బయోమెడికల్	0.6	10

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే స్థాయి నుండి సృష్టికర్తగా మారడానికి మనదేశం క్రమంగా అడుగులేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2014-15లో భారతీయుల నుంచి వచ్చిన పేటెంట్ దరఖాస్తులు 12,071 కాగా, 2023-24 నాటికి ఇది 51,574కు పెరగడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. అలాగే, అప్పట్లో పేటెంట్ల మంజూరు కేవలం 684 కాగా, పదేళ్లలో 25,082కు పెరిగింది. పేటెంట్ నియమాలకు సవరణలతో నిర్దిష్ట గ్రూప్స్‌నకు వేగంగా పరీక్షలు, గడువు కాలాన్ని సరళీకృతం చేయడం.. విద్యా సంస్థలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు దరఖాస్తు రుసుములను 80% తగ్గించడం.. ఫైలింగ్, సమాచారం పూర్తిగా డిజిటలైజేషన్ వంటి సంస్కరణలకు దారితీశాయి.

యూనివర్సిటీల సత్తా

పేటెంట్ దాఖలు, టెక్నాలజీ బదిలీ, మేధోసంపత్తి హక్కుల (ఐపీ) ద్వారా ఆదాయ సముపార్జన వంటి అంశాల్లో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సహాయం చేయడానికి ప్రత్యేక ఐపీ సెల్స్‌ను, చట్టపరమైన సహాయ విభాగాలను ఏర్పాటు చేయడం ద్వారా విశ్వవిద్యాలయాలు కూడా ముందంజలో ఉన్నాయి. ఉన్నత విద్యా సంస్థలలో మేధోసంపత్తి హక్కులపై అవగాహన కోసం ప్రభుత్వం 2020లో 'కపిల' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అలాగే 2016లో నీతి ఆయోగ్ ప్రారంభించిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలు, వ్యవస్థాపకతను పెంపొందిస్తోంది. 2021 సెప్టెంబరు నుంచి పేటెంట్ దరఖాస్తు రుసుము గణనీయంగా తగ్గడం యూనివర్సిటీల్లో జోష్ నింపింది. ఐఐటీ మద్రాస్ 2022లో 156 పేటెంట్లను అందుకోగా.. ఏడాదిలో ఈ సంఖ్య 300కి చేరింది. ఐఐటీ బాంబే 2023-24లో 421 పేటెంట్లతో దేశంలో అగ్రస్థానంలో ఉంది.

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్ 2020లో 48వ స్థానం నుంచి 2024లో 39వ స్థానానికి ఎగబాకింది.

భారత్‌లో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కి చేస్తున్న వ్యయం ప్రస్తుతం జీడీపీలో 0.67% మాత్రమే. ఇది యూఎస్‌లో 3.5%, చైనాలో 2.5%.

విద్యా సంస్థల పేటెంట్ అప్లికేషన్స్

సంవత్సరం	భారత్	విదేశీ
2021-22	7,405	96
2022-23	19,155	275
2023-24	23,306	237

వ్యక్తులూ.. విద్యాసంస్థలూ..

2000లో వచ్చిన మొత్తం పేటెంట్ దరఖాస్తుల్లో కంపెనీలవి 43 శాతం కాగా, 2023 నాటికి ఇది 17 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో వ్యక్తుల దరఖాస్తులు 10 నుంచి 32 శాతానికి పెరిగాయి. 2010లో 20 శాతంలోపే ఉన్న విద్యాసంస్థల వాటా.. ఇప్పుడు ఏకంగా 43 శాతానికి ఎగబాకింది. 2023-24లో దేశీయ సంస్థలు, వ్యక్తుల వంటి వారు పెట్టుకున్న మొత్తం పేటెంట్ దరఖాస్తులు 51,574 కాగా మంజూరైనవి 25,079. ఇందులో..

విభాగం	దరఖాస్తులు	మంజూరు
ఎమ్ఎస్ఎమ్ఈ	3,421	794
స్టార్టప్	2,546	747
విద్యాసంస్థలు	23,306	3,288
వ్యక్తులు	14,431	5,644

2010 నుంచి 2025 సెప్టెంబరు 11 వరకు ఫైల్ చేసిన పేటెంట్లు 9,32,693	మొత్తం దరఖాస్తుల్లో మంజూరైనవి 3,20,807
వీటిలో భారతీయులు దరఖాస్తు చేసినవి 3,83,073	వీటిలో భారతీయులవి 70,088

ఫైలింగ్, మంజూరులో టాప్ రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలు

ఫైలింగ్

రాష్ట్రం	సంఖ్య	రాష్ట్రం	సంఖ్య
తమిళనాడు	68,258	కర్ణాటక	46,300
మహారాష్ట్ర	67,321	తెలంగాణ	21.131
		ఆంధ్రప్రదేశ్	16,115

మంజూరు

రాష్ట్రం	సంఖ్య	రాష్ట్రం	సంఖ్య
మహారాష్ట్ర	17,160	ఢిల్లీ	9,421
తమిళనాడు	9,701	తెలంగాణ	2,042
		ఆంధ్రప్రదేశ్	1,567

ఆధారం: కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్, ట్రేడ్‌మార్క్స్ కార్యాలయం

ప్రైవేటు కాలేజీలు బంద్

రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం సమ్మెబాట పట్టాలని నిర్ణయం

15 నుంచి నిరవధికంగా కాలేజీల మూసివేత

- పిలుపునిచ్చిన వృత్తివిద్యా కాలేజీల యాజమాన్యాల సంఘం
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు లిఖితపూర్వకంగా వెల్లడి
- ఈ నెల 30లోగా బకాయిలు విడుదల చేయకుంటే ఆందోళన
- 16 నుంచి మేము సైతం.. డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం



ఉన్నత విద్యామండలి అధికారులకు నోటీస్ అందజేస్తున్న 'ఫతి' ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సాధించుకునే దిశగా ఆందోళన చేపట్టాలని రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్‌ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇన్‌స్టిట్యూషన్స్(ఫతి) ప్రతినిధులు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డిని కలిసి సమ్మె చేస్తున్నట్టు లిఖితపూర్వకంగా తెలిపాయి. ఈ నెల 30లోగా ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించాయి. బంద్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,500కుపైగా ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఫార్మసీ, నర్సింగ్ కాలేజీలు మూతపడతాయని.. దీనివల్ల సుమారు 10 లక్షల మంది విద్యార్థులు నష్టపోతారని సంఘం నేతలు పేర్కొన్నారు.

రూ. 10 వేల కోట్లకు చేరిన బకాయిలు..

సుమారు రూ. 10 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో సర్కారు విఫలమైందంటూ కాలేజీల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల సాధన కోసం 'ఫతి'పేరిట ఏర్పడి పలుమార్లు ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తులు చేశాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ రామకృష్ణారావు సహా ప్రభుత్వ పెద్దలందరితోనూ సమావేశమయ్యాయి. అయినా సర్కారు ఒక్క రూపాయి కూడా బకాయిలు విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను యాజమాన్యాలు సర్కారు ముందుంచాయి. రూ. లక్ష కోట్ల డిపాజిట్లతో ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. రూ. లక్ష కోట్ల డిపాజిట్ల సొమ్ముతో ప్రభుత్వ వాటా పరిమితమేనని.. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), కార్పస్ ఫండ్ వంటి ఇతర మార్గాల ద్వారా ఈ నిధులను సేకరించవచ్చని సూచించాయి. ఈ డిపాజిట్లపై వచ్చే 7 శాతం వడ్డీ (సుమారు రూ. 3 వేల కోట్లు)తో ఫీజు రీయింబర్స్‌చేయవచ్చని ప్రతిపాదించాయి. అయితే అందుకు కూడా ప్రభుత్వం మొగ్గుచూపకపోవడంతో విసిగిపోయిన కాలేజీల యాజమాన్యాలు.. రాష్ట్రంలోని అన్ని రకాల వృత్తి విద్యా కాలేజీల యాజమాన్యాలు గురువారం రాత్రి సమావేశమయ్యాయి. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ సమావేశం అనంతరం ఈనెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు 'ఫతి'పిలుపునిచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందుకు ఇంజనీర్స్‌డేను బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించాయి.

16 నుంచి డిగ్రీ, పీజీ కాలేజీలు కూడా..

'ఫతి'బాటలోనే తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం(టీపీడీపీఎంఏ) కూడా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నెల 16 నుంచి కాలేజీలను మూసేస్తామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణరెడ్డి, యాద రామకృష్ణలు ప్రకటించారు. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

దసరా జరుపుకోలేని పరిస్థితులున్నాయి

ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా ఉండటంతో విద్యకు తొలి ప్రాధాన్యత లభిస్తుందనుకున్నాం. కానీ అసలు ప్రాధాన్యతే లేకుండా పోయింది. రూ. 10 వేల కోట్ల బకాయిల విడుదల కోసం 6 నెలలుగా ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నాం. ప్రత్యామ్నాయ ప్రణాళికను సర్కారు ముందుంచాం. దసరా పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితులున్నాయి. జీతాలు ఇవ్వకపోతే సోమవారం నుంచి విధులకు హాజరుకాబోమని సిబ్బంది తేల్చిచెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాం. ఈ నెల 30లోగా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలి.

- రమేశ్, 'ఫతి'చైర్మన్

6 నెలలుగా వేతనాలు ఇవ్వలేకపోతున్నాం

ప్రైవేటు కాలేజీల సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు ఇవ్వలేకపోతున్నాం. యజమానులుగా మధ్యాహ్నం పూట కాలేజీకి వెళ్లలేకపోతున్నాం. సాయంత్రం, రాత్రిపూట వెళ్లి సంతకాలు పెట్టి వస్తున్నాం. బకాయిల విడుదల కోసం ఉప ముఖ్యమంత్రి భట్టిను నాలుగుసార్లు కలిశాం. ఇంజనీర్స్‌డేను బ్లాక్‌డేగా పాటించి, బంద్‌ను పాటించబోతున్నాం. ఆగస్టు 31 వరకు మాకు రావాల్సిన పూర్తి బకాయిలను విడుదల చేయాలి.

- కేవీ రవికుమార్, 'ఫతి'నాయకుడు



శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) హైదరాబాద్ ప్రతినిధులు అనిరుధ్ కొణిజేటి తదితరులు. శని, ఆదివారాల్లో బీఎన్ఐ హైదరాబాద్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిర్వహించే ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో వివరాలను ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.

'ఫీజు'కు ఎంత కోత పెట్టొచ్చు?

ముఖ ఆధారిత హాజరు గుర్తింపు వివరాలు పంపండి

- 75 శాతం హాజరుకాని విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్‌లో కత్తెరేయాల్సిందే
- ప్రతి విద్యార్థికీ యూనిక్ కోడ్ ఇచ్చేద్దాం.. డిజీ లాకర్ విధానంపై స్పీడ్ పెంచండి
- వర్సిటీల వీసీలతో సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వీసీ బాలకిష్టారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను క్రమబద్ధీకరించే ప్రక్రియ మొదలైంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వీసీలతో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ముఖ ఆధారిత హాజరు విధానం అమలుపై దృష్టిపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో సీట్లు పొందుతున్న విద్యార్థులు ఎంత మంది? వారిలో నిత్యం కాలేజీలకు హాజరయ్యే వారు ఎందరు? 75 శాతం లోబడి విద్యార్థుల హాజరున్న కాలేజీలు ఎన్ని? ఎందరు విద్యార్థులు ఈ విభాగం కిందకు వస్తారు? అనే అంశాలపై చర్చించినట్లు తెలిసింది. వర్సిటీల స్థాయిలో ఇప్పటికే ముఖ ఆధారిత హాజరు విధానం అమలు చేస్తున్నారని.. వర్సిటీల అనుబంధ గుర్తింపు పొందిన కాలేజీల్లో మాత్రం ఇది అమలు కావట్లేదని వీసీలు తెలిపారు. దీన్ని కచ్చితంగా అమలు చేసేలా చూడాలని చైర్మన్ సూచించినట్లు తెలిసింది.

కోతకు లెక్కలేంటి?

కాలేజీకి సరిగా రాని విద్యార్థులకు, రెగ్యులర్‌గా కాలేజీకి వచ్చి చదివే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒకే విధంగా ఉండటం ఏమిటనే ప్రశ్న ప్రభుత్వం నుంచి వచ్చింది. ఇలాంటి విద్యార్థులు ఎందరు ఉంటారో చెప్పాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం ఇటీవల అడిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఏ మేరకు కుదించే వీలుందో పరిశీలించాలని ప్రభుత్వం భావిస్తోందని.. అందుకు అనుగుణంగా సిద్ధం కావాలని వీసీలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఏ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని తగ్గించే అవకాశం ఉంది? కాలేజీకి హాజరవ్వని విద్యార్థులు ఎందరు? ఈ దిశగా సమగ్ర సమాచారం సేకరించాలని వీసీలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి కోరినట్లు తెలిసింది. ఆ వివరాల ఆధారంగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్కలను తయారు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

డిజీ లాకర్ విధానం

పూర్తిగా డిజిటల్ విధానంలోకి యూనివర్సిటీలు వెళ్ళాలని బాలకిష్టారెడ్డి వీసీలకు సూచించారు. సర్టిఫికెట్లను ఆన్‌లైన్ విధానంలోనూ అందుబాటులోకి తేవాలని.. దీనివల్ల తప్పుడు ధ్రువీకరణ పత్రాలను నిరోధించవచ్చని పేర్కొన్నారు. డిజీ లాకర్ విధానంతోపాటు ప్రతి విద్యార్థికీ యూనిక్ ఐడీ నంబర్ ఇవ్వాలని ప్రతిపాదించారు. ప్రతి వర్సిటీ నాణ్యతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు పొందేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ దిశగా బోధన ప్రణాళికలో సమూల మార్పులు తేవాలని.. తద్వారా సమీకృత బోధన విధానం అమలుకు కృషి చేయొచ్చన్నారు. ఈ ఏడాది నుంచి పీజీ కోర్సుల్లో క్రీడాకారులకు 0.5 శాతం రిజర్వేషన్ కోటాను అమలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్లు పురుషోత్తం, మహ్మద్, వర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

పైసలకు కటకట.. పాలన వెలవెల

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్థికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ మున్సిపాలిటీల్లో రెండేళ్లవరకు పన్నులను సమీక్షించి పెంచే అవకాశం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వస్తున్న ఆదాయంతోనే పాలన సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ శివార్లలోని ఇస్నాపూర్, ఇంద్రేశం వంటివాటికి మినహా మిగతా చోట్ల ఆర్థిక పరిపుష్ట లేక సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామ పంచాయతీలకు సాధారణంగా ఇంటి పన్ను, ఆస్తి పన్ను, నీటి పన్ను, వాణిజ్య లైసెన్సుల జారీ, వాటి రెన్యూవల్, తైబజార్ వేలం, పశువుల సంత తదితరాల ద్వారా జనరల్ ఫండ్ సమకూరుతోంది. పాలక మండళ్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ల విడుదల నిలిచిపోయింది. రిజిస్ట్రేషన్, ఇతర విభాగాల నుంచి సెస్సుల విడుదల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాక్టర్ డీజిల్ వంటి కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో కొత్త మున్సిపాలిటీలు ఉన్నాయి.

కమిషనర్ వేతనం కూడా జీఎఫ్ నుంచే..

కమిషనర్, అధికారులు, ఇతర ఉద్యోగుల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు మంజూరు చేయకపోవడంతో వేతనాల చెల్లింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ఖజానా నుంచి 010 పద్దు కింద వేతనాలు చెల్లించే వెసులుబాటు లేకపోవడంతో జనరల్ ఫండ్ (జీఎఫ్) నుంచే కమిషనర్, సిబ్బంది వేతనాలు చెల్లించాల్సి వస్తోంది. విలీన గ్రామపంచాయతీల కార్యదర్శులు పట్టణంలో పనిచేస్తూ పంచాయతీరాజ్ విభాగం నుంచి వేతనాలు తీసుకుంటున్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర విభాగాల్లో పనిచేసే కార్మికులు, కంప్యూటర్ ఆపరేటర్లు గ్రామ పంచాయతీల్లో రూ.9,500 వేతనం పొందే వారు. మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో వారికి ప్రతి నెలా రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉంది. కానీ, చాలాచోట్ల పాత వేతనాలే ఇస్తున్నారు. వాటిని కూడా నెలల తరబడి పెండింగులో పెడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జిల్లా కేంద్రమే అయినా..

ములుగు జిల్లా కేంద్రం ఈ ఏడాది 29న గ్రామ పంచాయతీ నుంచి అప్‌గ్రేడ్ అయ్యి 20 వార్డులతో కొత్త మున్సిపాలిటీగా ఏర్పడింది. పొరుగునే ఉన్న బండారుపల్లి, జీవింతరావుపల్లి పంచాయతీలు ఇందులో విలీనం అయ్యాయి. ఇప్పటివరకు కమిషనర్, మేనేజర్ మాత్రమే బదిలీపై వచ్చారు. పురపాలనలో అత్యంత కీలకమైన ఏఈ, టీపీఎస్, అకౌంట్స్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. మున్సిపాలిటీలో ప్రస్తుతం 130 మంది మల్టీ పర్పస్ వర్కర్లు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిలో 80 మంది పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న వారే. మున్సిపాలిటీ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలుగా కాగా, ఏటా రూ.3.27 కోట్లు వేతనాలుగా చెల్లించాల్సి వస్తోంది. దీంతోపాటు మరో రూ.1.20 కోట్లు కార్యాలయ నిర్వహణ, వాహనాలు, ఇంధనం కోసం ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది.



నాలుగు నెలలుగా జీతాల్లేవు..



కల్లూరు గ్రామ పంచాయతీలో గడిచిన 23 ఏళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నా. నాతోపాటు మరో 93 మంది మల్టీ పర్పస్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీలో పనిచేసిన కాలంలో నెలకు రూ.9,500 వేతనం ఇచ్చేవారు. మున్సిపాలిటీగా మారిన తర్వాత ఎంత వేతనం వస్తుందో తెలియదు. నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. జీఓ 60ని అనుసరించి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలి. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, జీవిత బీమా వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సయ్యద్ వజీర్ మియా
ఎలక్ట్రీషియన్, కల్లూరు మున్సిపాలిటీ

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

కోహిర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, ఇంద్రేశం, జిన్నారం (సంగారెడ్డి).. కేసముద్రం (మహబూబాబాద్).. స్టేషన్ ఘన్‌పూర్ (జనగాం).. మద్దూర్ (నారాయణపేట).. ఎదులాపురం, కల్లూరు (ఖమ్మం).. అశ్వారావుపేట (భద్రాద్రి కొత్తగూడెం).. చేవెళ్ల, మొయినాబాద్ (రంగారెడ్డి).. ములుగు (ములుగు).. అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ (మేడ్చల్-మల్కాజిగిరి).. బిచ్కుంద (కామారెడ్డి).

ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రధాని మోదీ


సీజేఐ జస్టిస్ గవాయ్‌తో మాట్లాడుతున్న ధన్‌ఖడ్. చిత్రంలో వెంకయ్యనాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: భారత 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎర్రటి కుర్తా, సంప్రదాయ తమిళ వస్త్రధారణ అయిన 'ముండు'ధరించిన రాధాకృష్ణన్ ఉదయం 10.11 గంటలకు ఆంగ్లంలో దైవసాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం రాష్ట్రపతి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్య నాయుడు, హమీద్ అన్సారీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌తో పాటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని సహా మిగతా నేతలంతా రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సహా ఇతర విపక్ష నేతలెవరూ హాజరు కాలేదు. ప్రమాణ స్వీకారం తర్వాత, రాధాకృష్ణన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని ప్రేరణ స్థల్ వద్ద ఉన్న ప్రముఖ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక సంస్కర్తల విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు అర్పించారు. ఈ సమయంలో ఆయన వెంట రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్. మురుగన్ ఉన్నారు. ఈ ఏడాది చివర్లో జరిగే శీతాకాల సమావేశాల్లో ఆయన పార్లమెంటులో తన అధికారిక విధులను ప్రారంభిస్తారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం రాధాకృష్ణన్ నేరుగా మహాత్మాగాంధీ సమాధి ఉన్న రాజ్‌ఘాట్ చేరుకొని నివాళులర్పించారు. అనంతరం సదైవ్ అటల్ వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి, కిసాన్ ఘాట్ వద్ద మాజీ ప్రధాని చరణ్ సింగ్‌కు నివాళులర్పించారు.

మళ్లీ జనహిత పాదయాత్ర

- నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈసారి యాత్ర
- 16న హైదరాబాద్‌కు రానున్న మీనాక్షి నటరాజన్
- 15న నిర్వహించాల్సిన కామారెడ్డి సభ వాయిదా
- రేపు పీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర మళ్లీ ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రానికి వస్తున్నారని, ఆ తర్వాత జనహిత పాదయాత్ర ప్రారంభమవుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో ఈసారి యాత్ర జరగనుంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయా జిల్లాల నేతలకు ఇప్పటికే టీపీసీసీ ఆదేశాల్చింది. ఈ నెల 16న హైదరాబాద్‌కు రానున్న మీనాక్షి వారం పాటు ఇక్కడే ఉంటారని సమాచారం. జనహిత పాదయాత్రలో పాల్గొనడంతోపాటు ఈ దఫా పర్యటనలో ఆమె కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయి పార్టీ నాయకత్వానికి నామినేటెడ్ పోస్టుల కేటాయింపు ఈసారి క్లియర్ అవుతుందని సమాచారం. అందుకోసం ఆమె మరోమారు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమవుతారని తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి వచ్చేవారంలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం నిర్వహించనుంది. ఇప్పటివరకు బస్తీలు, వార్డులవారీ సమావేశాలకు పరిమితమైనా వచ్చే వారంలో నియోజకవర్గ స్థాయిలో పెద్ద సభను నిర్వహించాలని, ఈ సభకు సీఎం రేవంత్‌తోపాటు మీనాక్షి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో స్థానిక నేతలతో పాటు ఇన్‌చార్జిలుగా ఉన్న మంత్రులు, కార్పొరేషన్ల చైర్మన్లతో కూడా మీనాక్షి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని గాంధీభవన్ వర్గాల సమాచారం. కాగా, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పదవి చేపట్టి ఏడాది అవుతున్న సందర్భంగా ఈ నెల 15వ తేదీన కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బీసీల సమరభేరి సభ వాయిదా పడింది. భారీ వర్ష సూచన కారణంగా సభను వాయిదా వేశామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఇక, పార్టీ క్రమశిక్షణ వ్యవహారాలపై చర్చించేందుకు ఎంపీ మల్లు రవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదివారం భేటీ కానుంది.

రైతులకు ఎరువుల నిరంతర సరఫరా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా సరఫరా కొనసాగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, కమిషనరేట్ అధికారులతో మంత్రి ఎరువుల సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను సమయానికి అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఒక్కరోజులోనే 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రాగా, గత రెండు రోజుల్లో 23 వేల మెట్రిక్ టన్నులు తెప్పించినట్టు చెప్పారు. రాబోయే నాలుగు రోజుల్లో మరో 27,650 మెట్రిక్ టన్నులు పంపించేందుకు కేంద్రం హామీ ఇచ్చిందన్నారు.

ఇక్రిశాట్‌తో తెలంగాణ భాగస్వామ్యం

సచివాలయంలో ఇక్రిశాట్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి ఇక్రిశాట్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు. ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్, డాక్టర్ హరికిషన్ మంత్రి తుమ్మలను కలసి హైదరాబాద్‌లోని సంస్థను సందర్శించాలని ఆహ్వానించారు.

రైతుల కోసం ఏఐ యాప్

సచివాలయంలో నెదర్లాండ్స్ ఆధారిత ఏఐ కంపెనీ ప్రతినిధులతో కూడా మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. ప్రతి రైతు సమస్యకు ఒకే వేదికగా పరిష్కారం లభించేలా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆఫ్రికన్ ప్రతి నిధి బృందం శుక్రవారం మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసింది.

సింగరేణిలో అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తా: కవిత

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, దీనిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం హెచ్‌ఎంఎస్-సింగరేణి జాగృతి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరప్షన్ పార్టీ అని, ఆ పార్టీ నాయకులు సింగరేణిలో తీవ్ర అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

బొగ్గు వేలం ఎక్కడున్నా వెళ్తాం

కొత్త బ్లాకులు రాకపోతే సింగరేణి సంస్థ ఉనికికే ప్రమాదం

- గత పాలకులు ఈ అంశాన్ని విస్మరించి వేలంలో పాల్గొనలేదు
- సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులను కోల్పోయాం
- రూ.60వేల కోట్ల రెవెన్యూ నష్టం వచ్చింది.. సింగరేణికి రూ.15 వేల కోట్ల నష్టం
- గ్రీన్ హైడ్రోజన్ గురించి ఆలోచిస్తున్నాం: విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి


సీఐఐ అవార్డుల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క, దేవ్‌జ్యోతి,శివప్రసాద్‌రెడ్డి, బీవీఆర్ మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇకపై దేశంలో ఎక్కడ బొగ్గు గనుల వేలం జరిగినా సింగరేణి సంస్థ పాల్గొంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి పరిధిలో ఉన్న ప్రస్తుత గనులు తరిగిపోతున్నాయని, మరో పదేళ్ల తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగితే సంస్థ ఉనికికి కూడా ప్రమాదం పొంచి ఉందని, ఈ ప్రమాదం బారి నుంచి సింగరేణిని కాపాడుకొని నిలబెట్టుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఎమ్మెల్యే కె.విజయరమణారావు, సింగరేణి సీఎండీ బలరాం, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘాలతోపాటు బోర్డు విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 'కేంద్ర బొగ్గు గనుల శాఖ నిర్వహించే వేలంలో పాల్గొనకుండా గత పాలకులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో సత్తుపల్లి, కోయగూడెం మైనింగ్ బ్లాకులు ప్రైవేటు వ్యక్తులకు దారాధత్తమయ్యాయి. తద్వారా రాష్ట్రానికి రూ.60వేల కోట్ల రెవెన్యూ నష్టం వచ్చింది. సింగరేణి సంస్థకు రూ.15వేల కోట్లు నష్టం కలిగింది. బొగ్గు గనుల వేలంలో పాల్గొంటే అటు సింగరేణితోపాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. సింగరేణికి కొత్త బ్లాకులు వస్తాయి. రాష్ట్రానికి రాయల్టీ రూపంలో ఆదాయం వస్తుంది. సింగరేణి మనుగడ దృష్ట్యా ఇకపై ఎక్కడ బొగ్గు గనుల వేలం జరిగినా పాల్గొనాలని నిర్ణయించాం.'అని భట్టి చెప్పారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ బొగ్గు గనుల వేలంలో పాల్గొంటే కలిగే లాభాలు, పాల్గొనకపోవడం కారణంగా జరిగే నష్టాలు, ఇతర రాష్ట్రాల్లో గనుల వేలం జరిగిన తీరును గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

త్వరలోనే బంగారం అన్వేషణ

సింగరేణి వ్యాపార విస్తరణలో భాగంగా కర్ణాటక రాష్ట్రంలో రాగి, బంగారం తవ్వకాల లైసెన్స్‌ను సింగరేణి సంస్థ సాధించిందని భట్టి చెప్పారు. రాయచూర్, దేవదుర్గ్ బెల్టులో రాగి, బంగారం బ్లాకులను వేలంలో దక్కించుకున్నామని తెలిపారు. త్వరలోనే అన్వేషణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ ప్రాంతంలో భవిష్యత్‌లో జరిగే రాగి, బంగారం తవ్వకాలకు 37.75 శాతం రాయల్టీ వస్తుందని, ఇది సింగరేణి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని వెల్లడించారు.

సింగరేణి గ్లోబల్ పేరుతో ఖనిజ రంగంలోకి

థర్మల్, సోలార్, గ్రీన్ ఎనర్జీ రంగాలపై సింగరేణి దృష్టి సారించిందని భట్టి అన్నారు. దేశంలోనే కాక ప్రపంచంలో ఎక్కడ విలువైన ఖనిజాల వేలం జరిగినా పాల్గొనాలని, ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇచ్చేందుకు ఓ కన్సల్టెంట్ కమిటీని నియమించినట్టు ఆయన చెప్పారు. గ్రీన్‌హైడ్రోజన్ పై కూడా దృష్టి సారించి సింగరేణి పనిచేస్తుందని, సింగరేణి గ్లోబల్ పేరుతో విలువైన ఖనిజాల రంగంలోకి ప్రవేశిస్తామని ఆయన వెల్లడించారు.

- సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడుతూ భవిష్యత్‌లో జరిగే వేలంలో పాల్గొని కొత్త బ్లాకులు సాధించడం ద్వారా సంస్థ మనుగడకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ దిశలో నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు.

ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్

సీఐఐ అవార్డుల ప్రదానంలో డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం ఐటీ నుంచి.. లైఫ్ సైన్సెస్ వరకు అధునాతన తయారీ పరిశ్రమలతో ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మారిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. హైదరాబాదు సోమాజిగూడలోని ఒక ప్రైవేట్ హోటల్లో శుక్రవారం సాయంత్రం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సౌత్ రీజియన్ నిర్వహించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్ లీడర్‌షిప్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం నలుమూలల నుంచి తెలంగాణలో కంపెనీలు ఏర్పాటు చేసేందుకు సీఎఫ్‌వో కీలక భూమిక పోషించాలని కోరారు. కార్యక్రమంలో సీఐఐ దక్షిణ ప్రాంత డైరెక్టర్ దేవ్‌జ్యోతి, సీఐఐ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మీ నిర్లక్ష్యంతో ఖజానాకు గండి

పన్నుల శాఖలో పనిచేస్తున్న అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను చేరుకునేందుకు శాఖలోని యంత్రాంగమంతా కృషి చేయాలని, ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించడంతో పాటు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును, రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపార లావాదేవీలను ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన వాణిజ్య పన్నుల శాఖపై సమీక్ష చేశారు. వ్యాపార లావాదేవీలకు అనుగుణంగా పన్ను వసూళ్లలో వస్తున్న సమస్యలను అధిగమించడానికి కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఆదాయం పెంచుకునేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసుకుని అధ్యయనం చేయాలని, దానిపై నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించిన భట్టి.. గత ఏడాది, ఈ ఏడాదిలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆడిట్ విభాగాల ప్రగతిని సమీక్షించారు. జీఎస్టీ ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలని, నిఘా వ్యవస్థ నిరంతరం పనిచేయాలని, వీలున్నంత మేరకు ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకుని పర్యవేక్షించాలని ఆదేశించారు. జీఎస్టీ హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా రాష్ట్ర ప్రభుత్వం కోల్పోతున్న ఆదాయమెంతో క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని భట్టి సూచించారు. ఇకపై ప్రతి 15 రోజులకోసారి పన్నుల శాఖ పనితీరును సమీక్షిస్తానని వెల్లడించారు. ఈ సమీక్షలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ హరిత, ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిరణ్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

14న బహుజన బతుకమ్మ పాట ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 14న బహుజన బతుకమ్మ పాటను ప్రసాద్ ల్యాబ్స్‌లో ఆవిష్కరించనున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. బహుజన బతుకమ్మ కేవలం ఉత్సవం మాత్రమే కాదని.. ఉద్యమంగా ప్రారంభమైన ఈ కార్యక్రమానికి 15 ఏళ్లు నిండాయని శుక్రవారం ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు.


కరీంనగర్ జిల్లాలో గద్దపాక గోదాం వద్ద యూరియా కోసం చంటిపాపను ఎత్తుకుని క్యూలో నిల్చున్న తల్లి


ఖానాపురంలో గుండెపోటుకు గురైన రాజమ్మను ఆస్పత్రికి తీసుకెళుతున్న రైతులు

తప్పని తోపులాటలు

- యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిలబడుతూ సహనం కోల్పోతున్న రైతులు
- తోపులాటలో డబ్బు పోగొట్టుకొని మనస్తాపంతో రైతు ఆత్మహత్య
- ఖానాపురంలో మహిళా రైతుకు గుండెపోటు


కున్సోత్ సుమన్ (ఫైల్)

ఇల్లెందురూరల్/ఖానాపురం/అర్వపల్లి/తిప్పర్తి/శంకరపట్నం: యూరియా తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడి రైతులు యూరియా దొరుకుతుందో లేదోనన్న ఆందోళనలో సహనం కోల్పోతున్నారు. దీంతో కొన్ని చోట్ల ఘర్షణలు చోటుచేసుకుంటుండగా, మరికొన్ని చోట్ల కొందరు గాయపడుతున్నారు.

➤ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ధనియాలపాడు గ్రామపంచాయతీ సేవ్యాతండాకు చెందిన కున్సోత్ సుమన్(28) మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. రెండు రోజుల క్రితం యూరియా కోసం నిజాంపేటకు రూ.500 నగదుతో వెళ్లాడు. టోకెన్ తీసుకొని రైతు వేదిక వద్దకు వెళ్లాడు. అక్కడ జరిగిన తోపులాటలో రూ.500 పోగొట్టుకున్నాడు. దీంతో సుమన్ ఆవేదనతో రాత్రి ఇంటికి వెళ్లగా యూరియా ఏదని భార్య మౌనిక ప్రశ్నించింది. ఆపై గురువారం మరోమారు దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట చేరుకున్న సుమన్ పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై మెరుగైన చికిత్సకు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రూ.500ల విషయమై గొడవ జరగ్గా, సుమన్ చికిత్సకు రూ.40వేలు ఖర్చు చేసినా ప్రాణం దక్కకపోవడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది.

➤ వరంగల్ జిల్లా ఖానాపురం రైతువేదిక వద్ద క్యూలో నిల్చున్న రైతులకు టోకెన్లు పంపిణీ చేశారు. ఒక్కసారి రైతులు అధికారుల వద్దకు దూసుకెళ్లడంతో తోపులాట జరిగింది. దీంతో పలువురు మహిళా రైతులు కిందపడి గాయపడ్డారు. మనుబోతులగడ్డకు చెందిన బానోతు రాజమ్మకు గుండెపోటు రావడంతో వెంటనే స్థానిక రైతులు ఆస్పత్రికి తరలించారు.

➤ కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిధిలోని గద్దపాక పీఏసీఎస్ వద్ద చంటిపాపతో ఓ మాతృమూర్తి క్యూలైన్‌లో నిల్చుంది. యూరియా కోసం గంటల తరబడి వేచి ఉంది.

> అది (పరమాత్మ) నడుస్తుంది. నడవదు కూడా! అది దూరంగా ఉంటుంది. అత్యంత సమీపంగానూ ఉంటుంది. అది ఈ సమస్త జగత్తు లోపల పరిపూర్ణంగా నిండి ఉంటుంది. ఈ జగత్తుకు వెలుపల కూడా ఉంటుంది!!
>
> – ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 13 సెప్టెంబర్ 2025

విద్వేషాలను పెంచే హత్య

ఆయనేమీ అమెరికా ప్రభుత్వంలో కీలక పదవి నిర్వహిస్తున్నవాడు కాదు. కనీసం రాజకీయ నాయకుడు కూడా కాదు. కానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సైద్ధాంతిక ఉపకరణాలు అందిస్తున్నవారిలో... 'అమెరికాను మళ్లీ మహోత్కృష్టంగా మారుద్దాం' (మాగా) ఉద్యమానికి తోడ్పడుతున్నవారిలో అతి ముఖ్యుడు. మూడు పదుల వయసులోని మితవాద క్రియాశీల కార్యకర్త చార్లీ కిర్క్‌ను యూటా వ్యాలీ విశ్వవిద్యాలయంలో బుధవారం దుండగుడు కాల్చి చంపిన వైనం ఇప్పుడు అమెరికాను ఊపిరాడకుండా చేస్తోంది. ప్రముఖులను, ఉన్న పదవుల్లోని వారినీ భౌతికంగా నిర్మూలించాలని చూసే సంస్కృతి అమెరికాకు కొత్తగాదు. కానీ ఈమధ్య అది పెరిగింది. ట్రంప్ ఎన్నికల ప్రచార సభల్లో ఆయనపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. మిన్నెసోటా ప్రతినిధుల సభ స్పీకర్ ఎమెరిటా మెలిసానూ, ఆమె భర్తనూ ఇటీవలే కాల్చి చంపారు.

అమెరికాలో తుపాకుల పరిశ్రమ పలుకుబడి అధికం. తుపాకి సంస్కృతిని రద్దుచేయటం మాట అటుంచి, కనీసం పరిమితులు విధించాలని చూసినా తీవ్ర వ్యతిరేకత వస్తుంది. తుపాకి కలిగివుండటం పౌరుల హక్కని, దాన్ని రద్దు చేయటమంటే జీవించే హక్కును కాలరాయటమేనని వాదిస్తారు. రిపబ్లికన్ పార్టీలో ఇలాంటివారు ఎక్కువున్నా, డెమాక్రటిక్ పార్టీలో కూడా తక్కువేం లేరు. కిర్క్ తుపాకులకు అనుకూలం. దానిపై ఒక విద్యార్థి ప్రశ్నకు జవాబు చెబుతుండగానే ఆయన హత్యకు గురయ్యారు. అమెరికాలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా అసహనం పెరిగింది. ఒక అంశంపై వాదం, ప్రతివాదం సంస్కృతి కనుమరుగవుతోంది. వినాలన్న యోచన లేదు. ఉన్నా వాదనకు జవాబు చెప్పలేక, అతనికి/ఆమెకు దురుద్దేశాలు అంటగట్టడం, అభాండాలేయటం, దౌర్జన్యానికి దిగటం పెరిగింది. ఏకీభవించకున్నా ఆ వాదనను గౌరవించాలన్న స్పృహ కొరవడింది.

ఒక విశ్వాసాన్ని కలిగివున్న వ్యక్తిని హతమార్చినంత మాత్రాన ఆ విశ్వాసాన్ని నిర్మూలించటం అసాధ్యం. కానీ దురదృష్టవశాత్తూ దీన్ని నమ్ముకునే ధోరణి ప్రబలుతోంది. కిర్క్ డ్రాపౌట్ అన్న మాటేగానీ అసాధారణ ప్రతిభావంతుడు. కేవలం 18 యేళ్ల వయసులోనే 'టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ' సంస్థ నెలకొల్పి తన మితవాద భావాలను బలంగా చెప్పగలిగే ఉపన్యాసకుడిగా రూపొందాడు. ఖజానా బాధ్యతాయుత నిర్వహణ, స్వేచ్ఛాయుత మార్కెట్లు, పరిమిత పాలనా వ్యవస్థ తదితర అంశాలపై విద్యాసంస్థల్లో ఉపన్యాసాలిచ్చాడు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడైనప్పుడే 22 ఏళ్ల వయసులో 'మాగా' ఉద్యమానికి అంకితమై పనిచేశాడు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఓటర్లుగా నమోదై రిపబ్లికన్లకు ఓటేయటం వెనక కిర్క్ కృషిని గురించి చెబుతారు. అరిజోనా వంటి డెమాక్రటిక్ ప్రభావిత ప్రాంతం రిపబ్లికన్ల వైపు మొగ్గటంలో అతని పాత్ర ప్రధానమైనది. మహిళలు, గర్భస్రావాలు, ట్రాన్స్‌జెండర్లు తదితర అంశాల్లో అతని వైఖరిని చాలామంది జీర్ణించుకోలేరు. జాతి, మత, వర్ణ, లింగ వివక్షను నిషేధించే 1964 నాటి పౌర హక్కుల చట్టం పెద్ద తప్పిదమని కిర్క్ భావన. భారతీయులకు కిర్క్ తీవ్ర వ్యతిరేకి. 'శ్వేత జాతీయులకు ఉద్యోగాలు రావాలి... మీరంతా ఖాళీ చేసి పొండి' అని పిలుపునిచ్చాడు.

తన భావాలపై ప్రశ్నించవచ్చంటూ కాలేజీలు, వర్సిటీల సందర్శన మొదలుపెట్టాడు. ఆ భావాలను పూర్వపక్షం చేస్తే అతని వాదన బలహీనపడుతుంది. కానీ భౌతిక దాడికి దిగటం వల్ల కిర్క్ భావాల బలం పెరుగుతుంది. ఈ మరణం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో సామాజిక మాధ్యమాల్లోని వ్యాఖ్యలే చెబుతాయి. 'మనది యుద్ధం. కిర్క్ నేలకొరిగిన యుద్ధ వీరుడు. వ్యక్తిగత భేదాలు పక్కనబెట్టి ఒక్కటై పోరాడాలి' అని మితవాద వ్యూహకర్త స్టీవ్ బేనన్ పిలుపునిచ్చారు. 'మనల్ని ప్రశాంతంగా బతకనీయకపోతే మనకున్న ప్రత్యామ్నాయాలు రెండే– పోరాడటం లేదా మరణించటం' అని ఎలాన్ మస్క్ అన్నారు. 'వామపక్షవాదులారా... మనం సంభాషించుకుందాం లేదా యుద్ధానికి దిగుదాం. మీ నుంచి మరో బుల్లెట్ బయటికొస్తే ఇక ఆ ఎంపిక మిగలదు' అని నటుడు జేమ్స్ వుడ్స్ హెచ్చరించారు. ఏదేమైనా ఈ వాతావరణంలో అక్కడివారే కాదు... వలసపోయినవారూ అప్రమత్తంగా ఉండక తప్పదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.షష్ఠి ప.11.19 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** కృత్తిక ప.2.54 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** తె.5.49 నుండి 7.19 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.5.44 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** ప.12.17 నుండి 2.06 వరకు.

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం: 6.03
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

కట్టుబాటు



ప్లాస్టిక్ నీళ్ల సీసాలను వాడకపోవడం అనే చిన్న నిర్ణయం కూడా పర్యావరణానికి గొప్ప మేలు చేస్తుంది. మేము మా కార్యాలయాలలో, పరీక్షా కేంద్రాలలో వీటిని నిషేధించాం. దేనికైనా అందరం కట్టుబడి ఉంటేనే మార్పు సాధ్యం.

– అజయ్ కుమార్, యూపీఎస్సీ చైర్మన్

ఏ పనైనా!



వచ్చే శనివారం జరిగే ఫుట్‌బాల్ ఆటలాగా ఒలింపిక్ క్రీడలను నిర్వహించలేము. ఇది చాలా సంక్లిష్టమైన పని. మీకు స్పష్టమైన నిర్ణయం తీసుకునే సామర్థ్యం ఉన్నప్పుడు మాత్రమే ఈ పనిని బాధ్యతగా చేయగలరు. ఈ పనే కాదు, ఏ పనైనా!

– థామస్ బాచ్, ఒలింపిక్ కమిటీ మాజీ అధ్యక్షుడు

అమ్మ - నాన్న



నేను చేసే ప్రతి పని అద్భుతంగా ఉంటుందని అమ్మ అనుకుంటుంది. కానీ నాన్నగారు, "నువ్వింకా బాగా చేయాలి. చొరవగా ముందుకు వెళ్లాలి" అని చెబుతుంటారు. నాన్న చెప్పేదే కరెక్టేమో అని నాకు అనిపిస్తుంటుంది.

– దుల్కర్ సల్మాన్, నటుడు

తెలియాలి!



ప్రజలకు ప్రతిదీ తెలియాలి. కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు వారిని నేను రంగుల కలల్లో విహరించనివ్వను. ప్రమాదంలో ఉన్నామన్న సంగతిని తెలుసుకోటానికి వారు అర్హులు. ప్రభుత్వం ఉన్నది తీపి వార్తలు చెప్పటానికి మాత్రమే కాదు!

– లారెన్స్ వాంగ్, సింగపూర్ ప్రధాని

తప్పనిదైతే...



చేయవలసిన పనిని చేయటానికి అయ్యే ఖర్చుకంటే, ఆ పనిని చేయకపోవటం వల్ల అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ముందున్న పని చాలా కష్టమైనదే కావచ్చు. కానీ అది ఎప్పటికైనా చేయక తప్పనిదైతే ఇప్పుడే తలకెత్తుకోవటం వల్ల భారీగా ఖర్చు తగ్గుతుంది.

– సైమన్ స్టీల్, కార్యదర్శి, యూఎన్ క్లైమేట్ చేంజ్

అర్థం లేదు



కొంతమంది ఇప్పటికీ భయంతో మాస్కులు ధరిస్తున్నారు. అవి తమకు సహాయపడతాయని అనుకుంటున్నారు. ఇది నిజంగా అర్థం లేనిది. ముఖాలను దాచుకోటానికి తప్ప, దేనికీ పనికిరానివి ఈ మాస్కులు.

– జోసెఫ్ లడాపో, ఫ్లోరిడా సర్జన్ జనరల్

కచ్చతీవుపై ఆగని రచ్చ

విశ్లేషణ



నిరుపమా సుబ్రమణియన్

భారతీయుల దృష్టంతా ఉత్తరాన చైనాలోని తియాన్‌జిన్‌పై ఉన్న సమయంలో, దక్షిణపు పొరుగు దేశం సడీచప్పుడు లేకుండా ఓ సందేశాన్ని పంపింది. శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకె ఇటీవల జాఫ్నా సందర్శించారు. ఒకే ఏడాదిలో దిస్సనాయకె ఆ రాష్ట్రాన్ని నాల్గవసారి సందర్శించడమే ఒక రికార్డు అనుకుంటే, ఆయన అక్కడ నుంచి నౌకా దళానికి చెందిన ఒక స్పీడు బోటులో బంజరు దీవి కచ్చతీవుకు వెళ్ళి మరో రికార్డు సృష్టించారు. శ్రీలంక అధ్యక్షుడు ఒకరు ఆ దీవిని సందర్శించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన ద్వారా ఆయన శ్రీలంక భూభాగపు హద్దును స్పష్టంగా పేర్కొన్నట్లు అయింది.



కచ్చతీవును సందర్శించిన శ్రీలంక అధ్యక్షుడు దిస్సనాయకె

శ్రీలంకదే అని ఒప్పుకొన్నప్పటికీ...

కచ్చతీవు శ్రీలంకలో భాగమే! పాక్ జలసంధిలోని ఈ చిన్న భూభాగంపై పొరుగు దేశపు క్లెయిమును భారత్ అంగీకరించింది. ఆ మేరకు రెండు దేశాల మధ్య 1974లో ఒక అంగీకారం కుదిరింది. ఈ అంగీకారం 1976లో మరో అంగీకారానికి దారితీసింది. అది రెండు దేశాల మధ్య సాగర జలాల సరిహద్దును నిర్దేశించింది.

అయినప్పటికీ, రామేశ్వరం–జాఫ్నాల మధ్యనున్న ఈ దీవి, భారత–శ్రీలంక సంబంధాలలో అడపాదడపా చిచ్చు రేపుతూనే ఉంది. బ్రిటిష్ హయాంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలంలోనూ భారత్ మ్యాప్‌లలో దాన్ని ఒక భాగంగా ఎన్నడూ చూపలేదు. రామేశ్వరంలోని జాలర్ల కోపతాపాలను చల్లార్చేందుకు, తమిళనాడు రాజకీయ నాయకులు మాత్రం ఆ నిర్జన దీవిని తిరిగి 'వెనక్కి తీసుకోవడం' గురించి తరచూ గొంతెత్తుతూ ఉంటారు.

తమిళనాడు జాలర్లు చేపల వేటకు అనుసరిస్తున్న 'బాటమ్ ట్రాలింగ్', 'పర్స్ సైన్', 'డబుల్ నెట్' వంటి పద్ధతుల వల్ల చేపలు ఇక ఏమాత్రం లభ్యంకాని స్థితి ఏర్పడింది. శ్రీలంక వైపు వనరులు ఎక్కువ ఉండటానికి కారణం, 30 ఏళ్ళ అంతర్యుద్ధ సమయంలో, జాఫ్నా జాలర్లు దూర ప్రాంతాల్లో చేపల వేటకు సాహసించకపోవడమే! దాంతో శ్రీలంక వైపు చేపల వేట భారతీయ జాలర్లకు ఆకర్షణీయమైనదిగా మారింది. ఫలితంగా, వారిని శ్రీలంక నౌకా దళం అరెస్టు చేయడం, వారి బోట్లను, వలలను స్వాధీనపరచుకోవడం పరిపాటిగా మారింది.

విజయ్ వ్యాఖ్యలతో మరోసారి...

గంగపుత్రులకు ప్రత్యామ్నాయ జీవనోపాధులను సృష్టించవలసిందిపోయి వారి సమస్యలన్నింటికీ పరిష్కారం కచ్చతీవును స్వాధీనపరచుకోవడమే అన్న భ్రమను తమిళ నాయకులు పెంచి పోషిస్తూ వచ్చారు. 'తమిళగ వెట్రి కళగం' పార్టీని ప్రారంభించిన సినీ నటుడు విజయ్ కూడా నిన్నగాక మొన్న అదే పల్లవిని అందుకున్నారు. ఇంతవరకు ఆయన నిర్వహించిన ర్యాలీలన్నింటిలోకెల్లా ఇటీవలి మదురై ర్యాలీని అతి పెద్దదిగా చెప్పాలి. రాష్ట్ర జాలర్లకు 'చిన్న పని చేసి పెట్టండి చాలు', 'ఈ దీవి మనదేనని క్లెయిము చేస్తే మన జాలర్లు సురక్షితంగా ఉంటారు' అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి, అదే భ్రమను కొనసాగించడంలో తాను కూడా ఒక చేయి వేశారు.

◆ కచ్చతీవు శ్రీలంకలో భాగమే. పాక్ జలసంధిలోని ఈ చిన్న భూభాగంపై పొరుగు దేశపు క్లెయిమును 1974లో భారత్ అంగీకరించింది. గంగపుత్రులకు ప్రత్యామ్నాయ జీవనోపాధులను సృష్టించవలసిందిపోయి వారి సమస్యలన్నింటికి పరిష్కారం కచ్చతీవును స్వాధీనపరచు కోవడమే అన్న భ్రమను తమిళ నాయకులు పెంచి పోషిస్తూ వచ్చారు. 'తమిళగ వెట్రి కళగం' పార్టీని ప్రారంభించిన సినీ నటుడు విజయ్ కూడా నిన్నగాక మొన్న అదే పల్లవిని అందుకున్నారు.



హీరో విజయ్

కచ్చతీవును 'తిరిగి' తెచ్చుకోవాలంటూ తమిళనాడు ప్రభుత్వం ఇంతవరకు నాలుగు తీర్మానాలు చేసింది. శ్రీలంకతో కుదిరిన అంగీకారాన్ని 'రాజ్యాంగ విరుద్ధమైనది'గా పేర్కొంటూ రద్దు చేయవలసిందని కోరుతున్న కేసులు కొన్ని సుప్రీం కోర్టు ముందున్నాయి. కచ్చతీవును కాంగ్రెస్ 'నిర్లక్ష్యపూరితం'గా శ్రీలంకకు అప్పగించిందని 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వ్యాఖ్యానించడం ద్వారా ప్రధాన మంత్రి మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అగ్నికి ఆజ్యం పోశారు.

కచ్చతీవును వెనక్కి తీసుకోవడం తమిళ జాలర్ల సమస్యలను పరిష్కరిస్తుందనే మాటే నిజమైతే, తమిళ చేపల బోట్లు కచ్చాతీవును దాటి, శ్రీలంక తూర్పు కోస్తా వరకు ఎందుకు వెళ్తున్నట్లు? విజయ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హేరత్, ''రాజకీయ వేదికల నుంచి చేసే ప్రసంగాలను'' చెవికెక్కించుకోవద్దంటూ శ్రీలంక పౌరులను కోరారు.

దిస్సనాయకెకు కలిసొచ్చింది!

కచ్చతీవును సందర్శించడం స్వదేశంలో దిస్సనాయకెకు చెందిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్పీపీ) పార్టీకి సహాయపడటం ఖాయం. తమిళులు ఎక్కువగా ఉన్న జాఫ్నాలో ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాన్ని ఆయన పార్టీ కొనసాగిస్తోంది. అంతర్యుద్ధ సమయంలో, తమిళ ఉగ్ర సంస్థలకు ఉదారంగా సహాయపడిన, ఆవలి వైపునున్న తమిళ సోదరులు, ఇపుడు తమకే ఎసరు పెడుతున్నారనే భావన జాఫ్నా తమిళులలో పాదుకొంది. కచ్చతీవు దీవిలో కాలు మోపడం ద్వారా, తాను శ్రీలంక తమిళ జాలర్ల పక్షాన ఉన్నానని దిస్సనాయకె చాటుకున్నట్లు అయింది.

దిస్సనాయకె ప్రతిష్ఠ కొద్ది నెలలుగా మసకబారుతూ వస్తోంది. ఆర్థిక వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువస్తామని, కఠినంగా ఉన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ షరతులలో మార్పులు కోరతామని వాగ్దానం చేయడం ద్వారా ఎన్పీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ, అది ఇంతవరకు ఉన్న పరిస్థితులు మరింత దిగజారకుండా మాత్రమే నిర్వహించగలుగుతోంది.

ఈ నేపథ్యంలో, కచ్చతీవు భూభాగం తమదేనని దిస్సనాయకె చాటుకోవడం, ఆయన ప్రభుత్వానికి ప్రధాన అండగా ఉన్న సింహళ జాతీయులను తప్పకుండా ఆకట్టుకుంటుంది. భారత్ పట్ల మరీ మెతకగా వ్యవహరిస్తున్నారని నిందిస్తున్న స్వదేశంలోని విమర్శకులకు కూడా దిస్సనాయకె సందేశం పంపినట్లయింది. భారతదేశంతో రక్షణ సహకార ఒప్పందం కుదుర్చుకున్నందుకు ఆయన విమర్శల పాలయ్యారు. మొత్తానికి, శ్రీలంక ప్రయోజనాలకు కట్టుబడిన వ్యక్తిగా దిస్సనాయకె తనను తాను చాటుకోగలిగారు.

సముద్రంపై జీవనం సాగించేవారికి సెయింట్ ఆంటొని ఆరాధనీయుడు. ఆయన స్మారక ప్రార్థనా మందిరం కచ్చతీవులో శతాబ్దంపైగా నిలిచి ఉంది. అంతర్యుద్ధం అంతమైన తర్వాత, ప్రార్థనా మందిరం కొత్త రూపురేఖలను సంతరించుకుంది. ఇంతా చేసి, 1.6 కిలోమీటర్ల పొడవు, 300 మీటర్ల వెడల్పు కలిగిన కచ్చతీవు పర్యాటక ప్రదేశంగా పరిణమించవచ్చు. కానీ, తమిళనాడు నుంచి సన్నాయి నొక్కులు మాత్రం ఆగకపోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఎన్నికల సంఘం జవాబు చెప్పాలి!

అభిప్రాయం



దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత ముఖ్యమైనవి. అటువంటి ఎన్నికల్లో 'ఓట్ చోరీ' ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది. దీన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఉద్యమాన్ని సాగిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా బిహార్‌లో హఠాత్తుగా ఈసీ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఓటర్ల జాబితా సవరణ చేపట్టి దాదాపు 8–9 శాతం మందిని... అంటే అక్షరాలా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించింది.

ఆర్జేడీకి చెందిన తేజస్వీ యాదవ్ వంటి ప్రతిపక్ష నాయకులు లక్షలాది మంది ఓటుహక్కుపై ఎన్నికల సంఘం గొడ్డలి వేటు వేసిందని ఆరోపిస్తున్నారు. తేజస్వి ప్రకారమైతే ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 50 మంది ఓటర్లను మృతులుగా ప్రకటించి తొలగించారు. ఈ తీరును ప్రశ్నిస్తే అన్ని విధాలా పరిశీలించి, నోటీసులు జారీ చేసి సహేతుకంగానే ఈ పని చేశామని ఎన్నికల సంఘం చెబుతోంది. ఓటర్ల గల్లంతుపై లక్షలాది ఫిర్యాదులు దాఖలు చేసినా... అవి సరైన రీతిలో లేవని ఎన్నికల సంఘం తిరస్కరించింది. వివిధ ప్రాంతాల్లో మరిన్ని భయానకమైన అంశాలు వెల్లడవుతున్నాయి. పూర్ణియా, ముజఫర్‌పూర్, హాజీపూర్ వంటిచోట్ల నిరక్షరాస్యులైన ముస్లింలనూ, ఇతర అణగారిన వర్గాలవారినీ ఎలాంటి కారణమూ చెప్పకుండా ఏకపక్షంగా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు.



ఈ అక్రమ ధోరణులపై పిటిషన్‌లు దాఖలయ్యాక సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పోలింగ్ కేంద్రాలవారీగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల జాబితాలనూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల ద్వారా వెల్లడించాలనీ, కారణాలు కూడా సూచించాలనీ, అవి ఆన్‌లైన్‌లో వెదకటానికి వీలుగా ఉండాలనీ ఆదేశాలు జారీ చేసింది. జాబితాలో గల్లంతైన వారి వినతులు వినడానికి వీలుగా ఈ ఆదేశాలిచ్చింది.

బిహార్‌లో మాత్రమే కాదు... మహారాష్ట్ర, హరియాణాల్లో కూడా అంతే. మహారాష్ట్రలో రాత్రికి రాత్రి కోటిమంది ఓటర్లు పుట్టుకొచ్చారు. మాలెగావ్ సెంట్రల్‌లోనే 42,821 మంది దొంగ ఓటర్లు జాబితాలకెక్కారు. నవీ ముంబైలో 76,556 మంది పలు పోలింగ్ కేంద్రాల్లో నమోదు కాగా, కొంతమంది పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదయ్యారు. కానీ ఈ ఆరోపణలు అర్థరహితమనీ, నిరాధారమనీ ఎన్నికల సంఘం అంటోంది.

సంస్థాగత వంచనకు రాజకీయ అండ

విచిత్రమేమంటే ఒక రాజకీయ పక్షంగా పారదర్శకత ఉండితీరాలని డిమాండ్ చేయవలసిన బీజేపీ ఈసీ కొమ్ముకాస్తోంది. దర్యాప్తు చేయాలని నిలదీయడానికి బదులు దాన్ని సమర్థిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పనిలో ఉండవలసిన సంస్థ ఏమో తప్పించుకునే ధోరణిలో, అనుమానాస్పద రీతిలో వ్యవహరిస్తుండటం, దాన్ని కాపాడటానికి అధికార పక్షం ఆత్రుత పడటం దేన్ని సూచిస్తోంది? ఇది అందరికీ పరీక్షా సమయం. బ్యాలెట్‌పై మళ్లీ విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన సమయం. ఎన్నికల సంఘం తాను అనుసరిస్తున్న విధానాలను తేటతెల్లం చేసి తీరవలసిన సమయం. 'సర్'ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నారని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఇది చాలా కీలకం.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి

నిరుద్యోగులు పోరాడి గెలిచారు!

దేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్–1 పరీక్షను కాంగ్రెస్ ప్రభుత్వం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో తీవ్ర వైఫల్యం చెందింది. అనేక అవకతవకలతో నిర్వహించిన ఈ పరీక్షపై పునః సమీక్ష చెయ్యాలనీ, మరలా పారదర్శకంగా పరీక్ష నిర్వహించాలనీ హైదరాబాద్ అశోక్ నగర్ వీధుల్లో విద్యార్థులు తీవ్ర నిరసన తెలిపారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మొండి వైఖరితో విద్యార్థులను అణచివేసి అక్రమ కేసులు బనాయించింది. దీంతో న్యాయ స్థానాన్ని ఆశ్రయించిన ఉద్యోగార్థులు ప్రభుత్వంతో పోరాడి గెలిచారు. ఈ కేసును పరిశీలించిన హైకోర్టు... 'ఎనిమిది నెలల్లోగా రీ–వాల్యుయేషన్ చేయాలి, లేని పక్షంలో రీ–ఎగ్జామ్ నిర్వహించాల'ని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది.




21,075 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తే, 21,085 మందికి రిజల్ట్స్ ఇచ్చారు. అదనంగా 10 మంది ఎలా వచ్చారో ప్రభుత్వం చెప్పాలి. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు ఇచ్చారు. పరీక్ష పూర్తయిన తర్వాత ట్రిపుల్ మూల్యాంకన పద్ధతిని అనుసరించలేదు. వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాను ప్రకటించాలి. కానీ, అదీ చేయలేదు. మూల్యాంకానికి ఆ సబ్జెక్ట్‌లో నిష్ణాతులైన ప్రొఫెసర్లను నిమగ్నం చేయాలి. కానీ, రిటైర్డ్ లెక్చరర్లు, కోచింగ్ సెంటర్ల ఫ్యాకల్టీని వినియోగించారు. రీ–కౌంటింగ్ పెడితే 9,000 మందిలో ఒక్కరికి కూడా మార్కులు పెరగలేదు. 46 పరీక్షా కేంద్రాల్లో కేవలం 2 సెంటర్లలోనే 74 మంది టాపర్లు ఉన్నారు. కొందరు అభ్యర్థులకు కొన్ని సబ్జెక్ట్‌లలో అధిక మార్కులు వచ్చి మరికొన్నింట్లో ఏకంగా 23, 68, 9 మార్కులు వచ్చాయి. తెలుగు మీడియం అభ్యర్థులకు జరిగిన అన్యాయం మరీ ఘోరం. ఇంగ్లీష్ మీడియం నుంచి 89.88 శాతం అభ్యర్థులు ఎంపికైతే, తెలుగు మీడియం నుంచి కేవలం 9.95 శాతం మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గ్రూప్–1 పరీక్షలో చరిత్రలో మొదటిసారి పక్కపక్కనే ఉన్న వాళ్లకు మొత్తంగా 719 మందికి ఒకే మార్కులు వచ్చాయి. ఇదెలా సాధ్యం అవుతుంది?

వీటినన్నింటినీ ప్రశ్నించినందుకు టీజీపీఎస్సీ తన పరువు పోయినట్టు భావించి నాకు పరువు నష్టం దావా నోటీసులు ఇచ్చింది. మాట్లాడొద్దని నా గొంతు నొక్కే ప్రయత్నం చేసింది. హైకోర్టు విద్యార్థులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఇంత జరిగితే అభ్యర్థులకు క్షమాపణ చెప్పి పరీక్షను మళ్లీ నిర్వహించకుండా... హైకోర్టు ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో కానీ, సుప్రీంకోర్టులో కానీ ప్రభుత్వం సవాలు చేయాలనుకోవడం మరింత మూర్ఖత్వం.

– ఏనుగుల రాకేష్ రెడ్డి । బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

డేటా పాయింట్



అమ్మను చూసే భాగ్యం!



జ్యోతిర్మయం

దేవతలకూ, దానవులకూ జరిగిన యుద్ధంలో ఒకసారి గెలుపు దానవుల రాజైన బలి చక్రవర్తికి దక్కింది. ఇంద్రుడిని త్రిలోకాధిపత్యం నుండి పడదోసి తాను ఆ స్థానాన్ని ఆక్రమించాడు బలి. ముల్లోకాలనూ ఏలుతూ అక్కడ నిర్వహింపబడే యజ్ఞయాగాలలో దేవతల కోసం సమర్పించబడే హవ్యభాగాన్ని, వారికి బదులుగా తాను స్వీకరిస్తూ, పరమాత్ముడైన శ్రీమహావిష్ణువుకు ప్రీతిని కలిగిస్తూ, శాస్త్రోక్తపద్ధతిలో ఎన్నెన్నో యాగాలను నిర్వహిస్తూ, బలి చక్రవర్తి పాలించసాగాడు. దేవతల దైన్యస్థితి వారి తల్లియైన అదితిని ఎంతగానో కలతకు గురిచేసింది. అసురుల బారి నుండి తన సంతానాన్ని కాపాడుకోవాలనే తలంపు ఆమెకు కలిగింది. వెంటనే తపస్సుకు పూనుకుంది. సంగతి తెలుసుకున్న బలి కంగారుపడి, ఏమి జరుగుతున్నదో తెలుసుకు రమ్మని అనుచర గణాన్ని పంపాడు. వెళ్ళిన వారు ఆమె చేస్తున్న ఘోర తపస్సును చూసి వణికిపోయారు. ఆమె తపస్సు కొనసాగితే ముప్పు అని గ్రహించి, ఆ తపస్సును ఎలాగైనా మాన్పాలని నిర్ణయించుకున్నారు. అమ్మ ఎవరికైనా అమ్మయేననీ, అమ్మ లేని ఇల్లు ఇల్లుగా కనిపించదనీ, కనక తపస్సును వీడి తక్షణమే ఇంటికి వచ్చేయమనీ ప్రార్థించారు. అలా ప్రార్థిస్తూ, అమ్మ మనసు కరిగే విధంగా పొగిడారని ధరణి దేవుల రామయమంత్రి 'దశావతార చరిత్రము' పంచమాశ్వాసంలోని పద్యంలో ఇలా చెప్పాడు.

కం. రోగి దరిద్రుడు పరదే / శాగతుడుం దల్లిజూచి యానందించు / న్భోగము భాగ్యము రాజ్య / శ్రీగలవారలకు వేఱె చెప్పగవలెనే. జబ్బుపడినవాడు, డబ్బును పోగొట్టుకుని దరిద్రుడైనవాడు, అప్పుడే పరదేశం నుంచి తిరిగి వచ్చినవాడు అమ్మ ముఖంలో ఏమి చూస్తారు? జబ్బుపడిన వాడు స్వస్థత అనే భోగాన్ని, దరిద్రుడు ధనంతో సమానమైన సంపదను, పరదేశం నుంచి వచ్చినవాడు సొంతగడ్డపై కాలుపెట్టడం అనే రాజభోగాన్ని చూస్తారని అంతర్లీనంగా చెప్పడం ఈ పద్యంలోని విశేషం. రాజ్య సంపదలతో తులతూగేవారి సంగతి వేరే చెప్పేదేముంది. నిజమైన మాటే కదా!

– భట్టు వెంకటరావు

మేడారం జాతరకు మాస్టర్‌ప్లాన్

• మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సమ్మక్క–సారలమ్మ జాతరను మరింత విస్తృతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర పనుల ఆధునీకరణలో భాగంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మేడారం జాతర మాస్టర్‌ప్లాన్‌పై మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పనుల ఆధునీకరణకు ఆమోదం తెలిపిన తర్వాత వెంటనే పనులు ప్రారంభించాలని, వంద రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. పనుల్లో ఆదివాసీ కోయ సంప్రదాయం స్పష్టంగా కనిపించాలని, అందుకు సంబంధించిన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నందున తగు ప్రణాళికలు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు శాశ్వత ఏర్పాట్లు

ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు మొదలు పెట్టాలి • సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, అధికారులు

సాక్షి, హైదరాబాద్: గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పుష్కరాలకు మరో 22 నెలల సమయం ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని సూచించారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని, భక్తుల రద్దీని అంచనా వేసుకొని మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. లక్షల సంఖ్యలో భక్తులు రానున్నందున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం గోదావరి పుష్కరాలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 2027లో జూలై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం అవుతాయని.. పుష్కరాల కోసం ఇప్పటి నుంచే పనులు ప్రారంభించాలని సూచించారు. 74 చోట్ల పుష్కర ఘాట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు వివరించారు.

ప్రధాన ఆలయాలపై ప్రత్యేక దృష్టి..

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతోపాటు అన్ని ప్రధాన ఆలయాలను మొదట అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆలయ పరిసరాల్లోని పుష్కర ఘాట్ల అభివృద్ధిని మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధితో పాటు అక్కడ శాశ్వత పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే గోదావరి తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఒకేరోజు రెండు లక్షల మంది భక్తులు పుష్కర ఘాట్లకు తరలివచ్చినా ఇబ్బంది లేకుండా రహదారుల నిర్మాణంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగు నీరు, స్నానాల ఘాట్లు, వసతి సదుపాయాలన్నీ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆలయాల కమిటీలు, అధికారులతో చర్చించి ప్రణాళిక రూపొందించాలని అన్నారు. మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలను నియమించుకోవాలని ఆదేశించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతోపాటు గోదావరి తీరం వెంట ఉన్న అన్ని ఆలయాలను సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను విస్తరించడంతోపాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని తెలిపారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలని సూచించారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పుష్కరాల ముందస్తు ఏర్పాట్లలో పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

అందరూ చూస్తుండగానే గొంతు కోసి..

• రియల్ వ్యాపారి దారుణహత్య



శ్రీకాంత్‌రెడ్డి

కుషాయిగూడ/ ఉప్పల్: హైదరాబాద్‌లో రియల్ వ్యాపారి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ మంగాపురంలో జరిగింది. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మంగాపురం ప్రాంతానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి(45) వృత్తిరీత్యా రియల్ వ్యాపారి. లాలాపేట శాంతినగర్‌కు చెందిన ధన్‌రాజ్‌యాదవ్ శ్రీకాంత్‌రెడ్డికి స్నేహితుడు. కొంత కాలంగా రియల్ వ్యాపారానికి సంబంధించిన లావాదేవీల్లో వచ్చిన తేడా వల్ల ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ధన్‌రాజ్ యాదవ్ తన స్నేహితునితో కలిసి మంగాపురంలోని శ్రీకాంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ కార్యాలయానికి వచ్చాడు. ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. అనంతరం శ్రీకాంత్, ధన్‌రాజ్‌ల మధ్య డబ్బు విషయంలో మాటామాటా పెరిగింది. ఇంతలోనే ధన్‌రాజ్ ఆగ్రహంతో ఊగిపోతూ శ్రీకాంత్‌రెడ్డి చొక్కా పట్టుకొని ఆఫీస్ బయటకు లాక్కొని వచ్చి కింద పడేశాడు. మద్యం మత్తులో ఉండటం వల్ల కిందపడిన శ్రీకాంత్‌రెడ్డి వెంటనే లేవ లేకపోయాడు. పక్కనే ఉన్న స్నేహితుడు వారిస్తున్నా, కార్యాలయం ఎదుట ఉన్న అందరూ చూస్తున్నా, తన వెంట తెచ్చుకున్న కత్తితో శ్రీకాంత్‌రెడ్డి గొంతు కోసి హత్య చేశాడు. ఈ తతంగాన్ని స్థానికులు సెల్‌ఫోన్‌లలో బంధిస్తూ అరుస్తూ కేకలు వేశారు. అనంతరం ధనరాజ్ తాపీగా నడుచుకుంటూ కొంతదూరం వెళ్లి రోడ్డుపైన కూర్చుండిపోయాడు. సమాచారం అందుకున్న కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తన సిబ్బందితో వచ్చి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీకాంత్‌రెడ్డికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

'మన ప్రజాపాలన' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్

నాగర్‌కర్నూల్: 'మన ప్రజాపాలన ప్రగతి వైపునకు తెలంగాణ పయనం'అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత, తెలంగాణ సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడు ముచ్చర్ల దినకర్ సీఎం రేవంత్‌కు పుస్తకాన్ని అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 20 నెలల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో తెలంగాణ దూసుకుపోతోందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పుస్తక రూపంలో తీసుకురావడాన్ని అభినందించారు. రచయిత దినకర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2023, డిసెంబర్ 7వ తేదీ నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ పత్రికల్లో తాను రాసిన 18 వ్యాసాలతో ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

'కొత్త నియామకాలు చేపట్టాలి'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి, కొత్త ఉద్యోగ నియామకాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జీటీ జీవన్ కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం దృష్టి సారించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి ఎన్నో లాభాలార్జించి పెడుతున్న సంస్థల్లోనైనా కొత్త ఉద్యోగ నియామకాలపై తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రియుడితో కలసి కన్నబిడ్డ హత్య

• వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..
• 4 నెలల క్రితం హత్య చేసి పాతిపెట్టిన వైనం
• మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



నిందితులు మమత, ఫయాజ్

శివ్వంపేట (నర్సాపూర్): ప్రియుడితో కలసి రెండేళ్ల కన్నబిడ్డను హత్య చేసి పాతిపెట్టిందో తల్లి. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉంటుందని భావించి వారు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఈ ఘటన శుక్రవారం మెదక్ జిల్లా శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శభాష్‌పల్లిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బంటు మమతకు సిద్దిపేట జిల్లా రాయిపోల్ మండలం వడ్డేపల్లికి చెందిన భాస్కర్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు, కూతురు తన్విసి (2) సంతానం. కాగా, మమత శభాష్‌పల్లికి చెందిన ఫయాజ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. మార్చి నెలలో ఇద్దరూ కలసి పారిపోవడంతో పెద్దలు సర్ది చెప్పి అత్తగారింటికి పంపించారు. మేలో పిల్లలను తీసుకొని మమత తల్లిగారింటికి వచ్చింది. ఆమెలో ఎలాంటి మార్పు రాకపోగా.. రెండోసారి మే 21న కుమారుడిని తల్లిగారి ఇంట్లోనే వదిలేసి కూతురు తన్విసిని తీసుకుని ప్రియుడితో వెళ్లిపోయింది. దీంతో మమత తండ్రి రాజు ఫిర్యాదు మేరకు శివ్వంపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుంటూరులో దొరికిన మమత, ఫయాజ్

శివ్వంపేట పోలీసులు ఏపీలోని గుంటూరులో మమత, ఫయాజ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కూతురు తన్విసి విషయంలో స్పష్టత రాకపోవడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. గొంతు పిసికి హత్య చేసి, పాతి పెట్టినట్లు చెప్పారు. దీంతో శుక్రవారం సాయంత్రం శభాష్‌పల్లి గ్రామ శివారులో చిన్నారిని పాతి పెట్టిన ప్రదేశాన్ని కనుగొన్నారు. డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, తహసీల్దార్ కమలాద్రి, ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి సమక్షంలో కుంట కట్టు కాల్వలో పూడ్చిన చిన్నారి మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసిన అనంతరం గ్రామస్తులు నిందితులకు దేహశుద్ధి చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఫయాజ్‌పై ఇప్పటికే దొంగతనాలు ఇతర నేరాలకు సంబంధించి 30కి పైగా కేసులు ఉన్నాయని పోలీసులు చెప్పారు.

కారుతో ఢీకొట్టి.. కళ్లల్లో కారం కొట్టి

• రంగారెడ్డి జిల్లాలో పట్టపగలు దారిదోపిడీ
• రూ.40 లక్షలతో ఉడాయించిన దుండగులు
• పారిపోతుండగా బోల్తాపడిన ఆగంతకుల కారు
• వాహనం నుంచి బయటపడి.. చేతికందిన నగదుతో పరార్



పారిపోతున్న దొంగలు (సీసీ కెమెరా దృశ్యం)


శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లాలో శుక్రవారం పట్టపగలే దారిదోపిడీ జరిగింది. ముందు వెళ్తున్న కారును ఢీకొట్టిన దుండగులు.. కారు అద్దాలను ధ్వంసం చేసి, డ్రైవర్ కళ్లల్లో కారం కొట్టి రూ.40 లక్షల నగదుతో తమ కారులో ఉడాయించారు. అయితే, పారిపోయే క్రమంలో అతివేగంగా వెళ్లటంతో వారి కారు అదుపుతప్పి బోల్తాపడింది. అతికష్టం మీద బయటకు వచ్చిన ఆగంతకులు.. అందినకాడికి డబ్బులు తీసుకుని పారిపోయారు. సినిమా సీన్‌ను తలపించిన ఈ దోపిడీ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం హుస్సేన్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన రాకేశ్ అగర్వాల్ అనే వ్యాపారి డబ్బు తీసుకుని రావాలని తన వద్ద పనిచేస్తున్న ఉద్యోగి సాయిబాబ, డ్రైవర్ మధును శుక్రవారం ఉదయం వికారాబాద్ పంపించాడు. రూ.40 లక్షలు తీసుకుని ఇద్దరూ తిరిగి వస్తుండగా, స్విఫ్ట్ కారులో వీరిని వెంబడించిన దుండగులు మధ్యాహ్నం ఒంటిగంటకు హుస్సేన్‌పూర్ శివారు వద్ద వెనుక నుంచి ఢీకొట్టారు. ఉలిక్కిపడ్డ డ్రైవర్ మధు కారును రోడ్డు పక్కన ఆపడంతో వెనక కారులోంచి దిగిన ముగ్గురు వ్యక్తులు మధు కళ్లల్లో కారం చల్లారు. కారు వెనక డోర్ అద్దాలు పగులగొట్టి, సీట్లో కూర్చున్న సాయిబాబా పక్కనే ఉన్న నగదు బ్యాగును లాక్కునేందుకు ప్రయత్నించారు. అతడు ప్రతిఘటించడంతో రాయితో కొట్టి బ్యాగును లాక్కుని క్షణాల్లో పారిపోయారు. అయితే, అతివేగంగా వెళ్లిన వారి కారు 3 కిలోమీటర్లు ప్రయాణించి అదుపుతప్పి బోల్తా పడింది. అతి కష్టం మీద కారులోంచి బయటకు వచ్చిన నలుగురు దొంగలు, చేతులకు అందినకాడికి (సుమారు రూ.30 లక్షలు) తీసుకుని, కొంతమొత్తాన్ని వదిలేసి పరారయ్యారు.

స్థానికుల చేతివాటం: దోపిడీ విషయం తెలిసి బోల్తా పడిన దొంగల కారు వద్దకు పోలీసులు చేరుకోవటానికి కొంత సమయం పట్టింది. ఈ లోగా అక్కడే ఉన్న పలువురు కారులో కనిపించిన కొంత డబ్బును తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు కారులో శోధించగా రూ.8.70 లక్షలు లభించాయి. కారులో నుంచి 2 ఫోన్లు, డమ్మీ పిస్టల్, కత్తి, కారంపొడి, క్షుద్ర పూజల్లో వినియోగించే మాలలు, గ్లౌజులు సీజ్ చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు 4 దర్యాప్తు బృందాలను నియమించారు. బోల్తా పడిన కారులో 2016లో నమోదైన ఓ కేసుకు సంబంధించిన చార్జిషీట్ లభించింది. దీంతో ఈ దొంగలకు గతంలోనే నేర చరిత్ర ఉండొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు వినియోగించిన కారు జడ్చర్లకు చెందినదిగా గుర్తించి, కారు యజమానితోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

సూర్యుడిపై సీతాకోకచిలుక!

5 లక్షల కిలోమీటర్ల వెడల్పయిన రంధ్రం

- గుర్తించిన 'నాసా'సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ
- భానుడి నుంచి వెలువడుతున్న సౌరగాలులు



వాషింగ్టన్: ఎల్లవేళలా భగభగమండుతూ భూగోళంపై జీవకోటికి ప్రాణాధారమైన లోక బాంధవుడు సూర్యుడిలో భారీ రంధ్రాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు చెందిన సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ గుర్తించింది. ఈ రంధ్రం ఏకంగా 5 లక్షల కిలోమీటర్ల వెడల్పున సీతాకోకచిలుక ఆకారంలో ఉండడం విశేషం. అందుకే బట్టర్‌ఫ్లై హోల్ అని పిలుస్తున్నారు. సూర్యుడి వాతావరణంలో అత్యంత అరుదుగా సంభవించే ఈ పరిణామం గురువారం నాసా కెమెరా కంటికి చిక్కింది. ఈ రంధ్రం భూమి వాతావరణాన్ని ప్రభావితం చేసే పరిస్థితి ఉండడం గమనార్హం. సూర్యుడి బయటి పొరను 'కరోనల్ హోల్'అంటారు. సూర్యుడి నుంచి ఉద్భవించే సౌర గాలులు అంతరిక్షంలోకి వెళ్లిపోవడానికి వీలుగా ఈ పొరలోని అయస్కాంత క్షేత్రాలు అప్పుడప్పుడు తెరుచుకుంటాయి. అలా తెరుచుకున్నప్పుడు రంధ్రం మాదిరిగా కనిపిస్తుంది. కానీ, 5 లక్షల కిలోమీటర్ల రంధ్రం కనిపించడం అరుదైన విషయమే. టెలిస్కోప్ చిత్రాల్లో కరోనల్ హోల్స్ నల్ల రంగులో దర్శనమిస్తాయి. ఈ ప్రాంతంలో సాధారణంగా ఉండే వేడి ప్లాస్మా మాయం కావడమే ఇందుకు కారణం. ఉదయభానుడి కరోనల్ రంధ్రం నుంచి వెలువడుతున్న సౌర గాలులు ప్రస్తుతం భూమి దిశగా దూసుకొస్తున్నాయి. అంతరిక్షం గుండా ప్రయాణించి, భూమికి సంబంధించిన అయస్కాంత క్షేత్రాన్ని ఢీకొట్టనున్నాయి. ఈ సౌరగాలుల ప్రవాహం ఈ నెల 14వ తేదీన భూమికి చేరుకొంటుందని అంచనా వేస్తున్నారు. సౌరగాలులు భూమిని ఢీకొట్టినప్పుడు భూఅయస్కాంత తుఫాన్లు సంభవిస్తాయి. వీటిని జీ1(స్వల్ప), జీ2(మధ్యస్థం)గా కొలుస్తారు. ఈ తుఫాన్ల వల్ల ప్రాణనష్టం ఏమీ ఉండదు గానీ ఉపగ్రహాల కార్యకలాపాలు, సాంకేతిక వ్యవస్థలు ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుంది. అంటే ఉపగ్రహ ప్రసారాల్లో అంతరాయం ఏర్పడొచ్చు. సూర్యుడి, భూమి అయస్కాంత క్షేత్రాల మధ్య అనుసంధానం సందర్భంగా అంతరిక్షం గురించి కొత్త విషయాలు తెలుసుకొనే అవకాశం ఉందని చెబుతున్నారు. సూర్యగోళం, భూగోళం మధ్య బంధాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన సమాచారాన్ని సీతాకోకచిలుక రంధ్రం అందిస్తుందని అంటున్నారు. మొత్తానికి సూర్యుడి నుంచి వెలువడుతున్న సౌర గాలుల ప్రవాహాన్ని సైంటిస్టులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

8.5 కోట్ల ఏళ్లనాటి డైనోసార్ గుడ్లు



సెంట్రల్ చైనాలో గుర్తించిన పరిశోధకులు

బీజింగ్: భూగోళంపై ఒకప్పుడు భారీ డైనోసార్లు(రాక్షస బల్లులు) ఉండేవన్న సంగతి తెలిసిందే. వాటిపై ఇప్పటికీ అధ్యయనం జరుగుతూనే ఉంది. భూమిని గ్రహ శకలాలు ఢీకొట్టడం లేదా వాతావరణ మార్పుల వల్ల లక్షల సంవత్సరాల క్రితం ఇవి అంతరించిపోయాయని సైంటిస్టులు చెబుతుంటారు. కానీ, చైనాలో 85 మిలియన్ల (8.5 కోట్లు) ఏళ్ల క్రితం నాటి రాక్షస బల్లుల గుడ్లను పరిశోధకులు వెలికితీశారు. అంటే డైనోసార్ల చరిత్ర మనం ఊహించిదానికంటే పురాతనమైనదని స్పష్టమవుతోంది. సెంట్రల్ చైనాలోని యూన్‌యాంగ్ బేసిన్‌లో ఉన్న ఖింగ్‌లాంగ్‌షాన్‌లో తవ్వకాల్లో రాక్షస బల్లుల గుడ్లు లభించాయి. ఇవి ఏ కాలానికి సంబంధించినవో తెలుసుకోవడానికి ఆధునిక కార్బొనేట్ యురేనియం-లెడ్(యూ-పీబీ) డేటింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ఈ గుడ్లు 8.5 కోట్ల ఏళ్ల నుంచే ఇక్కడ ఉన్నట్లు తేల్చారు. ఆ కాలాన్ని క్రెటాసియస్ పీరియడ్ అంటారు. ఆ సమయంలోనే భూమిపై భారీగా వాతావరణ మార్పులు సంభవించాయి. అత్యంత వేడిగా ఉన్న వాతావరణం చల్లబడడం మొదలైంది. ఈ పరిణామమే డైనోసార్లు క్రమంగా అంతరించిపోవడానికి దోహదపడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. డైనోసార్ ఎగ్స్ విషయంలో కార్బొనేట్ యురేనియం-లెడ్ డేటింగ్ పరీక్ష చేయడం ఇదే మొదటిసారి. ఈ వివరాలను ఎర్త్ సైన్స్ పత్రికలో ప్రచురించారు.

15 నుంచి నైరుతి తిరోగమనం: ఐఎండీ



న్యూఢిల్లీ: నైరుతి రుతు పవనాల తిరోగమనం ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) శుక్రవారం తెలిపింది. జూన్ ఒకటో తేదీన కేరళ మీదుగా దేశంలోకి ప్రవేశించిన ఈ రుతు పవనాలు అదే నెల 8వ తేదీ కల్లా దేశమంతటా విస్తరించాయి. అదేవిధంగా, రుతు పవనాల తిరోగమనం సెప్టెంబర్ 17న వాయువ్య భారతం నుంచి మొదలై అక్టోబర్ 15వ తేదీకల్లా పూర్తవుతుంది. పశ్చిమ రాజస్తాన్‌లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఈ నెల 15వ తేదీ నుంచి రుతు పవనాల ఉపసంహరణకు పూర్తి అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. ఈ సీజన్‌లో సాధారణంగా 77.86 సెంటీమీటర్ల వర్షం కురియాల్సి ఉండగా అంతకు 7 శాతం ఎక్కువగా 83.62 సెంటీమీటర్లు కురిసినట్లు తెలిపింది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం కలిగించాయి. వాయవ్య భారతంలో సాధారణ వర్షపాతం 53.81 సెంటీమీటర్లు కాగా, ఈ సీజన్‌లో 34 శాతం ఎక్కువగా 72 సెంటీమీటర్లు నమోదైనట్లు ఐఎండీ పేర్కొంది. అదేవిధంగా, దక్షిణాదిన సాధారణంగా నమోదయ్యే 61 సెంటీమీటర్లకు మించి 7 శాతం అధికంగా వర్షాలు కురిశాయని ఐఎండీ తెలిపింది.


కర్ణాటకలో 22 నుంచి కుల గణన

అక్టోబర్ 7కల్లా పూర్తి: సీఎం



బెంగళూరు: కర్ణాటకలో సెప్టెంబర్ 22 నుంచి రాష్ట్ర కులగణన మొదలుకానుందని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. అక్టోబర్ 7వ తేదీ వరకు ఇది పూర్తి కానుందన్నారు. దీని కోసం సుమారు రూ.420 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ సర్వేగా పిలిచే ఈ సర్వేకు కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన కులాల కమిషన్ చైర్‌పర్సన్ మధుసూదన్ ఆర్ నాయక్ సారథ్యం వహించనున్నారన్నారు. ఇందులో శాస్త్రీయంగా రూపొందించిన 60 ప్రశ్నలతో రాష్ట్రంలోని ఏడు కోట్ల మంది ప్రజలు, 2 కోట్ల కుటుంబాల సామాజిక, విద్యాపరమైన స్థితిగతులను తెల్చుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. డిసెంబర్ కల్లా సర్వే నివేదిక అందే అవకాశాలున్నాయన్నారు. దసరా సెలవుల్లో సుమారు 1.75 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సర్వేను చేపడతారన్నారు. ఇందుకోసం శిక్షణ ఇస్తున్నారని, ఒక్కొక్కరికి 120-150 ఇళ్ల బాధ్యతలు అప్పగిస్తారని సీఎం చెప్పారు. వీరికి రూ.20 వేల పారితోషికం కూడా ఇస్తామన్నారు.

కిర్క్ కిల్లర్ దొరికాడు



టైలర్ రాబిన్సన్

వాషింగ్టన్: అమెరికా డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడైన చార్లీ కిర్క్‌ను కాల్చి చంపిన హంతకుడు ఎట్టకేలకు దొరికిపోయాడు. 22 ఏళ్ల టైలర్ రాబిన్సన్ ఈ హత్యకు పాల్పడ్డాడని, అతడిని అరెస్టు చేశామని ఎఫ్‌బీఐ అధికారులు శుక్రవారం ప్రకటించారు. హంతకుడిని బంధించినట్లు యూటా రాష్ట్ర గవర్నర్ స్పెన్సర్ కాక్స్ ధ్రువీకరించారు. చార్లీ కిర్క్‌ను హత్య చేసింది టైలర్ రాబిన్సన్ అనే విషయం అతడి కుటుంబ సభ్యులకు తెలిసిన వెంటనే వారు ఆ విషయాన్ని తమ కుటుంబ మిత్రుడికి చేరవేశాడు. ఆ మిత్రుడు పోలీసు అధికారులను సంప్రదించి సమాచారం అందించాడు. పోలీసులు రంగంలోకి దిగి రాబిన్సన్‌ను అరెస్టు చేశారు. తాను ఈ నేరం చేశానని అతడు ఒప్పుకున్నట్లు సమాచారం. రాబిన్సన్ ఈ మధ్య కాలంలో రాజకీయాలపై విపరీతమైన ఆసక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలో ట్రంప్ మిత్రుడైన చార్లీ కిర్క్ వ్యవహార శైలి అతడికి నచ్చలేదు. అందుకే హత్య చేసినట్లు తెలుస్తోంది.

జస్టిస్ సుశీల కర్కీకే పీఠం

నేపాల్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం

- దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా రికార్డు
- ఆరు నెలల్లోగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం



జస్టిస్ సుశీలతో ప్రమాణం చేయిస్తున్న అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్

కఠ్మాండు: కల్లోల నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి ఎవరన్నదానిపై ఉత్కంఠకు తెరపడింది. రాజకీయ అనిశ్చితి ముగిసింది. నేపాల్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుశీల కర్కీ(73)ని పదవి వరించింది. తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా ఆమె శుక్రవారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. హిమాలయ దేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ప్రెసిడెంట్ ఆఫీసులో ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడు రామ్‌సహాయ్ యాదవ్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్‌మన్‌సింగ్ రావత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన తాత్కాలిక ప్రభుత్వం ఆరు నెలల్లోగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుందని రామచంద్ర పౌడెల్ చెప్పారు. నేపాల్‌లో సోషల్ మీడియాపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ యువత చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారడం, ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేయడం తెలిసిందే. తాత్కాలిక ప్రధానమంత్రి ఎంపికపై జెన్ జెడ్ ప్రతినిధులతో జరిగిన చర్చలు శుక్రవారం కొలిక్కి వచ్చాయి. జస్టిస్ సుశీల కర్కీకి జెన్ జెడ్ మద్దతు లభించింది. ఎక్కువ మంది ఆమె వైపే మొగ్గు చూపారు. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్, జెన్ జెడ్ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల్లో జస్టిస్ సుశీల ఎంపికకు ఆమోదముద్ర వేశారు. దాదాపు ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలసింది. నేపాల్ సుప్రీంకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె ఇప్పటికే రికార్డుకెక్కారు. తాత్కాలిక ప్రధానమంత్రి హోదాలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. నేపాల్ పార్లమెంట్‌ను రద్దు చేయాల్సిందిగా తొలి కేబినెట్ సమావేశంలో అధ్యక్షుడికి సిఫార్సు చేయనున్నారు. ఈ మేరకు జెన్ జెడ్ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో ఒప్పందం కుదిరింది. దేశంలో అవినీతి అరికట్టాలని యువత ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయ కుటుంబం నుంచి..

జస్టిస్ సుశీల 1952 జూన్ 7న తూర్పు నేపాల్‌లోని బిరాట్‌నగర్‌లో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఈ ప్రాంతం ఇండియా సరిహద్దులోనే ఉంది. ఆమెకు భారత్‌తో ఎంతో అనుబంధం ఉంది. 50 ఏళ్ల క్రితం భారత్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్నారు. పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తిచేశారు. అనంతరం నేపాల్‌లో న్యాయ విద్య అభ్యసించి, న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టారు. 2016 జూలైలో నేపాల్ సుప్రీంకోర్టులో 24వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 11 నెలల పాటు ఆ పదవిలో కొనసాగారు. జస్టిస్ సుశీల తల్లిదండ్రులకు మొత్తం ఏడుగురు సంతానం కాగా, అందరి కంటే ఆమె పెద్ద. ప్రముఖ నేపాలీ కాంగ్రెస్ నాయకుడు దుర్గాప్రసాద్ సుబేదీని జస్టిస్ సుశీల పెళ్లిచేసుకున్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకుంటున్న సమయంలోనే వారిద్దరికీ పరిచయం ఏర్పడింది. జస్టిస్ సుశీల పలు పుస్తకాలు రచించారు.

భారతీయ మహిళ సహా 51 మంది మృతి

నేపాల్‌లో జరుగుతున్న హింసాకాండలో మృతుల సంఖ్య 51కి చేరింది. వీరిలో ఒక భారతీయ మహిళ, ముగ్గురు పోలీసులు సైతం ఉన్నట్లు పోలీసులు శుక్రవారం ప్రకటించారు. 36 మృతదేహాలకు శుక్రవారం త్రిభువన్ యూనివర్సిటీ టీచింగ్ హాస్పిటల్‌లో పోస్టుమార్టం ప్రారంభించారు. నేపాల్‌లో జరిగిన హింసాకాండలో మరణించిన భారతీయ మహిళను రాజేశ్‌దేవి(55)గా గుర్తించారు. ఆమె స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్. ఆమె బస చేసిన కఠ్మాండు హోటల్‌కు మంగళవారం ఆందోళనకారులు నిప్పుపెట్టారు. బయటపడేందుకు ప్రయత్నిస్తూ ఆమె మంటల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారు. రాజేశ్‌దేవి భర్త రామ్‌వీర్‌సింగ్ సైనీ హోటల్ కిటికీ నుంచి దూకి ప్రాణాలతో బయటపడ్డారు. నేపాల్‌లో గత వారం రోజుల్లో ఘర్షణల్లో మృతిచెందినవారిలో 19 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 1,700 మంది గాయపడ్డారు. హింసాకాండ శుక్రవారం తగ్గుముఖం పట్టింది. ఆందోళనకారులు శాంతించారు. జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంటోంది.

మందలించినందుకు తల నరికేశాడు

అమెరికాలోని డాలస్‌లో భారతీయుడి దారుణ హత్య

- హోటల్ మేనేజర్ చంద్రమౌళి నాగమల్లయ్య తలపై వేటు వేసిన కార్మికుడు
- ప్రాణభయంతో పరుగెత్తుతుండగా వెంటాడి హత్య
- క్యూబా జాతీయుడు యొర్దానిస్ కోబోస్-మార్టినెజ్ అరెస్టు



చంద్రమౌళి నాగమల్లయ్య

డాలస్: అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్‌లో దారుణం జరిగింది. భారతీయుడు చంద్రమౌళి నాగమల్లయ్య(50)ను తోటి కార్మికుడు కిరాతకంగా హత్య చేశాడు. తాము పనిచేస్తున్న హోటల్ వద్ద భార్య, కుమారుడి కళ్లెదుటే ఆయన తలను నరికేశాడు. గదిని శుభ్రం చేసే మెషీన్ విషయంలో మొదలైన గొడవ హత్యకు దారితీసింది. ప్రాణభయంతో పరుగులు తీసిన నాగమల్లయ్యను వెంటాడి మరీ నరకడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. హంతకుడు యొర్దానిస్ కోబోస్-మార్టినెజ్(37)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య కేసు నమోదు చేశారు. హంతకుడిని క్యూబా జాతీయుడిగా గుర్తించినట్లు డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. నేర చరిత్ర కలిగిన మార్టినెజ్‌పై గతంలోనే కేసులు నమోదయ్యాయి. వాహనం దొంగతనం కేసుతో పాటు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో జైలుకు వెళ్లాడు. వలసదారుడన్న సానుభూతితో జో బైడెన్ ప్రభుత్వం అతడిని జైలు నుంచి విడుదల చేసింది. నేరస్థుడైన మార్టినెజ్‌కు తమ దేశంలోకి అనుమతించేందుకు క్యూబా ప్రభుత్వం నిరాకరించింది. దాంతోనే అమెరికాలోనే ఉంటున్నాడు. నాగమల్లయ్య హత్య విషయంలో నేరం నిరూపణ అయితే మార్టినెజ్‌కు యావజ్జీవ కారాగార శిక్ష లేదా మరణ శిక్ష పడుతుందని న్యాయ నిపుణులు చెప్పారు.

అసలేం జరిగింది?

చంద్రమౌళి నాగమల్లయ్య డాలస్‌లోని డౌన్‌టౌన్ సూట్స్ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. అదే హోటల్‌లో మార్టినెజ్ కార్మికుడు. ఇద్దరికీ చాలా రోజుల నుంచే పరిచయం ఉంది. బుధవారం ఉదయం హోటల్ గదిని శుభ్రం చేసే విషయంలో గొడవ మొదలైంది. మార్టినెజ్, మరో మహిళా కార్మికురాలు కలిసి విరిగిపోయిన మెషీన్‌తో గదిని ఊడ్చేందుకు ప్రయత్నిస్తుండగా నాగమల్లయ్య వారించాడు. అలా చేయొద్దంటూ మందలించినట్లుగా మాట్లాడారు. దాంతో ఆగ్రహానికి గురైన మార్టినెజ్ అప్పటికే తన వద్దనున్న కత్తితో నాగమల్లయ్యపై దాడి చేసేందుకు ముందుకొచ్చాడు. ఆందోళన చెందిన నాగమల్లయ్య వెంటనే బయటకు పరుగెత్తారు. ఎవరైనా తనను కాపాడాలని గట్టిగా అరుస్తూ పార్కింగ్ ప్రదేశానికి చేరుకున్నారు. మార్టినెజ్ అక్కడికి దూసుకొచ్చి నాగమల్లయ్యను కత్తితో పొడిచేశాడు. ఉన్మాదిలా మారి విచక్షణారహితంగా తల నరికాడు. నాగమల్లయ్య జేబులోని తాళం కార్డును, సెల్‌ఫోన్‌ను తీసుకున్నాడు. తెగిపడిన తలను కాలితో రెండుసార్లు దూరంగా తన్నాడు. తర్వాత తలను చేతితో తీసుకెళ్లి చెత్తకుండీలో పడేశాడు. అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే హోటల్‌కు చేరుకున్నారు. మార్టినెజ్‌ను అరెస్టు చేశారు. రక్తంతో కూడిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ హత్య జరుగుతున్న సమయంలో నాగమల్లయ్య భార్య, కుమారుడు హోటల్‌లోనే ఉన్నారు. కేకలు విని బయటకు వచ్చారు. నాగమల్లయ్యను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ, వారిని మార్టినెజ్ బలవంతంగా నెట్టేశాడు. నాగమల్లయ్య తల తెగిపోయేదాకా నరుకుతూనే ఉన్నాడు. ఇదంతా హోటల్ ప్రాంగణంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. కళ్లెదుటే జరిగిన హత్యను చూసి నాగమల్లయ్య భార్య, కుమారుడు బిగ్గరగా రోదించారు. ఇక తమకు దిక్కెవరంటూ గుండెలు బాదుకున్నారు. ఈ హత్య పట్ల హూస్టన్‌లోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబానికి తగిన సాయం అందిస్తామని, అండగా ఉంటామని ప్రకటించారు.



హంతకుడు మార్టినెజ్

కర్ణాటక వాసి నాగమల్లయ్య

నాగమల్లయ్య స్వస్థలం భారత్‌లోని కర్ణాటక. చాలా ఏళ్ల క్రితమే కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వచ్చారు. డాలస్ డౌన్‌టౌన్ సూట్స్ హోటల్‌లో మేనేజర్‌గా చేరారు. ఆయన చాలా సౌమ్యుడని, గొడవలకు దూరంగా ఉంటారని మిత్రులు చెప్పారు. కుటుంబం అంటే ఆయనకు ప్రాణమని, ఇతరుల పట్ల దయతో వ్యవహరిస్తారని తెలిపారు. అలాంటి వ్యక్తి హత్యకు గురికావడం బాధగా ఉందన్నారు. నాగమల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవడానికి, ఆయన కుమారుడి చదువులకు అయ్యే ఖర్చుల కోసం మిత్రులు నిధుల సేకరణ ప్రారంభించారు. నాగమల్లయ్య అంత్యక్రియలు శనివారం అమెరికాలోనే జరుగుతాయని సమాచారం.

నేడు మణిపూర్‌లో ప్రధాని పర్యటన


అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధానమంత్రి



ఇంఫాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటించనున్నారు. 2023లో రెండు జాతుల మధ్య ఘర్షణ మొదలైన తర్వాత ప్రధాని మణిపూర్‌లో అడుగుపెడుతుండడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తారని, రూ.7,300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునీత్‌కుమార్ గోయల్ శుక్రవారం తెలిపారు. చురాచాంద్‌పూర్, ఇంఫాల్‌లో ఘర్షణల్లో నిరాశ్రయులైన ప్రజలతో మోదీ సమావేశమవుతారని వెల్లడించారు. రెండు ర్యాలీల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. మోదీ పర్యటన అనంతరం రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, ప్రగతి వేగవంతం అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. మణిపూర్ సమగ్ర, సుస్థిర అభివృద్ధికి ప్రధానమంత్రి కట్టుబడి ఉన్నట్లు ఆయన కార్యాలయం స్పష్టంచేసింది. మణిపూర్‌లో నరేంద్ర మోదీ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం, సివిల్ సెక్రటేరియట్‌ను ప్రారంభించబోతున్నారు. అలాగే మణిపూర్ ఇన్ఫోటెక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. మణిపూర్ కేవలం సరిహద్దు రాష్ట్రం కాదని.. యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఒక మూలస్తంభమని, సౌత్‌ఈస్ట్ ఆసియాకు ముఖద్వారమని పునీత్‌కుమార్ గోయల్ పేర్కొన్నారు. ప్రధాని మోదీకి స్వాగతం పలకాలని, ఆయన నిర్వహించే సభల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బొల్సొనారోకు 27 ఏళ్ల జైలు

- బ్రెజిల్ మాజీ అధ్యక్షుడిని దోషిగా తేల్చిన ఆ దేశ సుప్రీంకోర్టు
- సైనిక తిరుగుబాటు, ప్రత్యర్థుల హత్యకు కుట్ర చేశారని ఆరోపణలు
- 2060 వరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా బొల్సొనారోపై నిషేధం



బ్రసీలియా: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనారోకు ఆ దేశ సుప్రీంకోర్టు 27 సంవత్సరాల 3 నెలల జైలు శిక్ష విధించింది. 2022లో ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నిర్వహించిన జాతీయ ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, దేశంలో సైనిక తిరుగుబాటుకు కుట్ర చేశారని, ఎన్నికల్లో తనపై గెలిచిన అధ్యక్ష అభ్యర్థిని చంపేందుకు ప్రయత్నించారని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూలదోసేందుకు కుట్ర చేశారని బొల్సొనారోపై మోపిన అభియోగాల్లో ఆయనను సుప్రీంకోర్టు శుక్రవారం దోషిగా తేల్చింది. అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో నలుగురు జడ్జీలు బొల్సొనారోను దోషిగా తీర్పు చెప్పగా, ఒకరు ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. జైలు శిక్షతోపాటు బొల్సొనారో 2060 సంవత్సరం వరకు ఎలాంటి ఎన్నికల్లో పోటీచేయరాదని కోర్టు నిషేధం విధించింది. అంటే ఆయన శిక్షాకాలం పూర్తయిన తర్వాత కూడా మరో 8 సంవత్సరాల వరకు ఎన్నికల్లో పోటీచేయటానికి అవకాశం ఉండదు. 2022 నాటి ఎన్నికల్లో బొల్సొనారోపై వామపక్ష కూటమి అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లూలా డసిల్వా విజయం సాధించారు. ఆ ఎన్నికల ఫలితాలను ఒప్పుకునేందుకు బొల్సొనారో తిరస్కరించటంతో రాజకీయ ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో 2023 జనవరి 8న బొల్సొనారో మద్దతుదారులు దేశవ్యాప్తంగా హింసాత్మక దాడులకు దిగారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బొల్సొనారోపై దర్యాప్తు చేపట్టింది. కొద్దిరోజుల క్రితమే ఆయన దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నించగా అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. తనపై మోపిన అభియోగాలను బొల్సొనారో తిరస్కరించారు. తాను ఎలాంటి తప్పులు చేయలేదని ప్రకటించారు. తన తండ్రిపై మోపిన కేసులు రాజకీయ ప్రతీకారంలో భాగమని బొల్సొనారో చిన్నకుమారుడు, బ్రెజిల్ సెనేటర్ ఫ్లావియో బొల్సొనారో ఆరోపించారు. కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్తామని బొల్సొనారో తరఫు న్యాయవాదులు తెలిపారు. కాగా, బొల్సొనారోకు జైలు శిక్ష విధించటాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. కోర్టు తీర్పు అన్యాయమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. దీనిపై అమెరికా తగిన విధంగా స్పందిస్తుందని హెచ్చరించారు. బ్రెజిల్‌పై అమెరికా ఇప్పటికే 50 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే.

టారిఫ్‌ల వల్లే విభేదాలు: ట్రంప్

న్యూయార్క్: భారత్‌పై విధించిన టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి ముడి చమురు కొంటున్నందుకు భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు విధించాల్సి వచ్చిందని, ఇది సాధారణ విషయం కాదని అన్నారు. ఈ సుంకాల కారణంగా భారత్‌తో విభేదాలు ఏర్పడే పరిస్థితి వచ్చిందని చెప్పారు. శుక్రవారం ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ అతిపెద్ద కస్టమర్‌గా మారిందని ఆక్షేపించారు. దానికారణంగానే 50 శాతం టారిఫ్‌లు విధించక తప్పలేదని పునరుద్ఘాటించారు. నిజానికి అది చాలా పెద్ద నిర్ణయమని, దాన్ని మామూలు విషయంగా భావించడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై మొండిగా దండయాత్ర కొనసాగిస్తున్న రష్యా అధినేత పుతిన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించగా.. రష్యా మిత్రదేశమైన భారత్‌పై భారీగా సుంకాలు విధించడం ద్వారా ఒకరకంగా చర్యలు తీసుకున్నట్లేనని వివరించారు.

బెయిల్ పిటిషన్‌పై రెండు నెలల్లోగా తేల్చాలి

హైకోర్టులకు సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సాధారణ, ముందస్తు బెయిల్ పిటిషన్ల విచారణను దీర్ఘకాలంపాటు ఆలస్యం చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇటువంటి చర్య న్యాయాన్ని నిరాకరించడమే కాదు, రాజ్యాంగ హక్కులను నిరాకరించడం కూడా అవుతుందని పేర్కొంది. బెయిల్ పిటిషన్లు దాఖలైన తేదీ నుంచి రెండు నెలల్లోగా వాటిపై నిర్ణయాన్ని వెలువరించాలని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన దరఖాస్తులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచలేమని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తెలిపింది. తమ పరిధిలోని దిగువ కోర్టుల్లోనూ బెయిల్ పిటిషన్లపై సత్వర నిర్ణయాలు తీసుకునేలా పర్యవేక్షించాలని హైకోర్టులకు సూచించింది. దీనిపై తగు మార్గదర్శకాలను జిల్లా కోర్టులకు పంపించాలని ఆదేశించింది. దర్యాప్తు సంస్థలు కేసుల దర్యాప్తును త్వరితగతిన ముగించాలని ధర్మాసనం కోరింది. మోసం కేసులో తన పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను బాంబే హైకోర్టు తోసిపుచ్చడాన్ని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవిధంగా స్పష్టతనిచ్చింది.

బాణసంచాపై దేశవ్యాప్త నిషేధం ఉండాలి

ఢిల్లీకి మాత్రమే పరిమితం కారాదు: సీజేఐ

న్యూఢిల్లీ: బాణసంచా వినియోగంపై దేశ రాజధాని ఢిల్లీ(ఎన్‌సీఆర్)లో మాత్రమే ప్రత్యేకంగా నిషేధం ఎందుకు విధించాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఢిల్లీలోని కొందరు ధనవంతులు మాత్రమే స్వచ్ఛమైన గాలికి అర్హులా? దేశంలోని ప్రజలంతా స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు అర్హులేనని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం దేశ రాజధాని ప్రాంతంలో బాణసంచా వినియోగాన్ని నియంత్రించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టింది. 'ఎన్‌సీఆర్ పరిధిలోని నగరాల్లో ప్రజలకు మాత్రమే పరిశుభ్రమైన గాలికి అర్హులా? మిగతా నగరాల్లోని పౌరులకు ఎందుకు కారు? ఇక్కడ ఎలాంటి విధానముందో దేశవ్యాప్తంగానూ అదే ఉండాలి. ఉన్నత పౌరులుంటున్నారనే కారణంతో ఢిల్లీకి ప్రత్యేకంగా ఒక విధానాన్ని రూపొందించలేం. గత శీతాకాలంలో అమృతసర్ వెళ్లాను. గాలి కాలుష్యం అక్కడ ఢిల్లీ కంటే దారుణంగా ఉంది. బాణసంచాపై నిషేధమే విధించాల్సి వస్తే, అది దేశమంతటా ఉండాలి'అని సీజేఐ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రీన్ క్రాకర్స్‌ను తక్కువ రసాయనాలను వినియోగించి రూపొందించే విధానంపై నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(నీరి) కసరత్తు చేస్తోందని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం బాణసంచా తయారీ, విక్రయాల లైసెన్సులపై యథాతథ పరిస్థితిని కొనసాగించాలని పేర్కొన్న ధర్మాసనం..తదుపరి విచారణను 22వ తేదీకి వాయిదా వేసింది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



ఎకో ఫ్రెండ్లీ బాటలో మన సిటీ
గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరంలో ప్లాస్టిక్, రసాయనాలు, పొల్యూషన్, కాంక్రీట్ జంగిల్ మధ్య 'ఎకో ఫ్రెండ్లీ' జీవనశైలికి ఆదరణ పెరుగుతోంది. - సిటీప్లస్‌లో



కన్‌స్ట్రక్'షైన్'
ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్టీ 2.0 నిర్మాణ రంగానికి పెద్ద ఉపశమనమే. సరళీకృత పన్ను విధానంతో స్థిరాస్తి కొనుగోలు దారుల్లో విశ్వాసం పెరుగుతోంది. - రియల్టీలో

గరిష్టం/కనిష్టం
28.0/21.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

డీఆర్‌ఎఫ్ సిబ్బందికి డిమోషన్

- మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సభ్యుల తొలగింపు
- మ్యాన్‌హోల్ ఘటన నేపథ్యంలో రంగనాథ్ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని యాకుత్‌పురా డివిజన్ మౌలాకా చిల్లాలో గురువారం చోటు చేసుకున్న మ్యాన్‌హోల్‌లో చిన్నారి పడిపోయిన ఘటనను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై లోతుగా విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ప్రాథమిక నివేదిక అందుకున్న ఆయన బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. బుధవారం సిల్ట్ తొలగించడానికి తెరచిన మ్యాన్‌హోల్‌ను మూయకపోవడంతోనే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న చిన్నారి అందులో పడిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటన జరగడానికి ఇద్దరు డీఆర్‌ఎఫ్ సూపర్‌వైజర్లు, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌కు చెందిన ఇద్దరు సిబ్బంది నిర్లక్ష్యం కారణమని తేల్చారు. దీంతో సూపర్‌వైజర్లు ఇద్దరికీ డిమోషన్ ఇవ్వడంతో పాటు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్ సిబ్బందిని తొలగించాలంటూ కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. చిన్నారి మ్యాన్‌హోల్‌లో పడిన ఉదంతానికి పూర్తి బాధ్యత హైడ్రా తీసుకుంటున్నట్లు ప్రకటించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్రవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కీలక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అన్ని మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లపై మూతలు ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా లేనట్లు గమనిస్తే సంబంధిత శాఖలైన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో సంప్రదించి వాటిపై మూతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోమని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఎక్కడైనా మూతలేని మ్యాన్‌హోల్ కనిపిస్తే 90001 13667 నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని రంగనాథ్ కోరారు.

భూములున్నాయ్.. కొంటారా?

- ప్రీబిడ్ సమావేశాల్లో కొనుగోలుదార్ల నుంచి స్పందన శూన్యం
- తుర్కయంజాల్, బాచుపల్లిల్లో విక్రయాలకు సన్నాహాలు
- తుర్కయంజాల్‌లో 12, బాచుపల్లిలో 70 ప్లాట్లు సిద్ధం

ఈ నెల 17 నుంచి హెచ్‌ఎండీఏ స్థలాలకు ఆన్‌లైన్ బిడ్డింగ్



సాక్షి, సిటీబ్యూరో

ఇంచుమించు రెండేళ్ల విరామం తరువాత భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) రంగం సిద్ధం చేసింది. నగరంలోని తుర్కయంజాల్, బాచుపల్లిల్లో ఉన్న ప్లాట్లను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టింది. ఈ రెండు చోట్ల నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశంలో కొనుగోలుదార్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు.

సాధారణంగా హెచ్‌ఎండీఏ స్థలాల కోసం ఏర్పాటు చేసే ప్రీబిడ్ సమావేశాల్లోనే కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆసక్తులను వ్యక్తం చేస్తారు. సందేహాలను నివృత్తి చేసుకుంటారు. కానీ.. ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రీబిడ్ సమావేశాల్లో అలాంటి ఆసక్తి కనిపించలేదు. అతి తక్కువ సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నట్లు అధికారులు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించే ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు ఏ మేరకు స్పందన ఉంటుందనేది సందేహాస్పదంగా మారింది. బిడ్డింగ్ నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థలాలపైన విస్తృత ప్రచారం కూడా చేపట్టారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్దత దృష్ట్యా అధికారుల్లోనూ డైలమా నెలకొంది.

ధరలు ఎక్కువే...

రెండు చోట్ల హెచ్‌ఎండీఏ నిర్ణయించిన బేసిక్ ధరలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుర్కయంజాల్‌లో చదరపు గజానికి రూ.65,000, బాచుపల్లిలో రూ,70,000 చొప్పున ధర నిర్ణయించారు. ప్రస్తుత స్తబ్దత కారణంగా మార్కెట్ ధరల కంటే ఎక్కువే ఉన్నట్లు కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. 'తుర్కయంజాల్‌లో ప్రస్తుతం గజానికి రూ.40,000 నుంచి రూ.45,000 వరకు ఉంది. కానీ హెచ్‌ఎండీఏ రూ.65,000 వరకు పెంచింది. దీనివల్ల కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవచ్చు' అని తుర్కయంజాల్‌కు చెందిన రియల్టర్ ఒకరు చెప్పారు. ఇక్కడ మొత్తం 12 ప్లాట్‌లను విక్రయించేందుకు నోటిఫికేషన్ వెలువరించారు. ఒక్కో ప్లాట్ కనిష్టంగా 600 గజాల నుంచి 1,146 గజాల వరకు ఉంది. కానీ ప్లాట్ సైజులు కూడా నాలుగు వైపులా సమంగా లేకపోవడం పట్ల కూడా పలువురు పెదవి విరుస్తున్నారు. కొన్ని స్థలాలకు క్రాసింగ్‌లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో భవన నిర్మాణాలకు అనుకూలంగా ఉండకపోవచ్చని మరికొందరు పేర్కొంటున్నారు. తుర్కయంజాల్‌లోని ప్లాట్‌లకు ఈ నెల 17న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు. కొనుగోలుదారులు 16వ తేదీ సాయంత్రం వరకు రూ.1180 చెల్లించి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు.

బాచుపల్లికి స్పందన కరువే..

బాచుపల్లిలో ఉన్న 70 ప్లాట్‌లకు ఈ నెల 18న ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు దఫాలుగా వేలం నిర్వహించనున్నారు. ఉదయం 35 ప్లాట్‌లు, మధ్యాహ్నం 35 ప్లాట్‌లకు బిడ్డింగ్ ఉంటుంది. ఈ నెల 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ సదుపాయం ఉంది. ఈ స్థలాల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లోనూ 30 మంది లోపే కొనుగోలుదారులు తమ ఆసక్తిని చూపడం గమనార్హం. ఈ స్థలాలకు గజానికి రూ.70,000 చొప్పున ధర నిర్ణయించారు. స్థానికంగా ఉన్న మార్కెట్ ధరల కంటే ఎక్కువేననే అభిప్రాయం ఉంది. చాలా వరకు మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు అనుకూలంగా ఉన్నాయి. కనిష్టంగా 266.67 గజాల నుంచి గరిష్టంగా 499.96 గజాల వరకు ఈ ప్లాట్ సైజ్‌లు ఉన్నాయి. ఈ లే అవుట్‌కు అప్రోచ్ రోడ్ లేకపోవడం కూడా ఒక లోపంగా ఉన్నట్లు ప్రీబిడ్డింగ్‌లో పాల్గొన్న కొందరు చెప్పారు. మరోవైపు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని పలు చోట్ల మిగిలిపోయిన హెచ్‌ఎండీఏ స్థలాలకు ఈ నెల 19వ తేదీన బిడ్డింగ్ నిర్వహించనున్నారు.

ఒకప్పుడు హాట్‌కేకుల్లా...

హెచ్‌ఎండీఏ ప్లాట్‌లు ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. కోకాపేట్‌లో ఎకరం రూ.కోటికిపైగా అమ్ముడు కాగా, మోకిల్లాలో గజానికి రూ.లక్షకుపైగా ధర పలికింది. బుద్వేల్‌లోనూ అనూహ్యమైన స్పందన లభించింది. ఉప్పల్ భగాయత్, బోడుప్పల్, మేడిపల్లి, హయత్‌నగర్, బాచుపల్లి, తుర్కయంజాల్, తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున అమ్ముడయ్యాయి. భూముల అమ్మకాలపైన ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం లభించింది. అన్ని మౌలిక సదుపాయాలతో లే అవుట్‌లను రూపొందించడం, ఎలాంటి వివాదాలు లేకపోవడం, బ్యాంకుల నుంచి సత్వరమే రుణసదుపాయం లభించడం వంటి వివిధ కారణాల దృష్ట్యా కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ఇప్పటికీ హెచ్‌ఎండీఏ స్థలాలపైన ప్రజల్లో నమ్మకం ఉన్నప్పటికీ ప్రస్తుత మార్కెట్ స్తబ్దత, అధికధరలు, అడ్డదిడ్డంగా ఉన్న ప్లాట్ సైజులు, రోడ్డు సదుపాయం లేకపోవడం వంటి అంశాలు బిడ్డింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మూసీలోకి పోటెత్తిన వరద



ఔటర్ సర్వీస్ రోడ్డుపై భారీగా ప్రవహిస్తున్న నీరు

సాక్షి, సిటీబ్యూరో/బండ్లగూడ: మూసీ నదిలో భారీగా వరద ప్రవాహం పెరిగింది. జంట జలాశయాల గేట్లు నాలుగు అడుగుల చొప్పున ఎత్తి దిగువ భాగాన భారీగా జలాలు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారగా, ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం తెల్లవారు జామున నుంచి భారీగా వరద ప్రవాహం పెరిగింది. రెండు జలాశయాలకు 2,300 క్యూసెక్కుల నుంచి 5,500 క్యూసెక్కుల వరకు వరద వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి అదే స్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీలో వరద ప్రవాహం పెరగడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. నివాసాలు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ వెళ్లే ఔటర్ సర్వీస్ రోడ్డుపై వరద భారీగా ప్రవహిస్తుండటంతో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా రాకపోకలు నిలిపివేశారు. ఉస్మాన్‌సాగర్ జలాశయం 6 క్రస్ట్ గేట్లు ఎత్తడంతో మంచిరేవుల నుంచి నార్సింగి వెళ్లే దారిపై వరదనీరు రావడంతో ఆ రోడ్డుపై కూడా రాకపోకలు నిలిపివేశారు.



హిమాయత్‌సాగర్ క్రస్ట్‌గేట్ల నుంచి ప్రవాహం

'గాంధీ'ని మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతా: డా.ఎన్.వాణి




సాక్షి, సిటీబ్యూరో: గాంధీ ఆస్పత్రిని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సూపరింటెండెంట్ డా.ఎన్.వాణి అన్నారు. శుక్రవారం ఆమె గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. రోగులు, సహాయకులు, వైద్య సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 1981 బ్యాచ్‌కు చెందిన వాణి వరంగల్ కేఎంసీలో ఎంబీబీఎస్, 1990లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ పూర్తి చేశారు. 1993లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2006లో ప్రొఫెసర్ కేఎంసీలో పని చేశారు. 2020–22 వరకు సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా చేశారు. అనంతరం డీఎంఈ, అడిషనల్ డీఎంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డా.రాజకుమారిని మెడికల్ కళాశాల ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు.

డిజిటలైజ్‌తో ఈజీ

జీహెచ్‌ఎంసీలో అందుబాటులోకి ఎస్సెట్ మేనేజ్‌మెంట్ సిస్టం

- పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా వ్యవస్థ
- సాంకేతికత దన్నుగా ట్రాకింగ్ సులభం.. వస్తువులు భద్రం
- ఎలక్ట్రానిక్ వస్తువుల సత్వర జారీకి ఉద్యోగులకు అవకాశం



లక్డీకాపూల్ : ఇకనుంచి అధికారులు, ఉద్యోగులకు ఇచ్చే ఎలక్ట్రానిక్ వస్తువుల సమగ్ర జాబితాను జీహెచ్‌ఎంసీ డిజిటలైజ్ చేయనుంది. ఇందుకోసం టీజీ ఆన్‌లైన్ సహకారంతో ఎస్సెట్ మేనేజ్‌మెంట్ విధానానికి కొత్తగా రూపకల్పన చేసి ఆవిష్కరించింది. ఈ విధానంలో వస్తువుల పర్యవేక్షణ, నిర్వహణ మెరుగుపడనుంది. జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం మాన్యువల్ వివరాలు నమోదు చేసి, కంప్యూటరీకరణ చేస్తుండగా ఇక నుంచి వస్తువులకు సంబంధించి ఇండెంట్ నుంచి ఆమోదం, జారీ వరకు అంతా వెబ్‌సైట్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. సాధారణంగా సంస్థలోని అన్ని సెక్షన్లకు అవసరాన్ని బట్టి కంప్యూటర్ ప్రాసెసింగ్ యూనిట్ (సీపీయూ), మానిటర్, కేబుళ్లు, మౌస్‌లు, ప్రింటర్లు, జిరాక్స్ యంత్రాలు వంటివి ఐటీ విభాగం సమకూరుస్తోంది. హోదాను బట్టి కొందరు అధికారులకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు ఇస్తారు. పలువురు అధికారులు, కొన్ని విభాగాలు ఆయా వస్తువులు తరచూ తీసుకుంటున్నట్టు గుర్తించారు. అంతకు ముందు ఎప్పుడు వస్తువులు ఇచ్చామన్న వివరాలు పూర్తి స్థాయిలో సమాచారం ఐటీ విభాగం వద్ద లేకపోవడంతో కొంతమేర దుర్వినియోగం జరుగుతోందన్న అంచనాకు వచ్చారు. ఈ పద్ధతికి చెక్ పెట్టేలా డిజిటలైజేషన్ నిర్ణయం తీసుకున్నట్టు జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఫలితంగా ఎస్సెట్ (వస్తువుల) మేనేజ్‌మెంట్‌లో పారదర్శకత, జవాబుదారీతనం పెరగనుంది. ఉద్యోగులకు కేటాయించిన వస్తువు ఎవరి వద్ద ఉందో సులభంగా ట్రాకింగ్ చేయవచ్చు. వస్తువుల బదిలీ, తిరిగి తీసుకోవడం సులభతరం కానుంది. అదే విధంగా ఉద్యోగులకు ఎలక్ట్రానిక్ వస్తువుల సత్వర జారీకి వీలు కలుగుతుంది. సాంకేతిక దన్నుగా తెచ్చిన ఈ కొత్త వ్యవస్థ పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిటికెలో సమాచారం ..

మాన్యువల్ విధానంలో ఉద్యోగులకు ఇచ్చిన వస్తువుల వివరాలను తెలుసుకోవాలంటే అనేక రిజిస్టర్లను తిరిగేయాల్సి వచ్చేది. చాలా సమయం పట్టేది. ఏ వస్తువు ఎవరి దగ్గర ఉందో తెలుసుకోవడం కష్టంగా ఉండేది. ఈ విధానంలో వస్తువుల డిజిటలైజేషన్‌తో ఒక్క క్లిక్ దూరంలో సమాచారం లభిస్తుంది. ఏ విభాగం, అధికారి ఏ వస్తువు కోసం ప్రతిపాదన పెట్టారు? ఎప్పుడు సరఫరా చేశాం? తదితర వివరాలు ఇక నుంచి వెబ్‌సైట్‌లో నమోదు కానున్నాయి. సంబంధిత విభాగం, అధికారులకు సరఫరా చేసే ముందు ప్రతి వస్తువుపై బార్ కోడ్ అంటిస్తారు. దానిని స్కానింగ్ చేస్తే వివరాలు వెబ్‌సైట్‌లో ఎంటర్ కానున్నాయి. దీంతో ఎవరు.. ఎప్పుడు ఏ వస్తువు తీసుకున్నారన్నది సులువుగా తెలుస్తుంది.

ఇక ప్రైవేట్ పరం!

- 9 కాంప్లెక్స్‌లు, ప్లేగ్రౌండ్ల నిర్వహణ బాధ్యతలు
- టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం

ఏజెన్సీలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను అప్పగించే యోచన

సాక్షి, సిటీబ్యూరో: ఎంతో కాలంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ప్లేగ్రౌండ్లు ప్రైవేట్ పరం కానున్నాయి. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పేరిట టెండర్ల ద్వారా వీటిని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ఈమేరకు తొలిదఫాలో 9 స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ప్లేగ్రౌండ్ల నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్)కోసం టెండర్లు పిలిచింది. టెండరులో అర్హత పొందే ఏజెన్సీ వీటిని నిర్వహించడంతో పాటు ఆయా స్పోర్ట్స్, గేమ్స్ ఆడేవారి నుంచి ఫీజులు వసూలు చేయనుంది. అర్హత పొందిన ఏజెన్సీ తాను కోట్ చేసిన మొత్తాన్ని నెలనెలా జీహెచ్‌ఎంసీ ఖజానాలో ఆన్‌లైన్ ద్వారా జమ చేయాల్సి ఉంటుంది.

ప్రైవేట్‌కు ఇవ్వనున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఏయే క్రీడలకు సదుపాయాల వివరాలిలా..

1) షేక్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అండ్ ప్లే గ్రౌండ్ (వాలీబాల్, బాక్సింగ్, జిమ్, రోలర్ స్కేటింగ్, షటిల్ బ్యాడ్మింటన్)
2) అమీర్‌పేట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (జిమ్ (జెంట్స్), షటిల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్)
3) సనత్‌నగర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్ అండ్ ప్లే గ్రౌండ్ (బాస్కెట్‌బాల్, చెస్, స్విమ్మింగ్, జిమ్(జెంట్స్), జిమ్ (లేడీస్), జిమ్నాస్టిక్స్, షటిల్ బాడ్మింటన్, స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, యోగా, క్రికెట్)
4) హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (జిమ్ (జెంట్స్), షటిల్ బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్)
5) రెడ్‌హిల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (క్రికెట్, ఫుట్‌బాల్, జిమ్)
6) విజయ్‌నగర్ కాలనీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (స్విమ్మింగ్, క్యారమ్, జిమ్, జిమ్నాస్టిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, యోగా, కరాటే)
7) విక్టోరియా ప్లే గ్రౌండ్, ఇండోర్ స్టేడియం, ఔట్‌డోర్ స్టేడియం (జిమ్, చెస్, సెపక్‌తక్రా, వాలీబాల్, జిమ్నాస్టిక్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, క్రికెట్, ఫెన్సింగ్, కరాటే, బాక్సింగ్, రోలర్ స్కేటింగ్)
8) గోల్కొండ స్పోర్ట్స్ కాంప్లెక్స్, స్విమ్మింగ్ పూల్ (స్విమ్మింగ్, బాక్సింగ్, క్రికెట్, ఫుట్‌బాల్)
9) తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియం (జిమ్, తైక్వాండో, రెజ్లింగ్)

తొలుత రెండేళ్లు..

నిర్వహణ బాగున్న జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ద్వారా గణనీయంగా ఆదాయం వస్తోంది. నిర్వహణ బాగులేనివి, కనీస సదుపాయాల్లేనివి కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సదుపాయాల్లేని వాటికి తగిన సదుపాయాలు కల్పిస్తే జీహెచ్‌ఎంసీకే ఆదాయం వచ్చేది. కానీ.. అది చేతకాని జీహెచ్‌ఎంసీ ప్రైవేటుకు బాధ్యతలప్పగించే చర్యలు చేపట్టింది. ప్రస్తుతానికి రెండేళ్ల కాలపరిమితితో ప్రైవేట్ పరం చేయనుంది. నిర్వహణ తీరును బట్టి మరో రెండేళ్లు పొడిగింపు నివ్వనుంది. అంటే.. అలా ఒకసారి వాటిని దక్కించుకున్న ఏజెన్సీలు వాటినిక వదలవన్నమాట!

నిబంధనలిలా..

- జీహెచ్‌ఎంసీకి ప్రతినెలా పదో తేదీలోపు ఫీజు చెల్లించాలి.
- వరుసగా రెండు నెలల ఫీజు చెల్లించని పక్షంలో కాంట్రాక్టు ఒప్పందం ఆటోమేటిక్‌గా రద్దు కావడంతో పాటు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించిన మొత్తాన్ని కూడా జప్తు చేస్తారు.
- ఆయా క్రీడలకు జీహెచ్‌ఎంసీ నిర్ణయించిన ఫీజులనే వసూలు చేయాలి. ఫీజులను అందరికీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫీజులు చెల్లించిన వారికి రసీదులివ్వడంతో పాటు రికార్డులు నిర్వహించాలి.
- కాంప్లెక్స్, ఆవరణ ఎలాంటి లోటు లేకుండా, పరిశుభ్రంగా ఉండాలి. 24 గంటలపాటు టాయ్‌లెట్స్ సదుపాయం ఉండాలి. సాధారణ పరిపాలన, రికార్డుల నిర్వహణ వంటి వాటికి సిబ్బంది ఉండాలి.
- కాంప్లెక్సుల పనివేళల్లో అన్ని క్రీడలకు సంబంధించిన కోర్సులకు ప్రొఫెషనల్ కోచ్‌లు ఉండాలి.
- షటిల్ కోర్టు ప్రదేశాల్లో పచ్చదనం ఉండాలి.



నిర్మాణ అనుమతుల వేగం పెరగాలి

- శిథిల భవనాలతో ప్రమాదాలు జరగొద్దు
- సమీక్ష సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: టౌన్ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణ అనుమతులు వేగంగా మంజూరు చేసేందుకు కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో కలిసి టౌన్ ప్లానింగ్ విభాగం కార్యకలాపాలను జోన్లు, సర్కిళ్ల వారీగా కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదులు, లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలని, ప్రమాదం సంభవించకముందే చర్యలు చేపట్టాలన్నారు. అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, అదనపు సీసీపీలు గంగాధర్, రంజిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

రూ.282 కోట్లతో గండిపేట డీపీఆర్

27 ఎంజీడీ నీటి తరలింపునకు మరో పైపులైన్

- త్వరలో ప్రభుత్వానికి జలమండలి నివేదిక



గండిపేట జలాశయం

సాక్షి, సిటీబ్యూరో: వందేళ్లకు పైగా నగర దాహార్తి తీర్చుతున్న గండిపేట (ఉస్మాన్ సాగర్) నుంచి మరో పైపులైన్ నిర్మాణం కోసం సుమారు రూ.రూ.282 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి ప్రభుత్వానికి సమర్పించేందుకు జలమండలి సిద్ధమైంది. నగరం నలుదిక్కులా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు మరింత పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జంట జలాశయాలతో పాటు కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూర్ ప్రాజెక్టులను నీటిని తరలిస్తున్నా.. సరిపోని పరిస్థితి. దీంతో అందుబాటులో ఉన్న జలవనరుల నుంచి మరింత నీటిని నగరానికి తరలించేందుకు జలమండలి ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో గండిపేట జలాశయం నుంచి ఆసిఫ్‌నగర్ రిజర్వాయర్ వరకు మరో పైపులైన్ ఏర్పాటుకు సిద్ధమైంది. గండిపేట నుంచి కాండూట్ లైన్ ద్వారా తరలిస్తున్న జలాలు మార్గమధ్యలో లీకేజీల కారణంగా సగానికిపై వృథా అవుతుండటంతో వాటి మరమ్మతులతో పాటు దానికి సమాంతరంగా కింద భాగంలో పైపులైన్ వేసేందుకు కార్యాచరణకు సిద్ధమైంది.

కాలువ పునరుద్ధరణ..

ఉస్మాన్ సాగర్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్‌ల వరకు 27 ఎంజీడీ నీటిని తరలించే కాలువను పునరుద్ధరించడం, తరచూ లీకేజీలు, మరమ్మతుల కోసం బ్రేక్‌డౌన్‌ల నివారణ కోసం జలమండలి సిద్ధమైంది. మొత్తంమీద ఉస్మాన్ సాగర్ వద్ద రా వాటర్ ఆర్‌సీసీ సంప్, పంపుహౌస్, 4.0 మీటర్ల ఎత్తు రిటైనింగ్ వాల్, షేక్‌పేటలో నీటిశుద్ధి కేంద్రం, నిర్వాహక భవన నిర్మాణాలు, షేక్‌పేటలో క్లియర్ వాటర్ సంప్ నిర్మాణం, ఆసిఫ్ నగర్ వద్ద 4.0 మీటర్ల ఎత్తు రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ట్రాన్స్‌మిషన్ కింద వద్ద ప్రతిపాదిత సంప్ వరకు 1500 ఎంఎం వ్యాసం కలిగిన గ్రావిటీ మెయిన్ పైపులైన్, ఉస్మాన్ సాగర్ నుంచి షేక్‌పేట వరకు 1300 ఎంఎం వ్యాసం కలిగిన పంపింగ్ మెయిన్ పైపులైన్, షేక్‌పేట్ నుంచి ఆసిఫ్ నగర్ వరకు 800 ఎంఎం దయా కలిగిన షేక్‌పేట్ పంపింగ్ మెయిన్‌లు, పైపులైన్ నిర్మాణాలు చేపట్టనున్నారు.

సగానికిపైగా నీటి వృథా

గండిపేట నుంచి కాండూట్ ద్వారా నగరానికి తలిస్తున్న నీటిలో సగం నీరు వృథా అవుతోంది. వాస్తవానికి గండిపేట జలాశయం నుంచి సుమారు 26 ఎంజీడీలకుపైగా తాగునీరు తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం నగరానికి ప్రతినిత్యం సుమారు 20 నుంచి 22 ఎంజీడీల నీరు తరలిస్తుండగా కాండూట్‌కు అడుగడుగునా లీకేజీల కారణంగా దాదాపు 8 నుంచి 10 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గండిపేట నుంచి ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 14.5 కిలోమీటర్ల పొడువు గల కాండూట్‌కు దాదాపు 45 ప్రాంతాల్లో లీకేజీ సమస్య ఉంది. నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా జర్మన్ టెక్నాలజీతో లీకేజీల మరమ్మతు పనులు నిర్వహించి 1 నుంచి 2 ఎంజీడీల నీటి వృథాను అరికట్టగలిగారు.







జీరో ఫిర్యాదులే లక్ష్యంగా పని చేయండి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జీరో శాతం ఫిర్యాదులే లక్ష్యంగా పని చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ క్షేత్రస్థాయి ఇంజనీర్లకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేట్ కార్యాలయంలో రంగారెడ్డి, మేడ్చల్ జోన్‌లోని 180 మంది అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారానికి కనీసం రెండుసార్లు తమ పరిధిలోని బస్తీల్లో/కాలనీల్లో పర్యటించి విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. వినియోగ దారులను కలిసి అంతరాయాలపై ఆరా తీయాలని తెలిపారు. రాజేంద్రనగర్, కిస్మత్‌పూర్, పహాడిషరీఫ్ సెక్షన్లలో ఎక్కువ ఫిర్యాదులు నమోదవుతుండటానికి కారణాలేమిటని సంబంధి ఏఈలను ప్రశ్నించారు. ఉద్యోగులు వినియోగదారులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు డా.నరసింహులు, శివాజీ, చక్రపాణి, ఇతర అధికారులు వేణు గోపాల్, సురేష్ పాల్గొన్నారు.

సఫీవుల్లా బాధ్యతల స్వీకరణ



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఉర్దూ అకాడమీకి డైరెక్టర్/సెక్రటరీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.షఫీవుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. జెన్‌కో సంస్థలో డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ సఫీవుల్లాను తెలంగాణ ఉర్దూ అకాడమీ డైరెక్టర్/సెక్రటరీగా నియమించగా ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఒకే రోజు 97 మందికి పదోన్నతులు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, వారితో సమాన స్థాయి హోదా ఉన్న 97 మందికి సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం మేరకు తాత్కాలిక పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీఏ ఆల్‌నైన్స్‌కు రూ.25.50 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ ప్రత్యేక నెంబర్‌లకు నిర్వహించిన బిడ్డింగ్‌లో వాహనదారుల నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. శుక్రవారం ఖైరతాబాద్‌లో నిర్వహించిన బిడ్డింగ్‌లో రవాణాశాఖకు రూ.63,77,361 ఆదాయం లభించినట్లు హైదరాబాద్ జేటీసీ రమేష్ తెలిపారు. 'టీజీ 09జీ 9999' నెంబర్‌కు హెటిరో డ్రగ్స్ సంస్థ రూ.25,50,200 చెల్లించి నెంబర్ దక్కించుకుంది.'టీజీ 09హెచ్0009' నెంబర్ కోసం ఏఆర్‌ఎల్ టైర్స్ లిమిటెడ్ సంస్థ రూ.6,50,009 చెల్లించింది.'టీజీ 09హెచ్001' నెంబర్‌కు డాక్టర్ రాజేశ్వరి స్కిన్‌అండ్ హెయిర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.6,25,999 చెల్లించి ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో నెంబర్ దక్కించుకుంది. 'టీజీ 09హెచ్0006' నెంబర్‌కు రూ.5,11,666 లభించింది. ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఈ నెంబర్‌ను సొంతం చేసుకుంది.

దసరాకు ముందే వేతనాలు ఇవ్వండి

లక్డీకాపూల్ : దసరా పండుగకు ముందుగానే మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు (ఎఐటియుసి) డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఏఐటీయూసీ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ నెల 26వ తారీఖు లోపు మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం తదితరులు కోరారు.

ఆభరణాల దుకాణంలో బంగారు కడియం చోరీ

బంజారాహిల్స్: సోమాజిగూడలోని ఖజానా జ్యువెలరీ ఆభరణాల షాపులో రూ.1.52 లక్షల విలువ చేసే బంగారు కడియం చోరీకి గురైంది. ఈ మేరకు ఖజానా జ్యువెలరీ మేనేజర్ ఎం.వెంకటరమణ పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 11వ తేదీన ఉదయం ఓ మహిళ బంగారు పంజాబీ కడియం కొనుగోలు చేయడానికి వచ్చి సేల్స్ ఎగ్జిక్యూటివ్ సతీష్‌ను అడిగింది. ఈ మేరకు ఆయన కడియాన్ని బల్లపై ఉంచి చూడమని చెప్పాడు. సేల్స్‌మేన్ కళ్లు గప్పిన కస్టమర్ నకిలీ కడియం అక్కడ పెట్టి బంగారు కడియాన్ని చాకచక్యంగా జేబులో వేసుకుంది. సీసీ ఫుటేజీ పరిశీలించగా బురఖా ధరించి వచ్చిన ఓ మహిళ 2, 3 ఆభరణాలు వేర్వేరు కౌంటర్‌లో చూసి చివరకు ఈ కడియాన్ని చూపించమంటూ అడిగిందని, అదే సమయంలో నకిలీ కడియాన్ని అక్కడ పెట్టి అసలు కడియాన్ని తస్కరించిందని గుర్తించారు. ఈ మేరకు జ్యువెలరీ షాపు మేనేజర్ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాకిస్థానీ ఫొటోతో 'పని' కానిచ్చారు!

మాట్రిమోనియల్ ఫ్రాడ్ చేసిన ఇద్దరు కిలేడీలు

- నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.25 లక్షలు స్వాహా
- బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరించిన హైదరాబాదీ
- ఇద్దరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఇన్‌స్టాగామ్ ఐడీ 'ఖూబ్‌సూరత్.రిస్తే'లో పాకిస్థాన్‌కు చెందిన యూట్యూబర్, ఇన్‌ఫ్ల్యూయెన్సర్ పర్వా షా ఫొటో పోస్టు చేసి పెళ్లి ప్రతిపాదనలతో నగరవాసిని మోసం చేసి ఇద్దరు బిజాపూర్ కిలేడీలు రూ.25 లక్షలు కాజేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఓ మహిళతో పాటు సహకరించిన హైదరాబాదీని అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత శుక్రవారం ప్రకటించారు. కర్ణాటకలోని బిజాపూర్‌కు చెందిన అనీసా మహ్మదృసీన్ హుండేకర్, జోహర్ ఫాతిమా తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం మాట్రిమోనియల్ ఫ్రాడ్స్ చేయాలని పథకం వేశారు. ఈ మేరకు 2023లో ఇన్‌స్టాగ్రామ్‌లో ఖూబ్‌సూరత్.రిస్తే పేరుతో ఓ ఐడీ క్రియేట్ చేశారు. ఇందులో పాకిస్థాన్‌కు చెందిన యూట్యూబర్ పర్వా షా ఫొటోలు పోస్టు చేశారు. ఇవి తనవే అన్నట్లు అనీసా తన ఫోన్ నెంబర్ పోస్టు చేసింది. ఆ ఏడాది మార్చిలో ఈ ప్రొఫైల్ చూసిన నగర వాసి సంప్రదించి పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. వివాహం చేసుకోవడానికి అంగీకరించిన అనీసా అతడితో మాట్లాడింది. ప్రత్యేక యాప్ ద్వారా పర్వా షానే మాట్లాడుతున్నట్లు వీడియో కాల్స్ కూడా చేసింది. ఆపై వైద్యం సహా వివిధ అత్యవసర అవసరాల పేరు చెప్తూ నగరవాసి నుంచి డబ్బు తీసుకోవడం ప్రారంభించింది. ఈ వ్యవహారంలో ఫాతిమా సైతం సహకరించింది. వీరికి పరిచయస్తుడైన హైదరాబాదీ మహ్మద్ అబ్దుల్ అమీర్ కమీషన్ ప్రాతిపదికన తన బ్యాంక్ ఖాతా వివరాలు అందించాడు. ఇందులోనూ బాధితుడు కొంత మొత్తం డిపాజిట్ చేశాడు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు నేతృత్వంలోని బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. అమీర్‌తో పాటు అమీసాను అరెస్టు చేసి వీరి నుంచి ల్యాప్‌టాప్, ట్యాబ్, ఫోన్లు స్వాధీనం చేసుకుంది. పరారీలో ఉన్న ఫాతిమా కోసం గాలిస్తోంది.

ముగ్గురి నుంచి రూ.33 లక్షలు స్వాహా...

డిజిటల్ అరెస్టు సహా మూడు రకాలైన నేరాల్లో ముగ్గురు నగర వాసుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.33 లక్షలు కాజేశారు. ఈ మేరకు శుక్రవారం వేర్వేరు కేసులు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. యాకుత్‌పురకు చెందిన వృద్ధుడికి (75) పోలీసు అధికారుల మాదిరిగా ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు ఆయన ఆధార్ కార్డు దుర్వినియోగమైందని చెప్పారు. ఆపై కొందరు యూనిఫాంలో వీడియో కాల్స్ చేసి ఐపీఎస్ అధికారులుగా మాట్లాడిన నేరగాళ్లు నేషనల్ సీక్రెట్స్ యాక్ట్ కింద కేసు నమోదైందని భయపెట్టారు. డిజిటల్ అరెస్టు చేశామని, విషయం ఎవరికీ చెప్పొద్దని భయపెడుతూ గత నెల 19 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు మొత్తం రూ.21,01,650 కాజేశారు. అబిడ్స్‌కు చెందిన ఓ బాధితుడికి (35) ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ఆకర్షణీయ జీతమంటూ ఎర వేశారు. ఆపై గూగుల్ రివ్యూస్ సహా వివిధ టాస్కులు ఇచ్చి, కమీషన్ల పేరుతో వర్చువల్ యాప్‌లో లాభాలు చూపించారు. ఆపై పెట్టుబడులంటూ రూ.10,25,550 డిపాజిట్ చేయించుకున్నారు. యాప్‌లో రూ.15,57,900 లాభం చూపించి... విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత కట్టాలనడంతో అనుమానం వచ్చిన బాధితుడు ఆరా తీసి తాను మోసపోయానని గుర్తించాడు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మరో వ్యక్తికి (44) వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.1,61,720 కాజేశారు. ఈ ముగ్గురి బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

వర్ధంతి సభలో సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం


సభలో మాట్లాడుతున్న తమ్మినేని

నిజాంపేట్: సీతారాం ఏచూరి గురించి మాట్లాడుకోవడం అంటే మార్కిస్టు పార్టీ గురించి మాట్లాడుకున్నట్టేనని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. శుక్రవారం ప్రగతినగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీరభద్రం..ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఏచూరి విద్యాభ్యాసం అంతా హైదరాబాద్, ఢిల్లీలో పూర్తి చేశారన్నారు. ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఎమర్జెన్సీ కాలంలో యూనివర్సిటీలో జరిగిన దాడులపై స్పందించి ఇందిరాగాంధీ రాజీనామాకు డిమాండ్ చేశారన్నారు. సీతారాం ఏచూరి కృషి వల్ల భారతదేశంలో 28 పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయన్నారు. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీల బలం తగ్గడానికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థల ప్రభావమేనన్నారు. అయితే మళ్లీ కమ్యూనిస్టులు పుంజుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి ప్రజలతో మమేకమైతే కమ్యూనిస్టులకు ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, ప్రగతినగర్ మాజీ సర్పంచ్ దయాకర్‌రెడ్డి, శ్రీరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, ఏ.అశోక్, ఎం.వినోద్, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరామయ్య, రాథోడ్ సంతోష్, వరప్రసాద్, నరేష్, లింగస్వామి, లక్ష్మణ్, సవిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో డిజైర్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సూత్ర' వస్త్ర ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు చిత్ర ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయి.
- పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం సాయంత్రం 5.30 గంటలకు రవీంద్రభారతిలో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఇంజినీరింగ్ బోధనలో మార్పులు రావాలి

ఎన్‌ఐఈఎల్‌ఐటీ అదనపు డైరెక్టర్ డాక్టర్ కొర్రా లక్ష్మణ్


ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కొర్రా లక్ష్మణ్, ప్రొఫెసర్లు, విద్యార్థులు

అబిడ్స్: సాంకేతిక విప్లవానికి అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు విద్యా బోధన ఎంతో అవసరమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఈఎల్‌ఐటీ) హైదరాబాద్ అదనపు డైరెక్టర్ డాక్టర్ కొర్రా లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక విద్యలో రోజు రోజుకు ఊహించని విధంగా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. శుక్రవారం చాపల్‌రోడ్‌లోని స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏసీఎం-డబ్ల్యూ స్టూడెంట్ చాప్టర్, సీఎస్ఐ స్టూడెంట్ బ్రాంచ్‌లు సంయుక్తంగా ఈ నెల 8వ తేదీ నుంచి డ్రోన్ టెక్నాలజీపై నిర్వహించిన బూట్ క్యాంప్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ముగింపునకు డాక్టర్ కొర్రా లక్ష్మణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి ఇంటిలోని వస్తువులు, వాహనాలు, నిత్యం ఉపయోగించే మిషన్లు ఆన్ చేయడం లేదా ఆఫ్ చేయడం ఐఓటీలతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ టెక్నాలజీ వలన వ్యవసాయ రంగం, ఆరోగ్య రంగం, స్మార్ట్ సిటీస్, స్మార్ట్ ఫోన్స్‌తో పాటు పలు విభాగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. డ్రోన్ టెక్నాలజీలో ఉపయోగించే డ్రోన్లు, వ్యవసాయరంగంలో పంటలపై మందులు పిచికారి చేయడం, రక్షణ విభాగంలో సమాచారాన్ని సేకరించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం, సినిమాలను చిత్రీకరించడంలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్టాన్లీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎల్.రాజు మాట్లాడుతూ..ఐఓటీ, డ్రోన్ టెక్నాలజీలు రెండు కలిసినప్పుడే శక్తివంతమైన ఫలితాలు వస్తాయని వివరించారు. అంతేకాక డ్రోన్లు ఆధునిక సమాచారాన్ని ఐఓటీ ద్వారా సేకరించి రైతులకు పంటల ఆరోగ్యంపై సరైన సమాచారం ఇవ్వవచ్చన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులందరూ ఈ సాంకేతికతను నేర్చుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఓడీ ఆర్.మదన్‌మోహన్, సీఎస్ఐ స్టూడెంట్స్ బ్రాంచ్ కో ఆర్డినేటర్ డాక్టర్ పోటు నారాయణ, ఏసీఎం ఫ్యాకల్టీ స్పాన్సర్ డాక్టర్ పీఆర్ అనిషా, కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, డీన్ ప్రొఫెసర్ వినయ్‌బాబు, కళాశాల డైరెక్టర్ వి.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి.వి రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో వ్యభిచారం

నిర్వాహకురాలిపై బేగంపేట పోలీసుల కేసు

సనత్‌నగర్: శ్మశానవాటికలో అయితే ఎలాంటి అనుమానం రాదనుకున్నదో ఏమో..ఓ మహిళ ఆ ప్రాంతాన్ని వ్యభిచార కేంద్రంగా మార్చింది. యువతులను తీసుకువచ్చి విటులను ఆహ్వానించి ఆమె కొనసాగిస్తున్న వ్యభిచార గృహం గుట్టు రట్టయ్యింది. నిర్వాహకురాలితో పాటు ఓ మహిళ, విటుడిని పోలీసులు అరెస్టు చేశారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్ సమీపంలోని ధనియాలగుట్ట శ్మశానవాటికలోని ఓ గదిలో వ్యభిచార కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో ఓ మహిళతో పాటు విటుడు గదిలో ఉండడాన్ని గుర్తించారు. మారీ మాధవి (39) అనే మహిళ ఇక్కడి గదిని వ్యభిచార గృహంగా మార్చినట్లు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి మహిళలను, యువతులను తీసుకువచ్చి విటులకు సమాచారం అందించి రప్పిస్తున్నట్లు పోలీసుల విచారణలో మాధవి ఒప్పుకుంది. దీంతో నిర్వాహకురాలు మాధవితో పాటు గదిలో ఉన్న మహిళ, విటుడిగా వచ్చిన బాలానగర్‌కు చెందిన ఓ సివిల్ కాంట్రాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1600 నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డయాలసిస్ పేషెంట్ల కోసం 'ఆశాయే ఇన్'

సాక్షి, సిటీబ్యూరో: డయాలసిస్ సేవలందించే ప్రముఖ సంస్థ నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నగరంలోని డయాలసిస్ పేషెంట్ల కోసం 'ఆశాయే ఇన్' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 250 మందికి పైగా పేషంట్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. డయాలసిస్ పేషంట్ల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నెఫ్రోప్లస్ కేర్ హెల్త్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకులు కమల్ డి.షా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు డయాలసిస్ చేయించుకుంటూనే రోజువారీ సాధారణ జీవితం గడిపేందుకు, డయాలసిస్ డైట్‌లో ఉంటూనే ఆహారాన్ని ఆస్వాదించేందుకు, క్షేమంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పేషెంట్లకు వివరించారు.





సీనియర్ జర్నలిస్ట్ సాగర్ కుమార్‌కు ఘన సత్కారం



సాగర్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

పంజగుట్ట: గతంలో పరిశోధనాత్మక జర్నలిజం ఉండేదని అప్పటి పాత్రికేయులే బోఫోర్స్, ఏలూరు స్కాం లాంటి ఎన్నో కుంభకోణాలు బయటపెట్టారని ప్రస్తుతం సెన్సేషన్ జర్నలిజం మాత్రమే ఉందని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ అన్నారు. శుక్రవారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిరియాల వెంకట్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో టైమ్స్ ఆఫ్ ఇండియా లీగల్ ఎడిటర్ ఎం.సాగర్‌కుమార్ ఉద్యోగ విరమణ, అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగనాథ్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ విజయ్‌బాబు, సీనియర్ పాత్రికేయులు హాజరై సాగర్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. కటారి అప్పారావు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ తిరుమలగిరి సురేందర్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూటం పురుషోత్తం పటేల్, సీనియర్ జర్నలిస్టులు చందు జనార్దన్, ఆకుల అమరయ్యతో పాటు పెద్ద సంఖ్యలో సీనియర్ జర్నలిస్టులు, సాగర్ కుమార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లలో మురుగు సమస్య



బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగు

బంజారాహిల్స్: మురుగు సమస్యలు కాలనీలను, బస్తీలతో పాటు ప్రధాన రోడ్లలో సైతం వేధిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో గడిచిన వారం రోజులుగా బజాజ్ ఎలక్ట్రానిక్స్ రోడ్డులో మురుగు ప్రవహిస్తూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వీవీఐపీలు తిరిగే ఈ రోడ్డులో కూడా సమస్యను పరిష్కరించకుంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా కూడా జలమండలి సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కిరాయికి తీసుకున్న కారుతో పరార్

వెంగళరావునగర్: కారును కిరాయికి తీసుకుని పత్తా లేకుండా పోయిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... బాలానగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ వెంగళరావునగర్‌కాలనీలో ఉంటూ వాహనాలు కిరాయికి తిప్పుతుంటాడు. ఈ క్రమంలో మే 29వ తేదీన గచ్చిబౌలికి చెందిన అక్బర్ హుస్సేన్ తనకు కారు కావాలంటూ తీసుకున్నాడు. తిరిగి 31వ తేదీనాడు కిరాయి, కారు రిటర్న్ ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నాడు. అయితే నేటి వరకు కారు లేదు, కిరాయి పంపలేదు. ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదు. దాంతో ప్రవీణ్‌కుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎట్టకేలకు ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత



కూల్చివేయకముందు కూల్చివేసిన తర్వాత

వెంగళరావునగర్: ఎట్టకేలకు హైడ్రా అధికారులు ఓవర్‌హెడ్‌ను కూల్చివేశారు. అతి సమీపంలో ఉన్న నిరుపేదల కుటుంబాలు, అతి ప్రమాదకరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, దుకాణాలకు ఇసుమంత ప్రమాదం కూడా జరగకుండా అతి చాకచక్యంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను కూల్చివేశారు. వాస్తవానికి కూల్చివేత పనులను గురువారం సాయంత్రం ప్రారంభించారు. అనుకోకుండా కురిసిన వాన, వెలుతురు లేకపోవడంతో మధ్యలోనే నిలిచి వెళ్లిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి తిరిగి ప్రారంభించిన ఈ కూల్చివేత పనులు పొద్దు పోయేసరికి పూర్తయ్యాయి. ఆరు దశాబ్దాల క్రితం ఈ ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించినా కాలక్రమంలో దాదాపు పాతికేళ్లుగా నిరుపయోగంగా మారింది. ట్యాంకు పిల్లర్లు పూర్తిగా పాడై, ఐరన్ ఊచలు బయటకు వచ్చాయి. ఒకవైపుకు కొద్దిగా ఒరిగి పోయింది. దాంతో ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రజలు భయాందోళనతో మునిగిపోయారు. ఈ విషయాన్ని ఇటీవల హైడ్రా అధికారులకు స్థానిక నేతలు ఫిర్యాదు చేసి కూల్చివేయాలని కోరారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో రెండు రోజుల పాటు కష్టపడి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఓవర్‌హెడ్ ట్యాంకును జేసీబీ ద్వారా కూల్చివేశారు.

మంగళవారం.. మహిళల కోసం..!

బస్తీ దవాఖానాల్లో మహిళ రక్షా కార్యక్రమం

- ఉచితంగా వ్యాధి నిర్ధారక పరీక్షలు
- అనుభవం ఉన్న వైద్యులచే సలహాలు
- ప్రతివారం 60 మంది దాకా వస్తున్న మహిళలు
- బస్తీ దవాఖానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: మారుతున్న నగరవాసుల జీవనశైలి ఎన్నో రకాల వ్యాధులకు కారణమవుతున్నది. పని ఒత్తిడి, వంశపారపర్యం, ఆహారపు అలవాట్లతో మహిళల్లో జబ్బులు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇంటికి సౌభాగ్యాన్ని ఇచ్చే మహిళల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలనే ప్రభుత్వ ఆశయం మంచి ఫలితాలను ఇస్తున్నది. వ్యాధులను ముందుగానే గుర్తించి కట్టడి చేసే 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నది. రక్తహీనత, థైరాయిడ్, కేన్సర్ వంటి జబ్బుల ముప్పు నుంచి తప్పిస్తూ ఆరోగ్య భరోసాను కల్పిస్తున్నది.

◆ ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 23 బస్తీ దవాఖానాల పరిధిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండగా ప్రతివారం 50–60 మంది మహిళలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ వివిధ వ్యాధులకు సంబంధించి ఉచితంగా రక్త పరీక్షలను కూడా చేయించుకుంటున్నారు.

◆ ప్రైవేటు ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చయ్యే ఈ చికిత్సలు బస్తీ దవాఖానాల్లో పూర్తి ఉచితంగా నిర్వహించడమే కాకుండా వైద్యుల సలహాలను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. బాలింతలు, గర్భిణులతో పాటు సాధారణ మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఇటీవల ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రతి మంగళవారం మహిళా వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా క్షేత్రస్థాయిలోనూ చైతన్యం కలిగిస్తూ మహిళలకు అవగాహన కూడా పెంచుతున్నారు.

◆ కేన్సర్ లక్షణాలను గుర్తించిన వారిని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో చాలామంది ఈ పరీక్షల కోసం ఆసక్తిగా ముందుకువస్తున్నారు. చాలామంది వ్యాధులు ముందస్తుగానే తెలుసుకోవడంతో మందుల ద్వారా వారిని ఆరోగ్యవంతులుగా చేసేందుకు కృషి చేస్తున్నారు.

◆ బస్తీ దవాఖానాల్లో మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. ఏదైనా వ్యాధికి సంబంధించి వైద్యున్ని సంప్రదించాల్సి వస్తే అనుభవజ్ఞులచే సదరు మహిళలు ఏ మందులు వాడాలి.. ఎలా వాడాలనేది కూడా తెలియజేస్తున్నారు. ప్రతి మంగళవారం మహిళా వారం అనే థీమ్‌తో వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు జరుగుతున్నాయి. వైద్యులు కూడా ప్రతి మంగళవారం తప్పనిసరిగా దవాఖానాలకు హాజరవుతున్నారు. పరీక్షల అనంతరం రిపోర్ట్ తీసుకువచ్చిన బాధిత మహిళలకు మందులు కూడా అందజేస్తున్నారు.

ఉచితంగా 48 రకాల పరీక్షలు...

బస్తీ దవాఖానాల్లో 48 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఆస్పత్రుల్లో వివరాలను నమోదు చేసుకున్న మహిళల సమాచారాన్ని ప్రత్యేకమైన యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. రక్త నమూనాలను సేకరిస్తూ ప్రాథమిక స్థాయిలోనే కొన్నింటిని గుర్తిస్తున్నారు. రొమ్ము, గర్భాశయ, ఓరల్, నోటి కేన్సర్, థైరాయిడ్, హార్మోన్ల అసమతుల్యతలు, సూక్ష్మ పోషక లోపాల గుర్తింపు, మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, లైంగిక వ్యాధులు, బరువు తగ్గుదల వంటి పరీక్షలను టీ హబ్‌లో చేపట్టి నిర్ధారిస్తున్నారు. ఫలితాలను ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తూ హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మహిళల ఆరోగ్యానికి బస్తీ దవాఖానాలు ఒక వారధిలా పనిచేయిస్తున్నాయి. రుగ్మతలను ప్రారంభంలోనే గుర్తిస్తే ముప్పు తప్పుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట గరీబోళ్లను తరిమేసే కుట్ర

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



గురుబ్రహ్మనగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీని ఖాళీ చేయించి అక్కడ మోడల్ ఇందిరమ్మ టవర్స్ అంటూ కొద్దికాలంగా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, షేక్‌పేట తహసీల్దార్ ఇక్కడి ప్రజలను మభ్యపెడుతున్నారని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తీవ్రంగా విమర్శించారు. గురుబ్రహ్మనగర్ బస్తీలో శుక్రవారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... గత 40 సంవత్సరాలుగా ఇక్కడే 20, 30 గజాల స్థలంలో ఉంటున్నారని, వాటి విలువ సుమారు రూ. 90 లక్షలు ఉంటుందన్నారు. అలాంటి విలువైన స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తే నాలుగు సంవత్సరాల తర్వాత రూ. 10 లక్షలు కూడా విలువ లేని ఫ్లాట్‌ను ఇస్తామంటున్నారన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీఓ 58 తీసుకువచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ విధంగా పట్టాలు ఇవ్వాలన్నారు. గతంలో పద్మాలయా అంబేడ్కర్‌నగర్, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో ఏవిధంగా అయితే ఉంటున్న స్థలంలో ఇళ్లు కట్టుకునేలా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందో అదే మాదిరిగా ఇవ్వాలన్నారు.

నో వెండింగ్ జోన్‌లో వాణిజ్య కార్యకలాపాలు



కేబీఆర్ పార్కు ముందు ఏర్పాటు చేసిన స్టాల్స్

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ముందు ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలు, ప్రమోషనల్ యాక్టివిటీస్ చేయడం నిషేధం. కానీ కొన్ని రోజుల నుంచి కొన్ని సంస్థలు తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు తమకు జీహెచ్‌ఎంసీ అనుమతులు ఉన్నాయంటూ ఇష్టారీతిన వ్యవహరిస్తూ పెద్ద ఎత్తున పార్కు గేటు ముందు స్టాల్స్ ఏర్పాటు చేసిన కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. కేబీఆర్ పార్కు వద్ద గతంలో ఈ విధంగా కమర్షియల్ యాక్టివిటీస్ పెద్ద ఎత్తున జరగడంతో నాటి ఉన్నతాధికారుల సూచన మేరకు వెండింగ్ జోన్ ఏర్పాటు చేసిన అక్కడికి వీటన్నింటిని తరలించారు. అయినా కొంత మంది తమకు అధికారులు మద్దతు, అనుమతులు ఉన్నాయంటూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. పార్కు ముందు కమర్షియల్ కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వొద్దంటూ పార్కు వాకర్స్ అసోసియేషన ప్రతినిధులు కూడా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

గోవధ నిషేధిత చట్టం తెచ్చి ఆమోదించాలి

హిమాయత్‌నగర్: గోవధ నిషేధిత చట్టం తీసుకొచ్చి పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించాలని బీజేపీ సీనియర్ నాయకుడు చీకోటి ప్రవీణ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై బీజేపీ ఎంపీలపై ఒత్తిడి తీసుకొస్తానని తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నమో మిషన్ వందే గో మాతరం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా చీకోటి ప్రవీణ్ హాజరై మాట్లాడారు. గోవును రక్షించాలనే ఉద్దేశంతో ధర్మరక్షను ఏర్పాటు చేసి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరారు. సుప్రీమ్ కోర్ట్ ఉత్తర్వులను ధిక్కరిస్తూ ఓవైసీ సోదరులు ఇష్టారీతిన గోవధను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. గోవధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, పీడీ యాక్ట్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నమో మిషన్ వందే గో మాతరం ప్రతినిధులు కవిత హైందవి, పూర్ణ శాంతి గుప్తా, సురేష్ కుమార్, వీర మద్వీరాజ్, భరత్ కుమార్, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, ఉదయ్ శ్రవణ్, దత్తు, విజయ్ మోజ్, గంప ప్రేమ్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని నేడు మండలాల యాత్ర

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ 584 మండలాల యాత్రను శనివారం ఉదయం 9 గంటలకు ఎల్‌బీనగర్ లోని శ్రీకాంతచారి విగ్రహం వద్ద నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో టీయూఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.సురేందర్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారుల హామీలను వెంటనే అమలు చేసి తెలంగాణ ఉద్యమ కారుల బంధువుగా మారాలని విజ్ఞప్తి చేశారు. టీయూఎఫ్ నాయకురాలు దయానంద్, వీరస్వామి, రజనీ కాంత్, సుదర్శన్, జగన్ యాదవ్, తాడూరి గగన్ కుమార్, జానకి రెడ్డి, శ్యామల, భాను ప్రకాశ్ రెడ్డి, రాజేందర్, పుట్నాల కృష్ణ, శివ కుమార్ నేత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత సంధ్యకు స్ఫూర్తిదాయక ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రశాంత సంధ్య మన్నె

బంజారాహిల్స్: నవోదయ స్కూల్స్ కాంప్లెక్స్ స్థాపించిన ప్రతిష్టాత్మక అధీనా అరిస్టియా స్ఫూర్తిదాయక ఉపాధ్యాయ అవార్డు జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ప్రశాంత సంధ్య మన్నెకు వరించింది. యువ మనస్సులను రూపొందించడంలో ఆమె ఆదర్శప్రాయమైన అంకితభావం, నిబద్ధతను గుర్తిస్తూ ఈ అవార్డు ప్రదానం చేశారు. గత 24 సంవత్సరాలుగా కొత్త ఆవిష్కరణలతో బోధనా స్ఫూర్తిని ప్రదర్శించారు. ఈ అవార్డు రావడం ఆమెకే కాక మొత్తం పాఠశాలకు గర్వకారణమని ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రశాంత సంధ్య మన్నె తన వినూత్న ప్రయత్నాలు, డైనమిక్ తరగతి పద్ధతులు, బాధ్యతాయుతమైన, నమ్మకంగా ఉన్న అభ్యాసకులను రూపొందించడంలో ఆమె పాత్ర అమోఘమన్నారు. విద్యార్థులను ప్రేరేపించే సామర్థ్యం, విద్యా రంగానికి ఆమె చేసిన గణనీయమైన కృషికి తగిన గుర్తింపు పొందిందన్నారు. ఆమె సాధించిన విజయం మొత్తం బోధనా సమాజానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. అంతేకాక భవిష్యత్తు తరాలను రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్రను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ అవార్డు తనకు విజయాన్ని మాత్రమే కాదు.. సంస్థ పట్ల మరింత బాధ్యతను కూడా అప్పగించిందని ఈ సందర్భంగా ప్రశాంత సంధ్య మన్నె తెలిపారు. ఉన్నత విద్యా రంగానికి మరింత అర్థవంతంగా తోడ్పడటంలో తన కృషిని గుర్తించినందుకు యాజమాన్యానికి కూడా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మెట్రోలో ప్రయాణికురాలి పర్సు చోరీ

బంజారాహిల్స్: మెట్రోరైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నగదుతో ఉన్న పర్సును చోరీ చేసిన ఘటన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో డిశ్చార్జి అటెండెంట్‌గా బిల్లింగ్ సెక్షన్‌లో నీరజ పనిచేస్తున్నది. తన కొడుకు పుట్టిన రోజు సందర్భంగా ఖర్చుల కోసం రూ. 27 వేలు డ్రా చేసుకుని పర్సులో ఉంచుకుని ఎల్‌బీ నగర్‌లో మెట్రో ఎక్కింది. పంజగుట్టలో మెట్రో దిగి చూసుకోగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి ఉన్నట్లు గమనించింది. అందులో రూ. 27 వేల నగదు ఉన్న పర్సు కనిపించలేదు. మెట్రోలో ఆమె ప్రయాణిస్తున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు హ్యాండ్‌బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి పర్సు చోరీ చేసి ఉంటారని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పంజగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్‌కు విందు



విందులో పాల్గొన్న ప్రముఖులు

బంజారాహిల్స్: అమెరికా కాన్సుల్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించిన లారా విలియమ్స్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విందు ఇచ్చారు. స్నేహం, సాంస్కృతిక, సామరస్యం, దౌత్య సాన్నిహిత్యాన్ని ప్రతిబింబించేలా విందు నిర్వహించారు. అలాగే ఈ విందు అమెరికా సంయుక్త రాష్ట్రాలు, తెలంగాణ, భారతదేశం సంబంధాలు మరింత బలపరచడం, ఆర్థిక సహకారం, సాంస్కృతిక మార్పిడి, అభివృద్ధి వంటి కీలక రంగాల్లో చర్చలకు వేదికగా నిలిచింది. ఈ విందులో సంప్రదాయ మొఘలాయి వంటకాలు, మధ్య ఆసియాకు చెందిన ప్రత్యేక వంటకాలతో సమతుల్యంగా మెనూ రూపొందించి వడ్డించారు. ఇంకా ఈ విందుకు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, తుర్కియో రిపబ్లిక్ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యాల్మాన్‌ఓకాన్, భారతదేశంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కాన్సుల్ జనరల్ ఆరెఫ్ అలీ అలీ అల్ తబూర్ అచేర్గమి, బెంగుళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, యూరోప్ విదేశీ వ్యవహారాల కోసం ఫ్రెంచ్ మంత్రిత్వ శాఖ స్టేట్ అడ్మినిస్ట్రేటర్ మార్క్ లామీ, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బాలరాం, ఐఎఫ్ఎస్ భారత ప్రభుత్వం విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

మద్యం మత్తులో కారు నడిపిన వ్యాపారి

బంజారాహిల్స్: పీకలదాకా మద్యం సేవించిన ఓ యువ వ్యాపారి మత్తులో కారు నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నానక్‌రామ్‌గూడ అశోకా లివియానోలో నివసించే తన్నీరు నవీన్‌కృష్ణ (36) వ్యాపారి కాగా, గురువారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–34లోని తన స్నేహితుడి రూమ్‌లో మద్యం సేవించాడు. అర్ధరాత్రి మద్యం మత్తులోనే కారు నడుపుతూ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–51లోని పెవీలియన్ డ్రైవ్ ఇన్ ముందు కారు అదుపు తప్పి ఫుట్‌పాత్ పైకి ఎక్కి అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జయ్యింది. ఎయిర్‌బెలూన్లు ఓపెన్ కావడంతో నవీన్‌కృష్ణ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పెట్రోకార్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా మద్యం మత్తులో ఉన్న నవీన్ వారికి సహకరించకపోగా, దుర్భాషలాడుతూ న్యూసెన్స్‌కు పాల్పడ్డాడు. పోలీసులు ఆయనను ఠాణాకు తరలించి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ నిర్వహించగా ఆల్కహాల్ మోతాదు 111 బీఏసీ నమోదైంది. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడిపి కంట్రోల్ తప్పి ఈ ప్రమాదానికి కారణమైన నవీన్ కృష్ణపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 281, 125, 110, 221 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జోగులాంబ ఆలయం వద్ద.. వైభవంగా 'గుడి సంబురాలు'

రాజా ఆఫ్ గద్వాల్ సంస్థాన్ కృష్ణ రామ్ భూపాల్



బంజారాహిల్స్: గద్వాల్ ప్రాంతంలోని జోగులాంబా దేవి ఆలయం వద్ద ఈ నెల 23, 24 తేదీల్లో గుడి సంబురాలు పేరుతో ఆలయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజా ఆఫ్ గద్వాల్ సంస్థాన్ కృష్ణ రామ్ భూపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జోగులాంబ ఆలయానికి చరిత్రలో ఎంతో గొప్ప స్థానం ఉందని 18 శక్తి పీఠాలలో ఇది ఒకటి అన్నారు. కోట్లాది మందికి ఆశీస్సులు అందిస్తున్న అమ్మవారి వైభవాన్ని, ఈ ప్రాంత ఔచిత్యాన్ని తెలియజేసేందుకు తాము పరంపరం ఫౌండేషన్, దేవాదాయ శాఖ సహకారంతో జోగులాంబ ఆలయం వద్ద దేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు గుడి సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పూర్వీకుల సంప్రదాయాలకు కొనసాగింపుగా ఈ దసరా నవరాత్రి వేడుకలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మల్లేష్‌యాదవ్ సేవలు చిరస్మరణీయం



దివంగత వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ ఎంపీ కేవీపీ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొంటి పెద్ద మల్లేష్‌యాదవ్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవు వేసి నివాళులర్పించారు. పేదల కోసం మల్లేష్‌యాదవ్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు గొంటి శ్రీనివాస్‌యాదవ్, గొంటి కుమార్‌చౌదరియాదవ్, గొంటి రవీందర్‌యాదవ్, గొంటి విక్రమ్‌యాదవ్, గొంటి సాయినాథ్‌యాదవ్, కిట్టుగౌడ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

వెంగళరావునగర్: నిబంధనలకు విరుద్ధంగా గంజాయి విక్రయానికి దాచి ఉంచిన ఇరువురు యువకులను మధురానగర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మధురానగర్ పీఎస్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఎస్ఐ జి.శివశంకర్ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. శుక్రవారం మధురానగర్ కాలనీలో అనుమానంగా తిరుగుతున్న ఎం.సాయికిరణ్, ఏ.సోమశేఖర్‌ల వద్దకు పోలీసులు వెళ్లగా పారిపోవడానికి ప్రయత్నించారు. దాంతో పోలీసులు వారిని పట్టుకుని వివరాలు అడగ్గా గంజాయి విక్రయిస్తున్నట్టుగా తెలియజేశారు. దాంతో వారిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న రెండు గ్రాముల గంజాయి, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ అనుబంధ కమిటీల నియామకం

రహమత్‌నగర్: బీజేపీ రహమత్‌నగర్ డివిజన్ అనుబంధ కమిటీలను పార్టీ డివిజన్ అధ్యక్షుడు తంగలపల్లి లక్ష్మణ్ శుక్రవారం ప్రకటించారు. మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఎస్.సౌభాగ్యలక్ష్మి, యువ మోర్చా అధ్యక్షుడిగా ఆర్.విజయ్ కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా డి.దశరథ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా రమేష్‌నాయక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా శ్యాంయాదవ్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా ఎం.డి. షేర్ ఆలంను నియమించారు.

తాజ్‌కృష్ణాలో సూత్ర వస్త్ర ప్రదర్శన ప్రారంభం



బంజారాహిల్స్: నగరవాసులకు సుపరిచితమైన సూత్ర వస్త్ర ప్రదర్శన దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని అద్వితీయమైన సంప్రదాయ , ఆధునికత మేళవించిన విస్తృత శ్రేణి వస్త్రాలు, ఆభరణాలను ప్రదర్శనను శుక్రవారం బంజారాహిల్స్ తాజ్‌కృష్ణా హోటలలో ప్రారంభించారు. ఈ ప్రదర్శన 13, 14 తేదీల్లో కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సూత్రా ప్రదర్శన దేశం నలుమూలల నుంచి పేరొందిన డిజైనర్స్, ఉన్నతమైన ప్రీమియర్ బ్రాండ్లను అన్నింటినీ ఒకే వేదిక పైకి చేర్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. దుర్గా నవరాత్రులు, దీపావళి పండుగ కోసం ప్రత్యేక వస్త్రాలు, ఆభరణాల సేకరణకు సూత్రా ప్రదర్శన అనువైన గమ్య స్థానమని తెలిపారు. ఈ ప్రదర్శనలో సంస్కృతి సంప్రదాయతలు కలబోసిన వస్త్రాలు, ఆధునిక ఫ్యాషన్లకు అద్దంపట్టే వేలాది రకాల దుస్తులతో పాటు అద్భుతమైన డిజైన్స్ ఆభరణాలు, ఉపకరణాలు జీవన శైలికి అవసరమైన అన్నీ ఒకేచోట లభిస్తాయని నిర్వాహకులు వివరించారు. ఈ ప్రదర్శనలో అనురాగ్ జ్యువెలరీ, రెయిన్స్ జైపూర్, లేబుల్ స్వానీ–ముంబయి, ఫ్యాబ్ ఆఫ్ కశ్మీర్ వంటి 100కి పైగా డిజైనర్లు, ప్రముఖ బ్రాండ్లు భాగస్వామ్యం కలిగి ఉన్నట్లు తెలిపారు.

ఏకేవై ఫౌండేషన్ సేవలు భేష్



వైద్య శిబిరంలో పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్

రహమత్‌నగర్: పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా ఏకేవై ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఏకేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రహమత్ నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... నిరుపేదలు సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారికి ఏకేవై ఫౌండేషన్ ద్వారా ఉచితంగా వైద్యాన్ని అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు గ్యార నాగరాజు, మాలాకీ, ఇబ్రహీం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




ఎకో ఫ్రెండ్లీ బాటలో మన సిటీ

గ్లోబల్ సిటీగానే కాకుండా ఎకో ఫ్రెండ్లీ జీవనశైలిపై పెరుగుతున్న ఆసక్తి

- 'ఎకో రన్స్', 'నేచర్ వాక్స్', గ్రీన్ ఛాలెంజ్‌లు తదితర ప్రాజెక్టులతో అవగాహన
- జీహెచ్ఎంసీ, ఎన్‌జీఓలు, ఇతర సంస్థల విశేష కృషి
- ఉత్సవాలు, వేడుకలు, పండుగలకు పర్యావరణహిత శోభ
- ట్రెండ్‌గా మారుతున్న నేచురల్ లైఫ్ స్టైల్..

గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరం ఒకవైపు ఐటీ హబ్, పరిశ్రమల కేంద్రం, మల్టీనేషనల్ కంపెనీలకు నిలయంగా వృద్ధి చెందుతూనే మరోవైపు సంప్రదాయాలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ అనే అంశాల్లో కూడా కొత్తపుంతలు వేస్తోంది. ఆధునిక జీవనశైలి, నగరీకరణ, అభివృద్ధి పేరుతో ప్రకృతి శత్రువుగా మారుతున్న ఈ కాలంలో కూడా సిటీజనులు పర్యావరణానికి మద్దతుగా కొనసాగిస్తున్న కొత్త జీవన ధోరణి ప్రశంసనీయంగా మారింది. ప్లాస్టిక్, రసాయనాలు, పొల్యూషన్, కాంక్రీట్ జంగిల్ మధ్య 'ఎకో ఫ్రెండ్లీ'జీవనశైలికి ఆదరణ పెరుగుతోంది. హైదరాబాద్ వంటి మెట్రో సిటీలో కూడా ఈ విధమైన పర్యావరణహిత జీవనశైలి మార్పులు కనిపించటం భవిష్యత్ తరాలకు ఉత్తమ ఉదాహరణ. ఈ సంస్కృతి పర్యావరణ పరిరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తుంది. ఇకపై పండగలూ, ఉత్సవాలూ, కొనుగోళ్లూ... అన్నీ ప్రకృతికి హానీ కలిగించకుండా, ప్రకృతిని అంగీకరించేలా మారడమే ఈ తరం నిజమైన జీవన ధర్మంగా మలచుకుంటోంది. టెర్రస్ గార్డెనింగ్, సీడ్ ఫెస్టివల్స్, వన మహోత్సవాలు, నేచర్ రన్స్ తదితర పర్యావరణ అవగాహన కార్యక్రమాలు హైదరాబాద్‌లో పర్యావరణ హిత జీవనశైలికి తోడ్పడే సరికొత్త సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి.

-సాక్షి, సిటీబ్యూరో

ఎకో ఫ్రెండ్లీ మార్పును ముందుండి నడిపిస్తున్నది నగర యువత. సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించటం, స్థానిక కమ్యూనిటీల్లో పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావటం, స్కూళ్లల్లో పిల్లలకు పర్యావరణ విద్యపై వర్క్‌షాపులు నిర్వహించటం వంటి చర్యలు యువత ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. నగరంలో ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని సంరక్షించాలన్న ఉద్దేశంతో 'ఎకో రన్స్', 'నేచర్ వాక్స్' లాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. కేబీఆర్ పార్క్, నెక్లెస్ రోడ్, దుర్గంచెరువు, గండిపేట్ ఎకో పార్క్ వంటి ప్రదేశాల్లో నిత్యం ఈవెంట్స్ జరుగుతున్నాయి. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, జీహెచ్ఎంసీ గ్రీన్ చాలెంజ్ గ్రూప్స్ తరచూ గ్రీన్ మారథాన్‌లు, ప్లాగ్ రన్స్ నిర్వహిస్తున్నారు. ఈ రన్స్‌లో ప్లాస్టిక్ రహిత నిబంధనలు పాటించడం, నిబంధనల ప్రకారం మొక్కలు నాటించడం వంటి అంశాలు ఉంటాయి.



పర్యావరణ సంబంధిత ప్రాజెక్టులు

హైదరాబాద్ నగరంలో వివిధ ప్రభుత్వ/స్వచ్ఛంద సంస్థలు పర్యావరణ పరిరక్షణపై అనేక ప్రాజెక్టులు చేపడుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో పర్యావరణ క్లబ్బులు ఏర్పడుతున్నాయి. జీహెచ్ఎంసీ నగరంలోని కొత్త నిర్మాణాలకు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ తప్పనిసరి చేస్తోంది. కేబీఆర్ పార్క్, మృగవాణి పార్క్, బొటానికల్ గార్డెన్ వంటి బయో డైవర్సిటీ పార్క్‌ల్లో జీవ వైవిధ్యాన్ని రక్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలవుతున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాద్‌లోని కొన్ని బస్తీలు, మార్కెట్లు ప్లాస్టిక్ రహిత జోన్‌గా మారుతున్నాయి (ఉదా: శిల్పారామం, శిల్పకళావేదిక మార్కెట్).


సీడ్ రాఖీలు.. ప్రేమతో ప్రకృతిని కాపాడేద్దాం

వినాయక చవితి కన్నా ముందే వచ్చిన రాఖీ పండుగలో కూడా ఈ మార్పు కొనసాగింది. మార్కెట్లో ప్లాస్టిక్, సింథటిక్ మెటీరియల్స్‌తో తయారైన రాఖీల స్థానాన్ని 'సీడ్ రాఖీలు' స్వీకరించాయి. విత్తనాలతో చేసిన ఈ రాఖీలను వాడిన తర్వాత నేలలో నాటితే మొక్కలుగా మారతాయి. సోదరుల రక్షణతోపాటు ప్రకృతికి రక్షణ అనే సందేశాన్ని ఈ ట్రెండ్ బలంగా వినిపించింది. స్కూల్స్, కాలనీలు, స్వచ్ఛంద సంస్థలు సీడ్ రాఖీలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి.



సీడ్ ఫెస్టివల్స్..

సహజ విత్తనాలను ప్రచారం చేయడానికి, మూల విత్తనాలను భద్రపరచడానికి హైదరాబాద్‌లో సీడ్ ఫెస్టివల్స్ ప్రజాదరణ పొందుతున్నాయి. ధరణి కలెక్టివ్, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వంటి సంస్థలు ప్రతి ఏడాది సీడ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నాయి. ఈ ఫెస్టివల్స్‌లో ప్రజలు తమ తోటల కోసం పురాతన విత్తనాలు, దేశీ విత్తనాలు తీసుకుంటారు. విత్తన మార్పిడి (సీడ్ ఎక్స్ఛేంజ్) కూడా ఈ ఫెస్టివల్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



మట్టి ప్రతిమలు..

నగరంలో ప్రతీ ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వినాయక చవితి ఉత్సావాల్లో కూడా ఇటీవల పర్యావరణ స్పృహ పెరిగింది. ఇటీవలే ముగిసిన వినాయక చవితి పండుగలో ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. గతంలో కన్నా ఈసారి మట్టి వినాయకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టితో తయారైన గణేశులు పలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, కార్పొరేట్ ఆఫీసుల్లో దర్శనమిచ్చాయి. నిమజ్జనం కోసం కూడా ప్రత్యేకంగా నిర్మించిన చిన్న ఎకో ఫ్రెండ్లీ ట్యాంకులు, వానకాలపు నీటి ట్యాంకులు వాడటం, మూసీ నదిలో నేరుగా విగ్రహాలు నిమజ్జనం చేయకుండా నిరోధించటం వంటివి చైతన్యాన్ని ప్రతిబింబించాయి. ముఖ్యంగా 'సీడ్ గణేశులు' ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిమజ్జనానికి అనంతరం మొక్కగా మారే గణేశుల వినూత్న ఆలోచన ప్రజల్లో పర్యావరణాన్ని పరిరక్షించాలనే స్ఫూర్తిని నింపింది.

సహజ ఉత్పత్తుల స్టోర్ల హైలైట్..

ఇక నగరంలో 'స్వదేశీ', 'జైపూర్', 'హస్తకళ' వంటి స్టోర్లూ సహజ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తూ, వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ స్టోర్లలో చేతితో తయారైన గృహోపకరణాలు, పర్యావరణ హిత ఇంటీరియర్ డిజైన్లు, బయో డిగ్రేడబుల్ ప్రోడక్టులు విస్తృతంగా లభ్యమవుతున్నాయి. ఇంట్లో డెకర్ నుంచి డైలీ యూజ్ వస్తువుల వరకు అన్ని సహజసిద్ధంగా తయారైనవే కావడం వల్ల వినియోగదారుల్లో నిశ్చితమైన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది

చేతివృత్తులకు ప్రోత్సాహం..

హైదరాబాద్‌లోని శిల్పారామం వేదికగా జరిగే చాప్ ప్రదర్శన కూడా ఈ ఎకో ఫ్రెండ్లీ జీవితశైలికి మారుపేరుగా నిలవనుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్స్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. వాతావరణ సమస్యలను తగ్గించే విధంగా ప్రామాణికంగా తయారైన టెక్స్‌టైల్ ఉత్పత్తులు, సహజమైన డై సాంకేతికతతో రూపొందించిన వస్త్రాలు ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్లాస్టిక్ వస్తువులు కాకుండా హస్తకళతో రూపుదిద్దుకున్న వస్తువులు ఈ వేదికగా సందడి చేయనున్నాయి.




టెర్రస్ గార్డెనింగ్..

నగరంలో టెర్రస్ గార్డెనింగ్ అనేది నేడు ఒక జీవనశైలి మార్గంగా మారుతోంది. అధిక జనాభా, స్థలాభావం మధ్యలో పట్టణ ప్రజలు తమ ఇంటి మేడను చిన్న తోటగా మలచుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) తరఫున తోటలపై అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. అర్బన్ కిసాన్, మై డ్రీమ్ గార్డెన్ వంటి సంస్థలు టెర్రస్ గార్డెనింగ్ సెటప్ చేయడంలో సహాయం చేస్తూ పాడిపంటల పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్ విధానాలు అందిస్తున్నాయి. సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు, పెస్ట్ కంట్రోల్ ముఖ్యంగా ఇంట్లోనే తయారు చేసుకునే విధానాలపై అవగాహన పెరుగుతోంది.

వన మహోత్సవం..

వన మహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదు. ప్రకృతిని గౌరవించే ఉత్సవంగా మారింది. తెలంగాణ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం కొనసాగుతోంది. హైదరాబాద్ చుట్టుపక్కల మియావాకి అటవీ విధానాన్ని అనుసరించి పచ్చదనం పెంచుతున్నారు. స్కూల్స్, కాలేజీలు, కార్పొరేట్ సంస్థలు వన మహోత్సవాన్ని జరుపుతూ 'ఒక విద్యార్థి – ఒక మొక్క' ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నాయి. మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవడం అనే చైతన్యం నానాటికీ పెరుగుతోంది.






రైల్వే మిక్స్‌డ్ స్కూల్‌లో తన్మయం

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ సౌత్ లాలాగూడలోని రైల్వే మిక్స్‌డ్ హై స్కూల్‌లో శుక్రవారం 'తన్మయం' పేరిట సంగీత వాయిద్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ డివిజన్ మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశా వర్మతో కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. సంతోష్ కుమార్ వర్మ మాట్లాడుతూ సంగీత వాయిద్య కేంద్రం విద్యార్థుల సంగీత ప్రతిభను వెలికి తీయడానికి దోహదం చేస్తుందన్నారు. పిల్లల్లో సృజనాత్మకత, క్రమశిక్షణతోపాటు సాంస్కృతిక అవగాహన కలుగుతుందని చెప్పారు. ఈ కేంద్రంలో వివిధ రకాల సంగీత వాయిద్య పరికరాలు ఉంటాయని, విద్యార్థులకు నిర్మాణాత్మక శిక్షణ అందించడమే లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కె.ముత్యాల నాయుడు, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కట్టా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు రామ్ మిర్యాల లైవ్ కన్సర్ట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ టాలీవుడ్ సింగర్ రామ్ మిర్యాల శనివారం (నేడు) తన స్వరాలతో నగరంలోని మ్యూజిక్ లవర్స్‌ను అలరించనున్నారు. నగరంలోని 'గ్రేస్ మంకీ'వేదికగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో రామ్ తన లైవ్ కన్సర్ట్‌తో హోరెత్తించనున్నారు. గ్రేస్ మంకీ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా పవర్‌ఫుల్ మ్యూజిక్ బ్యాండ్‌తో రామ్ లైవ్ కన్సర్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు రీజినల్ పాటలతో కొనసాగే ఈ లైవ్ కన్సర్ట్ రాత్రి 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. 21 ఏళ్ల వయసు దాటినవారు ఈ లైవ్ కన్సర్ట్‌లో పాల్గొనవచ్చని, ఆసక్తి ఉన్నవారు మ్యూజిక్ లవర్స్ బుక్ మై షోలో రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

శిల్పారామంలో ఛాప్-2025 షురూ..




- వివిధ రాష్ట్రాల చేనేత, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన

మాదాపూర్: యువతలో చేనేత కళలు, హస్తకళలపై అవగాహన కల్పించాలని మెట్రోపాలిటన్, పట్టణాభివృద్ధి కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 5 రోజులపాటు నిర్వహించనున్న ఛాప్–2025 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల చేనేత, హస్తకళా ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ మాలిని మాట్లాడుతూ ఫ్యాషన్ ట్రెండ్స్, ఫ్యాషన్ టెక్నాలజీలపై తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. తోలుబొమ్మలాట ప్రదర్శన సందర్శకులను ఎంతగానో అలరించనుందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో పవర్‌లూమ్, హ్యాండ్లూమ్‌లకు సంబంధించిన తేడాలు, గద్వాల్, ఇక్కత్, పోచంపల్లి, గుజరాత్ ఇక్కత్‌ల మధ్య వ్యత్యాసాలపై అవగాహన కల్పించనున్నారు. సందర్శనకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో నిఫ్ట్ అధ్యాపకులు, శిల్పారామం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కళింగ'లో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన




బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన–2025ను మిసెస్ బెల్లెజా తెలంగాణ ఫస్ట్ రన్నరప్ డాక్టర్ పి.నిఖిలారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను తిలకిస్తూ, వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని నిఖిలారెడ్డి అన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటితరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ చేనేతకారులను ప్రోత్సహించాలని కోరారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడతూ ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

భావితరాలకు భారతీయ నృత్యకళ

- జాతీయ అవార్డు గ్రహీత డ్యాన్సర్ మధులిత మహాపాత్ర
- కొండాపూర్‌లో ఒడిస్సీ డ్యాన్స్ వర్క్‌షాపు




గచ్చిబౌలి: భారతీయ నృత్యకళను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ ఒడిస్సీ నృత్యకారిణి మధులిత మహాపాత్ర అన్నారు. భిన్న సంస్కృతులకు నిలయమైన దేశంలో ఎన్నో ప్రాచీన నృత్యకళలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు దాదాపు 2 వేల మందికి ఒడిశా, బెంగాల్ శాస్త్రీయ నృత్యమైన ఒడిస్సీలో శిక్షణ ఇచ్చానని చెప్పారు. కొండాపూర్‌లోని ధరోహర్ డ్యాన్స్ అకాడమీ, సమకల్ప అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఒడిస్సీ డ్యాన్స్ వర్క్‌షాపులో ఆమె శిక్షణ ఇస్తున్నారు. ఒడిస్సీ డ్యాన్స్‌లో రెండు, మూడు సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ఇంటర్, ఆరేడు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి అడ్వాన్స్ పేరిట శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో కన్హీ గాలే మురళి పుంక, అడ్వాన్స్‌లో జన సమ్మోహినీలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నారు. హైదరాబాద్‌లో భారతీయ సంస్కృతిపై మక్కువ ఉన్న ఒడిషా, బెంగాల్‌కు చెందిన ఎంతో మంది ఉన్నారని ధరోహర్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు నిరంజన తెలిపారు.

ఫెస్ట్ లుక్



- ఈ డెకరేషన్‌తో ఎకో ఫ్రెండ్లీ దీపావళి
- చిన్న మెలకువలతో ఇంటి అందం రెట్టింపు

సాక్షి, సిటీబ్యూరో: దీపావళి వేళ మీ ఇంటి శోభను రెట్టింపు చేయాలంటే ఇల్లుతో పాటు ఇంట్లోని వస్తువులను శుభ్రం చేయడమే కాదు.. చిన్న చిన్న మెలకువలతో ట్రెండీ లుక్ తీసుకు రావొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్ రెండు చోట్లా డెకరేటివ్ చేస్తే ఎకో ఫ్రెండ్లీ దీపావళిగా మారుతుందంటున్నారు.

- సంప్రదాయమైన దీపాంతులు, కొవ్వొత్తుల స్థానంలో సిరామిక్ లేదా మార్బుల్ పల్లెంలో మట్టి దీపాంతలను వెలిగించండి. వీటిని హాల్, పూజ గదిలో పెట్టండి. డిస్కౌంట్ ధరల్లో వినూత్న డిజైన్స్ మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. మరింత సృజనాత్మకత కావాలంటే బంగారపు వర్ణం ఉండే ఎలక్ట్రిక్ దీపాంతలు లభ్యమవుతాయి. వీటి ధరలు రూ.300.
- ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలు బహుళ రంగుల లైట్లు, పోర్టబుల్ లైట్లు, లాంతర్లు వంటి వినూత్న లైటింగ్ ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకొచ్చాయి. వీటిని స్మార్ట్‌ఫోన్‌తో ఆపరేట్ చేసుకోవచ్చు కూడా. వైర్‌లెస్ ఉత్పత్తులు కావటంతో మొబైల్‌తో మనకు ఎంత కావాలంటే అంత కాంతి స్థాయి, రంగులను ఎంపిక చేసుకోవచ్చు. వీటి ధర రూ.3 వేల నుంచి ఉన్నాయి.
- పండుగ సీజన్‌లో ఇంటి ప్రధాన ద్వారం, మెయిన్ ఎంట్రెన్స్ లేదా భవనం మీద ఓం, స్వస్తిక్ వంటి చిహ్నాలను పెట్టుకోవచ్చు. ఇవి ఎల్ఈడీ లైట్లతో తయారు చేసిన ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.200 – 500 మధ్య ఉన్నాయి.
- రంగు రంగుల బాటిల్స్‌లో కొవ్వొత్తులను పెట్టి గోడల మూలల్లో లేదా ప్రధాన ద్వారానికి ఇరు వైపులా, ఇంటి చుట్టూ వేలాడదీయవచ్చు. దీంతో ఇల్లు రకరకాల వర్ణాల్లో అందంగా దర్శనమిస్తుంటుంది. వీటి ధర రూ.400 నుంచి ఉన్నాయి.
- అకార్డియన్ పేపర్ లాంతర్లు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. ఇవి పగటి పూట సూర్యరశ్మిని సేకరించి.. రాత్రి సమయాల్లో ప్రకాశిస్తాయి. వీటిని హెవీ డ్యూటీ నైలాన్‌తో తయారు చేస్తారు. ఈ లాంతర్ సెట్‌లు వివిధ డిజైన్స్, రంగుల్లో దొరుకుతాయి.
- ఈ మధ్య కాలంలో నీళ్లలో తేలియాడే కొవ్వొత్తులు బాగా ప్రాచుర్యం పొందాయి. అలంకరణ ప్రాయంగా వీటిని పూల కుండీల్లో, మొక్కలున్న ప్రాంతాల్లో, స్విమ్మింగ్‌పూల్ వద్ద అమర్చుకోవచ్చు. ఇవి పరిమాణాలను బట్టి 8–10 గంటల వరకు కాంతినిస్తాయి.

క్వాలిటీ ఫస్ట్

- విస్తీర్ణం తక్కువైనా నో ప్రాబ్లం
- నాణ్యమైన నిర్మాణాలకే ప్రాధాన్యం
- అందుబాటు గృహాలపై దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: ఆధునిక సదుపాయాలు లేకపోయినా పర్వాలేదు.. ఆట స్థలాలకు స్థానం కల్పించకున్నా ఇబ్బంది లేదు.. విస్తీర్ణం తక్కువైనా నో ప్రాబ్లం.. అందుబాటు ధరతో పాటు నిర్మాణంలో నాణ్యత ఉంటే చాలు నగరంలో ఇల్లు కొనేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నట్లు ఓ ప్రాపర్టీ పోర్టల్ సర్వే తెలిపింది. సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులను దృష్టిలో పెట్టుకొని అందుబాటు ప్రాజెక్ట్‌లను నిర్మించాలని సూచించింది. మన దేశంలోని నగరాలు, పట్టణాల్లో సుమారు 3 కోట్ల దాకా ఇళ్లు అవసరమవుతాయి. దీంతో బడా డెవలపర్లూ అందుబాటు గృహాల వైపు దృష్టిసారించారు. ఆర్థిక మాంద్యం కారణంగా ప్రవాస భారతీయులు, ఐటీ ఉద్యోగుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేవు. దీంతో తక్కువ విస్తీర్ణం కలిగిన ఇళ్లకు, స్థానిక కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే ఇళ్లకు శ్రీకారం చుట్టారు.

నగరానికి చెందిన పలు నిర్మాణ సంస్థలు అందుబాటు ధరల్లో ఇళ్లను నిర్మించడం మొదలు పెట్టాయి. ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్, కొంపల్లి, శామీర్‌పేట వంటి పలు ప్రాంతాల్లో రూ.45 లక్షల్లోపు ఫ్లాట్లు కొనేవారు బోలెడుమంది ఉన్నారు. కానీ, ఈ తరహా నిర్మాణాలు చేపట్టేవారి సంఖ్య తక్కువగా ఉంది. నేటికీ హైదరాబాద్ నిర్మాణ రంగం ఐటీ ఉద్యోగుల కొనుగోళ్ల మీదే ఆధారపడి ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే నగరంలో రేట్లు తక్కువగా ఉండటం. పెట్టుబడి కోణంలో ఆలోచించేవారు, స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు నగరం వైపు దృష్టిసారిస్తున్నారు.



- సిమెంట్, టైల్స్, మార్బుల్, గ్రానైట్, రంగులపై తగ్గిన ట్యాక్స్
- దీంతో డెవలపర్లకు తగ్గనున్న ప్రాజెక్ట్ నిర్మాణ వయ్యం
- ఆ మేరకు ఆదా కస్టమర్లకు బదలాయిస్తేనే ప్రయోజనం
- పట్టణ ప్రాంతంలో చౌక గృహాలకు పెరగనున్న డిమాండ్

కేంద్రం వస్తు సేవల పన్ను(జీఎస్టీ)ని సవరించింది. జీఎస్టీ సంస్కరణలు దేశీయ రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధానమైన సానుకూల మార్పు. ఈ నెల 22 నుంచి అమలులోకి రానున్న జీఎస్టీ 2.0 నిర్మాణ రంగానికి పెద్ద ఉపశమనమే. గృహ, కార్యాలయ, రిటైల్ విభాగాల వృద్ధికి దోహదపడటంతో పాటు సరళీకృత పన్ను విధానంతో పారదర్శకత, స్థిరాస్తి కొనుగోలు దారుల్లో విశ్వాసం పెరుగుతోంది. అయితే నిర్మాణ సామగ్రిపై తగ్గే జీఎస్టీ భారాన్ని.. ఆమేరకు డెవలపర్లు ప్రాపర్టీ కొనుగోలుదారులకు బదలాయిస్తే గనక రానున్న దసరా, దీపావళి పండుగ సీజన్ కస్టమర్లలో రెట్టింపు జోష్ నిండుకుంటుంది. – సాక్షి, సిటీబ్యూరో

నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపు..

నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగులు వంటి పలు నిర్మాణ సామగ్రి ధరలపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40–45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుంది. తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిపై అయ్యే ఖర్చులో డెవలపర్‌కు 10–15 శాతం వరకు ఆదా అవుతుంది. ఫలితంగా మొత్తం ఇంటి నిర్మాణ వ్యయం 4–6 శాతం వరకు ఖర్చు తగ్గుతుంది. అయితే ఈ తగ్గింపును డెవలపర్లు గృహ కొనుగోలుదారులకు బదలాయిస్తారా అనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న.





కన్‌స్ట్రక్షన్ ఫైన్

నిర్మాణ సామగ్రి ధరలపై జీఎస్టీ తగ్గించిన కేంద్రం

నిర్మాణ పనులు వేగవంతం..

జీఎస్టీ గతంలో మాదిరిగా ఐదు పన్ను శ్లాబులతో గందరగోళంగా లేకుండా రెండు రకాల ట్యాక్స్ ఫ్రేమ్‌వర్క్‌లను కేంద్రం తీసుకొచ్చింది. దీంతో ప్రాపర్టీ కొనుగోలుదారుల్లో పన్ను చిక్కులు తొలుగుతాయి. స్థిరాస్తి రంగంలోకి మరిన్ని సంస్థాగత పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఇన్‌పుట్ ఖర్చులు తగ్గుతుండటంతో ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతమవడంతో పాటు కొత్త ప్రాజెక్ట్‌ల లాంచింగ్స్‌కు డెవలపర్లు ఆసక్తి చూపిస్తారు. ప్రస్తుతం దేశంలో పట్టణ మార్కెట్లలో దాదాపు కోటి బడ్జెట్ గృహాల కొరత ఉంది. 2030 నాటికి ఈ సంఖ్య 2.5 కోట్లకు చేరుతుంది. ఇలాంటి సమయంలో కేంద్రం జీఎస్టీ తగ్గింపు చేయడం బడ్జెట్ గృహాలకు పెద్ద ఉపశమనం.



ఏ విభాగంలో ఎంత ప్రయోజనమంటే?

- గృహ విభాగం: సిమెంట్‌పై జీఎస్టీ తగ్గింపుతో నిర్మాణ ఖర్చులు 3–5 శాతం మేర తగ్గుతాయి. ముఖ్యంగా రూ.40 లక్షల కంటే తక్కువ ధర ఉండే చౌక గృహాలను నిర్మిస్తున్న డెవలపర్లకు నగదు ప్రవాహం, మార్జిన్లు పెరుగుతాయి. దీంతో ఈ విభాగంలోని బిల్డర్లకు గణనీయమైన ఉపశమనం కలుగుతుంది. ఇప్పటి వరకు నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ భారం కారణంగా అందుబాటు గృహాలను నిర్మించేందుకు డెవలపర్లు ఆసక్తి చూపించలేదు. దీంతో మొత్తం కొత్త గృహాల సరఫరాలో అఫర్డబుల్ హౌసింగ్ వాటా 2019లో 40 శాతంగా ఉండగా.. 2025 తొలి అర్ధభాగం నాటికి ఏకంగా 12 శాతానికి పడిపోయింది. అలాగే విక్రయాలలో ఈ విభాగం వాటా 2019లో 40 శాతంగా ఉండగా.. ఇప్పుడది 18 శాతానికి తగ్గింది. తాజాగా కేంద్రం జీఎస్టీ సవరణతో నిర్మాణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అయితే ఈ తగ్గింపు వ్యయాలను డెవలపర్లు గృహ కొనుగోలుదారులకు బదలాయిస్తే గనక అందుబాటు గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

కార్యాలయ విభాగం

- ప్రస్తుతం కార్యాలయ విభాగం 12 శాతం జీఎస్టీ ఉంది. ఇన్‌పుట్ క్రెడిట్(ఐటీసీ) కూడా అందుకోవచ్చు. అయితే ఇటీవల పరిణామాలు పరిస్థితిని కొంచెం క్లిష్టతరం చేశాయి. వాణిజ్య ఆస్తుల లీజులపై ఐటీసీని తొలగించారు. దీంతో డెవలపర్లు ఇకపై ప్రాజెక్ట్ సంబంధిత వ్యయాలపై ఐటీసీని క్లెయిమ్ చేయలేరు. దీంతో కార్యాలయ స్థలాలు, ఇతర వాణిజ్య ఆస్తుల కార్యాచరణ ఖర్చులు, అద్దె ధరలు పెరిగే అవకాశం ఉంది. అలాగే రిజిస్టర్ చేయని వాణిజ్య ఆస్తుల అద్దెలు రివర్స్ ఛార్జ్ మెకానిజం(ఆర్సీఎం) ప్రకారం అద్దెదారులు 18 శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. దీంతో వాణిజ్య ప్రాపర్టీలను అద్దెకు తీసుకునేవారికి ఇది అదనపు భారమే.

రిటైల్ విభాగం



నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపు డెవలపర్లకు ఇన్‌పుట్ ఖర్చులను తగ్గిస్తుంది. దీంతో షాపింగ్ మాల్స్, రిటైల్ కాంప్లెక్స్‌ల నిర్మాణ ఖర్చులు తగ్గుతాయి కాబట్టి రిటైల్ ప్రాజెక్ట్‌ల సరఫరా పెరగడంతో పాటు రిటైల్ అద్దెలలో పోటీ పెరుగుతుంది. జీఎస్టీ సవరణ లాజిస్టిక్ ఖర్చులను కూడా తగ్గిస్తుంది. సరఫరా గొలుసులను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. అయితే వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించే రిటైల్ ప్రాపర్టీల అద్దె ఆదాయంపై మాత్రం జీఎస్టీ 18 శాతం చెల్లించాల్సిందే. ఇది ఆయా అద్దెదారులకు కాసింత ఇబ్బందే..

ఏ నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ ఎంతంటే?

- సిమెంట్, రెడీమిక్స్ కాంక్రీట్(ఆర్ఎంసీ): గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా.. 18 శాతానికి తగ్గింది.
- టైల్స్, ఇసుక, ఇటుకలు: 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గింది.
- రంగులు, వార్నిష్: 28 శాతం నుంచి 18 శాతం తగ్గింది.
- మార్బుల్, గ్రానైట్: 12 శాతం ఉండగా.. 5 శాతానికి తగ్గింది.





హై ఫై ఇంటీరియర్

నగటున ఒక్కో గృహానికి రూ.4.9 లక్షలు ఖర్చు

ఇల్లంటే నాలుగు గోడలు, పైకప్పు కాదు.. అంతకుమించి అంటున్నారు నేటి గృహ కొనుగోలుదారులు. ఇల్లంటే చిరునామా కాదు.. సమాజంలో గౌరవం, హోదాగా భావిస్తున్నారు. అందుకే ఇంటి ఎంపిక నుంచే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రాంతం నుంచి మొదలుపెడితే ధర, వసతులు, నాణ్యత, పొరుగు నివాసితులు వరకూ ప్రతీది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గృహ కొనుగోలు కోసం ఎంత ఖర్చు చేస్తున్నారో.. దాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకూ అంతే ఖర్చు పెడుతున్నారు. లగ్జరీ ఇంటీరియర్‌ను ఏరికోరి మరీ ఎంచుకుంటున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

నగరవాసులకు ఇంటీరియర్‌పై ఆసక్తి పెరిగిపోయింది. 60 శాతం కంటే ఎక్కువ మంది గృహ యజమానులు ఇంటీరియర్‌పై రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఖర్చు పెడుతున్నారు. అధిక డిమాండ్ ఉన్న లగ్జరీ గృహ విభాగంలో అయితే ఫుల్ హోమ్ డిజైన్లనే కొనుగోలుదారులు కోరుకుంటున్నారు. దీంతో హైదరాబాద్ హోమ్ ఇంటీరియర్ మార్కెట్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2030 నాటికి దీని విలువ 2.9 బిలియన్ డాలర్లకు చేరుతుందని మ్యాజిక్ బ్రిక్స్ నివేదిక తెలిపింది.



- వంట, పడక గదికి అత్యధికంగా మొగ్గు
- మొత్తం బడ్జెట్‌లో 40 శాతం ఈ గదులకే..
- ఇంటీరియర్ ఉన్న ఇళ్లకు విలువ అధికం

సగటున రూ.4.9 లక్షలు ఖర్చు..

హైదరాబాద్‌లో సగటున ఒక్కో గృహ యజమాని ఇంటీరియర్‌పై రూ.4.9 లక్షలు వెచ్చిస్తున్నారు. ఢిల్లీ, బెంగళూరు నగరాల కంటే మన దగ్గర ఇంటీరియర్‌పై చేసే ఖర్చు తక్కువే. దేశ రాజధాని ఢిల్లీలో సగటున రూ.5.8 లక్షలు, గార్డెన్ సిటీ బెంగళూరులో రూ.5.2 లక్షలు వెచ్చిస్తున్నారు.

వంట, బెడ్ రూమ్‌కు ఇంటీరియర్ మస్ట్..

ఇంటిలో గదిని బట్టి ఇంటీరియర్ డిజైన్, ట్రెండ్‌లను కస్టమర్లు ఎంపిక చేస్తున్నారు. వంటగది, పడక గదికి తప్పనిసరిగా ఇంటీరియర్ ఉండాల్సిందేనని గృహ యజమానులు చెబుతున్నారు. ఇంటీరియర్‌పై ఖర్చు చేసే మొత్తంలో 40 శాతం వ్యయం కిచెన్, బెడ్‌రూమ్ ఇంటీరియర్ కోసమే వెచ్చిస్తున్నారు. గదుల వారీగా చూస్తే.. పడక గది ఇంటీరియర్‌కు సగటున రూ.1.7 లక్షలు, వంట గదికి రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇంటిలో దుస్తులు, వస్తువులు, పాత్రల నిల్వకు యజమానులు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నారు. అందుకే వార్డ్‌రోబ్, కిచెన్‌లో క్యాబినెట్స్ కోసం ఇంటీరియర్ తప్పనిసరి అంటున్నారు. మొత్తం ఇంటీరియర్ వ్యయంలో వార్డ్‌రోబ్, క్యాబినెట్స్ వ్యయం 60 శాతం వరకు ఉంటుంది.



ఇంటి విలువ 70 శాతం అధికం

అందమైన ఇల్లు ఎవరినైనా ఆకర్షిస్తుంది. ఇంటీరియర్ బాగుంటే ఇంటి విలువ కూడా పెరుగుతుంది. సాధారణ రీసేల్ ప్రాపర్టీలతో పోలిస్తే డిజైన్ ఇంటీరియర్ ఉన్న ఆస్తుల రీసేల్ వ్యాల్యూ 70 శాతం వరకు పెరుగుతుంది. అలాగే 45 శాతం అధిక అద్దెలను అందిస్తుంది. నగర నివాస మార్కెట్‌లో 95 శాతం వాటా 2, 3 బీహెచ్‌కే యూనిట్లదే. 750 చ.అ. నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉండే ఈ మధ్య తరగతి గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది. రూ.2–5 కోట్ల ధర ఉన్న ప్రాపర్టీలు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి.

క్లుప్తంగా...

ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులు

మంత్రి దామోదర



వటపల్లి(అందోల్): రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఆరోగ్య కార్డులను అందజేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ఆయన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అల్మాయిపేట లక్ష్మీదేవి గార్డెన్‌లో శుక్రవారం జరిగిన నియోజకవర్గస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అందోల్ నియోజకవర్గంలో ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు ఉపాధ్యాయులు హెల్త్ కార్డు ప్రస్తావన తీసుకురాగా మంత్రి స్పందించారు. ప్రతీ ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి హెల్త్ కార్డు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో.. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆర్డీవో పాండు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీలవి రాక్షసానందం

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: గ్రూప్ 1 పరీక్షల రద్దు అంశంపై బీఆర్‌ఎస్, బీజేపీ రాక్షసానందం పొందుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ అన్నారు. ఆయన శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదం అయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం 65 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని వివరించారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ అంశంపై న్యాయస్థానంలో సరిగ్గా ప్రాజెక్ట్ చేయడంలో.. ఎక్కడో లోపం జరిగిందన్నారు. కోర్టు నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలన్నారు. న్యాయపరమైన అంశాలను అధిగమించి ముందుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నిరుద్యోగులు ఆందోళన చెందనక్కర్లేదని కోరారు. ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో వివరాలు సేకరించి.. జాబ్ క్యాలెండర్ ప్రకటించి.. నోటిఫికేషన్లు వేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి పొన్నం తెలిపారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్, కేబుల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. శనివారం ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిన్నస్థాయి కేబుల్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు బీజేపీ తరఫున మద్దతు ప్రకటించారు. శుక్రవారం రాంచందర్‌రావును ఆయన నివాసంలో తెలంగాణ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిన్నస్థాయి కేబుల్ ఆపరేటర్స్ కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించకుండా ఇంటర్నెట్ కేబుల్స్ కట్ చేయడం సరి కాదన్నారు. రామంతపూర్‌లో కరెంట్‌షాక్ దుర్ఘటన జరిగిందని, ఇందుకు మొత్తం ఇంటర్నెట్ వైర్లు కత్తిరించి ఆపరేటర్లను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. లక్షా 50 వేల మంది కేబుల్ ఆపరేటర్స్, సిబ్బంది ఉన్న ఈ పరిశ్రమపై అనేక కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం తరహాలో ఆప్టిక్ ఫైబర్ సౌకర్యాలను కేబుల్ ఆపరేటర్స్‌కు అందిందించాలన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించండి

మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడాది కాలంగా బిల్లులు, వేతనాలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నరకం చూపిస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఆందోళన చెందవద్దని, డిమాండ్లు నెరవేరేంత వరకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వరంగల్ జిల్లాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 'మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పట్ల రేవంత్ ప్రభుత్వం కర్కషంగా, కఠినంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం. పెండింగ్ బిల్లులు, వేతనాల కోసం కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణం. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను మధ్యాహ్న భోజన పథకానికి దూరం చేస్తే వారి పరిస్థితి ఏంటి? అప్పులు చేసి మరీ విద్యార్థులకు భోజనాలు పెట్టిన వారి ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తీర్చాలి'అని డిమాండ్ చేశారు. యూరియా కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన విలేకరులపై ఖమ్మం పోలీసులు అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని మండిపడ్డారు.

ప్రజాగళాన్ని వినిపించే పత్రికలపై కక్ష సాధింపా?

సాక్షి మీడియాపై కేసులను ఖండించిన మంత్రి పొన్నం, ఎంపీ రఘునందన్ | ఇలాంటి కేసులు చెల్లవు: సీనియర్ అడ్వొకేట్ ఎల్.రవిచందర్ | పార్టీ నేత ప్రెస్‌మీట్ వార్తను ప్రచురిస్తే ఎడిటర్‌పై కేసులా?: జర్నలిస్టు నేత విరాహత్ అలీ

సాక్షి, హైదరాబాద్/హుస్నాబాద్/జిన్నారం (పటాన్‌చెరు): ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న పత్రికలపై ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న దాష్టీకం, కక్ష సాధింపు ధోరణిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం నేరమా? అని వివిధ పార్టీల నాయకులు, న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలను లేవనెత్తే పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం సరికాదని ఖండించారు. ఏపీ ప్రభుత్వ కక్ష సాధింపును తప్పుబట్టారు. సాక్షి ఎడిటర్‌పై 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం దారుణమని ఖండించారు.



పత్రికా స్వేచ్ఛకు భంగమే..



ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు ఎక్కడా భంగం కలగొద్దు. పత్రికలకు స్వేచ్ఛ ఉంది. సాక్షి పత్రికా సంపాదకుడు ధనంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం సరి కాదు. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం పత్రికా వ్యవస్థ. రాజకీయ కక్షలు, కారుణ్యాలు నాయకుల మధ్య, పార్టీల మధ్య ఉండాలి. అందుకే కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణను కాపాడాలని కోరుతోంది. 70 ఏళ్ల నుంచి ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ జరగలేదు. పత్రికలకు సంబంధించి స్వేచ్ఛా వాతావరణం ఉండాలి. పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నాం.

– మంత్రి పొన్నం ప్రభాకర్

మీడియాపై దాడి సరికాదు



ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి'దినపత్రికపై జరుగుతున్న దాడులు సరి కాదు. రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల పక్షాన నిలబడే మీడియాపై ఇలాంటి దాడులను ఖండిస్తున్నాం. ఆరోపణలుంటే చట్టపరంగా విచారణ జరపాలే తప్ప సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిపై కక్షసాధిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేయడం ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛను హరించడమే.

– రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ

ఇది పత్రికల గొంతు నొక్కడమే..



ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారంటూ సాక్షి పత్రిక, చానల్‌పై కేసు నమోదు చేశారు. పత్రికలపై ఇలాంటి కేసులు పెట్టడం చెల్లదు. ఇటీవలే సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు, సూచనలు జారీ చేసింది. రాజకీయ ప్రేరేపితంగా ఇలా ఇష్టం వచ్చినట్లు కేసులు నమోదు చేయడం మానుకోవాలని ప్రభుత్వాలకు హితవు పలికింది. ప్రతీ అంశంపై కేసు నమోదు చేయడం ప్రారంభిస్తే పాత్రికేయులు కార్యాలయాలకు కాదు. రోజూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలను రాజ్యాంగం ఎంతమాత్రం సమర్థించదు. రాష్ట్రంలోగానీ, కేంద్రంలోగానీ ప్రభుత్వాలను ప్రసన్నం చేసుకోవడం కోసం కొందరు అధికారులు, పోలీసులు ఇలాంటి కేసులు పెడుతుంటారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై కక్ష సాధింపు ధోరణి వాక్ స్వాతంత్రాన్ని దెబ్బతీయడమే. మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉంది.

– ఎల్.రవిచందర్, సీనియర్ అడ్వొకేట్, తెలంగాణ, ఏపీ హైకోర్టులు

కూటమి సర్కారు తీరు ఆక్షేపణీయం



పత్రికల గొంతు నొక్కే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపణీయం. ఒక పార్టీ నాయకుడు విలేకరుల సమావేశం నిర్వహించి చేసిన వ్యాఖ్యలను 'సాక్షి'లో ప్రచురిస్తే అందుకు ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం ఏంటి? ఇదెక్కడి సంప్రదాయం? ప్రజా సమస్యలు, ప్రతిపక్షాల వాయిస్‌ను పత్రికలో ప్రచురిస్తే కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉన్న పక్షంలో ఆ వార్తకు సంబంధించి ఖండన లేదా వివరణ ఇచ్చే అవకాశం ఉన్నా.. దానిని వినియోగించుకోకపోవడం అన్యాయం. అధికారం ఉందని తన సిబ్బందితోనే ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యం కాదు. ఇలాంటి సంఘటనలను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రజాస్వామ్యంలో పత్రిక వ్యవస్థ నాలుగవ స్థంభం అన్న విషయాన్ని విస్మరించొద్దు. ఇలాంటి సంఘటనలు ప్రభుత్వ విలువను దిగజారుస్తాయన్న విషయాన్ని ప్రభుత్వంలోని వారు గుర్తించాలి. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డిపై నమోదు చేసిన కేసును వెంటనే ఎత్తివేయాలి.

– కె.విరాహత్ అలీ, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు

జర్నలిస్టులను వేధించొద్దు

సర్కార్ అక్రమాలను బయటపెడితే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరైంది కాదు. రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగించాలి. ఆర్టికల్ 19(1)ఏ మీడియాకు స్వేచ్ఛ కల్పిస్తోంది. ప్రజాసమస్యలను వెలికితెస్తే తప్పేంటి? ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే నేరమా? సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసుల్ని సమాజం హర్షించదు. పత్రికల్లో వచ్చిన వార్తలు, చానళ్లలో ప్రసారాల పట్ల ఏవైనా అభ్యంతరాలుంటే భారత ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చు. చట్టం తనపని తానుచేస్తే నష్టం లేదు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటేనే సమస్య. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అన్నిరకాల కేసులను వెంటనే రద్దుచేయాలి. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంపై నమ్మకముంచాలి. దేశ రాజ్యాంగాన్ని దాని పరిధిలోని వ్యవస్థలను గౌరవించాలి. మీడియా మెజారిటీ వర్గమైన ప్రజల తరఫున పనిచేయడాన్ని పోలీస్ కేసులు అడ్డుకోలేవు. వెంటనే ఏపీ సర్కార్ సాక్షి ఎడిటర్‌పై కేసులను ఎత్తివేయాలి.

– బి.బసవపున్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడబ్ల్యూజేఎఫ్

పాత్రికేయుల హక్కులను గౌరవించాలి

పోలీసులు చట్టప్రకారం, న్యాయప్రకారం విధులు నిర్వహించాలి. ప్రజాస్వామ్యంలో ఏదైనా పత్రికలో నిరాధార లేదా అప్రియమైన వార్త వస్తే దానికి ముందుగా రిజాయిండర్ ఇవ్వాలి. అలా కాకుండా పరిధి దాటి పత్రికాస్వేచ్ఛను హరించేలా ఎడిటర్, బ్యూరోచీఫ్, రిపోర్టర్లపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి నోటీసులివ్వడం సరికాదు. పోలీసులే నేరుగా పత్రికా కార్యాలయాలకు, ఎడిటర్ నివాసానికి వచ్చి సోదాలు జరపడం, నోటీసులిచ్చి ఎత్తుకెళ్లడం వంటివి సరికాదు. పాత్రికేయులకు ఉండే ప్రజాస్వామ్యహక్కులను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– కప్పర ప్రసాదరావు,తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్, అధ్యక్షుడు

అప్రజాస్వామికం

పత్రిక సంపాదకుడు, విలేకరులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసి నోటీసులివ్వడం రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనం. ఎడిటర్‌పై కేసులు పెట్టడం, నోటీసులు ఇవ్వడం ఖండనార్హం. వార్తాపత్రికల్లో వచ్చిన వార్తల్లో ఏవైనా అసత్యాలున్నాయని భావిస్తే ముందుగా ఆ వార్తపై స్పష్టత, వివరణ కోరాలి.

– ఎం.ఎస్.హెచ్.హాష్మీ, ఉమ్మడి ఏపీడబ్ల్యూజేఎఫ్ మాజీ అధ్యక్షుడు

'సాక్షి'పై ఏపీ సర్కార్ కక్ష సాధింపు

తీవ్రంగా ఖండించిన ఢిల్లీ టీయూడబ్ల్యూజే

సాక్షి, న్యూఢిల్లీ: తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే అక్కసుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సాక్షి'మీడియా సంస్థపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఢిల్లీలోని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండించింది. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు ఇతర జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనని యూనియన్ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు ఢిల్లీ టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు నాగిళ్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి కొన్నోజు రాజు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రజాస్వామ్యంలో వేధింపులు, అక్రమ కేసులకు తావులేదు. కేవలం తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే నెపంతో సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం, విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్లకు పిలిపించి వేధించడం సరికాదు. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను రక్షించాల్సిన ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సుప్రీంకోర్టు సైతం అనేక సందర్భాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాలని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి, జర్నలిస్టులపై పెట్టిన కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి'అని టీయూడబ్ల్యూజే నేతలు డిమాండ్ చేశారు.

ఆడిటింగ్‌లోనూ ఏఐ

ఇంటోసాయ్ సదస్సులో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఆడిటింగ్‌లోనూ కృత్రిమ మేధ (ఏఐ)ని వినియోగించుకోవాలని, పౌరులే కేంద్రంగా జరిగే పరిపాలనతో పాటు ఆడిటింగ్‌లో పారదర్శకత కోసం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ప్రధానం కాబోతోందని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ సుప్రీం ఆడిట్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఇంటోసాయ్) 34వ వార్షిక సమావేశంలో నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రపంచంలోని అన్ని దేశాల మధ్య సాంకేతిక పరిజ్ఞాన పంపిణీ అవసరమని గత నాలుగు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో తీర్మానించారు. ఈ సదస్సు ముగింపు సందర్భంగా శుక్రవారం భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కె. సంజయ్‌మూర్తి మాట్లాడుతూ.. పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి సదస్సులో పాల్గొన్న సంస్థలు ఆసక్తిని ప్రదర్శించాయని ప్రశంసించారు. నైపుణ్యాలను పంచుకోవడం, సహకారాన్ని కొనసాగించడం ద్వారా డిజిటల్ యుగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే వీలు కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో 29 దేశాలకు చెందిన సుప్రీం ఆడిట్ సంస్థలు, (ఎస్ఏఐ), అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థలు, స్థానిక నిపుణులు పాల్గొన్నారు.

దిగొచ్చిన కాంట్రాక్టర్లు

ఎట్టకేలకు ఉచిత చేప పిల్లల పంపిణీకి బిడ్స్ దాఖలు

సాక్షి, హైదరాబాద్ : ఉచిత చేపపిల్లల పంపిణీకి.. ఒకటి కాదు.. రెండు కాదు.. మూడోసారికి కాంట్రాక్టర్లు దిగొచ్చారు. ప్రభుత్వం ఆహ్వానించిన టెండర్లకు ఆలస్యంగా బిడ్స్ దాఖలు చేసి మమ అనిపించారు. 33 జిల్లాల్లో 80 వరకు దాఖలు చేసిన కాంట్రాక్టర్లు.. కొన్ని జిల్లాల్లో మాత్రం ఒక్కొక్క బిడ్ దాఖలు చేశారు. అధికారులు టెక్నికల్ బిడ్స్ ఓపెన్ చేసే పనిలో పడ్డారు. అతిత్వరలో అన్ని పూర్తిచేసి ఫైనాన్షియల్ బిడ్స్ కూడా పూర్తి చేస్తామని మత్స్యశాఖ అధికారులు అంటున్నారు. అయితే మూడు నాలుగు రోజుల పాటు పాండ్స్ ను తనిఖీ చేస్తారు. గతంలో కాంట్రాక్టర్లపై అవినీతి ఆరోపణలు ఉన్నాయా అనే విషయాలను పరిశీలిస్తారు. ఈ నెలాఖరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 26,326 నీటి వనరుల్లోకి చేప పిల్లలను వదిలేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రూ.93.62 కోట్ల వ్యయంతో 84.62 కోట్ల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం భావించింది. గతంలో జరిగిన అవినీతిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల ఆదేశించారు.

ఎమ్మెల్యేల చోరీ కాకపోతే మరేంటి?

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీలో చేరలేదంటారా?
- గ్రూప్ 1 పరీక్షల అవకతవకలపై బీజేపీ మౌనం ఎందుకు
- మున్సిపల్ శాఖను రేవంత్ కాసుల వేటకు వాడుకుంటున్నారు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో 'ఓటు చోరీ'గురించి నీతులు చెపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. తెలంగాణలో జరుగుతున్న 'ఎమ్మెల్యేల చోరీ'గురించి ఎందుకు మాట్లాడటం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల చోరీపై రాహుల్ గాంధీ సిగ్గుపడాలని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ప్రక్రియలో రాహుల్‌గాంధీ భాగస్వామి అయ్యారన్నారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఇప్పుడు తాము పార్టీ మారలేదంటూ చేస్తున్న వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించాలన్నారు. పార్టీ మారిన ప్రతి ఎమ్మెల్యేతో రాహుల్ గాంధీతో సహా అనేక మంది కాంగ్రెస్ నేతలు ఫొటోలు కూడా దిగారన్నారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు గుర్తు పట్టగలరా'అంటూ కాంగ్రెస్ కండువాలు వేసుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేల ఫొటోలను ఆయన విడుదల చేశారు.

చోటే భాయ్‌కు బీజేపీ పహారా

చోటే భాయ్ రేవంత్‌రెడ్డికి చీమ కూడా కుట్టకుండా బడే భాయ్ పార్టీ బీజేపీ పహారా కాస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగి ఏకంగా పరీక్షనే రద్దు చేయాలని హైకోర్టు చెప్పినా రాష్ట్ర బీజేపీ స్పందించడం లేదన్నారు. డబ్బులకు ఉద్యోగాలు అమ్ముకున్నారన్న ఆరోపణల మీద బీజేపీ మౌనానికి కారణమేంటో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ అంశంపై సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన బీజేపీ నేతలు గ్రూప్ –1 కుంభకోణం మీద ఎందుకు విచారణ కోరడం లేదని నిలదీశారు. రేవంత్–బీజేపీ రహస్య మైత్రికి ఇది తాజా ఉదాహరణ మాత్రమే అని కేటీఆర్ పేర్కొన్నారు.



కాగా, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంతో హైదరాబాద్‌లో తెరిచి ఉంచిన మ్యాన్ హోల్‌లో పాప పడి అదృష్టవశాత్తూ బయట పడిందన్నారు. తప్పును దిద్దుకోవాల్సిన హైడ్రా, జీహెచ్ఎంసీ, మున్సిపల్ శాఖలు దుమ్మెత్తి పోసుకుంటున్నాయని మండిపడ్డారు. మున్సిపల్ శాఖను కేవలం కాసుల వేటకు వాడుకోవడంలో రేవంత్ బిజీగా ఉన్నారని కేటీఆర్ విమర్శించారు.

నేడు గద్వాల పర్యటనకు కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శనివారం గద్వాల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ నివాసం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులతో కలిసి గద్వాల నియోజకవర్గానికి కేటీఆర్ బయల్దేరుతారు. సాయంత్రం 4 గంటలకు గద్వాల నియోజకవర్గం కిష్టారెడ్డి బంగ్లా వద్ద జిల్లా నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలుకుతారు. సాయంత్రం 5 గంటల వరకు కిష్టారెడ్డి బంగ్లా నుంచి తేరు మైదానం వరకు జరిగే ర్యాలీలో కేటీఆర్ పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు తేరు మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా గద్వాల మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

మేం కప్పిన కండువాలు వాళ్లు అప్పుడే తీసేశారు

- పార్టీ మారలేదని ఆ ఎమ్మెల్యేలు చెప్తున్నారు
- కోర్టు, స్పీకర్ నిర్ణయం తీసుకుంటారు.. కేటీఆర్‌కెందుకు?
- మంత్రి జూపల్లి వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: తాము కప్పిన కండువాలను ఆ ఎమ్మె ల్యేలు అప్పుడే తీసేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు చిన్న పిల్లలు కాదని, వారు ఒకరు చెపితే చేసేవారు కాదని, ఒకరు తినిపిస్తే తినేవాళ్లు కాదని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, తూడి మేఘారెడ్డిలతో కలసి ఆయన మాట్లాడుతూ తాము పార్టీ మారలేదని, అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశామని ఆ 10 మంది ఎమ్మెల్యేలు చెపుతున్నారని అన్నారు. ఆ ఎమ్మెల్యేల వివరణపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కు, కోర్టులకు ఉందని, మధ్యలో కేటీఆర్‌కు ఎందుకని ప్రశ్నించారు. సిగ్గుందా.. అనే పదం ఆయనకు ఇప్పుడు గుర్తుకొచ్చిందా? అని నిలదీశారు. గతంలో 84 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పక్షాన గెలిచిన తర్వాత కూడా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ఆ సిగ్గు గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబ సభ్యులు ఎన్నో సిగ్గులేని పనులు చేశారని ఆరోపించారు. తన సోదరి కవిత చేస్తున్న ఆరోపణలపై కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని, పెగ్గులు పోసేవాళ్లకు రాజ్యసభ సభ్యత్వం ఇచ్చినప్పుడు కేటీఆర్‌కు సిగ్గు అనే పదం గుర్తుకు రాలేదా అని ఎద్దేవా చేశారు. తాను మాట్లాడిన అంశాన్ని కావాలని తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. గెలిచినా, గెలవకపోయినా తాను పనులు చేశానని, ఎప్పుడూ హామీలివ్వలేదని, ఇదే విషయాన్ని తాను చెప్తే తానేదో ఓడిపోతానని చెప్పినట్టు ప్రచారం చేస్తున్నారని మంత్రి జూపల్లి మండిపడ్డారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల వివరణలు

ఫిర్యాదుదారులకు

మూడురోజుల్లోగా సమాధానం ఇవ్వాలన్న స్పీకర్


సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరి ఫిరాయింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అంశం మరో అంకానికి చేరుకుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు స్పీకర్ గత నెలలో నోటీసులు జారీ చేశారు. స్పీకర్ నోటీసులకు స్పందిస్తూ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ మినహా మరో ఎనిమిదిమంది తమ వివరణలు అందజేశారు. ఫిరాయింపునకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న 8 మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను స్పీకర్ తనకు ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు పంపించారు. వాటిపై మూడు రోజుల్లోగా తిరిగి సమాధానం ఇవ్వాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు.

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఇచ్చిన వివరణను బీఆర్‌ఎస్ విప్ కేపీ వివేకానంద్‌కు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), డాక్టర్ సంజయ్ (జగిత్యాల) ఇచ్చిన వివరణను ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి పంపించారు.
- గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), కాలె యాదయ్య (చేవెళ్ల) ఇచ్చిన వివరణను ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు, అరికపూడి గాంధీ (శేరిలింగంపల్లి), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్) ఇచ్చిన వివరణను ఎమ్మెల్యే డాక్టర్ కె.సంజయ్‌కి పంపించారు.
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పీకర్‌కు ఇచ్చిన వివరణను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అందజేశారు.

తాము కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం తమ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రిని కలిసినట్టు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చినట్టు తెలిసింది. కాగా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలపై బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్టు సమాచారం. బెంగళూరు పర్యటనలో ఉన్న స్పీకర్ ఈనెల 16న హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం నుంచి వచ్చే అభ్యంతరాలు, సమాధానాలపై తదుపరి కార్యాచరణను చేపట్టే అవకాశముంది.

ఆనందో 'బ్రహ్మ'..!

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



బ్రహ్మానందం ఆత్మకథ పుస్తకంను ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు



సాక్షి, న్యూఢిల్లీ: మొత్తం 1200 చిత్రాల్లో నటించి యావత్ ప్రజానీకాన్ని తన హాస్యంతో ఇప్పటికీ నవ్విస్తున్న నటుడు బ్రహ్మానందం అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. హాస్యనటుడు బ్రహ్మానందం రచించిన 'మీ అండ్ నేను'ఆత్మకథను ఢిల్లీలోని ఆఫీసర్స్ క్లబ్‌లో వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. బ్రహ్మానందం నటనలో నిబద్ధత, పద్ధతులను పాటించిన వ్యక్తి అని అన్నారు. ఆయన వెలువరించిన డైలాగులు అత్యంత ఆనందాన్ని ఇస్తాయన్నారు. అందుకే ఆయన 'ఆనందో బ్రహ్మ'అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ప్రధాని మోదీ లాంటి వారు.. ఎన్నో కష్టాలు పడి పైకి వచ్చారని, తన ఆత్మకథను రాసేందుకు వీరంతా స్ఫూర్తి అయ్యారని బ్రహ్మానందం గుర్తు చేసుకున్నారు. తన ప్రయాణంలో అనేక కీలకమైన ఘట్టాలను రాసినట్లు చెప్పారు.

రూ.100 కోట్ల ఆ స్థలంపై కౌంటర్ వేయండి

జూబ్లీహిల్స్‌లోని 2,000 గజాల స్థలంపై జీహెచ్ఎంసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద రూ.100 కోట్ల విలువైన స్థలం విషయంలో కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రా, జీహెచ్ఎంసీని హైకోర్టు ఆదేశించింది. 2,000 గజాల స్థలానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. అనధికారిక ప్రతివాది జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీని కూడా కౌంటర్ దాఖలు చేయాలని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. 1991లో ఆమోదించిన లేఅవుట్ ప్రకారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద 4.66 ఎకరాల స్థలం జీహెచ్ఎంసీ పరిధిలో ఉంది. ఇందులో పార్కు, టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని సత్యనారాయణ అనే వ్యక్తి కబ్జా చేసి 2002 నుంచి నర్సరీ నడుపుతున్నారనేది జీహెచ్ఎంసీ ఆరోపణ. ఇటీవల హైడ్రా సహకారంతో ఈ స్థలాన్ని జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకుంది. కార్పొరేషన్ స్థలం అంటూ చుట్టూ బోర్డులు పాతింది. దీనిని సవాల్ చేస్తూ సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. హైడ్రా స్టాండింగ్ కౌన్సిల్ మహేశ్వర్, పవన్ విచారణకు హాజరయ్యారు. నిబంధనల మేరకు పిటిషనర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. వారు సమర్పించిన డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాత ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేవని తేలిందన్నారు. దీంతో స్థలాన్ని అప్పగించాలని మరోసారి నోటీసులు జారీ చేశామని, ఆ తర్వాతే చర్యలు చేపట్టామన్నారు. జూబ్లీహిల్స్ సొసైటీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆ భూమిని ప్రజావసరాలకు వినియోగించుకునేందుకు సొసైటీకి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో తమను కూడా ప్రతివాదుల జాబితాలో చేర్చాలని జీహెచ్ఎంసీ కౌన్సిల్ న్యాయమూర్తిని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడిగా దామోదర్ రెడ్డి

దామోదర్ రెడ్డి | సుంకరి భిక్షం

సాక్షి, హైదరాబాద్: పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షునిగా పుల్గం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుంకరి భిక్షం గౌడ్ ఎన్నికైనట్టు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకూ సంఘం అధ్యక్షునిగా ఉన్న గుండు లక్ష్మణ్ పదవీ విరమణతో ఎన్నిక అనివార్యమైంది. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశానికి.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డితో పాటు 33 జిల్లా ప్రధాన కార్యదర్శులు కూడా హాజరయ్యారు.



జోయాలుక్కాస్ షోరూంను ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ. చిత్రంలో జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోని

జోయాలుక్కాస్ షోరూం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: సంప్రదాయం నుంచి సమకాలీన డిజైన్లతో నగలను అందరూ మెచ్చేలా జోయాలుక్కాస్ షోరూం ఎంతగానో ఆకట్టుకుంటుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఏఎస్ రాజు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జోయాలుక్కాస్ రెండో షోరూమ్‌ను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోయాలుక్కాస్ జువెలరీ షోరూమ్‌లో ప్రపంచ స్థాయి ఆభరణాలు అందమైన డిజైన్లతో అందరికీ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆంథోని జేఎస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ జార్జ్, రిటైల్ హెడ్ రాజేశ్ కిషన్, మార్కెటింగ్ హెడ్ అనిష్ వర్గీస్, రీజనల్ మేనేజర్ సునీల్ పి.ఎస్. తదితరులు పాల్గొన్నారు.

రూ.2,700 కోట్ల స్థలంపై గురి..

'క్యాంపు' భరతం పట్టేస్తా!

కర్నూలు బీ, సీ క్యాంపు క్వార్టర్స్‌పై ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల కన్ను

మినీ క్రికెట్ స్టేడియం, లీజు పేరుతో అత్యంత ఖరీదైన స్థలాన్ని కాజేసే కుట్ర



చుట్టూ కాంక్రీట్ కట్టడాల నడుమ ఫొటోలో ఆకుపచ్చగా కనిపిస్తున్న ఈ ప్రాంతం కర్నూలులోని బీ.సీ క్యాంపు క్వార్టర్స్. కర్నూలు రాజధానిగా ఉన్నప్పుడు అధికారులు నివాసం ఉండేందుకు ప్రభుత్వం ఏ, బీ, సీ క్వార్టర్లను నిర్మించింది. బీ, సీ క్యాంపు క్వార్టర్స్‌లో దాదాపు వంద ఏళ్ల నాటి భారీ వృక్షాలు ఉన్నాయి. కిక్కిరిసిన నగరానికి ప్రాణ వాయువు అందించడంలో వీటి పాత్ర చాలా కీలకం. కర్నూలులోనే అత్యధికంగా చెట్లు ఉన్న ఈ ప్రాంతం కూడా ఇదే. అక్కడకు వెళితే ఆ చల్లదనానికి మనసుకు ఎంతో హాయిగా అనిపిస్తుంది. అలాంటి భారీ వృక్షాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా తొలగించేందుకు రంగం సిద్ధమైంది. బీ, సీ క్వార్టర్లను కూలగొట్టి టీడీపీ జిల్లా కార్యాలయానికి స్థలంతోపాటు మినీ క్రికెట్ స్టేడియం, మల్టీప్లెక్స్, స్టార్ హోటల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు కీలక ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో చకచకా మంత్రాంగం జరుగుతోంది. దాదాపు 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ క్యాంపు క్వార్టర్స్ విలువ దాదాపు రూ.2,700 కోట్లు! కర్నూలు చరిత్రలోనే దీన్ని అతి పెద్ద దోపిడీగా అభివర్ణిస్తున్నారు. బీ, సీ క్యాంపు స్థలాలను ఖాళీ చేయాలని అందులో ఉంటున్న వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చిన అధికారులు తాజాగా నీరు, విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.

సాక్షి ప్రతినిధి కర్నూలు: భాషా ప్రయుక్త రాష్ట్రాలలో భాగంగా ఏర్పాటైన ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా ఉంది. 1953 అక్టోబర్ 1 నుంచి 1956 అక్టోబరు 31 వరకూ కర్నూలే రాజధాని. అప్పట్లో అధికారులు నివాసం ఉండేందుకు ఏ, బీ, సీ క్వార్టర్లను నాటి ప్రభుత్వం నిర్మించింది. నగరంలో ఆ ప్రాంతాలను ఇప్పటికీ ఏ, బీ, సీ క్యాంపు అని వ్యవహరిస్తుంటారు. మొత్తం 1,090 క్వార్టర్లలో ప్రస్తుతం 953 ఉన్నాయి. ఇందులో 367 క్వార్టర్లలో అధికారికంగా కొందరు, 490 క్వార్టర్లలో అనధికారికంగా మరికొందరు నివాసం ఉంటున్నారు. కొన్ని శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ సెంటు రూ.30 లక్షలకుపైగా ఉంది. ప్రధాన రహదారి ప్రాంతంలోనైతే రూ.50 లక్షలుపైనే ఉంది. సగటున రూ.30 లక్షలు అనుకున్నా ఎకరా రూ.30 కోట్లు ఉంటుంది. ఈ లెక్కన మొత్తం 90 ఎకరాల విలువ రూ.2,700 కోట్లపైనే! నగర నడిబొడ్డున అత్యంత విలువైన ఈ ప్రాంతంలో 70 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిని తొలగించి ఈ స్థలాన్ని ప్రభుత్వం వినియోగించుకోవాలని, అపార్ట్‌మెంట్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆలోచించారు. ఆయన హఠాన్మరణంతో ఆ ప్రతిపాదన పట్టాలెక్కలేదు.

సర్కారు ఖరీదైన స్థలంపై టీడీపీ ప్రజాప్రతినిధుల కన్ను

బీ, సీ క్యాంపులోని క్వార్టర్లను తొలగించి మినీ క్రికెట్ స్టేడియం నిర్మించాలని మంత్రి టీజీ భరత్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. తక్కిన స్థలాలను లీజు పేరుతో కూటమి నేతలు గుప్పిట పట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో 33 ఏళ్ల లీజుకు తీసుకుని మల్టీప్లెక్స్, స్టార్ హోటల్స్, ఫంక్షన్‌హాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఇతర నిర్మాణాలు చేపట్టాలని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలుత 39 క్వార్టర్లను కూల్చేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు అందులో నివాసం ఉంటున్న వారికి నోటీసులు ఇచ్చారు. అనంతరం మిగతావారికి జారీ అయ్యాయి. కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఈ స్థలం కర్నూలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోకి వస్తుంది. తొలగించిన స్థలంలో 3–5 ఎకరాల్లో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేసి మిగతా 85–87 ఎకరాల స్థలాన్ని లీజు పేరుతో 33 ఏళ్లు దక్కించుకునేలా సిద్ధమయ్యారు. ఆ తర్వాత కూడా లీజుదారుడు కొనసాగాలని భావిస్తే మరో రెండు దఫాలు అంటే 66 ఏళ్లు వారి ఆధీనంలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అంటే లీజు పేరుతో 99 ఏళ్లు వారి ఆజమాయిషీలోనే ఉంటుంది. కర్నూలులో అత్యంత విలువైన స్థలం ఇదే కావడం గమనార్హం!

రూ.120 కోట్ల స్థలంలో టీడీపీ కార్యాలయం!

తెలుగుదేశం జిల్లా కార్యాలయం కోసం రెండు ఎకరాలను 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి కలెక్టర్ రంజిత్‌బాషాకు లేఖకు రాశారు. కర్నూలులో 'బీ' క్యాంపు మెయిన్ రోడ్డులోని ఖరీదైన స్థలాన్ని టీడీపీ కోరింది. ఇక్కడ సెంటు రూ.60 లక్షల వరకు ఉంది. ఈ లెక్కన టీడీపీ కోరుతున్న రెండు ఎకరాల విలువ రూ.120 కోట్లకుపైనే ఉంటుంది!

రెండు నెలలు గడువిద్దామన్నా..

క్వార్టర్లు ఖాళీ చేయించేందుకు కీలక ప్రజాప్రతినిధి ఐదు ప్రభుత్వ శాఖలను పురమాయించారు. పోలీసు, రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్తు, ఆర్ అండ్ బీ అధికారులను రంగంలోకి దించారు. ఈ నెల 8వతేదీ నుంచి అధికారులు నీరు, కరెంట్ సరఫరా నిలిపివేశారు. పండుగ వేళ తామంతా ఎక్కడికి వెళ్లాలి? పిల్లల చదువులు ఏం కావాలి? ఉన్నఫళంగా కరెంటు, నీరు ఆపేస్తే తాము ఏం చేయాలని అందులో ఉంటున్న కుటుంబాలు అవస్థ పడుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, కలెక్టరేట్, ఎన్టీఆర్ విగ్రహం వద్ద మూడు రోజులుగా ఆందోళనకు దిగినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రెండు నెలలు గడువిద్దామని కీలక ప్రజాప్రతినిధికి అధికారులు సర్దిచెప్పే యత్నం చేసినా వినలేదని చర్చించుకుంటున్నారు.

స్టేడియం కోసం ఇప్పటికే స్థలం సేకరించిన బీసీసీఐ..

కర్నూలులో భారీ క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం బీసీసీఐ ఇప్పటికే నేషనల్ హైవే సమీపంలో బాలసాయి స్కూలు పక్కన 16.40 ఎకరాలను సేకరించింది. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మించే వీలుంది. హైదరాబాద్–బెంగళూరు హైవే పక్కనే ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తవు. ఈ స్థలం ఉన్నప్పటికీ మళ్లీ మినీ క్రికెట్ స్టేడియం పేరుతో నగరం నడిబొడ్డున అత్యంత ఖరీదైన స్థలంపై కూటమి ప్రజాప్రతినిధులు కన్నేయడం గమనార్హం!

తప్పుడు సాక్ష్యాలు..

అసత్య ప్రచారాలు

సిట్ ద్వారా చంద్రబాబు కూటమి ప్రభుత్వ పన్నాగం

- ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచార కుతంత్రం
- నర్రెడ్డి సునీల్‌రెడ్డి కార్యాలయాల్లో సోదాల పేరుతో హైడ్రామా
- న్యాయవాదులను నాలుగు గంటలపాటు అడ్డుకున్న సిట్
- సోదాల సమయంలో ఓ ప్రైవేట్ వాహనం రాక
- ఆ వాహనంలోంచి బ్యాగ్‌లు, వస్తువులు కార్యాలయంలోకి చేరవేత!.. తద్వారా తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టించే యత్నం
- ప్రభుత్వ వ్యతిరేకతను కప్పి పుచ్చేందుకు విఫలయత్నాలు



సాక్షి, అమరావతి: మద్యం విధానంపై అక్రమ కేసులో కుట్రలు ఒక్కొక్కటిగా బెడిసి కొడుతుండటంతో చంద్రబాబు ప్రభుత్వం కొత్త కుతంత్రాలకు తెర తీస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించేందుకు సరికొత్త పన్నాగానికి పదును పెడుతోంది. అందులో తాజా అంకంగానే హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త నర్రెడ్డి సునీల్ రెడ్డి నివాసం, కార్యాలయాల్లో సోదాల పేరిట సిట్ హైడ్రామా నడిపింది. ముందస్తు పన్నాగంతోనే టీడీపీ అనుకూల ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచార రాద్ధాంతంతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. ఏకంగా సిట్ అధికారుల ద్వారానే తప్పుడు సాక్ష్యాలు సృష్టించేందుకు యత్నించడం విస్మయ పరిచింది. అయితే చంద్రబాబు ప్రభుత్వ ఈ తాజా కుట్ర కూడా బొల్తా కొట్టింది. కొండను తవ్వినంత హడావుడి చేసిన సిట్.. చివరికి అక్కడ ఎలుక కూడా లేదని తెలుసుకుని చేతులెత్తేసింది. వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేసేందుకు పన్నిన తాజా కుట్ర వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రైవేట్ వాహనం ఎందుకొచ్చినట్లు?

మద్యం అక్రమ కేసులో చంద్రబాబు ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్త నర్రెడ్డి సునీల్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు తెగబడింది. హైదరాబాద్, విశాఖపట్నంలోని ఆయన కార్యాలయాల్లో సిట్ అధికారులు సోదాల పేరుతో రాద్ధాంతం చేశారు. నిబంధనల ప్రకారం సోదాలు నిర్వహించేటప్పుడు న్యాయవాదులను అనుమతించాలి. కానీ సిట్ అధికారులు వారిని అనుమతించలేదు. దీని వెనుక తప్పుడు సాక్ష్యాలను సృష్టించే కుతంత్రం ఉన్నట్లు స్పష్టమైంది. సోదాల సమయంలోనే ఓ ప్రైవేట్ వాహనం అక్కడికి చేరుకుంది. ఆ వాహనంలో కొన్ని బ్యాగ్‌లు, ఇతర వస్తువులు ఉండటాన్ని చూసి సునీల్‌రెడ్డి తరఫు న్యాయవాదులు ప్రశ్నించారు. ఆ వాహనాన్ని ఎందుకు లోపలకు అనుమతిస్తున్నారని నిలదీసినా.. సిట్ అధికారులు సరైన సమాధానం చెప్పలేదు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించేందుకు అవసరమైన పత్రాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సిట్ అధికారులు సునీల్‌రెడ్డి కార్యాలయంలోకి చేర్చేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. వాటిని సోదాల సమయంలో ఆయన కార్యాలయంలో గుర్తించినట్లుగా కట్టు కథ వినిపించాలన్నది సిట్ అధికారుల ఉద్దేశం. ఆ వాహనంలోనే సిట్‌కు సంబంధం లేని ఓ ప్రైవేట్ వ్యక్తి ఉండటం గమనార్హం. ఆయన ఎవరని ఆరా తీయగా ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయంలో పని చేసే ఉద్యోగి అని తెలిసింది. అంటే టీడీపీ ఎమ్మెల్యే వర్గీయుడి ద్వారా తప్పుడు సాక్ష్యాలు సృష్టించేందుకు సిట్ అధికారులు ప్రయత్నించారని తేటతెల్లమైంది.

ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం

- సునీల్ రెడ్డి నివాసంలో సోదాల పేరుతో హైడ్రామా సాగించిన సిట్ అధికారికంగా మాత్రం ఎటువంటి సమాచారం వెల్లడించలేదు. కానీ తమకు అలవాటైన రీతిలో టీడీపీ అనుకూల ఎల్లో మీడియాకు లీకులు ఇచ్చింది. ఆ వెంటనే అవాస్తవాలు, అభూత కల్పనలతో ఎల్లో మీడియా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా అసత్య కథనాలు ప్రచురించింది. సునీల్ రెడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడని.. మద్యం వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని అవాస్తవ కథనాలతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు దుష్ప్రచారానికి తెగబడింది. అసలు అత్యంత సన్నిహితుడని ఎవర్ని అంటారో ఈనాడుకుగానీ, ఇతర టీడీపీ ఎల్లో మీడియాకు గానీ తెలుసా? అని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. అత్యంత సన్నిహితులు అంటే ఎలా ఉంటారు అంటే.. చంద్రబాబు–ఈనాడు ఎండీ కిరణ్ ఉన్నట్టుగా ఉంటారు. ఆంధ్రజ్యోతి–ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ 5 చానల్ చైర్మన్ బీఆర్ నాయుడు చంద్రబాబుకు అత్యంత సన్నిహితులు అవుతారు. ఎందుకంటే వారు చంద్రబాబుతో తరచూ కలుస్తూనే ఉంటారు. టీడీపీ అక్రమాలకు వత్తాసు పలకడం.. చంద్రబాబు ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటారు. న్యాయవాది అయిన సునీల్ రెడ్డి వ్యాపారవేత్తగా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గత పదేళ్లలో ఆయన ఆంధ్రప్రదేశ్‌కు నాలుగైదుసార్లు కూడా రాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా ఆయన ఏనాడూ రాజధానివైపు రానే లేదు. వైఎస్ జగన్‌ను కలిసిందీ కూడా లేదు. మరి సునీల్ రెడ్డి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడని టీడీపీ అనుకూల ఎల్లో మీడియా ఎలా సూత్రీకరిస్తుందని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. కేవలం టీడీపీ కూటమి ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు సిట్ ద్వారా డైవర్షన్ పాలిటిక్స్ సాగిస్తున్నారని, అందుకు ఎల్లో మీడియా వత్తాసు పలుకుతూ బురద చల్లుతోందన్నది స్పష్టమవుతోంది.

క్లుప్తంగా...

'జనతన' చీఫ్ సుజాత లొంగుబాటు!

- జోరుగా ప్రచారం.. నిర్ధారించని ఇరువర్గాలు



సుజాత (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాత అలియాస్ మైనక్క లొంగిపోయినట్టు ప్రచారం జరుగుతోంది. గతేడాది అక్టోబరులో సుజాతను పోలీసులు అరెస్ట్ చేసినట్టు ప్రచారం జరిగింది. దాన్ని మావోయిస్టులు ఖండించగా.. తాజాగా మరో సారి లొంగుబాటు ప్రచారం జోరందుకుంది. ఛత్తీస్‌గఢ్‌లోని ఘరియాబంద్ జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం భాస్కర్ అలియాస్ బాలన్న మృతిచెందారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే సుజాత లొంగుబాటు వార్తలు వచ్చాయి. మావోయిస్టు పార్టీ సాయుధ దళాల్లో ఇప్పుడు 40 శాతం మహిళలే ఉంటున్నారు. వీరందరి ప్రతినిధిగా కేంద్ర కమిటీలో సుజాతది కీలక స్థానం. ఆమెకు అండగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులుగా భాను అలియాస్ మిడ్కో, ఊర్మిళ చైతే పార్టీలో పనిచేశారు. వీరి అండతోనే సుజాత దండకారణ్యంలో జనతన సర్కారు చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో సుక్మా, బీజాపూర్ జిల్లాల్లో సమాంతర పాలనను నడిపించారని చెబుతారు. ఆపరేషన్ కగార్ మొదలయ్యాక సుజాత సహాయకురాళ్లు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఈ క్రమంలో పార్టీలో మహిళా విభాగానికి పెద్దదిక్కుగా ఉన్న సుజాత లొంగిపోయినట్టుగా ప్రచారం జరుగుతోంది.

అప్పీల్‌కు వెళ్లకుండా గ్రూప్–1 పరీక్షలు నిర్వహించాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కోర్టు అప్పీల్‌కు వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రూప్–1 పరీక్షలు తిరిగి నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. గ్రూప్–1 పరీక్షల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మీడియా సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. పరీక్షల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయలేదని, కొత్తగా జీవో 29 తెచ్చి తీవ్ర అన్యాయం చేశారన్నారు. అర్హతలేని వారితో గ్రూప్–1 పేపర్లు దిద్దించారని, ఫలితాలు పరిశీలిస్తే తెలుగు మీడియం వారికి తీవ్ర అన్యాయం జరిగినట్లు స్పష్టమవుతోందని తెలిపారు. 719 మందికి ఒకే మార్కులు రావడం ఎలా సాధ్యం అని కృష్ణయ్య ప్రశ్నించారు.

ఆ డ్రగ్స్ విలువ రూ.12 కోట్లే

రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుకున్నామన్న మహారాష్ట్ర పోలీసుల ప్రకటనలో వాస్తవం లేదు

తెలంగాణ పోలీస్, ఎక్సైజ్ శాఖల వాదన

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లిలోని వాగ్దేవి కెమికల్ ఫ్యాక్టరీలో మహారాష్ట్ర స్పెషల్ పోలీసులు పట్టు కున్న డ్రగ్స్ ఉదంతం వివాదాస్పదమవుతోంది. ఈ ఘటనలో పట్టుకుంది కేవలం రూ.12 కోట్ల విలువైన డ్రగ్స్ మాత్రమేనని, మహారాష్ట్ర పోలీసులు చెప్పినట్టు రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడలేదని తెలంగాణ పోలీస్, ఎక్సైజ్ వర్గాలు లెక్కలు చెబుతున్నాయి. మహారాష్ట్ర పోలీసులు పట్టుకున్న 5,790 కేజీల ఎండీ డ్రగ్స్ విలువ రూ.11.58 కోట్లు, 35,500 లీటర్ల కెమికల్స్ విలువ రూ.29.94 లక్షలు, మొబైల్స్ విలువ రూ.1.50 లక్షలు, ఇతర మెటీరియల్ విలువ రూ.4.57 లక్షలు కలిపినా రూ.12 కోట్లకు మించే అవకాశం లేదని అంటున్నాయి. మహారాష్ట్ర పోలీసుల ప్రయత్నం అభినందనీయమే అయినా పట్టుబడిన డ్రగ్స్ విలువను అమాంతం పెంచడం వెనుక కారణ మేంటన్న దానిపై ఆరా తీస్తున్నాయి. మరోవైపు అసలు ఈ ఆపరేషన్‌లో మెఫిడ్రిన్ డ్రగ్ తయారీకి అవసరమయ్యే ముడి పదార్థాలు కూడా లభించలేదని ఎక్సైజ్ వర్గాలు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. మిథైల్ ప్రొపియోఫెనన్, ప్రొపియోనిల్ క్లోరైడ్, మెథిలమైన్ అనే ముడి పదార్థాలు ఉంటేనే ఈ డ్రగ్ తయారవుతుందని, అలాంటి ముడిపదార్థాలేవీ కూడా అక్కడ లభించలేదని ఆ నివేదికలో వెల్లడించినట్టు తెలిసింది. మరో పక్క.. రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ రాకెట్ ఛేదించామని చెప్పుకున్న మహారాష్ట్ర స్పెషల్ టీం కోర్టులకు ఇచ్చిన నివేదికలో మాత్రం రూ.11.58 కోట్ల విలువైన డ్రగ్స్ తయారు చేసే రసాయనాలను పట్టుకున్నామని వెల్లడించాయని ఎక్సైజ్ అధికారులు చెబుతుండడం గమనార్హం.

చర్చలకు దేవాలయాలుగా చట్టసభలు

ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ద్వారా వారి ఆకాంక్షలు నెరవేరుతాయి

బెంగళూరులో జరిగిన 11వ కామన్ వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో మండలి చైర్మన్ గుత్తా



కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: చట్టసభలు నిజమైన చర్చలకు దేవాలయాలుగా మారినప్పుడు ప్రజాస్వామ్యం వృద్ధి చెందుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే వారి ఆకాంక్షలు నెరవేర్చడం సాధ్యమవుతుందని చెప్పారు. బెంగళూరులో జరుగుతున్న భారత ప్రాంత 11వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సమావేశాల్లో శుక్రవారం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'ప్రజాస్వామ్యానికి శాసన సభ, శాసన మండలి కేంద్ర బిందువులు. ప్రజలు తమ ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ కోసం మాట్లాడతారని, తమ ప్రయోజనాలను కాపాడుతారని, రాజ్యాంగ విలువలను నిలబెడతారని నమ్ముతారు. అయితే ఇటీవలి కాలంలో అంతరాయాలు, అర్థవంతమైన చర్చ లేకపోవడం, శాసనసభ కార్యకలాపాల్లో గౌరవం లేకపోవడంపై ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. తెలంగాణలోని రెండు చట్టసభలు ప్రజల అభ్యున్నతి, సరైన చట్టాలను రూపొందించేందుకు పనిచేస్తున్నాయి. చైర్మన్‌గా సభలో సభ్యులందరి హక్కులను కాపాడుతున్నా. తెలంగాణలో ఇప్పటికే ఆచరణలో ఉన్న కృత్రిమ మేధస్సు, పరిశోధన, రికార్డుల నిర్వహణ, సమాచారంతో కూడిన చర్చల కోసం సభ్యులకు వేగంగా సమాచారాన్ని అందించడంలో సహాయపడుతోంది' అని గుత్తా వివరించారు. 'పౌరులు తాము ఎన్నుకున్న ప్రతినిధుల నుంచి సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ వైపు చూస్తున్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, మహిళలు, యువత, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలతోపాటు వాతావరణ మార్పు, సాంకేతికత, స్థిరమైన అభివృద్ధిని ఆశిస్తున్నారు' అని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ వ్యాఖ్యానించారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖదీర్ ఫరీద్, డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప మల్లప్ప లామ్ని, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లు, శాసన పరిషత్ చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు, లెజిస్లేటివ్ సెక్రటరీలను తెలంగాణ అసెంబ్లీ ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసింది.

తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్‌ది ఒక పాత్ర మాత్రమే

బీఆర్‌ఎస్ హయాంలో భయంతో ఉద్యమకారులెవరూ మాట్లాడలేదు

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మహాధర్నాలో ప్రొఫెసర్ కోదండరాం




జేఏసీ మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం. చిత్రంలో జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ సీఎం కేసీఆర్‌ది ఒక పాత్ర మాత్రమేనని ఆయన వల్లే రాష్ట్రం వచ్చిందనేది అంగీకరించే విషయం కాదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టంచేశారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఈ నెల 15న జనసమితి రాష్ట్ర కార్యాలయంలో ఉద్యమ కారుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. హరగోపాల్ మాట్లాడుతూ ఒక వ్యక్తి తెలంగాణ తీసుకొచ్చారని ప్రచారం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన భూ కబ్జాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని సవాలు చేశారు. వెన్నెల గద్దర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరో 500 మంది కళాకారులకు ఉద్యోగాలివ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. .

వచ్చే 5 రోజుల్లో అతి భారీ వర్షాలు

అనేక జిల్లాల్లో కురిసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అనేక జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి డా.లీలారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- 13న ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చు.
- మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాలలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది.
- 14న నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.
- 15న ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చు.
- 16న ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది.
- 17న ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో కురవొచ్చు.


మురుగు నీరు పొలాల్లో నిలవనివ్వొద్దు

భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలని, పొలంలో నుంచి మురుగు నీటిని తీసివేయడానికి రైతులు కాల్వలు చేసుకోవాలని డా. లీలారాణి రైతులకు సూచించారు.

- ఇప్పటికే భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి మురుగు నీటిని త్వరగా తీసివేయాలి.
- విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి.
- రైతులు చెట్ల కింద నిలబడకూడదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచకూడదు.
- అలుగు పారుతున్న చెరువుల్లో మట్టి కోతను నివారించడానికి ఇసుక నింపిన సంచులను తాత్కాలిక అడ్డుకట్టలుగా వేసుకోవాలి.
- కిందపడిన విద్యుత్ తీగలను తాకకండి. వాటిని వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి

వరంగల్‌పై పిడుగుల వాన

- ఒకే ఇంటిపై మూడు పిడుగులు
- మరో ఘటనలో 94 గొర్రెలు మృత్యువాత



ఇంటి లోపల పగుళ్లు ఏర్పడిన స్లాబు

వరంగల్ నెట్‌వర్క్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో పిడుగులు పడి ఆస్తి నష్టం వాటిల్లింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట ఎస్సీ కాలనీలో వంగూరి వెంకన్న, వెంకటమ్మ దంపతుల ఇంటిపై ఉరుములు, మెరుపులతో పాటు ఒకేసారి మూడు పిడుగులు పడ్డాయి. సొమ్మసిల్లి పడిపోయిన వెంకటమ్మను ఆస్పత్రికి తరలించారు. పిడుగులు పడి ఇంటి స్లాబుకు పెచ్చులూడి పగుళ్లు ఏర్పడ్డాయి. ఇంట్లోని రూ.లక్ష విలువైన ఫ్రిడ్జి, రెండు ఫ్యాన్లు, టీవీ, విద్యుత్ తీగలు కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని శుక్రవారం గ్రామ పరిపాలన అధికారి గణేశ్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేట గోదావరి శివారు ప్రాంతంలో గొర్రెల మందపై పిడుగు పడి 94 గొర్రెలు మృతి చెందాయి. దీంతో రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెలకాపరులు తెలిపారు. హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండలో పిడుగుపడి ఎద్దు మృతిచెందింది.



"శిలలపై పిడిగుద్దు గుద్దినారూ... మనవాళ్లు మనసులో కోపాన్ని బయటికే తోసినారూ...!" అంటూ పాడుకుంటూ ప్రస్తుతం థాయిలాండ్ వాసులు తమలోని ఫ్రస్టేషన్‌ను బయటకు వెళ్లగక్కుతున్నారు.

''అహో ఆఫీసు బాసూ... ఆ యముడంటి క్రూరిస్టు శాడిస్టు ఫేసూ... ఈ ఆఫీసు యజమానిగా మా పిడిగుద్దుల పాలబడ్డావయా...'' అని ఆలాపన పాడిన తర్వాత... ''ప్రతిమపై పిడిగుద్దు గుద్దినారూ... మనవాళ్లు కసితీర అక్కసును వెళ్లగక్కినారూ'' అంటూ ఖూనీచేయాల్సినంత కసిని... కూనిరాగాలతో సరిపెట్టుకుని తమ కోపాల్నీ, ఫ్రస్టేషన్లనూ బయటకు తీసిపడేస్తున్నారు. దాంతో తమ 'కోపతాపాలూ డీప్ డిప్రెషన్ల' నుంచి చప్పున బయటకు వచ్చేస్తున్న ఫీలింగ్ కలుగుతోందంటూ హ్యాపీగా చెబుతున్నారు.

కసి ఉంచుకోవద్దు... 'పంచ్'కోండి!

ఇలా కోపం వెళ్లగక్కేది విధిగా మన బాసు పైనే కానక్కర్లేదు... అది యథేచ్ఛగా మన ఎక్స్ గాళ్‌ఫ్రెండూ కావచ్చూ లేదా మన బాయ్‌ఫ్రెండూ కావచ్చు. ఇలా వాళ్లెవరైనప్పటికీ... వాళ్ల మీద ఉన్న కసినీ, అక్కసును కూడా హాయిగా... ''వారెవా ఏమి ఎక్సు... నన్ను వదిలేసి దొడు తీసూ'' అంటూ మాజీ ప్రేమిక (కుడి) మీద ఉన్న కోపాన్ని వెళ్లగక్కుకోవచ్చు. అలా మన మనసులోని కోపాగ్రహబాధల నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఇది మరెక్కడో కాదు... మన పొరుగున ఉన్న థాయిలాండ్‌లోనే. అక్కడి వీధుల్లో ప్రతిమలు తయారు చేసే ఓ స్కల్ప్‌చర్ షాప్ ఉంది. మనం చేయాల్సిందల్లా మన ఆగ్రహానికి గురికాబోయే సదరు అభాగ్యుల ఫొటో తీసుకెళ్లి... జస్ట్ వాళ్లకు హ్యాండోవర్ చేసేయడమే. వాళ్లు శ్రద్ధగా జీవం ఉట్టిపడేలా మనక్కావాల్సిన ప్రతిమను తయారు చేసి పెడతారు. అంతే... ఆ తర్వాత మనం దాంట్లోని జీవకళంతా వెళ్లిపోయేలా, మన మనసులోని కోపమంతా పారిపోయేలా, మన మదిలోని అక్కసంతా తీరిపోయేలా బాదేయవచ్చు.

ఇక మనలో కసి మరీ ఎక్కువగా ఉందనుకోండి... పుస్తకాల్లో సాదా ప్రతీ, మేలుప్రతిలాగానే... ఆ బంకమట్టిలోపలే కాస్తంత మెటల్‌ఫ్రేము గట్టిగా అమర్చి మరో పది దెబ్బలకు నిలిచేలా, ఇంకో నాలుగు దెబ్బలు కాసేలా మేలైన స్టాండర్డు మట్టిప్రతిమలు తయారు చేసిస్తారు. మనసాగలేక మనం అక్కడికక్కడే మనస్ఫూర్తిగా కొట్టేశాక కూడా మన కసి తీరలేదనుకోండి. పర్లేదు... మరో నాల్రోజులకోసం అద్దెకిస్తారు లేదా కాస్త డబ్బులెక్కువ పే చేస్తే మనక్కావల్సిన ప్రతిమను మనకే పర్మనెంటుగా అమ్మేస్తారు కూడా. ఈ ప్రతిమలూ దెబ్బల వ్యవహారమంతా చూస్తూ... ''అద్దిరా కసితీరా కొట్టే దెబ్బలోని పవరు. అరెరె... భలే టెక్నిక్కు కదా... బహుమంచి క్రియేటివిటీ కదా'' అంటూ కొందరంటూ ఉంటే.. ''ఆ... ఆ టెక్నిక్కుదేవుందీ... ఈ టైపు క్రియేటివిటీ మనకెప్పట్నుంచో తెలుసు. దెబ్బకు దెయ్యం దిగొస్తుందనే సామెత మన దగ్గర లేదా'' అంటూ కొందరు పెదవి విరుస్తున్నారు.



''మన హాస్య దర్శకుడు జంధ్యాల ఇలాంటి టెక్నిక్కులనెప్పుడో కనిపెట్టేశారంటూ 'అహ నా పెళ్లంట' సినిమాల్లో బ్రహ్మానందం... వాళ్ల బాసూ, పరమ పిసినారి పీసు కోట శ్రీనివాసరావును షాట్ ఫ్రీజు చేసి మరీ ''పోతావురా ఒరేయ్... మట్టిగొట్టుకుపోతావు రా... నాశనమైపోతావురా'' అంటూ తిట్టే షాట్లూ... ''బాబాయ్ అబ్బాయ్ సినిమాలో సుత్తివేలు తనకు కోపం వచ్చినప్పుడల్లా చిందులు తొక్కుతూ... రోజుకు 'మూడు పూటల కోటా' చొప్పున తాను కసితీరా బాదేయడానికి ఓ బానపొట్ట పహిల్వాన్‌ను పనిలో పెట్టుకున్న సీన్లూ ఉదాహరిస్తున్నారు.

ఏతావాతా చెప్పొచ్చేదేమంటే ''మనం ఎవరిపట్ల కోపం కలిగి ఉన్నామో వారికి ఏమాత్రం హాని కలగని విధంగా... కసితీరా మన కినుకను వెళ్లగక్కి హాయిగా కునుకు తీయగలుగుతున్నప్పుడు ఏమార్గమైతేనేమీ... ఈ మార్గమైతేనేమీ'' అంటూ కొందరిప్పుడు సన్నాయి నొక్కులు నొక్కి మరికొందరు... ప్రతిమ మీద దెబ్బలాగా ఢంకా బజాయించి ఇంకొందరూ కసి తీర్చుకునే మార్గానికి సపోర్టు చేస్తున్నారు.

- యాసీన్

లైఫ్@360

ఓ సప్న కల!



పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా వీధుల్లో సాదాసీదాగా ఉండే ఒక వృద్ధ మహిళ ఒక ముతక సంచీ భుజాన వేసుకుని షేరింగ్ ఆటోలో ప్రయాణిస్తుండటం కనిపిస్తుంది. ఆమె వయసు 70 ఏళ్లు, అయితేనేం.. ఉత్సాహంలో.. చురుకుదనంలో పాతికేళ్ల యువతీ యువకులతో పోటీ పడుతోందామె. స్కూల్ టీచర్‌గా పుష్కరం క్రితం రిటైరైందామె. ప్రభుత్వం వారిచ్చే పెన్షన్ తీసుకుంటూ హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు కదా... ఈ వయసులో మీరు ఇంత శ్రమ తీసుకోవడం అవసరమా? అనడిగితే... ''చదువుకోవాలని కొండంత కోరిక ఉన్నా, బోలెడంత డబ్బు పెట్టి చదువు కొనలేక నిరుత్సాహంతో నీరసపడిపోయే నిరుపేద పిల్లలకు నాకు తెలిసిన నాలుగు అక్షరం ముక్కలు నేర్పి, వారి కాళ్ల మీద వాళ్లను నిలబడేలా చేయాలన్న నా కలే నాకు ఉత్సాహాన్నిస్తోంది'' అంటుందామె. ఆమె సప్నా ఘోష్ రాయదాస్, గత పదేళ్లుగా ఆమె జీతం లేకుండా గణితం, సైన్స్ బోధిస్తోంది.

ఆమె 2015లో ఉద్యోగ విరమణ చేసినప్పటినుంచి ఇంట్లో కూర్చోవడానికి బదులుగా, ఆమె ప్రతి రోజూ 7 కిలో మీటర్లు ప్రయాణించి మరీ మారుమూలన ఎక్కడో నిరుపేదల కోసం ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఆ పాఠశాలకు వెళ్లి, గణితం, సైన్స్ బోధించాలనుకుంది. ఎందుకంటే ఆమెకు అందులోనే శాంతి, విశ్రాంతి కూడా.

సప్నాకు సొంత పిల్లలు లేరు, కానీ ఆమె బోధించిన పిల్లలు వీధిలో ఆమెను చిరునవ్వుతో పలకరించి ఆమె పాదాలను తాకినప్పుడు, ఆమె హృదయం గర్వం, ఆనందంతో నిండిపోతుంది. 'చిన్నప్పటినుంచి డాక్టర్ కావాలని కలలు కనేదాన్ని, కానీ మా ఇంటి పరిస్థితులు నన్ను టీచర్ కావడానికి దారితీశాయి. నా విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, అధికారులు కావడం చూసినప్పుడు, నేను చేసినది నా కల కంటే గొప్పదని నాకు అనిపిస్తుంది.' అంటున్న సప్న రాయ్ అందరికీ స్ఫూర్తిదాయకం.

ఆహా! అందమైన జీవితం!



పక్షుల కువకువలే తప్ప హారన్ మోతలు లేవు, ఎటు చూసినా పచ్చని చెట్లు, పంట పొలాలే తప్ప, ఎత్తైన భవనాలు లేవు. అలారం మోతతోనో మొబైల్‌ఫోన్ కాల్‌తోనో కాకుండా నులివెచ్చని సూర్యకిరణాలు తట్టిలేపుతున్నాయి. బ్రేక్ మీద నుంచి కాలు తీయలేని ట్రాఫిక్ జామ్‌లు లేవు, కాలినడకతో ఎంత దూరం వెళ్లినా అడుగులకు బ్రేక్ వేయాల్సిన పనిలేదు. ఎండ, వాన, చలి కాలాలను అచ్చంగా ఆస్వాదించవచ్చు. నీల్, మోమోలుగా ప్రాచుర్యంలోకి వచ్చిన స్వప్నిల్ రావు, మృణ్మయీ దేశ్‌పాండేల జీవితం ఇది.

వాళ్లు ఐదేళ్ల కిందట మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ కొండల్లోని ఓ గ్రామానికి వెళ్లారు. అక్కడ కొంత బంజరు నేలను కొని సాగు చేశారు. గొప్ప ఇంజినీరింగ్ స్కిల్‌తో ఇంటిని నిర్మించుకున్నారు.

నగరంలో పుట్టి పెరిగిన వాళ్లకు గ్రామం ఎలా ఉంటుందో తెలియదు. సినిమాల్లో చూడడం తప్ప గ్రామాన్ని, గ్రామీణ జీవితాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయలేరు. ముంబయి దంపతులు నగరాన్ని వదిలి కొండకోనల్లోని ఓ కుగ్రామానికి వెళ్లి అక్కడే నివసిస్తున్నారు. అది కూడా పర్యావరణ హితంగా. స్థానికంగా దొరికే ల్యాటరైట్ ఇటుకలతో ఇద్దరూ ఇటుక ఇటుక పేర్చి ఇంటిని నిర్మించుకున్నారు. బంజరు భూమిని చదును చేసి సాగులోకి తెచ్చి స్వయంగా మొక్కలు నాటి పంటలు పండిస్తున్నారు. జీరో వేస్ట్ లైఫ్‌స్టైల్‌ను అనుసరిస్తున్నారు. ఇది నీల్, మోమో దంపతుల అచీవ్‌మెంట్.



ఎకో ఫ్రెండ్లీ జీవితం స్వప్నిల్, మృణ్మయిలు సిటీ బిజీ జీవితంలో అలసిపోయారు. జీవితం ఇంకోలా ఉంటే బావుణ్ననుకున్నారు. ఆ ఆలోచన ఫలితమే ఇప్పుడు వాళ్లు ములుసార్ గ్రామంలో జీవిస్తున్న ఎకో ఫ్రెండ్లీ జీవితం. 2020 నుంచి అక్కడే జీవిస్తూ పొలాన్ని సాగు చేసి రకరకాల కూరగాయలు, పండ్లు పండిస్తున్నారు. ఆ ఉత్పత్తులతో నగరానికి ఉపయోగపడే పని ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. నీల్ అండ్ మోమో పేరుతో పర్యావరణహితమైన సబ్బులు, షాంపూలు ఇతర ఉత్పత్తుల పరిశ్రమ నిర్వహిస్తున్నారు. మదర్ ఎర్త్‌ని కాపాడుకోవడం నగర జీవితంలో సాధ్యం కావడం లేదు. ప్రకృతితో కలిసి జీవిస్తూ నగరాల్లో ఉండే వారికి పర్యారణ హితమైన ఉత్పత్తులను చేరుస్తున్నారీ దంపతులు.

● యోగా

భావోద్వేగాల అదుపు



మెదడుకు చేరాల్సిన ఆక్సిజన్ స్థాయిల్లో మార్పులు, రక్తప్రసరణల అడ్డంకులు రకరకాల సమస్యలకు కారణం అవుతుంటాయి. మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపే ఈ సమస్యను యోగాసనాల ద్వారా బ్యాలెన్స్ చేసుకునే ఎన్నో పద్ధతులున్నాయి. వాటిలో ప్రసరిత హస్త ఉత్థానాసన ఒకటి. దీన్నే వైడ్ స్టాన్స్ ఫార్వర్డ్ బెండ్ అని కూడా అంటారు.

ప్రసరిత హస్త ఉత్థానాసన...

సంస్కృతంలో 'హస్త' అంటే చేతులు, 'ఉత్' అంటే తీవ్రమైన, 'తాన్' అంటే సాగదీయడం, 'ప్రసరిత' అంటే విస్తరించడం. చేతులు, పాదాలను స్ట్రెచ్ చేయడం ఈ ఆసనంలో చూస్తాం. ఈ ఆసనం ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని, గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుందని హైలైట్ చేసింది. మీరు దీన్ని ఎలా చేయవచ్చో ఇక్కడ ఉంది.

ఇలా చేయాలి... ● సమస్థితిలో నిలబడి, దీర్ఘ శ్వాస తీసుకొని, వదలాలి ● చేతులను తలపైకి లేపి, వెన్నును ముందుకు తలను వెనక్కి వంచాలి. ఈ సమయంలో చేతులు కూడా వెనక్కి వంచాలి ● అదే భంగిమ నుంచి మెల్లగా తల భూమికి ఆనేలా ముందుకు వంగాలి. చేతులను నేలకు ఆనించడం, వీలైతే పాదాలను పట్టుకోవడం.. చేయవచ్చు ● ఈ భంగిమలు ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి యథా స్థితికి చేరుకోవాలి ● దీంతో ఉచ్ఛ్వాస నిశ్వాసలు మెరుగు అవుతాయి. సూర్య నమస్కారాల్లో రెండవ భంగిమతో మొదలుపెట్టే ఈ ఆసనం వల్ల ఆక్సిజన్ లెవల్స్, రక్త ప్రసరణలో మెరుగైన ఫలితాలు పొందవచ్చు. దీని వల్ల మానసిక ఒత్తిడి, ఆందోళన వంటివి బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాయి.

సాక్షి సినిమా



● కమల్‌హాసన్

స్టంట్ స్టార్ట్

కమల్‌హాసన్ కొత్త చిత్రం ప్రారంభమైంది. కమల్‌హాసన్ కెరీర్‌లోని ఈ 237వ సినిమాతో 'కేజీఎఫ్, ఖైదీ, అమరన్, కల్కి 2898 ఏడీ' వంటి సూపర్‌హిట్ సినిమాలకు పని చేసిన స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్బు-అరివు ద్వయం దర్శకులుగా పరిచయం అవుతున్నారు. 2024 ప్రారంభంలోనే ఈ చిత్రాన్ని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు సెట్స్‌కు వెళ్లలేదు. కాగా ఈ సినిమా పనులు ప్రారంభమయ్యాయని, 'ప్రేమలు, రైఫిల్‌క్లబ్' వంటి హిట్ చిత్రాలకు స్క్రీన్ రైటర్‌గా పని చేసిన శ్యామ్ పుష్కరన్ ఈ సినిమాకు అసోసియేట్ అయ్యారని చిత్రయూనిట్ శుక్రవారం అధికారికంగా పేర్కొంది. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... ఫైట్ మాస్టర్స్ దర్శకత్వం వహిస్తున్నారు కాబట్టి ఈ చిత్రం యాక్షన్ ప్రాధాన్యంగా ఉంటుందని, కమల్ రిస్కీ స్టంట్స్ చేయనున్నారని కోలీవుడ్ టాక్.



● అనుష్క

సోషల్ మీడియాకి విరామం

సెలెబ్రిటీలంటే జనాలకు విపరీతమైన క్రేజ్. అందులోనూ సినిమా యాక్టర్స్‌కి ఆ క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందుకేనేమో... నటీనటులు కూడా తమ సినిమా, వ్యక్తిగత, ఆరోగ్యం... ఇలా పలు విషయాలను తమ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులకు దగ్గరవుతుంటారు. అయితే కొందరు ఉన్నట్టుండి సోషల్ మీడియాకి కొద్ది రోజులు విరామం ప్రకటించి, అందరూ ఆశ్చర్యపోయేలా చేస్తుంటారు. తాజాగా ఈ జాబితాలో హీరోయిన్ అనుష్క చేరారు. సోషల్ మీడియాకి కొన్నాళ్లు బ్రేక్ ఇవ్వనున్నట్లు అనుష్క స్వయంగా లేఖ రాశారు.

''బ్లూ లైట్ (షూటింగ్ లైట్‌ని ఉద్దేశించి) టు క్యాండిల్ లైట్. కొన్నాళ్లపాటు సోషల్ మీడియా నుంచి దూరంగా ఉండాలనుకుంటున్నాను. ఈ ప్రపంచంతో కనెక్ట్ అయ్యి స్క్రోలింగ్ నుంచి దూరంగా... ఎక్కడైతే మొదలయ్యానో అక్కడ కొన్నాళ్లపాటు ఉండాలనుకుంటున్నాను. త్వరలోనే మరిన్ని కథలతో మిమ్మల్ని కలుస్తాను'' అంటూ అనుష్క ఆ లేఖలో పేర్కొన్నారు. ఇక అనుష్క ప్రస్తుతం మలయాళంలో 'కథనార్' సినిమా చేస్తున్నారు. అలాగే ఓ తెలుగు సినిమా అంగీకరించారు.

కిష్కింధపురికి ప్రేక్షకుల ప్రేమ దక్కింది

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్

''కిష్కింధపురి'ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. గురువారం మూడు ప్రీమియర్ షోలు వేద్దామనుకుని, మొదలైన మా సినిమాకు 66 షోలు పడ్డాయి. ఆర్గానిక్‌గా మా సినిమా ఆడియన్స్‌కు చేరువైంది. మా 'కిష్కింధపురి'కి వారి ప్రేమ దక్కింది. ఈ ప్రేమ కొనసాగుతుంది. తెలుగు ప్రేక్షకులు గొప్పోళ్లు. గొప్ప చిత్రాన్ని కాపాడతారు'' అని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు.

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం నిన్న (శుక్రవారం) విడుదలైంది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ సినిమా ప్రెస్ మీట్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ- ''ఒక కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే కృషితో చేసిన సినిమా 'కిష్కింధపురి'. సాహుగారు ఎంతగానో సపోర్ట్ చేసి, ఈ సినిమాను నిర్మించారు. చేతన్ భరద్వాజ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు. ''మేము అనుకున్నదానికంటే డబుల్ ఇంపాక్ట్ రెస్పాన్స్ వస్తోంది. మా బ్యానర్‌లో మంచి సినిమా పడింది'' అని తెలిపారు సాహు. ''ఫస్ట్ టైమ్ హిట్ కొట్టినప్పుడు ఆ క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఈ మూమెంట్స్‌ని నేను లైఫ్ లాంగ్ గుర్తు పెట్టుకుంటాను'' అని పేర్కొన్నారు కౌశిక్. ''ప్రేక్షకుల స్పందన మా సినిమాకు గొప్ప బలాన్నిచ్చింది'' అని చెప్పారు చేతన్ భరద్వాజ్.



● చేతన్ భరద్వాజ్, కౌశిక్, సాయి శ్రీనివాస్, సాహు గారపాటి

హీరోయిన్ సాయిపల్లవి హిందీలో నటించిన తొలి చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రం 'మేరే రహో'. సునీల్ పాండే దర్శకత్వంలో

ఆ పరిచయంతో...

ఆమిర్ ఖాన్, మన్సూర్ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్ కానుంది. ఒకరితో ఒకరికి పరిచయం లేని ఓ అబ్బాయి, అమ్మాయి ఓ రోజు విచిత్రకరమైన పరిస్థితుల్లో కలుసుకుంటారు. ఆ పరిచయం వారి జీవితాలను ఎలా మార్చేసింది? అన్న కోణంలో ఈ 'మేరే రహో' సాగుతుందని బాలీవుడ్ సమాచారం. తొలుత ఈ సినిమాకు 'ఏక్ దిన్' అనే టైటిల్ అనుకున్నారు. నవంబరులో రిలీజ్ ప్లాన్ చేశారు. శుక్రవారం ఈ సినిమా టైటిల్, విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా కాకుండా హిందీలో 'రామాయణ' సినిమాలో సీతగా సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే.



● సాయిపల్లవి

కథ విని షాక్ అయ్యాను

- రాజేంద్రప్రసాద్



''దర్శకుడు చిరంజీవి 'నేనెవరు?' చిత్ర కథ చెప్పినప్పుడు షాకయ్యా. ఇంత గొప్ప కథను కరెక్ట్‌గా తెరకెక్కించగలడా? అని సందేహపడ్డాను. కానీ, షూటింగ్‌కి వెళ్లాక అతను ఎంత జీనియస్ అన్నది అర్థం అయింది. నిర్మాతలు కూడా ఎంతో తపన, నిబద్ధత కలిగిన వ్యక్తులు. ఈ సినిమాతో వారికి మంచి విజయం సొంతం కావాలి. నేను నటించిన మంచి సినిమాల్లో 'నేనెవరు?' ఒకటిగా నిలిచిపోతుంది'' అని నటుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో రాజేంద్రప్రసాద్, సాయి కిరణ్, జోగిని శ్యామల ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'నేనెవరు?'. సరికొండ మల్లికార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు-సకినాన భూలక్ష్మి నిర్మించిన ఈ చిత్రం ద్వారా వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'నేనెవరు?' ఆడియో, టీజర్ లాంచ్ ఈవెంట్‌కి హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, దర్శకుడు వి. సముద్ర అతిథులుగా హాజరై, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''రాజేంద్రప్రసాద్ వంటి గొప్ప ఆర్టిస్టుతో 'నేనెవరు?' చిత్రం రూపొందించే చాన్స్ లభించడం మా అదృష్టం. దసరాకి మా సినిమాని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు దర్శక-నిర్మాతలు.

ట్రాన్స్‌లోకి...



● ఇమ్రాన్ హష్మి

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా, ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఓమి ట్రాన్స్...' అంటూ సాగే తొలి పాట పూర్తి లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఓజీ పాత్రలో పవన్ కల్యాణ్, ఓమి పాత్రలో ఇమ్రాన్ హష్మి నటించారు. ''ఓమి ట్రాన్స్' శక్తిమంతంగా ఉండి, శ్రోతలను ట్రాన్స్‌లోకి తీసుకెళుతుంది. ఓజీ, ఓమి ముఖాముఖి పోరుని సూచించేలా ఈ పాట సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

అందెల రవమిది వస్తోంది



● ఇంద్రాణి

ఇంద్రాణి దావులూరి ప్రధాన పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అందెల రవమిది'. విక్రమ్ కొల్లూరు, తనికెళ్ల భరణి, ఆదిత్య మీనన్, జయలలిత ఇతర పాత్రలు పోషించారు. శివ బట్టిప్రోలు సమర్పణలో నాట్యమార్గం ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాతలు కేఎస్ రామారావు, దామోదర ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంద్రాణి దావులూరి మాట్లాడుతూ- ''అందెల రవమిది'లాంటి గొప్ప సినిమాను తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. 'స్వర్ణకమలం' సినిమా నుంచి ఎంతో స్ఫూర్తి పొందాను. విశ్వనాథ్‌గారి సినిమాలంటే ఎంతో ఇష్టం'' అని తెలిపారు. ''సినిమా పూర్తిగా కమర్షియల్ అయిన ఈ సమయంలో సంప్రదాయ సంగీతం, నాట్యంతో మళ్లీ ఇండస్ట్రీకి ప్రాణం పోయడానికి వచ్చిన ఇంద్రాణి ధైర్యాన్ని మెచ్చుకోవాలి'' అని కేఎస్ రామారావు చెప్పారు. ''అందెల రవమిది' కోసం ఇంద్రాణి ఎంత కష్టపడిందో అంతే ఇష్టపడి చేసింది. ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు దామోదర ప్రసాద్. యూఎఫ్ఓ సంస్థ లక్ష్మణ్, ఈస్ట్ వెస్ట్ అధినేత రాజేశ్ మాట్లాడారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



నేటి సమాజంలో తప్పు చేసిన వాళ్ళకు తోడుగా నిలబడుతున్నారు కొందరు రాజకీయ నాయకులు. భాషతో, ప్రాంతాలతో సంబంధం లేకుండా స్వలాభం కోసం దారుణాలను చేసేవాళ్ళని కూడా దరి చేర్చుకుంటున్నారు నేటి నేతలు. ఆఖరికి ప్రభుత్వంలో ఉన్న పెద్ద పెద్ద బడా బాబులు కూడా తమకు కావాల్సిన వాళ్ళ కోసం కవచంలా కాపు కాస్తున్నారు. అటువంటి వారికి సరైన రీతిలో బుద్ధి చెప్పే ప్రయత్నమే 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ఈ మలయాళ సినిమా తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా జీ5 ఓటీటీ వేదికగా లభ్యమవుతోంది. మలయాళ సుప్రసిద్ధ నటులు సురేష్ గోపి, వర్ధమాన నటి అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించగా ప్రవీణ్ నారాయణ్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. వాస్తవ ఘటనల ఆధారంగా తీసిన సినిమా ఇది. కేరళ రాష్ట్రంలో జరుగుతున్న లైంగిక అత్యాచారాలు, అలాగే న్యాయ వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపిన చిత్రమే ఈ 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే... బెంగళూరుకు చెందిన ఐటీ ఉద్యోగిని జానకి విద్యాధరన్ పండగ సెలవుల కోసం ఇంటికి వెళ్ళే సమయంలో అత్యాచారానికి గురవుతుంది. జానకి ఇదే విషయం మీద న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కి పోరాడుతూ ఉంటుంది. ఈ దశలో తన తండ్రిని కూడా కోల్పోతుంది. కింది కోర్టులో జానకికి న్యాయం దొరక్కపోగా మానసికంగా కుంగిపోతుంది. అయితే ప్రత్యర్థులను ఈ కేసు నుండి గెలిపించిన ప్రముఖ న్యాయవాది డేవిడ్ ఆ తర్వాత పై కోర్టుకి జానకి తరపున నాటకీయ ఫక్కీలో అప్పీల్ చేస్తాడు. జానకిని అత్యాచారం చేసి, తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని తానే స్వయంగా ఇన్వెస్టిగేషన్ చేసి పట్టుకుని పోలీసులకు అప్పగిస్తాడు డేవిడ్. కానీ కోర్టులో మాత్రం ఈ కేసు రకరకాల అనూహ్య మలుపులతో ఉత్కంఠ రేకెత్తిస్తూ ఆఖరికి కేరళ ప్రభుత్వానికే ఓ సవాలు విసురుతుంది. అయితే ఆఖర్లో జానకికి డేవిడ్ కోర్టు పరంగా న్యాయం చేస్తాడా? లేదా అన్నది మాత్రం ఈ సినిమాలోనే చూడాలి. ఇటువంటి రియలిస్టిక్ డ్రామాలు చాలావరకు ప్రేక్షకులను అలరిస్తాయి. అందులోనూ కీలక పాత్రధారులైన సురేష్ గోపి, అనుపమా పరమేశ్వరన్ తాము చేసిన పాత్రలకు న్యాయం చేశారు. మస్ట్ వాచ్ ఫర్ వీకెండ్.

- హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
శనివారం
13-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	356	81,905
నిఫ్టీ ▲	109	25,114

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,146	▲	104
డోజోన్స్	45,923	▼	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,285	▼	12
డాక్స్	23,680	▼	24
హాంషై	3,871	▼	5
నికాయ్	44,768	▲	396

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.95	88.97
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.40	121.40
€	యూరో	ఎస్‌బీఐ	101.90	104.66
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.11	60.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.43	70.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.59	24.06
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.49	13.32

బంగారం@ 1,13,800

మరో కొత్త గరిష్ట స్థాయి • రూ.1,32,000 వద్ద వెండి రికార్డు



న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరల్లో ర్యాలీ కొనసాగుతోంది. శుక్రవారం ఈ విలువైన లోహాలు సరికొత్త జీవిత కాల గరిష్టాలకు చేరాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు రూ.700 పెరగడంతో రూ.1,13,800 స్థాయిని నమోదు చేసింది. వెండి కిలోకి ఏకంగా రూ.4,000 పెరిగి 1,32,000ను తాకింది. అంతర్జాతీయంగా బలమైన డిమాండ్ ధరలకు మద్దతుగా నిలిచినట్టు ట్రేడర్లు తెలిపారు. ''ఇటీవలి యూఎస్ ఆర్థిక డేటాతో ఫెడ్ 2025లోనే ఒకటికి మించిన విడతల్లో రేట్ల కోతను చేప డుతుందన్న అంచనాలు పెరిగాయి. దీంతో బంగారంలో కొనుగోళ్లు పెరిగాయి''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. పారిశ్రామిక డిమాండ్‌కు తోడు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి బలమైన పెట్టుబడుల ప్రవాహంతో వెండి ధరలు పెరిగినట్టు చెప్పారు. ఈ ఏడాది పెట్టుబడిదారులకు బంగారం, వెండి మంచి లాభాన్నిచ్చాయి. ఇప్పటి వరకు బంగారం ధర 10 గ్రాములకు రూ.34,850 (44 శాతం), వెండి ధర కిలోకి రూ.42,300 (47 శాతం) చొప్పున పెరగడం గమనార్హం. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం స్వల్ప లాభంతో 3,683 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

స్వల్పంగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం

- ఆగస్టులో 2.07 శాతంగా నమోదు
- మైనస్‌లోనే ఆహార ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో నమోదైన ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి నుంచి ఆగస్ట్ నెలలో కాస్తంత ఎగిసింది. జూలైలో 1.61% కాగా, ఆగస్టులో 2.07 శాతానికి చేరింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్లు, నూనెలు, ఫ్యాట్స్ ధరలు పెరగడం ఇందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) వెల్లడించింది. వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ/రిటైల్ ద్రవ్యోల్బణం) తొమ్మిది నెలల పాటు వరుస క్షీణతకు ఆగస్టులో బ్రేక్ పడినట్టయింది. 2024 ఆగస్ట్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.65 శాతంగా ఉంది.

- ఆహార ద్రవ్యోల్బణం మైనస్ 0.69 శాతంగా నమోదైంది. జూలైలో ఇది మైనస్ 1.76%గా ఉంది.
- కూరగాయల ధరలు 15.92% పడిపోయాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం జూలైలో 1.18 శాతంగా ఉంటే, ఆగస్టులో 1.69 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో 2.1 శాతం నుంచి 2.47 శాతానికి చేరింది.

రానున్న నెలల్లో గమనించాలి..

ఆహారం, పానీయాల విభాగాల్లోని ధరల పెరుగుదల వల్లే సీక్వెన్షియల్‌గా (నెలవారీగా) రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో పెరగడానికి కారణమని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి సానుకూల ధోరణులు కనిపిస్తున్నప్పటికీ.. ఆగస్ట్ చివరి నుంచి సెప్టెంబర్ ఆరంభం వరకు అధిక వర్షాలు, వరదలు ఖరీఫ్ దిగుబడులపై ప్రభావం చూపిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతిమంగా దిగుబడి, ధరల తీరును గమనించాల్సి ఉందన్నారు.

హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ టెక్నాలజీ సెంటర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికన్ బీమా దిగ్గజం ది హార్ట్‌ఫోర్డ్ తాజాగా హైదరాబాద్‌లో తమ టెక్నాలజీ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఇది ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ పరివర్తన, అధునాతన టెక్నాలజీలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుందని సంస్థ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ పన్నాల తెలిపారు. ప్రస్తుతం అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్, షికాగో, చార్లొట్‌లో తమకున్న టెక్నాలజీ సెంటర్లకు అనుబంధంగా పని చేస్తుందని వివరించారు. కస్టమర్లకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలను అందించేందుకు డిజిటల్, డేటా అనలిటిక్స్, ఏఐ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటున్నట్లు పేర్కొన్నారు.

టైర్ల ధరలు తగ్గించిన సియట్



న్యూఢిల్లీ: జీఎస్టీ తగ్గింపు ఫలాలను కంపెనీలు కస్టమర్లకు పంచుతున్నాయి. తాజాగా టైర్ల తయారీ సంస్థ సియట్ తన అన్ని రకాల టైర్ల ధరలు తగ్గించింది. న్యూమాటిక్ టైర్ల (గాలితో నింపే టైర్ల) జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి, ట్రాక్టర్ల టైర్లు, ట్యూబ్లుపై 18% నుంచి 5% జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాన్ని పూర్తిగా డీలర్లు, కస్టమర్లకు అందిస్తామని కంపెనీ ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 22 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది.

భవిష్యత్ భారత్‌దే..!

- స్థిరమైన విధానాలతో తయారీ హబ్‌గా ఎదగొచ్చు
- పరిశ్రమకు బాసటగా ప్రభుత్వం
- మారుతీ సుజుకీ ఎండీ తకేయూచి



న్యూఢిల్లీ: బలమైన ఆర్థిక శక్తిగా భవిష్యత్తంతా భారత్‌దేనని ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాషి తకెయూచి తెలిపారు. రాబోయే అనేక దశాబ్దాల పాటు భారత్ హవా నడుస్తుందన్నారు. దేశం ఆకాంక్షిస్తున్నట్లుగా ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగాలంటే విధానాలపరంగా స్థిరత్వం అవసరమని చెప్పారు. ఆటోమోటివ్ విడిభాగాల తయారీ సంస్థల సంఘం ఏసీఎంఏ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా తకెయూచి ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా భౌగోళికరాజకీయ, ఆర్థిక సంక్షోభ పరిస్థితులు నెలకొన్న తరుణంలో విశ్వసనీయమైన తయారీ హబ్‌గా తన స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు భారత్ ముందు చక్కని అవకాశం ఉందని చెప్పారు. 'చరిత్రను చూస్తే ప్రతి కొన్ని దశాబ్దాలకు ఓ కొత్త దేశం ఆర్థిక శక్తిగా ఆవిర్భవించడం కనిపిస్తుంది. అమెరికా, జపాన్, హాంకాంగ్ మొదలైన వాటిని చూశాం. గత మూడు దశాబ్దాల కాలం చైనాకి చెందింది. ఆ దేశం ప్రపంచానికే ఫ్యాక్టరీగా ఎదిగింది. ఇకపై వచ్చే అనేక దశాబ్దాల పాటు భారత్ హవా ఉంటుంది' అని ఆయన తెలిపారు. ఉద్యోగం చేయగలిగే వయస్సున్న జనాభా అత్యధికంగా ఉండటం, వేగంగా వృద్ధి చెందుతున్న నాలుగు లక్షల కోట్ల డాలర్ల ఎకానమీ, క్రియాశీలకమైన ప్రభుత్వ మద్దతు, కొత్త ఆవిష్కరణలు చేయడంపై ప్రజల్లో అమితాసక్తి తదితర అంశాలు భారత్‌కి సానుకూలమైనవని తకెయూచి చెప్పారు.

జపాన్ తరహాలోనే ఇక్కడ కూడా..

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు జపాన్ ఏ విధంగానైతే పరిశ్రమలకు బాసటగా నిల్చిందో భారత్‌లోను అదే తరహా పరిస్థితి కనిపిస్తోందని తకెయూచి చెప్పారు. 'ప్రభుత్వం కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించింది, పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం), మేకిన్ ఇండియా లాంటి సాహసోపేత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇటీవల ప్రత్యక్ష పరోక్ష పన్నులను తగ్గించడంతో పాటు దేశీయంగా డిమాండ్‌కి ఊతమిచ్చేందుకు వడ్డీ రేట్లను తగ్గించడం లాంటి చర్యలన్నీ కూడా అంతిమంగా తయారీ రంగ వృద్ధికి దోహదపడతాయి' అని ఆయన పేర్కొన్నారు. ఇవన్నీ కూడా పరిశ్రమ పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను సూచిస్తాయని చెప్పారు.

టారిఫ్‌లు పెద్ద సవాలే..

భారత ఎగుమతులపై అమెరికా భారీ టారిఫ్‌లు విధించడమనేది ఆటో విడిభాగాల పరిశ్రమకు పెద్ద సవాలేనని తకెయూచి అభిప్రాయపడ్డారు. అయితే, దీన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున సానుకూల ఫలితాలు రాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇరు దేశాలు కొన్ని సానుకూల ప్రకటనలు చేసినట్లు తెలిపారు. భారత ఆర్థిక వృద్ధితో పాటు దేశ ఆటో పరిశ్రమ భవిష్యత్తు కూడా మరింత ఆశావహంగా కనిపిస్తోందన్నారు. 2024–25లో 523 బిలియన్ డాలర్ల మార్కును దాటిన ఆటో విడిభాగాల ఎగుమతులు 2030 నాటికి రెట్టింపు కాగలవని తకెయూచి చెప్పారు. 'అంతర్జాతీయ తయారీ హబ్‌గా భారత్ ఎదుగుతున్న విషయాన్ని ప్రపంచం గమనిస్తోంది. అందుకే తమ తొలి గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహనం ఈ–విటారా తయారీ కోసం సుజుకీ మోటార్ కార్పొరేషన్ ఈ దేశాన్ని ఎంచుకుంది. ఈ వాహనం 100 దేశాలకు ఎగుమతి అవుతుంది' అని పేర్కొన్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఇక భారీ ఐపీవోలకు జోష్	జీఎస్‌టీ కోతతో ఇళ్లకు డిమాండ్

ఎనిమిదో రోజూ నిఫ్టీ ర్యాలీ

- సెన్సెక్స్ లాభం 356 పాయింట్లు
- ఫెడ్ రిజర్వ్ రేట్ల తగ్గింపు అంచనాలు
- యూఎస్‌తో ట్రేడ్ డీల్ సఫలంపై ఆశలు

ముంబై: అమెరికాతో వాణిజ్య చర్చలు సఫలమవుతాయనే ఆశలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల ప్రభావంతో స్టాక్ సూచీల లాభాల జోరు శుక్రవారం కూడా కొనసాగింది. సెన్సెక్స్ 356 పాయింట్లు బలపడి 81,905 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది అయిదో రోజూ లాభాల ముగింపు. వరుసగా ఎనిమిదో రోజూ లాభపడిన నిఫ్టీ 109 పాయింట్లు పెరిగి 25,114 వద్ద నిలిచింది. సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో ఉదయమే లాభాలతో మొదలైన సూచీలు రోజంతా అదేజోరు కొనసాగించాయి.. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, టెలికమ్యూనికేషన్, యుటిలిటీస్, విద్యుత్ షేర్లు రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 444 పాయింట్లు బలపడి 81,992 వద్ద, నిఫ్టీ 134 పాయింట్లు ఎగసి 25,139 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. చైనా, సింగపూర్ మినహా ఆసియా మార్కెట్లు 1.50% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు పావు శాతం నష్టాలతో ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- లాభాల మార్కెట్లోనూ కన్జూమర్ డిస్క్రెషనరీ, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.27%, 0.9 శాతం పెరిగాయి.
- రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపడంతో ఇన్ఫోసిస్ షేరు 1% పెరిగి రూ.1,526 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 2.32% లాభపడి రూ.1,545 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,686 కోట్లు పెరిగి రూ.6.33 లక్షల కోట్లకు చేరింది.

సాక్షి స్పోర్ట్స్



బెంగళూరు బుల్స్ 'హ్యాట్రిక్' విజయం

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో బెంగళూరు బుల్స్ జట్టు 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన తొలి పోరులో బెంగళూరు బుల్స్ 28–23 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌పై గెలుపొందింది. బెంగళూరు తరఫున అలీ రెజా 8 రెయిడ్ పాయింట్లతో సత్తా చాటగా... దీపక్ (5 పాయింట్లు), సత్యప్ప (4 పాయింట్లు) రాణించారు. జైపూర్ జట్టు తరఫున నితిన్ కుమార్ 8 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46–36 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై విజయం సాధించింది. తలైవాస్ తరఫున అర్జున్ దేశ్వాల్ 17 పాయింట్లతో విజృంభించాడు. బెంగాల్ వారియర్స్ తరఫున దేవాంక్ 13 పాయింట్లతో పోరాడాడు. లీగ్‌లో భాగంగా నేడు యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్... పుణేరి పల్టన్‌తో తెలుగు టైటాన్స్ ఆడతాయి.



సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

హాంకాంగ్: ఈ ఏడాది తమ అద్భుత ఫామ్ కొనసాగిస్తూ... భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఆరో టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో భాగంగా శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21–14, 20–22, 21–16తో జునైది ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీకి గట్టిపోటీనే ఎదురైంది. తొలి గేమ్ నెగ్గిన భారత ద్వయం రెండో గేమ్‌లో తడబడింది. 16–20తో వెనుకబడిన దశలో ఒక్కసారిగా విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి స్కోరును 20–20తో సమం చేసింది. అయితే మలేసియా జోడీ వరుసగా రెండు పాయింట్లు గెలిచి గేమ్‌ను సాధించి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో గేమ్‌లో సాత్విక్-చిరాగ్ తమ వ్యూహాలను మార్చి ఆడి పైచేయి సాధించారు. స్కోరు 6–5 వద్ద సాత్విక్-చిరాగ్ వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 10–5తో ముందంజ వేశారు. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నారు.

లక్ష్య సేన్‌దే పైచేయి...

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ సెమీఫైనల్లో అడుగు పెట్టాడు. భారత రెండో ర్యాంకర్ ఆయుశ్ శెట్టితో జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 66 నిమిషాల్లో 21–16, 17–21, 21–13తో విజయం సాధించి ఈ ఏడాది రెండో టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ఈ ఏడాది 13 టోర్నీల్లో ఆడిన లక్ష్య సేన్ మకావ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకున్నాడు.

గుకేశ్‌ను నిలువరించిన దివ్య



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో పోటీపడుతున్న భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ నాలుగో 'డ్రా' నమోదు చేసింది. ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తో శుక్రవారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌ను దివ్య 103 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఇటీవల మహిళల ప్రపంచకప్ టోర్నీలో విజేతగా నిలిచిన దివ్య రేటింగ్ 2478 పాయింట్లు కాగా... గుకేశ్ రేటింగ్ 2767 పాయింట్లు. ఈ టోర్నీలో వరుసగా మూడు పరాజయాల తర్వాత గుకేశ్ 'డ్రా'తో గట్టెక్కాడు. ఎనిమిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానంద, ప్రణవ్, అభిమన్యు పురాణిక్, లియోన్, ఆదిత్య మిట్టల్, రౌనక్ సాధ్వాని, నారాయణన్, ఆర్యన్ చోప్రా తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోగా... విదిత్, పెంటేల హరికృష్ణ ఓటమి చవిచూశారు. కార్తికేయన్ మురళీ మాత్రం విజయాన్ని అందుకున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి తొలి ఓటమి చవిచూసింది. బీబీసారా అసబయేవా (కజకిస్తాన్)తో జరిగిన గేమ్‌లో వైశాలి 39 ఎత్తుల్లో ఓడిపోయింది. ఓల్గా గిర్యా (రష్యా)తో జరిగిన గేమ్‌ను ద్రోణవల్లి హారిక 43 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఎనిమిదో రౌండ్ తర్వాత వైశాలి 6 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి రెండో స్థానంలో, హారిక 4.5 పాయింట్లతో 20వ స్థానంలో ఉన్నారు.

'పసిడి' పోరుకు జైస్మీన్, నుపుర్

సెమీస్ చేరి పతకం ఖాయం చేసుకున్న మీనాక్షి • పురుషుల విభాగంలో భారత్‌కు నిరాశ


జైస్మీన్


నుపుర్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళా బాక్సర్లు నాలుగు పతకాలు ఖరారు చేసుకొని భారత్ పరువును నిలబెట్టారు. 57 కేజీల విభాగంలో జైస్మీన్ లంబోరియా, ప్లస్ 80 కేజీల విభాగంలో నుపుర్ షెరాన్ ఫైనల్లోకి దూసుకెళ్లి పసిడి పతకాలకు విజయం దూరంలో నిలిచారు. 48 కేజీల విభాగంలో మీనాక్షి హుడా సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. 80 కేజీల విభాగంలో ఇప్పటికే పూజా రాణి సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన 57 కేజీల విభాగం సెమీఫైనల్లో జైస్మీన్ 5–0తో అల్కాలా కరోలినా (వెనిజులా) ఘనవిజయం సాధించింది. ఫైనల్లో జూలియా జెరెమిటా (పోలాండ్)తో జైస్మీన్ తలపడుతుంది. అల్కాలాతో జరిగిన బౌట్‌లో జైస్మీన్ ఆద్యంతం ఆధిపత్యం కనబరిచింది. మూడు రౌండ్లలోనూ భారత బాక్సర్‌దే పైచేయి సాధించింది. ప్లస్ 80 కేజీల విభాగం సెమీఫైనల్లో నుపుర్ 5–0తో సేమా దుజ్‌టాస్ (టర్కీ)పై గెలుపొందింది. 48 కేజీల విభాగం క్వార్టర్ ఫైనల్లో మీనాక్షి 5–0తో అలైస్ పంఫేరి (ఇంగ్లండ్)పై నెగ్గింది. నేడు జరిగే సెమీఫైనల్లో లుట్‌సైఖాన్ (మంగోలియా)తో మీనాక్షి తలపడుతుంది. మరోవైపు పురుషుల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. 12 ఏళ్ల తర్వాత భారత పురుష బాక్సర్లు ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి రిక్తహస్తాలతో వెనుదిరిగారు. బరిలో మిగిలిన చివరి బాక్సర్ జాదూమణి సింగ్ (50 కేజీలు) కూడా ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో జాదూమణి సింగ్ 0–4తో వరల్డ్ చాంపియన్ సంజార్ తష్కెన్‌బె (కజకిస్తాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మూడు కాంస్యాలు లభించాయి.


దక్షిణేశ్వర్ ధమాకా

- ప్రపంచ 155వ ర్యాంకర్‌పై సంచలన విజయం
- సుమిత్ నగాల్ కూడా గెలుపు
- స్విట్జర్లాండ్‌పై 2–0తో ఆధిక్యంలో భారత్
- నేడు మరో మ్యాచ్ గెలిస్తే డేవిస్‌కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత


దక్షిణేశ్వర్


సుమిత్ నగాల్

బీల్ (స్విట్జర్లాండ్): ఐదేళ్ల విరామం తర్వాత డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించేందుకు భారత్ చేరువైంది. మరో విజయం సాధిస్తే 2020 తర్వాత భారత్ మళ్లీ డేవిస్‌కప్ ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ టోర్నీ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌లో చోటు సంపాదిస్తుంది. స్విట్జర్లాండ్ జట్టుతో శుక్రవారం మొదలైన వరల్డ్ గ్రూప్–1 రౌండ్ మ్యాచ్‌లో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత్‌కు విజయం దక్కింది. ఫలితంగా భారత్ 2–0తో స్విట్జర్లాండ్‌పై ఆధిక్యంలో నిలిచింది. తొలి సింగిల్స్‌లో ప్రపంచ 626వ ర్యాంకర్, తమిళనాడు ప్లేయర్ దక్షిణేశ్వర్ సురేశ్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ 155వ ర్యాంకర్ జెరోమ్ కిమ్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణేశ్వర్ 7–6 (7/4), 6–3తో నెగ్గి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో దక్షిణేశ్వర్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశాడు. ప్రధాన ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడంతో అనుకోకుండా డేవిస్ కప్ జట్టులో చోటు దక్కించుకున్న దక్షిణేశ్వర్... కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ నమ్మకాన్ని నిలబెడుతూ... కీలక సమయంలో సత్తా చాటాడు. తన ఎత్తును వినియోగించుకుంటూ... నెట్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. 'నా ఆట నేను ఆడాను. వేరే విషయాలని దరిచేరనివ్వలేదు. దేశం కోసం తొలిసారి బరిలోకి దిగినప్పుడు ఒత్తిడి ఉండటం సహజమే. నా బలమేంటో నాకు తెలుసు. దాన్ని సద్వినియోగం చేసుకుంటూ విజయం సాధించా' అని మ్యాచ్ అనంతరం దక్షిణేశ్వర్ అన్నాడు. ఇక రెండేళ్ల తర్వాత డేవిస్ కప్ బరిలోకి దిగిన భారత నంబర్‌వన్, ప్రపంచ 290వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 6–3, 7–6 (7/4)తో ప్రపంచ 222వ ర్యాంకర్ హుస్లెర్‌ను ఓడించి భారత్ ఆధిక్యాన్ని 2–0కు పెంచాడు. నేడు మరో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. ముందుగా డబుల్స్ మ్యాచ్‌లో జాకబ్ పాల్-స్ట్రికర్ జంటతో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి-శ్రీరామ్ బాలాజీ ద్వయం పోటీపడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత జోడీ గెలిస్తే 3–0తో విజయాన్ని ఖాయం చేసుకుంటుంది. రివర్స్ సింగిల్స్‌లో జెరోమ్ కిమ్‌తో నగాల్; హుస్లెర్‌తో దక్షిణేశ్వర్ ఆడతారు.


మొహమ్మద్ హారిస్

పాకిస్తాన్ జోరు

- ఆసియా కప్‌లో శుభారంభం
- ఒమన్‌పై 93 పరుగులతో ఘన విజయం

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీని పాకిస్తాన్ జట్టు విజయంతో మొదలు పెట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాక్ 93 పరుగుల తేడాతో ఒమన్‌ను ఓడించింది. తొలిసారి ఆసియా కప్ బరిలోకి దిగిన ఒమన్ జట్టు పాక్ బౌలింగ్ ముందు నిలబడలేకపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేయగా...ఛేదనలో ఒమన్ 16.4 ఓవర్లలో 67 పరుగులకే కుప్పకూలింది. అబుదాబిలో నేడు జరిగే మ్యాచ్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్ తలపడతాయి. ఓపెనర్ సయిమ్ అయూబ్ (0) డకౌట్ కాగా... మొహమ్మద్ హారిస్ (43 బంతుల్లో 66; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాహిబ్‌జాదా ఫర్హాన్ (29 బంతుల్లో 29; 1 ఫోర్) కలిసి పాక్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. ఆరంభంలో ప్రత్యర్థిని కట్టడి చేయడంలో ఒమన్ సఫలమైనా...ఆ తర్వాత పట్టు విడిచింది. హారిస్, ఫర్హాన్ రెండో వికెట్‌కు 64 బంతుల్లో 85 పరుగులు జోడించారు. కెప్టెన్ సల్మాన్ ఆఘా (0) తొలి బంతికే వెనుదిరగ్గా... ఫఖర్ జమాన్ (23 నాటౌట్; 2 ఫోర్లు), మొహమ్మద్ నవాజ్ (19 నాటౌట్) కూడా కీలక పరుగులు జత చేయడంతో స్కోరు 150 పరుగులు దాటింది. ఒమన్ బౌలర్లలో షా ఫైసల్, ఆమిర్ కలీమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఒమన్ పూర్తిగా చేతులెత్తేసింది. హమ్మద్ మీర్జా (23 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ కనీసం క్రీజ్‌లో నిలబడలేకపోయారు. పాకిస్తాన్ తరఫున ఫహీమ్ అష్రఫ్, ముఖీమ్, అయూబ్ తలా 2 వికెట్లు తీశారు. పాక్ తమ తర్వాతి మ్యాచ్‌లో రేపు భారత్‌ను ఎదుర్కొంటుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



ఒకప్పుడు.. అభిమాన తారల ఫొటోలు బ్యాచిలర్స్ రూముల్లో దర్శనమిచ్చేవి. ఇంటర్నెట్ వచ్చాక ఫొటోలు, వీడియోల రూపంలో ఆ అభిమానం మొబైల్ తెరకెక్కింది. గోడలకున్న చిత్రాలతో ఏ ఇబ్బందీ లేదు. సమస్యల్లా ఈ మొబైల్‌లో ప్రత్యక్షమయ్యే ఫొటోలు, వీడియోలతోనే. కృత్రిమ మేధ (ఏఐ) విపరీత ధోరణులు, సోషల్ మీడియా కాస్తా సోషల్ కామర్స్ (సామాజిక వ్యాపార వేదికలు) కావడంతో సామాన్యులు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఏఐ సాధనాలను ఉపయోగించి అభిమాన తారల ఫొటోలు, వీడియోలతో సైబర్ నేరగాళ్ల ఆర్థిక మోసాలకు తెగబడుతున్నారు.

వెల్లువెత్తుతున్న సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలు
గేమింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్టు ప్రచారం
రోజూ 1,000కి పైగా ఫిషింగ్ డొమైన్స్ నమోదు
సోషల్ మీడియా వీడియోలతో తస్మాత్ జాగ్రత్త

పేరు, వాయిస్, వీడియోను చట్టవిరుద్ధ వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం ద్వారా వివిధ సంస్థలు తన ప్రచార, వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘిస్తున్నాయని, అలాగే తన ఫొటోలను అశ్లీల కంటెంట్‌లో మార్ఫింగ్ చేశారని నటి ఐశ్వర్య రాయ్ న్యాయస్థానం మెట్లు ఎక్కిన సంగతి తెలిసిందే. దాంతో, ఆమె అనుమతి లేకుండా పేరు, ఇమేజ్, వాయిస్ వాడడానికి వీల్లేదని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఒక్క ఐశ్వర్య మాత్రమే కాదు.. బాధితుల జాబితాలో ప్రపంచవ్యాప్తంగా చాలామంది సెలబ్రిటీలు ఉన్నారు. తన పేరు, ఫొటోలను ఉపయోగించి అనధికారికంగా వస్తువుల అమ్మకాలు, వక్రీకరించిన వీడియోలతో దోపిడీకి పాల్పడుతున్నారని నటులు జాకీష్రాఫ్, అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్ సైతం 2024లో చట్టపరంగా రక్షణ కోరారు.



ప్రముఖుల ఫొటోలు, వీడియోలు

ప్రధాని నరేంద్ర మోదీ ఓ పెట్టుబడి పథకాన్ని ప్రచారం చేస్తున్నట్టుగా డీప్‌ఫేక్ వీడియో ఫేస్‌బుక్‌లో కొన్నిరోజుల క్రితం వైరల్‌గా మారింది. అలాగే క్రికెటర్లు కోహ్లీ, సచిన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్టు డీప్‌ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి.. ఇలా ప్రముఖ నాయకులు, పారిశ్రామికవేత్తలు, నటులు, ఆర్‌బీఐ, బ్యాంకులు, పలు కంపెనీల లోగోలు, ఫొటోలు, వీడియోలతో మోసపూరిత పథకాలను, అనధికార వ్యాపారాలను ప్రచారం చేయడానికి వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వేదికగా డీప్‌ఫేక్ ఇమేజెస్, వీడియోలు వెల్లువెత్తుతున్నాయి. మెటా తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రత్యక్షమయ్యే ఏఐతో రూపొందిన వీడియోలు, చిత్రాలు, వాయిస్‌కు 'మేడ్ విత్ ఏఐ' అని 2024 మే నుంచి చూపిస్తోంది. తప్పుడు సమాచారంతో కూడిన డీప్‌ఫేక్ వీడియోలను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించేలా యూట్యూబ్‌ను యూజర్లు అభ్యర్థించవచ్చు.

రోజుకు 1,000కిపైగా..

ఏడు దేశాలకుపైగా నెటిజన్లను మోసం చేయడానికి స్కామర్లు ప్రతిరోజూ 1,000కి పైగా ఫిషింగ్ డొమైన్స్‌ను రిజిస్టర్ చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, అనంత్ అంబానీ, జావెలిన్ క్రీడాకారుడు నీరజ్ చోప్రా, క్రికెటర్ విరాట్ కోహ్లీతోపాటు ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో, అమెరికన్ యూట్యూబర్ జేమ్స్ డొనాల్డ్‌సన్ (మిస్టర్ బీస్ట్), డెడ్‌పూల్ చిత్ర నటుడు ర్యాన్ రేనాల్డ్స్, పాకిస్తానీ నటి హనియా అమీర్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు గేమింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నట్టుగా డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి మోసగిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'క్లౌడ్‌సెక్' ఇటీవల తెలిపింది. ఈ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రజలను ఆకర్షించడానికి నకిలీ ప్లే స్టోర్‌ను కూడా సైబర్ నేరగాళ్లు సృష్టించారని వెల్లడించింది. ఆసక్తికర విషయం ఏమంటే సులభంగా డబ్బు సంపాదించేందుకు సామాన్యులకు ఈ గేమింగ్ యాప్స్ దోహదం చేస్తున్నాయని పేరొందిన టీవీ యాంకర్స్ న్యూస్‌లో చెప్పినట్టుగా ఈ డీప్‌ఫేక్ వీడియోలను రూపొందిస్తున్నారు. స్కామర్లు 2024 సెప్టెంబర్ ప్రారంభంలో యూరప్ ప్రజలను లక్ష్యంగా చేసుకున్నారు. ఆ తరువాత భారత్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ వంటి అనేక దేశాలకు విస్తరించారు.

ఎన్ని మోసాలో!

2024లో భారత్‌లో కేవలం నాలుగు నెలల్లో పెట్టుబడి మోసాల తాలూకు 63 వేల కేసులు నమోదయ్యాయని సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'రెడ్‌హంట్ ల్యాబ్స్' వెల్లడించింది. 48% కేసుల్లో బాధితులు ఒక్కొక్కరు సగటున రూ.50,000 పైచిలుకు నష్టపోయారు.

భారత్‌లో మోసపూరిత లింకులతో కూడిన 20 లక్షలకుపైగా ఖాతాలను మెటా తొలగించింది. 66 లక్షల మోసపూరిత ఖాతాలను వాట్సాప్ నిషేధించింది.

ఫేస్‌బుక్ ప్రకటన సమీక్ష వ్యవస్థ కళ్లుగప్పి మోసగాళ్లు స్వల్పకాలిక ప్రచారాలు, మోసపూరిత లింక్స్, ఏఐ ఆధారిత కంటెంట్‌ను ఉపయోగించి తప్పించుకుంటున్నారు.

మోసపూరిత ప్రకటనల్లో 80% స్థానిక భాషల్లో రూపొందించినవే కావడం విశేషం.

వినియోగదారులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకట్టుకునే టైటిల్‌తో నకిలీ వార్తా కథనాలు, మోసపూరిత ప్రకటనలపై క్లిక్ చేయగానే.. విశ్వసనీయ భారతీయ మీడియా సంస్థల ప్రముఖ యాంకర్లు సెలబ్రిటీలను ఇంటర్వ్యూ చేసినట్టుగా డీప్‌ఫేక్ వీడియోలు ప్లే అవుతాయి.

రైల్వే భద్రతలో సీసీటీవీ కెమెరాలు కీలకం: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: రైల్వే స్టేషన్లలో, ప్రయాణికుల భద్రత కోసం విస్తృతస్థాయిలో సీసీటీవీ కెమెరాలను వినియోగించాలని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో రైళ్లలో చోరీలు, డ్రగ్ సరఫరాలను పసిగట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించిన జీఆర్పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్), ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) అధికారులు తరచూ సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైల్వేల రాష్ట్ర స్థాయి భద్రత కమిటీ సమావేశాన్ని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ పలు సూచనలు చేశారు. దొంగతనాలు, మరణాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ సరఫరా వంటి నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. మానవ అక్రమ రవాణాపై తలపెట్టిన ఆపరేషన్ 'ఆహత్'ను పకడ్బందీగా కొనసాగించాలన్నారు. నేరస్తులకు సంబంధించిన చార్జిషీట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు డీజీపీ సూచించారు. సమావేశంలో అడిషనల్ డీజీపీ (పర్సనల్) అనిల్ కుమార్, రోడ్ సేఫ్టీ, రైల్వే ఐజీ రమేశ్ నాయుడు, రైల్వేస్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆరోమాసింగ్ ఠాకూర్, ఐఎస్‌డబ్ల్యూ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, రైల్వేస్ ఎస్పీ చందనా దీప్తి, ఆర్పీఎఫ్ ఎస్పీ నవీన్, ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్ రాధి, రైల్వే సీనియర్ డివిజనల్ మేనేజర్ సీహెచ్ కరుణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. రైల్వేల భద్రతపై జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు.



● కడుపు కోత.. గుండె కోత.. అంటే ఏమిటి? ఎదిగొస్తున్న బంగారు తల్లి ఇక లేదంటే జీర్ణించుకోవడం ఎవరి వల్ల సాధ్యం? పదో తరగతి పూర్తి కాకుండానే పదేళ్ల నిండి బలైపోయిన చిట్టి తల్లిని తిరిగి తెచ్చివ్వగలరా? ఆ చిన్నారి తల్లి అడుగుతున్నది 'న్యాయం' చేయాలని మాత్రమే..

వాహనాలకు రిఫ్లెక్టర్లు ఇక తప్పనిసరి

- రాత్రి వేళ ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- రిఫ్లెక్టర్లు, రియర్ మార్కింగ్ ప్లేట్ల ఏర్పాటు, వాటి తయారీపై విధివిధానాలు వెల్లడిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్



రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ఇక వాహనాలకు కచ్చితంగా రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసుకోవాల్సిందే. ఈ నిబంధన మోటారు వాహన చట్టంలో పొందుపరిచినదే. గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. కానీ, అది అంతగా అమలు జరగటం లేదు. ముఖ్యంగా భారీ వాహనాలను రోడ్డు పక్కన నిలిపినప్పుడు, అవి నెమ్మదిగా ముందుకు సాగుతున్న సమయంలో.. వాటి వెనక రిఫ్లెక్టర్లు సరిగా లేకపోవటంతో వెనక నుంచి వేగంగా వచ్చే వాహనాలు చీకట్లో వాటిని గమనించకుండా ఢీకొంటున్నాయి. పలు సందర్భాల్లో ఇవి తీవ్ర ప్రాణనష్టం కలిగించే భారీ ప్రమాదాలుగా మారుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, వాహనాలకు రిఫ్లెక్టర్లను అమర్చే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలు తెలుపుతూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఇండియన్ ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ (ఏఐఎస్) 057, 090, 089 ప్రమాణాలకు అనుగుణంగా రిఫ్లెక్టివ్ టేప్‌లు, రియర్ మార్కింగ్ ప్లేట్‌లు అమర్చాల్సి ఉంటుంది. నకిలీ, నాణ్యత లేనివి అమర్చకుండా ఉండేందుకు వీలుగా ప్రభుత్వం ఆ ఉత్తర్వులో విధివిధానాలను వెల్లడించింది. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ట్రెయిలర్లు, పవర్ టిల్లర్లు, నిర్మాణ సామగ్రి తరలించే వాహనాలు సహా అన్ని రకాల వాహనాలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఉత్తర్వులో స్పష్టం చేసింది.

- ➤ ప్రభుత్వం పేర్కొన్న టెస్టింగ్ ఏజెన్సీలు ఆమోదించిన రిఫ్లెక్టివ్ టేప్‌లు, రియర్ మార్కింగ్ ప్లేట్‌లను తయారు చేసే సంస్థలను ఎంపానల్ చేయాల్సి ఉంటుంది. విదేశీ తయారీదారులు అయితే దేశంలో 100 శాతం యాజమాన్యంతో రిజిస్టర్డ్ సబ్సిడరీ కంపెనీ కలిగి ఉండాలి.
- ➤ ఇక నుంచి వాహన రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ సమయంలో రిఫ్లెక్టివ్ టేప్‌లు సరైన స్థితిలో ఉన్నాయని అధికారులు నిర్ధారించాలి.
- ➤ ప్రామాణికాలు, నిబంధనలను ఉల్లంఘించే వారు, నకిలీల తయారీదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారు.
- ➤ రిఫ్లెక్టర్ తయారీ సంస్థలు ప్రామాణికతలను పాటిస్తున్నాయని ధ్రువీకరించేందుకు ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేస్తారు. తయారీదారులపై అధికంగా నిఘా ఉంటుంది. నకిలీవి మార్కెట్‌లోకి రాకుండా ఈ కమిటీ పర్యవేక్షించాల్సి ఉంటుంది.

నకిలీ ఐటీసీ స్కాంపై కొనసాగుతున్న ఈడీ దర్యాప్తు

తెలంగాణ సహా 5 రాష్ట్రాల్లో ఏక కాలంలో 10 చోట్ల ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: భారీ స్థాయిలో సరుకు రవాణా చేసినట్లు ఇన్వాయిస్‌లు సృష్టించిన నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో 10 చోట్ల గురువారం మొదలైన సోదాలు శుక్రవారం కొన్ని చోట్ల జరిగినట్టు సమాచారం. హరియాణా, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. కోట్లాది రూపాయల వ్యాపారాన్ని కాగితాల మీద చూపించి, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అక్రమంగా పొందినట్లు ఈడీ గుర్తించింది. పలు షెల్ కంపెనీల ఖాతాల ద్వారా దాదాపు రూ.650 కోట్లు కొందరి వద్దకు చేరాయని ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈ ఏడాది మే నెలలో శివకుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా మరింత లోతుగా ఈడీ అధికారులు తాజాగా సోదాలు చేపట్టినట్టు తెలిసింది. మరి కొందరు వ్యక్తులు, సంస్థలు నకిలీ ఐటీసీ కుంభకోణంలో భాగస్వాములైనట్లు గుర్తించిన ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

'మెటా క్రిప్టో' కీలక నిందితుడి అరెస్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంచలనం రేపిన మెటా ఫండ్ క్రిప్టో కరెన్సీ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో మొదటి నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న కీలక నిందితుడు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్ల సతీశ్‌ను గురువారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అధిక లాభాలంటూ ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.100 కోట్లు కొల్లగొట్టారన్న ప్రచారం జరుగుతున్న ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న మరో నలుగురు దాసరి రాజు, దాసరి రమేశ్, బూర శ్రీధర్, తులసీ ప్రకాశ్‌లను కూడా సీసీఎస్ పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేశారు. సతీశ్ దుబాయ్‌కి పారిపోయే అవకాశాలు ఉన్నాయన్న సమాచారంతో అతని ఇంటిపై పోలీసులు అర్ధరాత్రి దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులో పోలీసులు అరెస్టు చేసిన వారి సంఖ్య ఐదుకు చేరింది. ఈ కుంభకోణంలో వీరు సూత్రధారులంటూ 'సాక్షి' ఈ ఏడాది జూలైలోనే కుంభకోణాన్ని వెలికి తీసిన విషయం తెలిసిందే. సీపీ గౌస్‌ఆలం కేసు విచారణను సీసీఎస్‌కు బదిలీచేసి ఆయనే స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది.

16 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్

16, 620 మంది ర్యాంకర్లతో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

- స్టేట్ టాపర్‌గా నీట్‌లో 144వ ర్యాంకు సాధించిన ఎస్.ప్రజ్ఞేశ్వర్‌రావు
- నాగ మనస్విని శివ, తూము వెన్నెలకు రెండు, మూడు ర్యాంకులు
- స్థానిక జాబితా నుంచి 1,020 మంది తొలగించిన కాళోజీ వర్సిటీ
- జాబితాపై 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాల స్వీకరణ
- 15న తుది మెరిట్ లిస్టు.. దాని ఆధారంగానే కౌన్సెలింగ్ ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా ప్రవేశాల కోసం ఈ నెల 16వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం ర్యాంకర్ల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వ విద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. నీట్ యూజీలో 638 నుంచి 113 మధ్య మార్కులు సాధించి (113 కటాఫ్ మార్కులు), తెలంగాణ స్థానికత ఉన్న 16,620 మంది విద్యార్థులతో ప్రొవిజనల్ మెరిట్ జాబితాను వర్సిటీ ప్రకటించింది. నీట్–యూజీలో 144 ర్యాంకు పొందిన ఎస్.ప్రజ్ఞేశ్వర్‌రావు (638 మార్కులు) ఈ జాబితా ప్రకారం స్టేట్ టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. రెండు, మూడు స్థానాల్లో నాగ మనస్విని శివ (192వ ర్యాంకు, 633 మార్కులు), తూము వెన్నెల (307 ర్యాంకు, 626 మార్కులు) నిలిచారు.

సుప్రీంకోర్టు తీర్పు మేరకు లిస్టు..

సుప్రీంకోర్టు తీర్పుతో ఆల్ ఇండియా కోటా పోగా మిగిలిన ర్యాంకర్ల నుంచి కాళోజీ వర్సిటీ మెరిట్ జాబితాను రూపొందించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అర్హతలు లేకున్నా దరఖాస్తు చేసుకున్న 1,020 మంది విద్యార్థులను స్టేట్ కోటా నుంచి తొలగించారు. అదే సమయంలో నాలుగు కేటగిరీలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు తల్లిదండ్రుల సర్వీస్ సర్టిఫికేట్ ఆధారంగా చేసుకున్న దరఖాస్తులను వర్సిటీ ఆమోదించింది. సింగరేణి కోటా కింద ఉన్న ఏడు సీట్లకు సంబంధించి 128 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు సింగరేణి సంస్థ ఇచ్చిన సర్వీస్ సర్టిఫికెట్లు తనిఖీ చేశారు. ఎన్‌సీసీ, క్యాప్ కేటగిరీతో పాటు పీడబ్ల్యూడీ కోటా కింద చేసుకున్న దరఖాస్తులను కూడా వర్సిటీ పరిశీలించి ఆమోదించింది.

14 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు కేవలం కౌన్సెలింగ్ కోసం ప్రకటించిన తాత్కాలిక జాబితా మాత్రమేనని వర్సిటీ ప్రకటించింది. విద్యార్థులు తమ ర్యాంకు స్థానాన్ని చెక్ చేసుకోవడంతోపాటు అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు. స్థానిక కోటా నుంచి తొలగించిన 1,020 మంది విద్యార్థుల్లో అర్హులు ఉంటే, తగిన ఆధారాలతో వర్సిటీలో సంప్రదించాలని సూచించారు. అభ్యంతరాలను పరిశీలించిన తరువాత ఈ నెల 15న తుది మెరిట్ లిస్టును వర్సిటీ విడుదల చేయనుంది.

కన్వీనర్ కోటా కింద 5,769 సీట్లు

రాష్ట్రంలో 35 ప్రభుత్వ కళాశాలల్లో 4,140 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అందులో 85 శాతం.. అంటే 3,519 సీట్లు రాష్ట్ర కోటా కింద మెరిట్ లిస్టు ప్రకారం పొందే అవకాశం ఉంది. 26 ప్రైవేటు కళాశాలల్లో సుమారు 4,500 సీట్లు ఉండగా, అందులో 50 శాతం.. అంటే 2,250 సీట్లు కన్వీనర్ కోటా కింద రాష్ట్ర విద్యార్థులకు దక్కనున్నాయి. మొత్తం 5,769 సీట్లు రాష్ట్ర కోటా కింద తెలంగాణ స్థానికత గల విద్యార్థులకు దక్కనున్నాయి.

మెడికల్ పీజీ మెరిట్ జాబితా విడుదల

రాష్ట్రంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి మెడికల్ పీజీ (డిగ్రీ, డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశాల కోసం స్టేట్ ర్యాంకర్ల మెరిట్ జాబితాను కాళోజీ వర్సిటీ శుక్రవారం విడుదల చేసింది. 7,179 మంది ర్యాంకర్లకు చెందిన స్టేట్ మెరిట్ లిస్టును ప్రకటించింది. దీని ప్రకారం రాష్ట్రం నుంచి టాపర్‌గా సురవరం రుత్విక్ రెడ్డి (ఆల్ ఇండియా ర్యాంక్ –16, మార్కులు 684) నిలిచారు. తరువాత స్థానాల్లో కాయతి రోహన్ రెడ్డి (ర్యాంక్–22, మార్కులు 681), గడ్డే అలేఖ్య (ర్యాంక్ 43, మార్కులు 675) నిలిచారు. జాతీయ స్థాయిలో ఎంసీసీ (మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ) పీజీ అడ్మిషన్ల షెడ్యూల్‌ను ప్రకటించిన తరువాత, దానికి అనుగుణంగా రాష్ట్రంలో కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్లు కాళోజీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2,785 పీజీ సీట్లు ఉన్నాయి. అదనపు సీట్ల కోసం ప్రైవేటు కళాశాలలు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో ఈ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద ఎంసీసీ భర్తీ చేస్తుంది. ప్రైవేటు కాలేజీల్లో ఆల్ ఇండియా కోటా ఉండదు. ఇందులో 50 శాతం కన్వీనర్ కోటా, మిగతా 50 శాతం సీట్లను ఎన్ఆర్ఐ కోటా కింద కాలేజీల యాజమాన్యాలే భర్తీ చేసుకుంటాయి. 2024– 25లో వర్సిటీ పరిధిలో కన్వీనర్ కోటా కింద 1,422 సీట్లు భర్తీ కాగా, ఆల్ ఇండియా కోటా కింద 622 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా కింద 741 సీట్లు భర్తీ అయ్యాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

రామాయపట్నంపై నిర్దయ


రామాయపట్నం పోర్టు నిర్మాణ తీరు (ఫైల్)

పోర్టుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం

చెప్పేదొకటి.. చేసేదొకటి అనే రీతిలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి తలపెట్టిన నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు నిర్మాణ తీరే దీనికి చక్కటి ఉదాహరణ. నాడు చకచకా పనులు సాగి, గతేడాది ఏప్రిల్ నాటికి మొదటి దశ పూర్తి కావాల్సిన ఈ నౌకాశ్రయం సర్కార్ నిర్లక్ష్య ధోరణి కారణంగా అతీగతీ లేకుండాపోతోంది. దీనిపై ఏ మాత్రం దృష్టి సారించకుండా.. రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ప్రతి 50 కిలోమీటర్లకో పోర్టును ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. 70 శాతం పూర్తయిన దీనిపైనే శ్రద్ధ చూపని పాలకులు.. మిగిలిన వాటిని ఎలా నిర్మిస్తారు.. ఇదంతా బూటకమనే విషయం వారి చేష్టలతోనే స్పష్టమవుతోంది.

- నత్తనడకన నిర్మాణ పనులు
- కాంట్రాక్ట్ సంస్థ మార్పుతో ఆర్నెల్ల పాటు ఎక్కడికక్కడే
- ఆపై ప్రారంభించినా.. ఊపందుకోని వైనం
- బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణానికే పరిమితం
- నీరుగారిన ఆశయం

కందుకూరు: రామాయపట్నం పోర్టును కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్కార్ హయాంలో దీని నిర్మాణ పనులు చకచకా సాగినా, ప్రస్తుతం అడుగు ముందుకు పడటంలేదు. నూతన ప్రభుత్వం కొలువుదీరాక.. అప్పటికే పనులు చేస్తున్న ఏజెన్సీని తొలగించడంతో ఆర్నెల్ల పాటు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆ తర్వాత చేపట్టినా, పనుల్లో వేగం నేటికీ పుంజుకోలేదు. గతంలో చేసిన వర్కుల మినహా ప్రస్తుతం ఏ మాత్రం పురోగతి లేదు.

అసలెప్పటికి పూర్తవుతుందో..?

వాస్తవానికి డిసెంబర్, 2023 నాటికే వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలని నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. తదనుగుణంగా అన్ని చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే మరో నాలుగేళ్లకైనా నిర్మాణం పూర్తవుతుందాననే అనుమానం తలెత్తుతోంది.

ప్రస్తుతం.. గ్రహణం

గతేడాది జూన్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతోనే పోర్టు నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. అధికారం చేజిక్కించుకున్న వెంటనే కాంట్రాక్ట్ సంస్థ అరబిందోను తొలగించింది. తదనంతరం దాదాపు ఆర్నెల్ల పాటు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆపై నవయుగ కంపెనీకి నిర్మాణ బాధ్యతను అప్పగించారు. అయితే అప్పటికే పాత సిబ్బందిని తొలగించడం.. కార్మికులు, భారీ యంత్రాలను సమకూర్చడంలో చోటుచేసుకున్న జాప్యంతో పనులు మరింత ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్నా, అవి నామమాత్రమే. గతంలో చేపట్టిన బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణ పనులను అరకొరగా జరుపుతున్నారు. కీలకమైన డ్రెడ్జింగ్, బెర్తుల నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు.

మొదటి దశ ఎప్పుడో..?

రామాయపట్నం పోర్టు మొదటి దశలో భాగంగా 34.04 ఎమ్మెమ్టీపీఏ (మిలియన్ మెట్రిక్ టన్స్ పర్ ఆనమ్) కార్గో సామర్థ్యంతో నాలుగు బెర్తులను నిర్మించాల్సి ఉంది. వీటిలో రెండు జనరల్, ఒకటి కోల్, మరొకటి మల్టీ పర్పస్‌కు సంబంధించనవి. సముద్రంలో వచ్చే ఆటుపోట్లు, తుఫాన్లను తట్టుకునేలా సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిని నీటి ఉపరితలం నుంచి మూడు మీటర్ల ఎత్తు, 100 మీటర్ల వెడల్పుతో పెద్ద బండరాళ్లతో నిర్మించారు. ఇందులో సౌత్ బ్రేక్ వాటర్ ఫీడర్ 3.7.. నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్ 1.73 కిలోమీటర్ల మేర పనులను పూర్తి చేశారు. వీటి మధ్యలోనే బెర్తులనూ నిర్మిస్తున్నారు. లక్ష టన్నుల సామర్థ్యం గల భారీ నౌకలు నిలిచేందుకు వీలుగా సముద్ర లోతును 16 మీటర్ల వరకు గతంలోనే డ్రెడ్జింగ్ చేశారు.


గతంలోనే పూర్తయిన మొదటి బెర్తు

బల్క్ బెర్తును నిర్మించి, 2023 డిసెంబర్ నాటికే మొదటి వాణిజ్య నౌకను నిలపాలనే లక్ష్యంతో పనులు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికే మొదటి దశలో కీలకమైనవన్నీ పూర్తయ్యాయి. ఆపై సర్కార్ నిర్లిప్త ధోరణితో ఏ మాత్రం పురోగతి కనిపించడంలేదు.

ఉన్నతాశయంతో..

తీర ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఉలవపాడు మండలంలోని రామాయపట్నం వద్ద రూ.3736 కోట్ల అంచనాతో పోర్టు నిర్మాణానికి గత ప్రభుత్వంలో పునాది రాయి పడింది. 850.79 ఎకరాల్లో పనులకు 2022, జూలై 20న నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ పనులను అరబిందో సంస్థ వాయువేగంతో 70 శాతం మేర చేసింది. 18 నెలల్లోనే వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు సాగాయి. డిసెంబర్, 2023 నాటికి మొదటి వాణిజ్య నౌకను నిలపాలనే లక్ష్యంతో సర్కార్ అడుగులేసింది. అయితే ఆపై 2024 సాధారణ ఎన్నికల హడావుడి, కోడ్ అమల్లోకి రావడంతో అది సాధ్యపడలేదు.

ప్రస్తుత పరిస్థితి..

ఒక బెర్తు నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన మూడు బెర్తులతో పాటు, సముద్ర లోతును పెంచే డ్రెడ్జింగ్ పనులు జరగాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంకల్పించినా, ప్రస్తుత సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా రామాయపట్నం పోర్టు ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ అంతుచిక్కడంలేదు.

క్లుప్తంగా...

శాప్ ఎండీగా ఎస్.భరణి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీగా ఎస్.భరణి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన భరణి శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత బదిలీల్లో భాగంగా ఆమెకు శాప్ ఎండీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అలాగే శాప్ ఎండీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గిరీషాను రిలీవ్ చేసింది.

16 ఆలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని వివిధ జిల్లాల పరిధిలో ఉన్న 16 ఆలయాలకు కొత్తగా ట్రస్టు బోర్డులను నియమిస్తూ ప్రభుత్వం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా ఆలయాలకు ప్రభుత్వం నియమించిన ట్రస్టు బోర్డుల సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు బాధ్యతల్లో కొనసాగుతారని దేవదాయశాఖ శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హరి జవహర్‌లాల్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

నేతన్నలకు ఆప్కో బకాయిలు రూ.2 కోట్లు చెల్లింపు

మంత్రి సవిత వెల్లడి

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో నేతన్నలకు ఆప్కో మొత్తం బకాయిల్లో 20 శాతం(రూ. 2,00,32,615) విడుదల చేసినట్టు చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేతన్నల నుంచి కొనుగోలు చేసే వస్త్రాలను ఆప్కో షోరూమ్‌లు, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోందని, ఇలా రాష్ట్రంలో 84 సొసైటీలకు చెందిన నేతన్నల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మొదటి విడతగా విడుదల చేసిన నిధులు ఆయా చేనేత సొసైటీల ఖాతాల్లో జమకానున్నాయని పేర్కొన్నారు.

15 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదరనాయుడు

సాక్షి, అమరావతి: నాలుగు నెలలు, ఆ పై వయసు కలిగిన పశువులకు ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాధి వల్ల జీవాలు బలహీనంగా తయారై.. వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతాయన్నారు. సంకర జాతి పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుందన్నారు. టీకాల పంపిణీ కోసం 80.84 లక్షల డోసులను జిల్లాల్లో సిద్ధం చేసినట్లు చెప్పారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుపోషకులకు సూచించారు.

ఎరియర్స్ బిల్లుల సమర్పణకు గడువు పొడిగించాలి

ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఎరియర్స్ బిల్లుల సమర్పణ గడువును ఈ నెల 15 వరకు పొడిగించాలని ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ, రాజేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎఫ్ఎంఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య వల్ల బిల్లుల అప్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. 11వ తేదీ మధ్యాహ్నానికే వెబ్‌సైట్‌లో బిల్లుల అప్‌లోడ్‌ను నిలిపివేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర నిరాశ చెందారని తెలిపారు.

బాలికల సంరక్షణపై రేపు రాష్ట్రస్థాయి సదస్సు

- జేజేసీ, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల సంయుక్త నిర్వహణ
- పాల్గొననున్న హైకోర్టు సీజే ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు, అధికారులు

సాక్షి, అమరావతి: బాలికల సంరక్షణ అనే అంశంపై రాష్ట్ర హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ (జేజేసీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సంయుక్తంగా ఆదివారం విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నాయి. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ సదస్సుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రేవతి మోహితె ధెరె, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ చైర్మన్ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, సభ్యులు జస్టిస్ వడ్డిబోయన సుజాత, జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ చల్లా గుణరంజన్ పాల్గొంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏటా దేశవ్యాప్తంగా పలు అంశాలపై ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం బాలికల సంరక్షణ అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. బాలికల సంరక్షణకు సంబంధించిన చట్టాలు, వాటి అమలు, ప్రభుత్వ పథకాలు, అమలులో ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలు తదితరాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు హైకోర్టు జేజేసీ నోడల్ అధికారి, రిజిస్ట్రార్ (అడ్మిన్) వి.ఎస్.ఎస్.శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ సదస్సులో అన్ని జిల్లాల ప్రధాన జడ్జీలు, పోక్సో కోర్టుల న్యాయాధికారులు, జిల్లా న్యాయసేవాధికార సంఘాల కార్యదర్శులు, రాష్ట్ర యునిసెఫ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.రాజకుమార్, పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొంటారు.

స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ పోర్టల్ ద్వారానే బంగారు కుటుంబాలను స్వీకరించాలి

ఆర్థిక, ఆర్థికేతర కార్యకలాపాలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రణాళికా శాఖ

సాక్షి, అమరావతి: స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ మార్గదర్శుల ఆమోదంతో పోర్టల్ ద్వారానే బంగారు కుటుంబాలను స్వీకరించాలని, మార్గదర్శి/బంగారు కుటుంబాల జాబితాలో మార్పులు, చేర్పులు కూడా పోర్టల్ ద్వారానే జరగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భాగస్వామి సంస్థలు, స్వచ్ఛంద సేవకులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థికేతర కార్యకలాపాలను స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ సీఈవో ఆమోదంతో నిర్వహించాలని ఉత్తర్వుల్లో సూచించారు. ఈ కార్యకలాపాలను సంబంధిత వాటాదారులతో సంప్రదించి పారదర్శకత కోసం డాక్యుమెంట్ చేయాలని పేర్కొన్నారు. ఆర్థిక లావాదేవీల ప్రాజెక్టులకు సంబంధించి చట్టప్రకారం ఫైళ్ల ద్వారా కార్యకలాపాలను నిర్వహించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సీఎస్ఆర్ నిధులతో విద్య, వైద్య, జీవనోపాధి, మౌలిక సదుపాయాలు, వాతావరణం వంటి రంగాల్లో ప్రాజెక్టులను ఆమోదించాలని, ఆర్థిక సాయం కోసం నిధుల ఏజెన్సీలు, కార్పొరేట్ సంస్థల సహకారంతో అవగాహన ఒప్పందాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఆమోదించిన బడ్జెట్ నిబంధనలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర పీ–4 ద్వారా జరిగే చెల్లింపులు, రీయింబర్స్‌మెంట్‌లు, పరిపాలనా వ్యయాలను ప్రాసెస్ చేయాలని సూచించారు. రూ.50 లక్షలకు మించి నిధులు విడుదల, వినియోగం కోసం ప్రభుత్వ బిజినెస్ నియమావళి ప్రకారం ముందస్తు అనుమతి అవసరమని తెలిపారు. స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఆమోదం లేకపోతే ఎటువంటి ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధమైన సమ్మతి ఉండదని స్పష్టం చేశారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి

విద్యార్థి సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్

సాక్షి, అమరావతి: సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా విద్యావ్యవస్థలో అశాస్త్రీయ, మతపర ఆలోచనలను చేర్చడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆర్ఎస్‌యూ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు నూర్ మహమ్మద్ విమర్శించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకునేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రివల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) 10వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్–సీవీఆర్ కళాశాలలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో విద్యార్థులను ఉద్దేశించి నూర్ మహమ్మద్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో రాష్ట్రాల పాత్ర తగ్గించి కేంద్రం తన నియంత్రణ పెంచుకుంటోందన్నారు. ప్రాచీన, శాస్త్రీయ అంశాల ముసుగులో విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను తగ్గించి, ప్రశ్నించే తత్వాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులా?

- సాక్షి ఎడిటర్‌ను బెదిరించే ప్రయత్నం దారుణం
- సోషల్ మీడియా యాక్టివిస్టు అబ్బూరి శ్రీను అరెస్ట్ అక్రమం
- వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ నేతలు ధ్వజం

సాక్షి, అమరావతి : ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిని కూటమి నేతలు తప్పుడు కేసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ప్రెసిడెంట్ పోశం రెడ్డి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మందపాటి హరీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తూ 'సాక్షి' పత్రిక గొంతు నొక్కే ప్రయత్నం దారుణం అని మండిపడ్డారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. బెదిరించే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు 800 మంది సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టి, ఎంతో మందిని జైలుకు పంపారని.. తాజాగా సోషల్ మీడియా యాక్టివిస్టు వినుకొండ నియోజకవర్గానికి చెందిన అబ్బూరి శ్రీనును హైదరాబాద్‌లో దాచేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అబ్బూరి శ్రీను అరెస్ట్ అప్రజాస్వామిక చర్య అని.. అరెస్టుల పేరుతో సోషల్ మీడియా యాక్టివిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రభుత్వ పరికి పంద చర్య అని వారు అభివర్ణించారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారో కుటుంబ సభ్యులకు సైతం చెప్పకుండా తీసుకెళ్లడం దారుణం అన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు గురవుతున్న సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- షెడ్ల నిర్మాణానికి 90 శాతం సబ్సిడీపై ఆర్థిక చేయూతనివ్వాలి
- ఏపీ మేకలు, గొర్రెల పెంపకందారుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ గొర్రెల మేకల పెంపకందారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంటా శ్రీరామ్, పూసపాటి వెంకట్రావు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం సచివాలయంలో పశుసంవర్ధక శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో గొర్రెలు, మేకల పెంపకందారులకు రూ.10 వేల కోట్లు కేటాయించి ప్రతి పెంపకందారుకి 50 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల రుణం ఇవ్వాలని కోరారు. అన్ని జీవాలకు ఉచిత వైద్యం, మందులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏటా నాలుగుసార్లు నట్టల నివారణ మందులు, 2 సార్లు సాధారణ వ్యాక్సినేషన్‌తో పాటు ఇతర వ్యాక్సినేషన్ ఉచితంగా వేయాలన్నారు. ప్రతీ రైతు సేవా కేంద్రాల్లో నెలకు రూ.10 వేల విలువైన పశు వైద్య మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా షెడ్ల నిర్మాణానికి పశుపోషకులకు మాదిరిగా గొర్రెలు, మేకల పెంపకం దారులకు 90 శాతం సబ్సిడీ వర్తింప చేయాలన్నారు. ప్రమాదాల వల్ల మృతిచెందిన గొర్రెల కాపరులకు రూ.20 లక్షలు, సాధారణ మరణాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న పశువైద్యులు, గ్రామస్థాయి పశువైద్య సహాయకుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

తురకపాలెం మరణాలపై వారంలోగా నివేదిక ఇవ్వాలి

వైద్యశాఖ మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలపై వారంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం సమీక్షించిన ఆయన మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జిల్లా అధికారులు విఫలమయ్యారన్నారు. గ్రామంలో 18 ఏళ్లు పైబడిన 1,501 మందికి 42 రకాల పరీక్షలు చేశామన్నారు. బ్లడ్ కల్చర్ పరీక్ష ద్వారా కేవలం నాలుగురిలో మెలియోడోసిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. 7శాతం జనాభాలో మధుమేహం, కిడ్నీకి సంబంధించిన ఆర్ఎఫ్‌టీటీ (రీనల్ ఫంక్షన్ టెస్టు) 6 శాతం, 14 శాతం జనాభాలో ఏదో ఒక ఇన్ఫెక్షన్ ఉన్నట్టు తేలిందన్నారు. సమీక్షలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

శిల్పకళాకారులకు లేపాక్షి అవార్డులు

సాక్షి, అమరావతి: హస్తకళాకారుల జీవన ప్రమాణ స్థాయి పెరిగినప్పుడే ఆ కళలు భవిష్యత్తు తరాలకు అందుతాయని లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ డిజైన్ పోటీ–2025 అవార్డుల కార్యక్రమం శుక్రవారం విజయవాడ అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించారు. శిల్పకళల్లో వినూత్నత ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అధ్యక్షత వహించగా లేపాక్షి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం 15 అవార్డులకు గాను గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందించారు. నూతక్కి శ్రీనివాసరావు(కొండపల్లి బొమ్మలు–శ్రీనివాస కల్యాణం), టి.అయ్యన్న(ఏటికొప్పాక బొమ్మలు–మల్టీపర్పస్ యుటిలిటీ బాక్స్), దళవాయి అనంతమ్మ(తోలుబొమ్మలు–టేబుల్ ల్యాంప్ షేడ్), సుబ్రహ్మణ్య ఆచార్య(వుడ్ కార్వింగ్–షోకేస్ ఐటమ్), కేవీఎస్ఎన్ కిషోర్(కలంకారీ బ్లాక్ ప్రింటింగ్–వాల్ పెయింటింగ్ క్లాత్) బంగారు పతకాలు గెలుచుకున్నారు. మరో ఐదుగురు శిల్పకారులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. ఒక్కొక్కరికి రూ.10వేల నగదు బహుమతిగా అందించారు.

ఈ-గవర్నెన్స్‌పై విశాఖలో జాతీయ సదస్సు


ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం: ఈ–గవర్నెన్స్ విధానాల అమలుపై జాతీయ సదస్సును విశాఖలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ–గవర్నెన్స్ అమలు, సిబ్బంది నియామకం, సంక్షేమం, శిక్షణ, కెరీర్ అభివృద్ధి, ప్రజా ఫిర్యాదులు, ఆధునిక పరిపాలన విధానాలు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే 28వ జాతీయ ఈ–గవర్నెన్స్ సదస్సు(ఎన్‌సీఈజీ)కు ప్రజా ఫిర్యాదులు–పెన్షన్ల కేంద్ర మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ–గవర్నెన్స్ డివిజన్ నేతృత్వం వహిస్తోంది. వికసిత్ భారత్, సివిల్ సర్వీస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ పేరిట జరిగే సదస్సులో ఆరు ప్లీనరీ, ఆరు బ్రేక్ అవుట్ సెషన్లు జరగనున్నాయి. దేశం నలుమూలల నుంచి వెయ్యి మంది వరకు అతిథులు, ఐటీ రంగ నిపుణులు, ఏపీ సీఎంతో పాటు కేంద్ర, రాష్ట్రాల ఐటీ శాఖ మంత్రులు భాగస్వామ్యం కానున్నారు. సదస్సు ఏర్పాట్లు, పర్యవేక్షణ కోసం జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో కూడిన 13 ప్రధాన కమిటీలు, 10 సబ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఆర్గనైజింగ్ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ నేతృత్వం వహిస్తున్నారు. భద్రతా కమిటీకి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ నేతృత్వం వహిస్తున్నారు. వైద్య బృందాలతో కూడిన కమిటీలు, ప్లీనరీల నిర్వహణ కమిటీలు, లాజిస్టిక్స్, పబ్లిసిటీ, సుందరీకరణ, మీడియా కమిటీలను నియమిస్తూ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

విద్యుత్ సంస్థల్లో ఆధిపత్య పోరు

- ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో మధ్య పొసగని పొత్తు
- ఉద్దేశపూర్వకంగా జెన్‌కో ఎండీని పక్కనపెట్టి నిర్ణయాలు
- తాజాగా బదిలీ అయిన ట్రాన్స్‌కో జేఎండీ
- ఆ స్థానంలో జెన్‌కో ఎండీని కాదని డిస్కం సీఎండీకి ఇన్‌చార్జి బాధ్యతలు
- విశాఖలో ఉండే అధికారికి రాష్ట్రస్థాయిలో విజిలెన్స్, సెక్యూరిటీ అధికారాలు
- కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు జెన్‌కో ఎండీ సన్నాహాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఉన్నతాధికారుల ఆధిపత్యపోరు తారస్థాయికి చేరింది. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో), ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తాజాగా ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) బదిలీ కావడంతో ఆ పోస్టులో ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) సీఎండీ ఐ.పృథ్వీతేజ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో మరోసారి జెన్‌కో ఎండీని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెడుతున్నట్లు రుజువైంది. ఈ పరిణామం విద్యుత్ సంస్థల ఉద్యోగుల మధ్య తీవ్ర చర్చకు దారితీసింది.



పెద్దాయనతో పొసగడం లేదు

రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇంధనశాఖ పర్యవేక్షణలో ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీ డిస్కంలు ఏర్పాటయ్యాయి. వీటికి ఐఏఎస్ అధికారులు, విద్యుత్ శాఖలో ఉన్నతాధికారులుగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసినవారు ఎండీ, సీఎండీలుగా నియమితులవుతుంటారు. వీరితోపాటు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ), హెచ్ఆర్ జేఎండీ పోస్టులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఏపీ జెన్‌కో ఎండీగా 2023 ఏప్రిల్‌లో చేరిన కె.వి.ఎన్. చక్రధర్‌బాబు అనేక ప్రాజెక్టుల స్థాపనకు నేతృత్వం వహించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో యూనిట్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి కృష్ణపట్నం, వీటీపీఎస్‌లో 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తేవడంలో ప్రముఖపాత్ర పోషించారు. అయితే ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో అధికారుల మధ్య పొసగడం లేదనే గుసగుసలు విద్యుత్‌శాఖలో చాలాకాలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యున్నత స్థానంలో ఉన్న అధికారి చక్రధర్‌బాబుకి ప్రాధాన్యం ఇవ్వడం లేదనే వాదనలకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. తన ప్రమేయం లేకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకోవడం, కావాలనే తనను పక్కనపెట్టడం వంటి సంఘటనలతో విసిగిపోయిన చక్రధర్‌బాబు కొద్దిరోజుల కిందట ఆరోగ్య సమస్యలను కారణంగా చూపించి దీర్ఘకాలసెలవు పెట్టారు. తరువాత ప్రభుత్వ పెద్దలు బుజ్జగించడంతో విధుల్లో చేరారు. అయినా అసంతృప్తిగానే ఉంటున్న ఆయన డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా తాజాగా ఐఏఎస్ అధికారుల బదిలీల్లో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతల్ని అక్కడే ఉండే ఏపీ జెన్‌కో ఎండీకి ఇవ్వాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా ఎక్కడో ఉన్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా అత్యంత ప్రాధాన్యత కలిగిన విజిలెన్స్ విభాగానికి కూడా ఆయన్నే ఇన్‌చార్జి చేశారు. నిజానికి ఒకటి, రెండురోజుల్లో పృథ్వీతేజ్ కూడా బదిలీ అవుతారని ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో చక్రధర్‌బాబును కాదని ఆయనకు ప్రాధాన్యతనివ్వడానికి అంతర్గత విభేదాలే కారణమని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. చక్రధర్‌బాబు కేంద్ర సర్వీసులకు వెళ్లేవరకు కూడా జెన్‌కోలో కొనసాగించే అవకాశాలు లేవంటున్నారు.

ఏపీ ట్రాన్స్‌కో ఇన్‌చార్జి జేఎండీగా పృథ్వీతేజ్

సాక్షి, అమరావతి: ఏపీట్రాన్స్‌కో హెచ్ఆర్ అండ్ అడ్మిన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్(జేఎండీ)గా ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీగా ఇన్‌చార్జ్‌గా, ఏపీ పవర్ కో ఆర్డినేషన్ కమిటీ(ఏపీపీసీసీ) మెంబర్ కన్వీనర్‌గానూ పృథ్వీకి బాధ్యతలు అప్పగించారు. ఇంధన శాఖ కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ఓ అంతర్గత ఫిర్యాదుల కమిటీని కూడా విజయానంద్ ఏర్పాటు చేశారు. ఇందులో ముగ్గురు అధికారులను సభ్యులుగా నియమించారు. సెరెంటికా రెన్యూవబుల్స్ ఇండియా కంపెనీకి కర్నూలు జిల్లా తుగ్గలి, పత్తికొండ, దేవనకొండ, పందికోన, ఆస్పరి మండలాల్లోని గ్రామాల్లో 300 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతిచ్చారు. ఇదే సంస్థకు అనంతపురం జిల్లాలోని కుడైర్, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లోని గ్రామాలలో 250 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును కేటాయించారు. ఈ మేరకు వేర్వేరు ఉత్తర్వులను విజయానంద్ జారీ చేశారు.

'క్లస్టర్ల' ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: డీఎస్సీ–2025 పోస్టింగ్‌లు ఇవ్వకముందే.. రెగ్యులర్ ఖాళీలను క్లస్టర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఉండే మొత్తం ఖాళీల్లో డీఎస్సీ–2025 వారిని సర్దుబాటు చేయాలని సూచించారు. క్లస్టర్ల ఉపాధ్యాయులకు తప్పనిసరిగా న్యాయం చేయాల్సిందేనన్నారు.

• టెక్ టాక్

జూపిటర్ ది సూపర్ కంప్యూటర్





ఇక్కడ కనిపిస్తున్నదేమిటో తెలుసా? యూరప్‌లోనే ఫాస్టెస్ట్ కంప్యూటర్. పేరు జూపిటర్. పశ్చిమ జర్మనీలోని జూలిచ్ నగరంలో గత వారం దీనిని ప్రారంభించారు. ఇది యూరప్‌లో తొలి ఎక్సాస్కేల్ సూపర్ కంప్యూటర్. అంటే ఇది సెకనుకు ఒక క్విన్‌టిలియన్ (అంటే 1 పక్కన 18 సున్నాలు) కాలిక్యులేషన్స్ చేయగలదు. ఈ సూపర్ కంప్యూటర్ భారీ సైజ్‌లో ఉంటుంది. పర్యావరణ పరిశోధనల్లో, ఏ.ఐ.లో కొత్త పరిశోధనలకు ఈ కంప్యూటర్ బాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మీరు నెట్‌లో దీని గురించి మరింతగా చదివి తెలుసుకోండి.టెక్ టాక్ జూపిటర్– ది సూపర్ కంప్యూటర్ ఇక్కడ కనిపిస్తున్నదేమిటో తెలుసా? యూరప్‌లోనే ఫాస్టెస్ట్ కంప్యూటర్. పేరు జూపిటర్. పశ్చిమ జర్మనీలోని జూలిచ్ నగరంలో గత వారం దీనిని ప్రారంభించారు. ఇది యూరప్‌లో తొలి ఎక్సాస్కేల్ సూపర్ కంప్యూటర్. అంటే ఇది సెకనుకు ఒక క్విన్‌టిలియన్ (అంటే 1 పక్కన 18 సున్నాలు) కాలిక్యులేషన్స్ చేయగలదు. ఈ సూపర్ కంప్యూటర్ భారీ సైజ్‌లో ఉంటుంది. పర్యావరణ పరిశోధనల్లో, ఏ.ఐ.లో కొత్త పరిశోధనలకు ఈ కంప్యూటర్ బాగా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. మీరు నెట్‌లో దీని గురించి మరింతగా చదివి తెలుసుకోండి.

చెట్లు ఒకదానితో ఒకటి మాట్లాడుకోగలవు

• మీకు తెలుసా?



ఈ ప్రకృతిలో ఎన్నో రహస్యాలు ఉన్నాయి. మనం మన మేధోశక్తితో శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకుని ఒక్కొక్క రహస్యాన్ని ఛేదిస్తూ వస్తున్నాం. ఉన్నచోటే ఉంటూ మనకు నిత్యం ఆక్సిజన్ అందిస్తున్న చెట్లకు/మొక్కలకు ప్రాణం ఉందని జగదీష్ చంద్రబోస్ అనే శాస్త్రవేత్త శాస్త్రీయ ఆధారాలతో నిరూపించారు. మరి ప్రాణమున్న ప్రతీ జీవి శిలావిగ్రహంలా ఉండిపోదు కదా! ఇంకో ప్రాణితో కమ్యూనికేట్ చేస్తుంది. మనుషులకు భాష ఉన్నట్లు చెట్లకు కూడా వాటిదైన భాష ఉంటుందా అని సందేహం వచ్చింది మనిషికి. పరిశోధన చేశాడు.

అన్ని ప్రాణుల్లాగానే చెట్లు కూడా ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటాయని, అవి వాటి సామాజిక నెట్వర్క్‌లో భాగమని కెనడా శాస్త్రవేత్త సుజానే సిమార్డ్ తన పరిశోధనల ద్వారా నిర్ధారించారు. చెట్లు 'వుడ్ వైడ్ వెబ్' అని పిలిచే భూగర్భ మైకోరైజల్ ఫంగస్ నెట్‌వర్క్ ద్వారా కమ్యూనికేట్ చేస్తాయట. పోషకాలు, నీరు వంటి వాటి గురించి వాకబు చేసుకోవడం, ఏదైనా ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించి హెచ్చరిక చేసుకోవడం వంటి చర్యల ద్వారా ఇవి కమ్యూనికేట్ అవుతాయి. ఈ నెట్‌వర్క్ చెట్ల రూట్ సిస్టమ్‌లను కలుపుతుంది, ఇది మానవ మెదడు న్యూరాన్‌ల వంటిది.

సిమార్డ్, 1997లో నేచర్ జర్నల్‌లో తన పరిశోధనను పబ్లిష్ చేస్తూ -- పేపర్ బిర్చ్, డగ్లస్ ఫిర్ చెట్ల మధ్య కార్బన్ బదిలీని రేడియోఆక్టివ్ ఐసోటోప్‌లతో ట్రాక్ చేసినట్టు చెప్పారు. బిర్చ్ చెట్టు అధిక కార్బన్‌ను ఫిర్ చెట్టుకి పంపితే తరువాత ఫిర్ చెట్టు బిర్చ్ చెట్టుకి కార్బన్‌ని పంపింది. ఇది చెట్ల పరస్పర సహకారాన్ని చూపిస్తుంది. మరో ఎక్స్‌పెరిమెంట్‌లో గాయపడిన డగ్లస్ ఫిర్ చెట్టు పొరుగు చెట్టయిన పాండెరోసా పైన్‌కు రక్షణ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయమని సిగ్నల్ పంపగా అది ప్రతిస్పందించింది. ఇలాంటి అనేక పరిశోధనల తర్వాత ఇతర జీవుల్లానే చెట్లు కూడా సంభాషించుకుంటాయనే నిర్ధారణకు వచ్చారు శాస్త్రవేత్తలు.

• వండర్ కిడ్



లిటిల్ పొయెట్



కేరళ రాష్ట్రం కోళికోడ్‌కు చెందిన అజ్ఞా యామి దేశంలో అతి పిన్న వయస్కురాలైన కవయిత్రిగా రికార్డు సృష్టించింది. ఐదేళ్లకే కవిత్వం రాసి పుస్తకం వేసింది. రైమ్స్ చెప్పే వయసులో సొంతంగా కవిత్వం రాయడం చాలా గ్రేట్.

అజ్ఞా యామి 2017లో జన్మించింది. యూకేజీ చదువుతున్న సమయంలోనే మలయాళ పదాలతో వాక్యాలు రాస్తూ తన భావాలను వ్యక్తం చేసేది. ఆమె ప్రతిభ, భాష పట్ల మక్కువ చూసిన తల్లిదండ్రులు, శ్రీకాంత్, శ్రుతి ప్రోత్సహించారు. కవిత్వం గురించి, కవితల గురించి వివరించారు. కొన్ని కవితలు విన్న అజ్ఞా యామి తనూ కవిత్వం రాయడం మొదలెట్టింది. చుట్టూ ఉన్న ప్రపంచంలోని రకరకాల అంశాలపై కవితలు అల్లింది. బాల్యంలోని అమాయకత్వం మొదలుకొని, ప్రకృతిలోని రంగుల వరకు అనేక రకాల సబ్జెక్ట్స్ పై పొయెమ్స్ రాసింది. 30 కవితల్ని కలిపి 'వర్ణపట్టం'(రంగుల గాలిపటం) పేరుతో పుస్తకం వెలువరించింది. వాటికి బొమ్మలు కూడా తనే గీయడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అతి పిన్న వయస్కురాలైన కవయిత్రిగా రికార్డు అందించారు.



• ఊరంత స్కూలు

ఎర్లీ లెర్నింగ్ విలేజ్

మీ స్కూల్లో మొత్తం ఎంతమంది చదువుతున్నారు? 500 మంది, వెయ్యి మంది.. అంతకంటే ఎక్కువుండటం కష్టం కదూ. అయితే ఒక ఊరంత స్కూల్ మీకు తెలుసా? అక్కడ ఏకంగా 2,100 మంది స్టూడెంట్స్ ఉంటారు. ఇంకో విశేషమేమిటంటే, వీరంతా ప్రీ–స్కూల్ చదివే చిన్నారులు.

సింగపూర్ నగరం లోరాంగ్ చువాన్‌లోని ఆస్ట్రేలియన్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఏఐఎస్) క్యాంపస్ పక్కనే ఈ స్కూల్ ఉంది. దీన్ని 'ఎర్లీ లెర్నింగ్ విలేజ్ (Early Learning Village) అంటారు. ఏఐఎస్, స్టాంఫోర్డ్ అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్ కలిసి దీన్ని నిర్మించాయి. ప్రపంచంలో అతి పెద్ద ప్రీస్కూల్ ఇదే. సుమారు 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని కట్టించారు. అంటే మొత్తం ఏడు ఫుట్‌బాల్ మైదానాలంత స్థలంలో ఐదు భవనాలు, 100 కంటే ఎక్కువ తరగతి గదులతో ఈ స్కూల్‌ని నిర్మించారు. 18 నెలల నుండి ఆరు సంవత్సరాల వయస్సున్న పిల్లలు ఇక్కడ చదువుకుంటారు. వారికోసం ఈ క్యాంపస్ అంతా చెట్ల పచ్చదనంతో నిండి ఉంటుంది.

2017లో ఈ స్కూల్‌ని ప్రారంభించారు. స్కూల్ అంటే కేవలం పుస్తకాలతో కుస్తీ పట్టడం, పద్యాలు పాడించడం మాత్రమే ఉండదు. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు అనేక ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈత నేర్పేందుకు సిబ్బందితోపాటు 20 మీటర్ల స్విమ్మింగ్ పూల్ ఉంది. ఇక్కడ ఇండోర్ ఎయిర్ కండిషన్డ్ జిమ్ కూడా ఉంది. ఇక్కడ వివిధ దేశాల చిన్నారులు చేరుతుండటంతో కొన్ని పాఠాలు వారి దేశాలు, ఖండాలకు తగ్గట్లుగా నేర్పిస్తారు. ఈ క్రమంలో ఒకే వయసున్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఒక అంతస్తు కేటాయించారు. ప్రతి తరగతి విద్యార్థులను నాలుగు బృందాలుగా విభజించి, వారు మరింత చురుగ్గా మారేందుకు టీచర్లు శ్రద్ధ చూపిస్తారు. ఈ స్కూల్ గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు ప్రపంచంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చి తమ పిల్లల్ని ఇక్కడ చేర్పిస్తూ ఉంటారు.





• మహనీయులు

హిందీలో స్టార్‌గా ఎదిగిన తెలుగు తేజం




పిల్లలూ! మీలో చాలామందికి సినిమాలు చూడటమంటే ఇష్టం కదా! సినిమా హీరోల్ని ఇష్టపడుతుంటారు కదా! మన తెలుగు నేల మీద పుట్టి, ముంబయి మహానగరానికి వెళ్లి, అక్కడ హీరోగా విశేషమైన పేరు తెచ్చుకున్న ఓ వ్యక్తి ఉన్నారు. ఆయనే ఇవాళ ఆయన పైడి జైరాజ్.

పైడి జైరాజ్ పూర్తి పేరు పైడిపాటి జైరాజ్. ఆయన తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లలో 28 సెప్టెంబర్ 1909న జన్మించారు. ఆయనకు ఇద్దరు అన్నలు. పైడిపాటి సుందరరాజా, పైడిపాటి దీనదయాళ్. జైరాజ్ చిన్నవాడు కావడంతో అందరూ అతణ్ని అపురూపంగా చూసుకునేవారు. హైదరాబాద్ నగరంలోని నిజాం కళాశాలలో జైరాజ్ డిగ్రీ చదువుకున్నారు. ఆ సమయంలో నాటక రంగం, చలనచిత్రాలపై ఆసక్తి పెంచుకున్నారు. ఎలాగైనా సినిమాల్లో చేరాలన్న ఉద్దేశంతో 1929లో బొంబాయికి వెళ్లిపోయారు. 'స్టార్ క్లింగ్ యూత్' అనే నిశ్శబ్ద చిత్రంతో నటుడిగా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత 'మాతృభూమి', 'ఆల్ ఫర్ లవర్', 'మహాసాగర్ మోతి', 'ఫ్లైట్ ఇన్ టు డెత్' తదితర సైలెంట్ సినిమాల్లో నటించారు.

మంచి నటుడిగా పేరు తెచ్చుకొని హమారీ బాత్ (1943), సింగార్ (1949), అమర్ కహానీ(1949), రాజ్‌పుత్ (1951), రేషమ్(1952) తదితర చిత్రాల్లో హీరోగా నటించారు. పృథ్వీరాజ్ చౌహాన్, మహారాణా ప్రతాప్ వంటి కీలకమైన పాత్రల్లో నటించి మెప్పించారు. 1952లో 'సాగర్' అనే సినిమాను తనే నిర్మించి దర్శకత్వం వహించారు. తెలుగు వ్యక్తిగా హిందీ సినిమాల్లో హీరోగా ఎదిగిన అరుదైన ఘనతను సాధించారు. నటుడిగా ఎదుగుతున్న సమయంలోనే ఢిల్లీకి చెందిన పంజాబీ మహిళ సావిత్రిని వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. భారతీయ సినీరంగానికి ఆయన చేసిన సేవలకు గానూ 1980లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందించారు. జైరాజ్ 11 ఆగస్టు 2000న ముంబయిలో మరణించారు. ఆయన జీవితంపై 2018లో తెలంగాణ ప్రభుత్వం 'లైఫ్ జర్నీ ఆఫ్ జైరాజ్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది.


• మన పుస్తకాలు

మాడలిన్



ఫ్రాన్స్‌లో బాలలు మెచ్చిన పుస్తకం 'మాడలిన్'. 1939లో రచయిత లుడ్విగ్ బెమెల్మాన్స్ రాసిన ఈ పుస్తకం ఆ తర్వాత సిరీస్‌గా మారింది. లుడ్విగ్ తన జీవిత అనుభవాల నుండి ప్రేరణ పొంది ఈ పుస్తకం రాశారు. ప్రపంచంలోని 8 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలు చదవాల్సిన పుస్తకాల్లో ఒకటిగా నిలిచిన మాడలిన్. ప్యారిస్ నగరంలోని బాలికల బోర్డింగ్ స్కూల్లో జరిగిన పలు అనుభవాలను ఇందులో పొందుపరిచారు. బొమ్మలు ఈ పుస్తకానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

బాలలకు ఉల్లాసాన్ని అందించే గేయాలు



గ్రంథాలయోద్యమ సారథి, మానవతావాది, పత్రికా సంపాదకుడు, సాహితీవేత్త వెలగా వెంకటప్పయ్య చిన్నారుల కోసం రాసిన వెయ్యి గేయాల సమాహారం ఈ పుస్తకం. అలతి పదాలతో చిన్నారులకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించేలా రాసిన ఈ గేయాలు నేటి బాలల్లో భాషాపటిమను, సాహిత్య దృక్పథాన్ని పెంపొందిస్తాయి.

• మన సినిమా లిలో అండ్ స్టిచ్

హేయ్ కిడ్స్... జియో స్టార్‌లో ఓ సూపర్ మూవీ వచ్చిందోచ్. అదే లిలో అండ్ స్టిచ్. ఇదో సైంటిఫిక్ కామెడీ మూవీ. ఎర్త్‌కి దూరంగా ఓ ప్లానెట్‌లో ఏలియన్స్ ఓ ఎక్స్‌పరిమెంట్ చేస్తుంటారు. దాంట్లో 626 అనే సూపర్ పవర్స్ ఉన్న ఏలియన్‌ను క్రియేట్ చేస్తారు. అయితే యాక్సిడెంటల్‌గా ఆ 626 ఏలియన్ ఎర్త్ మీద పడుతుంది. అది కూడా సరిగ్గా లిలో అనే పాప ఇంటి దగ్గర పడుతుంది. ఏలియన్ ప్లానెట్ హెడ్ ఈ 626ని ఎర్త్ నుండి తీసుకురావడానికి మరో రెండు ఏలియన్స్‌ని భూమి మీదకు పంపిస్తారు. అయితే ఈ లోపు ఎవరూ లేని లిలోకి 626 దొరికి మంచి ఫ్రెండ్ అవుతుంది. లిలో దానికి స్టిచ్ అని పేరు పెడుతుంది. లిలో అండ్ స్టిచ్ చేసే అల్లరి ఈ సినిమాలో సూపర్ హైలైట్. మరీ ముఖ్యంగా స్టిచ్ చేసే అల్లరి మిమ్మల్ని గిలిగింతలు పెట్టిస్తుంది. స్టిచ్‌ని ఎత్తుకెళ్లడానికి వచ్చిన ఇద్దరు ఏలియన్లు మనుమల్లా మారి చేసే అల్లరి ఇంకా సూపర్ గా ఉంటుంది. ఇంకో సూపర్ విషయం ఏంటో తెలుసా. ఈ సినిమాని 10 క్రోర్స్ పెట్టి తీస్తే వందల కోట్లు కలెక్షన్స్‌గా వచ్చాయి. అంత హిట్ అయ్యింది. సో కిడ్స్.. హావ్ ఎ నైస్ జర్నీ విత్ లిలో అండ్ స్టిచ్ ఆన్ జియో స్టార్.

– హరికృష్ణ ఇంటూరు



• కథ

మరపురాని విందు

అనగనగా ఓ ఊర్లో రవీంద్రుడనే వ్యాపారి ఉన్నాడు. నీతి నియమాలతో అతను వ్యాపార వ్యవహారాలు నడిపేవాడు. దీంతో ఊళ్లో అందరూ అతనంటే గౌరవం, అభిమానం చూపేవారు. కొంతకాలానికి రవీంద్రుడికి వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఊరివారికి గొప్ప విందు ఇవ్వాలని అనుకున్నాడు. రవీంద్రుడు విందు ఏర్పాటు చేస్తున్నాడని తెలిసి తోటి వ్యాపారులందరూ అతని వద్దకు వచ్చారు. జీవితంలో తాము మర్చిపోలేని విందు ఇవ్వాలని, అది తమకు మరపురాని విందు కావాలని అతనితో అన్నారు. దీంతో రవీంద్రుడు ఆలోచనలో పడ్డాడు. ఊరిలో ధనవంతుల తోపాటు పేదవారు కూడా అధికంగా ఉన్నారు. వారందరికీ మరపురాని విందు ఇవ్వాలంటే ఏమేం చేయించాలని ఆలోచించాడు.

విందు రోజు రానే వచ్చింది. రవీంద్రుడు ఎలాంటి విందు ఇస్తాడోనన్న ఆత్రుతతో అందరూ అతని ఇంటికి చేరుకున్నారు. అక్కడ ధనికులకు వేరుగా, పేదలకు వేరుగా విస్తరాకులు వేశారు. ధనికులంతా ఒక వైపు, పేదవారంతా మరోవైపు కూర్చున్నారు. పనివాళ్లు వచ్చి పదార్థాలు వడ్డించడం మొదలుపెట్టారు. ధనవంతుల విస్తరాకుల్లో సంకటి, అంబలి, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయ వడ్డించారు. పేదవాళ్ల విస్తరాకుల్లో భక్ష్యాలు, పలావు, మిఠాయిలు వడ్డించారు.

ఇదంతా చూసి ధనవంతులు గగ్గోలు పెట్టారు. రవీంద్రుడు తమను అవమానించాడని ఆక్రోశించారు. మరో వైపు నిరుపేదలు రవీంద్రుడు తమకు నిజంగానే మరపురాని విందు ఇచ్చాడని మెచ్చుకున్నారు. రవీంద్రుడు వారి మధ్యకు వచ్చి 'అయ్యా! నేను ఎన్ని గొప్ప వంటకాలు తయారు చేయించినా ధనవంతులు తిననివి కానీ, కొత్తవి కానీ ఉండవు. కానీ వారి జీవితంలో సంకటి, అంబలి, ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలు తిని ఉండరు. అందుకే ఈ విందు మరపురానిదిగా ఉండాలని వారికి అవి వడ్డించమన్నాను. అలాగే నిరుపేదలు భక్ష్యాలు, పలావు, మిఠాయిలు ఎప్పుడో కానీ తినరు. అందుకే వారికి అవి వడ్డించమన్నాను' అని వివరించాడు. అతను చెప్పింది సబబే అని అందరికీ అనిపించి, 'నిజంగా ఇది మరపురాని విందే' అని ఒప్పుకున్నారు.



బిజినెస్ రీల్

ఓబెన్ మోటార్ సైకిళ్లపై పండుగ ఆఫర్లు

రూ.35,000 వరకు ప్రయోజనాలు



బెంగళూరు: ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్ల తయారీ సంస్థ 'ఓబెన్ ఎలక్ట్రిక్' పండుగల సందర్భంగా పలు ఆఫర్లు ప్రకటించింది. 'మెగా ఫెస్టివ్ ఉత్సవ్' పేరిట దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపింది. కంపెనీ ఫ్లాగ్‌షిప్ మోటారు సైకిళ్లు రోర్ ఈజెడ్ సిగ్మా, రోర్ ఈజెడ్ కొనగోళ్లపై క్యాష్ బ్యాక్‌లు ప్రకటించింది. రోర్ ఈజెడ్ సిగ్మా లేదా రోర్ ఈజెడ్‌లను రూ.20,000 వరకు ధర తగ్గించి విక్రయిస్తున్నట్టు, దీనికితోడు రూ.10,000 క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్టు కంపెనీ వెల్లడించింది. అలాగే ప్రతీ కొనుగోలుపై బంగారం కాయిన్‌ను ఇస్తున్నట్టు తెలిపింది. అలాగే లక్కీ డ్రాలో ఐఫోన్‌ను సైతం గెలుచుకోవచ్చని పేర్కొంది. తమ మోటారు సైకిళ్ల పనితీరును తెలుసుకోవడాన్ని మరింత సులభతరం చేస్తూ అసాధారణ విలువతో మెగా ఫెస్టివ్ ఉత్సవ్ కార్యక్రమాన్ని రూపొందించినట్టు ఓబెన్ ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు, సీఈవో మధుమిత అగర్వాల్ తెలిపారు.

జీనా సీఖో లైఫ్‌కేర్‌తో సేల్స్‌ఫోర్స్ జట్టు



న్యూఢిల్లీ: సీఆర్ఎం సర్వీసుల దిగ్గజం సేల్స్‌ఫోర్స్ తాజాగా ఆయుర్వేదిక్ హెల్త్‌కేర్ సంస్థ జీనా సీఖో లైఫ్‌కేర్‌తో జట్టు కట్టింది. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకునేందుకు, డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలు అందించడంలో కంపెనీకి కావాల్సిన ఏఐ ఆధారిత సొల్యూషన్స్‌ను అందించనుంది. సేల్స్‌ఫోర్స్ సర్వీస్‌క్లౌడ్, మార్కెటింగ్ క్లౌడ్‌తో వర్చువల్ ఔట్‌పేషంట్ డిపార్ట్‌మెంట్ (వీవోపీడీ), కాల్ సెంటర్ మేనేజ్‌మెంట్, మెడిసిన్ ఆర్డర్ ప్రాసెసింగ్ మొదలైన వాటన్నింటినీ ఏకీకృతం చేయడం సాధ్యపడిందని జీనా సీఖో లైఫ్‌కేర్ తెలిపింది. దీనితో కాల్ సెంటర్ రెస్పాన్స్ సమయం 50% మెరుగుపడగా, ప్రతి నెలా వీవోపీడీ సెషన్ల సంఖ్య 1,000కి పైగా ఉంటోందని పేర్కొంది. సేల్స్‌ఫోర్స్ కన్సల్టింగ్ పార్ట్‌నర్ క్వాడ్రాఫోర్ట్ టెక్నాలజీస్ ఈ సాంకేతికతలను అమలు చేస్తున్నట్లు వివరించింది. రాబోయే రోజుల్లో డేకేర్ కేంద్రాల్లాంటివి మరింతగా విస్తరించడం, చికిత్స ప్రణాళికలను మెరుగుపర్చుకునేందుకు అధునాతన ఏఐ, ప్రె డిక్టివ్ అనలిటిక్స్‌ను ఉపయోగించడం మొదలైన వాటిపై దృష్టి పెట్టనున్నట్లు జీనా సీఖో తెలిపింది.

ఇక భారీ ఐపీవోలకు జోష్

క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా భారీ కంపెనీల పబ్లిక్ ఇష్యూ నిబంధనలను సరళీకరించేందుకు నిర్ణయించింది. పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా విషయంలో వెసులుబాటును కల్పించనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల పెట్టుబడుల పరిమితినీ సవరించనుంది. వీటితో పాటు పలు తాజా ప్రతిపాదనలను శుక్రవారం(12న) నిర్వహించిన బోర్డు సమావేశంలో సెబీ అనుమతించింది. వివరాలు చూద్దాం..

- సెబీ నిబంధనల సరళీకరణ
- పబ్లిక్‌కు కనీస వాటాపై వెసులుబాటు
- 8 శాతం వాటాతో లిస్టింగ్‌కు ఓకే

ముంబై: అతి భారీ కంపెనీలు పబ్లిక్ ఇష్యూ చేపట్టడంలో దన్నునిస్తూ సెబీ తాజాగా పలు వెసులుబాట్లకు తెరతీస్తోంది. ప్రధానంగా పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా కల్పించే అంశంలో గడువును సవరించేందుకు నిర్ణయించింది. దీంతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తదితర మెగా అన్‌లిస్టెడ్ కంపెనీలు లబ్ధి పొందే వీలుంది. తాజా మార్గదర్శకాలు అమల్లోకి వస్తే దిగ్గజ కంపెనీలు లిస్టింగ్‌లోనే భారీగా వాటాను విక్రయించవలసిన అవసరం ఉండదు. పబ్లిక్‌కు కనీస వాటా కల్పించే విషయంలో తగినంత గడువుకు వీలు చిక్కనుంది.

10 శాతం నుంచి తగ్గింపు

కొత్త మార్గదర్శకాల ప్రకారం రూ. 50,000 కోట్ల నుంచి రూ. లక్ష కోట్ల మార్కెట్ విలువగల కంపెనీలు ఐపీవోలో ప్రస్తుత 10 శాతానికి బదులుగా 8 శాతం వాటాను విక్రయించేందుకు అనుమతిస్తారు. వీటికి పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా కల్పించడంలో ఐదేళ్ల గడువునిస్తారు. ప్రస్తుతం ఇది మూడేళ్లుగా అమలవుతోంది. రూ. లక్ష కోట్లకుపైన మార్కెట్ విలువతో ఐపీవోకు వచ్చే కంపెనీలు ప్రస్తుత 5 శాతానికి బదులుగా 2.75 శాతం వాటాను ఆఫర్ చేయవచ్చు. రూ. 5 లక్షల కోట్లకు మించిన అతిభారీ కంపెనీలైతే ఐపీవోలో 2.5 శాతం వాటా విక్రయానికీ వీలుంటుంది. ఇలాంటి భారీ కంపెనీలు 10ఏళ్లలో పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటా నిబంధనను అమలు చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ నిబంధన ఐదేళ్ల గడువును అనుమతిస్తోంది. వెరసి అతితక్కువ స్థాయిలో వాటా విక్రయించడం ద్వారా కంపెనీలు లిస్టయ్యేందుకు వీలు చిక్కుతుంది. తదుపరి దశలవారీగా పబ్లిక్ వాటాకు తెరతీయవచ్చు. దీంతో ఒకేసారి భారీస్థాయిలో వాటా విక్రయించవలసిన అవసరం తప్పుతుందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. తద్వారా భారీ ఐపీవోలకు లిక్విడిటీ సమస్య తలెత్తకుండా నివారించవచ్చని తెలియజేశారు.

రిటైల్ పరిమాణం ఓకే

రూ. 5,000 కోట్లకు మించిన ఐపీవోల పరిమాణంలో రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయింపులను 35 శాతంగానే కొనసాగించనున్నట్లు పాండే తెలియజేశారు. అంతేకాకుండా అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) వాటాను సైతం 50 శాతం నుంచి పెంచే ఆలోచనలేదని స్పష్టం చేశారు. అయితే దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఐపీవోలలో మరింత చోటు కల్పించేందుకు వీలుగా యాంకర్ కేటాయింపులను సవరిస్తున్నట్లు వెల్లడించారు. వీటి ప్రకారం యాంకర్ వాటా రూ. 250 కోట్లుదాటితే ఇన్వెస్టర్ల సంఖ్యను ప్రస్తుత 10 నుంచి 15కు పెంచనుంది. కనీసం 5 నుంచి గరిష్టంగా 15వరకూ అనుమతిస్తారు. ఆపై ప్రతీ రూ. 250 కోట్ల కేటాయింపులకు అదనంగా 15మంది ఇన్వెస్టర్లకు వీలుంటుంది. అంటే ఒక్కో ఇన్వెస్టర్‌కు కనీసం రూ. 5 కోట్ల పెట్టుబడికి వీలుంటుంది. ఇదేవిధంగా యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయింపుల వాటా ప్రస్తుత 33 శాతం నుంచి 40 శాతానికి పెరగనుంది. దీనిలో ఎంఎఫ్‌లకు 33 శాతం, జీవిత బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్‌లకు మిగిలిన వాటాను రిజర్వ్ చేయనున్నారు.



రీట్, ఇన్విట్‌లలో బీమా, పెన్షన్ ఫండ్స్

రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఇన్విట్)లలో వ్యూహాత్మక ఇన్వెస్టర్ నిబంధనలను సెబీ సవరించింది. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారులు(క్విబ్)సహా కొన్ని కేటగిరీ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు)ను ఇందుకు అనుమతించనుంది. అంతేకాకుండా రీట్‌ను ఈక్విటీగా గుర్తించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్‌లు), స్పెషలైజ్‌డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ ప్రత్యేక పెట్టుబడులకు వీలుగా ఇన్విట్‌ను హైబ్రిడ్‌గా కొనసాగించనుంది. ఇన్విట్, రీట్ నిబంధనల సవరణ ద్వారా ఇన్వెస్టర్ల పరిధి మరింత విస్తరించనుంది. దీంతో రీట్, ఇన్విట్‌ల వ్యూహాత్మక పెట్టుబడిదారుల కేటగిరీలో విభిన్న ఇన్వెస్టర్ల పెట్టుబడులకు వీలు చిక్కనుంది. ఇది రీట్, ఇన్విట్‌లకు జోష్‌నివ్వడంతోపాటు.. సులభ వ్యాపార నిర్వహణకు దారి ఏర్పడనున్నట్లు పాండే పేర్కొన్నారు. పెన్షన్ ఫండ్స్, ప్రావిడెంట్ ఫండ్స్, బీమా ఫండ్స్ తదితర పలు భారీ సంస్థాగత ఇన్వెస్ట్‌మెంట్‌లకు ప్రస్తుత నిబంధనలు అడ్డుపడుతున్నట్లు తెలియజేశారు. నిజానికి దీర్ఘకాలిక పెట్టుబడులకు ఆసక్తి చూపే ఆయా సంస్థలకు రీట్, ఇన్విట్‌లు అత్యుత్తమ అవకాశాలని సెబీ పేర్కొంది.

ఎగ్జిట్ లోడ్ కుదింపు

ఆర్థిక వృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసే వ్యూహంలో భాగంగా సెబీ బోర్డు ఎంఎఫ్ పంపిణీ సంస్థలపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా మరింత పారదర్శక, నిలకడైన ప్రోత్సాహకాలకు దన్నునిస్తూ గరిష్ట ఎగ్జిట్ లోడ్‌ను ప్రస్తుత 5 శాతం నుంచి 3 శాతానికి కోత పెట్టింది. టాప్–30 పట్టణాలను దాటి ఫండ్స్‌లోకి కొత్తగా మహిళా ఇన్వెస్టర్లను చేర్చుకుంటే పంపిణీదారులకు అధిక ప్రోత్సాహకాలు అందేటట్లు నిబంధనలు సవరించింది.

లోరిస్క్ ఎఫ్‌పీఐలకు సపోర్ట్

తక్కువ రిస్క్‌గల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు)ను సింగిల్ విండో ద్వారా దేశీ సెక్యూరిటీల మార్కెట్లో కార్యకలాపాలు చేపట్టేందుకు అనుమతించనున్నారు. ఇందుకు వీలుగా సెబీ బోర్డు నిబంధనలను సవరించింది. తద్వారా ఎఫ్‌పీఐలకు దేశీయంగా సులభతర పెట్టుబడులకు వీలు చిక్కనుంది. లోరిస్క్ ఎఫ్‌పీఐలు దేశీ క్యాపిటల్ మార్కెట్లో సులభంగా పెట్టుబడులు చేపట్టేందుకు స్వాగత్–ఎఫ్ఐ పేరుతో తెరతీయనున్న సింగిల్ విండో దారి చూపనుంది. దీంతో యూనిఫైడ్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా విభిన్న పెట్టుబడి మార్గాలలో ఎఫ్‌పీఐలు ఇన్వెస్ట్ చేసేందుకు వీలుంటుందని పాండే తెలియజేశారు. ఫలితంగా పెట్టుబడుల విషయంలో ఎఫ్‌పీఐలకు పదేపదే ఎదురయ్యే నిబంధనలు, భారీ డాక్యుమెంటేషన్ వంటి అవరోధాలు తొలగిపోనున్నట్లు వివరించారు. లోరిస్క్ విదేశీ ఇన్వెస్టర్ల జాబితాలో ప్రభుత్వ సొంత ఫండ్స్, కేంద్ర బ్యాంకులు, సావరిన్ వెల్త్ ఫండ్స్, మల్టీలేటరల్ సంస్థలు, అత్యంత నియంత్రణలతోకూడిన పబ్లిక్ రిటైల్ ఫండ్స్, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్స్ చేరనున్నట్లు వెల్లడించారు. స్వాగత్–ఎఫ్ఐ మార్గదర్శకాలను ఎఫ్‌పీఐలతోపాటు.. విదేశీ వెంచర్ క్యాపిటల్ ఇన్వెస్టర్ల(ఎఫ్‌వీసీఐలు)కు వర్తించనున్నట్లు పేర్కొన్నారు. 2025 జూన్30కల్లా దేశీయంగా 11,913 మంది ఎఫ్‌పీఐలు రిజిస్టరై ఉన్నట్లు వెల్లడించింది. రూ. 80.83 లక్షల కోట్ల ఆస్తులను హోల్డ్ చేస్తున్నట్లు తెలియజేసింది.

రిటైల్ రుణాల పట్ల జాగ్రత్త

- ఆస్తుల నాణ్యత వేగంగా క్షీణించే ప్రమాదం
- బ్యాంకర్లకు కేవీ కామత్ సూచన



ముంబై: భవిష్యత్ రిటైల్ రుణాల విషయంలో బ్యాంక్‌లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఈ రంగానికి చెందిన వెటరన్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ కామత్ సూచించారు. పోర్ట్‌ఫోలియో (రుణ ఆస్తులు) పరంగా అస్థిరతలు లేకుండా చూసుకోవాలని కోరారు. బెంగాల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కామత్ మాట్లాడారు. కార్పొరేట్లు (కంపెనీలు) నిధుల కోసం బ్యాంకులపై ఆధారపడడం కొంత కాలానికి తగ్గుతుందంటూ.. భవిష్యత్తులో బ్యాంకులకు ప్రధాన వ్యాపారం రిటైల్ విభాగం నుంచే వస్తుందన్నారు. రిటైల్ విభాగంలో ఆస్తుల నాణ్యత వేగంగా క్షీణించే రిస్క్ ఉంటుందని హెచ్చరించారు. ఈ రిస్క్ పోర్ట్‌ఫోలియో పరంగా అసమానతల రూపంలో ఎదురవుతుందన్నారు. బ్యాలన్స్‌షీట్లలో లోపాలు చోటుచేసుకుంటే అన్‌సెక్యూర్డ్ రుణాల్లో అధిక భాగం వసూలు కాకుండా పోతాయంటూ, బ్యాంక్‌లు ఈ విషయంలో జాగ్రత్తగా మసలుకోవాలని సూచించారు. ఫిన్‌టెక్‌లతో బ్యాంకులు పోటీపడక తప్పదన్నారు. తక్కువ క్రెడిట్ స్కోరు ఉన్న వ్యక్తులకు ఫిన్‌టెక్‌లు రుణ సాయం అందిస్తున్నట్లు చెప్పారు. రిటైల్ రుణ విభాగంలో పరిమితికి మించి రుణ వితరణ (ఒకే వ్యక్తికి) ఉందన్నారు. చిన్న ఇన్వెస్టర్లు డెరివేటివ్స్‌లో రూ.1.75 లక్షల కోట్లు నష్టపోయారన్న ఇటీవలి సెబీ డేటాను కామత్ ప్రస్తావించారు. నియంత్రణ సంస్థలు ఇప్పుడు దీన్ని కఠినతరం చేస్తున్నాయంటూ, ఈ చర్యలు ఫలితాన్నిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. లేదంటే రుణ ఎగవేతలు పెరగొచ్చని అభిప్రాయపడ్డారు.

తొమ్మిది ఎన్‌బీఎఫ్‌సీల లైసెన్స్‌లు స్వాధీనం



ముంబై: ఫోన్‌పే టెక్నాలజీ సర్వీసెస్ సహా తొమ్మిది నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) సర్టిఫికెషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ (సీవోఆర్/లైసెన్స్‌లు)ను స్వాధీనం చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. ఎన్‌బీఎఫ్‌సీ వ్యాపారం నుంచి తప్పుకోవడంతో ఫోన్‌పే టెక్నాలజీ సర్వీసెస్ సీవోఆర్‌ను వెనక్కిచ్చేసింది. ఆదిత్య బిర్లా ఫైనాన్స్ తన మాతృ సంస్థ ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లో విలీనం కావడంతో లైసెన్స్‌ను స్వాధీనం చేసింది. ఆర్‌బీజీ లీజింగ్ అండ్ క్రెడిట్, యషిలా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్, తదితర కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి.

స్టార్ హెల్త్‌కు నగదు రహిత చికిత్సలు బంద్

హెల్త్‌కేర్ ప్రొవైడర్ల అసోసియేషన్ హెచ్చరిక

న్యూఢిల్లీ: నగదు రహిత చికిత్సలు నిలిపివేస్తామంటూ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్‌పీఐ) హెచ్చరిక జారీ చేసింది. స్టార్ హెల్త్ నుంచి ఆస్పత్రులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను ప్రస్తావించింది. ఏహెచ్‌పీఐలో 1,500 ప్రైవేటు ఆస్పత్రులు సభ్యులుగా ఉన్నాయి. చికిత్సల ధరలను తగ్గించాలంటూ ఒత్తిడి చేయడం, డాక్టర్ల క్లినికల్ నిర్ణయాలపై అసంబద్ధమైన ప్రశ్నలు, నగదు రహిత క్లెయిమ్‌లకు ఆమోదం తెలిపి, తుది బిల్లులో అడ్డమైన కోతలు విధించడం వంటి చర్యలతోపాటు.. నగదు రహిత చికిత్సలను అకస్మాత్తుగా ఉపసంహరించుకోవడం చేస్తున్నట్టు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ దృష్టికి ఏహెచ్‌పీఐ తీసుకెళ్లింది. కాగా, ఏహెచ్‌పీఐ నిర్ణయం ఏకపక్షం, దురదృష్టకరంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాఖ్యానించింది. పాలసీదారులు స్టార్ హెల్త్ ద్వారా సేవలు పొందడంపై దీని ప్రభావం ఉండదని స్పష్టం చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)	
13-9-2025	
విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

అపోలో హెల్త్‌లో వాటా కొనుగోలు

- ఐఎఫ్‌సీతో అపోలో హాస్పిటల్స్ డీల్
- 30.6% విలువ రూ. 1,254 కోట్లు



న్యూఢిల్లీ: అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్‌లో 30.6 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు హెల్త్‌కేర్ చైన్ దిగ్గజం అపోలో హాస్పిటల్స్ తాజాగా పేర్కొంది. ఇందుకు ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ)తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. డీల్ విలువ రూ. 1,254 కోట్లుకాగా.. 41.65 కోట్లకు పైగా షేర్లను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. దీంతోపాటు గురుగ్రామ్‌లో అంకాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొంది. ఇందుకు రూ. 573 కోట్లు వెచ్చించనుంది. ఐఎఫ్‌సీ నుంచి దాదాపు 31 శాతం వాటాను కొనుగోలు చేశాక అపోలో హెల్త్‌ను పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు చేయనున్నట్లు అపోలో హాస్పిటల్ తెలియజేసింది.

సీ–డాక్‌తో టీసీఎస్ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా సార్వభౌమ క్లౌడ్ వ్యవస్థను రూపొందించే దిశగా సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వెల్లడించింది. భారత డేటా లోకలైజేషన్ నిబంధనలకు అనుగుణంగా, కీలక ప్రభుత్వ సేవలను డిజిటలీకరించడానికి దన్నుగా ఉండేలా దేశీ టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, ఏఐ ఆధారిత క్లౌడ్ ప్లాట్ఫాంలను రూపొందించడంపై ఈ భాగస్వామ్యం దృష్టి పెడుతుందని పేర్కొంది. భవిష్యత్తుకు కూడా సర్వసన్నద్ధంగా ఉండే సావరీన్ క్లౌడ్ సిస్టంను తయారు చేయడం ద్వారా అంతర్జాతీయ క్లౌడ్ మౌలిక సదుపాయాలందించే భారీ టెక్నాలజీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గించాలనేది లక్ష్యమని టీసీఎస్ వివరించింది.

జీఎస్‌టీ కోతతో ఇళ్లకు డిమాండ్

- సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్ రేట్లు తగ్గుతాయ్
- క్రెడాయ్ అంచనా

సింగపూర్: పలు ఉత్పత్తులపై జీఎస్‌టీని తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వినియోగదారుల కొనుగోలు శక్తి పెరుగుతుందని, ఇది ఇళ్లకు డిమాండ్‌ను పెంచుతుందని రియల్ ఎస్టేట్ డెవలపర్ల సమాఖ్య 'క్రెడాయ్' అంచనా వేసింది. సిమెంట్, మరికొన్ని బిల్డింగ్ మెటీరియల్స్‌పై జీఎస్‌టీని తగ్గించడం వల్ల నిర్మాణ వ్యయం దిగొస్తుందని పేర్కొంది. సింగపూర్‌లో నిర్వహించిన క్రెడాయ్–నాట్‌కాన్ వార్షిక సమావేశం సందర్భంగా దీనిపై ప్రకటన చేసింది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాలు తప్పకుండా వినియోదారులకు బదిలీ కావాలంటూ.. సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్ కంపెనీలు రేట్లను తగ్గించాలని డిమాండ్ చేసింది. జీఎస్‌టీలో 12 శాతం, 28 శాతం శ్లాబులను ఎత్తివేస్తూ, ఇందులోని వస్తు, సేవలను 5 శాతం, 18 శాతం కిందకు మారుస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోగా, ఈ నెల 22 నుంచి ఇది అమల్లోకి రానుండడం తెలిసిందే.

సానుకూల సెంటిమెంట్

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో వినియోదారుల్లో సానుకూల సెంటిమెంట్ నెలకొన్నట్టు క్రెడాయ్ చైర్మన్ బొమన్ ఇరానీ తెలిపారు. పండుగల సీజన్‌కు ముందు ఇది మంచి సంకేతంగా పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతోపాటు బడ్జెట్‌లో పన్ను మినహాయింపులు, రెపో రేట్ల తగ్గింపు హౌసింగ్ డిమాండ్‌కు ప్రేరణనిస్తాయని క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ పటేల్ అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఇళ్ల అమ్మకాలు విలువ పరంగా పెరిగినప్పటికీ.. సంఖ్యా పరంగా (యూనిట్లు) తగ్గినట్టు చెప్పారు. అయితే జూన్ త్రైమాసికంలో జీడీపీ బలమైన వృద్ధిని నమోదు చేయడం, విధానపరమైన చర్యల ఫలితంగా రానున్న నెలల్లో ఇళ్ల అమ్మకాలు పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుబాటు ధరల ఇళ్లకు ఉన్న రూ.45 లక్షల పరిమితిని సవరించాలన్న డిమాండ్‌ను మరోసారి ప్రస్తావించారు. రూ.45 లక్షల వరకు ఉన్న ఇళ్లపై జీఎస్‌టీ ఒక శాతం కాగా, అంతకుమించితే 5 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది.

పన్నుల భారం తగ్గించాలి..

రియల్ ఎస్టేట్ రంగంపై కేంద్రం, రాష్ట్రాలు కలిపి 35–45 శాతం వరకు పన్నులు విధిస్తున్నాయని.. ఈ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని శేఖర్ పటేల్ పేర్కొన్నారు. పన్నులు తగ్గించడం వల్ల ప్రాపర్టీల ధరలు దిగొస్తాయన్నారు. క్రెడాయ్‌లో దేశవ్యాప్తంగా 13,000 మంది డెవలపర్లు సభ్యులుగా ఉన్నారు.



నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	399.45	3.71
BAJFINANCE	1,002.70	3.34
BAJAJFINSV	2,083.20	2.23
HINDALCO	757.9	2.05
EICHERMOT	6,875.00	1.73

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	321.85	-1.9
HINDUNILVR	2,582.00	-1.53
INDUSINDBK	741	-1.02
BAJAJ-AUTO	9,025.00	-0.97
TRENT	5,129.00	-0.81

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,329
ఎన్ఎస్ఈ	92,242
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,41,752
ఎఫ్ఐఐ	+ 129
డీఐఐ	+ 1,556

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	62.58	$	62.37
బ్రెంట్	66.86	$	66.37

ప్రభుత్వం, ఆటో పరిశ్రమ కలిసి పని చేయాలి

- అప్పుడే రేర్ మ్యాగ్నెట్స్, టెక్నాలజీ సవాళ్లను అధిగమించవచ్చు
- ఏసీఎంఏ ప్రెసిడెంట్ శ్రద్ధా సూరి మార్వా



న్యూఢిల్లీ: భౌగోళికరాజకీయ పరిస్థితులు మారిపోతున్న నేపథ్యంలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్‌లాంటి ముడి వస్తువులు, ఇతరత్రా టెక్నాలజీలపరమైన సమస్యలను అధిగమించాలంటే ప్రభుత్వం, ఆటో పరిశ్రమ కలిసి పని చేయాల్సి ఉంటుందని ఆటో విడిభాగాల సంస్థల సంఘం ఏసీఎంఏ ప్రెసిడెంట్ శ్రద్ధా సూరి మార్వా తెలిపారు. సవాళ్లను అవకాశాలుగా మల్చుకోవాలని, మొబిలిటీ విడిభాగాలకు భారత్‌ను విశ్వసనీయమైన హబ్‌గా నిలబెట్టాలనేదే తమ ఉమ్మడి లక్ష్యమని ఏసీఎంఏ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె వివరించారు. 'కీలకమైన ముడి వస్తువులు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, సెమీకండక్టర్లు మొదలైన వాటి కొరత పెద్ద సవాలుగా మారింది. దీనిపై జాతీయ స్థాయిలో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

అపారమైన అవకాశాల కూడలిలో మనం ఇప్పుడు ఉన్నాం. కానీ అదే స్థాయిలో సవాళ్లు కూడా ఉన్నాయి. వాణిజ్య యుద్ధాలు, భౌగోళికరాజకీయ ఒడిదుడుకులు, టారిఫ్‌లపరమైన ఉద్రిక్తతలు, ఎగుమతులపరంగా పరిమితుల్లాంటివన్నీ కూడా సరఫరా వ్యవస్థ స్వరూపాన్ని మార్చివేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కీలక ముడి వస్తువులను దక్కించుకునేందుకు ప్రభుత్వంతో మరింతగా కలిసి పనిచేయాలి. అలాగే కొత్త మార్కెట్లలోకి ప్రవేశించేందుకు ప్రపంచవ్యాప్తంగా భాగస్వామ్యాలను పటిష్టం చేసుకోవాలి. అంతర్జాతీయంగా పోటీపడే విధంగా మన పరిశ్రమ బలోపేతం కావాలి' అని మార్వా చెప్పారు.

సరఫరా వ్యవస్థ పటిష్టం కావాలి: సియామ్

మరోవైపు, సరఫరా వ్యవస్థలనేవి కేవలం వ్యయాలను తగ్గించుకునే అంశానికే పరిమితం కాకుండా వైవిధ్యంగా, ఎలాంటి అవాంతరాలెదురైనా నిలదొక్కుకునే విధంగా పటిష్టంగా మారాలని వాహనాల తయారీ సంస్థల సంఘం సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర సూచించారు. ఇందుకోసం వనరులు సమృద్ధిగా ఉన్న దేశాలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టాల్సి ఉందని ఆయన వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపార సంస్థల మధ్య సంబంధాలు ఎంత ముఖ్యమో, అలాగే అలాంటి భాగస్వామ్యాలకు దోహదపడేలా ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు చొరవ తీసుకోవడం కూడా ముఖ్యమేనని చంద్ర చెప్పారు.

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల తయారీకి ప్రోత్సాహకాలు

కేంద్ర మంత్రి కుమారస్వామి



న్యూఢిల్లీ: దేశీయంగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల తయారీని ప్రోత్సహించేందుకు వీలుగా ద్రవ్య ప్రోత్సాహకాలతో ప్రభుత్వం ఒక పథకాన్ని సిద్ధం చేస్తోందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ల సరఫరాలో చైనాయే 90 శాతానికి పైగా వాటా కలిగి ఉండడం తెలిసిందే. ఇటీవలి కాలంలో భారత్‌కు వీటి ఎగుమతులను చైనా నిలిపివేసింది. దీంతో ప్రత్యామ్నాయాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించడం గమనార్హం. మూలధన, నిర్వహణ వ్యయాలకు మద్దతు ఈ పథకం ద్వారా అందిస్తామని.. దీంతో కీలక ఎక్విప్‌మెంట్‌పై అధిక టారిఫ్‌ల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. "రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు అన్నవి ఎలక్ట్రిక్ వాహన మోటార్లకు ఎంతో కీలకం. ప్రస్తుతం వీటి సరఫరాలో చైనా ఆధిపత్యం చలాయిస్తోంది. కనుక దేశీ తయారీని ప్రోత్సహించేందుకు ద్రవ్య ప్రోత్సాహకాలను సిద్ధం చేస్తున్నాం"అని వెల్లడించారు. రూ.1,345 కోట్లతో పథకాన్ని తీసుకొచ్చే విషయమై అంతర్గత చర్చలు కొనసాగుతున్నట్టు మంత్రి కుమారస్వామి జూలైలో ప్రకటించడం గమనార్హం. ఈ పథకం కింద రెండు కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. రేర్ ఎర్త్ ఆక్సైడ్స్‌ను మ్యాగ్నెట్లుగా మార్చే ప్రాసెసింగ్ ప్లాంట్లకు ఈ పథకం కింద పెట్టుబడి సాయం అందనుంది.



ఖాతా తెరవని భారత బుల్లెట్

సీజన్‌లోని చివరి ప్రపంచకప్‌లో కొనసాగుతున్న షూటర్ల వైఫల్యం

నింగ్బో (చైనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) తాజా సీజన్‌లోని చివరి ప్రపంచకప్‌లో పతకాలు కొల్లగొట్టే భారత షూటర్లకు ఊహించని విధంగా నిరాశ ఎదురవుతోంది. నాలుగు రోజులైనా కూడా ఒక్క భారత షూటర్ కనీసం కాంస్య పతకం నెగ్గలేకపోయాడు. ఇన్ని రోజులైనా కూడా భారత్ బోణీ కొట్టలేకపోవడం బహుశా ఇటీవల ఇదే తొలిసారి! పురుషులు, మహిళల ఈవెంట్లలో వరుస వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో మెహులీ ఘోష్, మానిని కౌశిక్ అత్యంత పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు. 2023లో బాకులో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన మెహులీ క్వాలిఫయింగ్‌లో 583 పాయింట్లతో 23వ స్థానంలో నిలిచింది. మానిని 580 పాయింట్లతో 45వ స్థానానికి పరిమితమైనింది. తెలంగాణకు చెందిన మరో షూటర్ రాపోలు సురభి భరద్వాజ్ 578 పాయింట్లతో ఏకంగా 52వ స్థానంలో నిలిచింది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్ భవేశ్ షెకావత్ మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అతను నాలుగో స్థానంలో నిలువడం ద్వారా ఫైనల్ చేరే అవకాశాల్ని సజీవంగా ఉంచుకున్నాడు. అతనితో పాటు ప్రస్తుతం భారత్ ఆశలన్నీ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో పోటీపడే రిథమ్ సాంగ్వాన్, ఇషా సింగ్, సురభి రావులపై ఉన్నాయి. ఈ నలుగురిలో ఎవరు క్వాలిఫయింగ్ రౌండ్‌ను విజయవంతంగా అధిగమించి ఫైనల్ చేరతారో చూడాలి. చైనా 2 స్వర్ణాలు, 3 రజతాలు, ఒక కాంస్యంతో అగ్రస్థానంలో ఉండగా... ఇంకా బోణీ కొట్టలేకపోయిన భారత్ అసలు ఈ పతకాల పట్టికలోనే ఎక్కలేదు!

అథ్లెటిక్స్ 'ప్రపంచం' పిలుస్తోంది!



198 దేశాలు... 2000లకు పైగా అథ్లెట్లు... 49 ఈవెంట్లు... రికార్డులు బద్దలు కొట్టేందుకు... అంతర్జాతీయ వేదికపై అందరి దృష్టిని ఆకర్షించేందుకు... అథ్లెట్లందరూ 'సై' అంటున్నారు. స్ప్రింట్ రేసుల్లో అగ్రరాజ్యం అమెరికా ఆధిపత్యం కొనసాగుతుందా.... మిడిల్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా తమ హవా కొనసాగిస్తుందా... ఫీల్డ్ ఈవెంట్స్‌లో యూరోపియన్లు తమ సత్తా చాటుకుంటారా... ఇవన్నీ తెలుసుకోవాలంటే క్రీడాభిమానులు నేటి నుంచి మొదలయ్యే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌పై దృష్టి సారించాల్సిందే. 1983లో ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకిలో తొలిసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు వేదిక కాగా... తాజాగా 20వ ఎడిషన్‌కు జపాన్ రాజధాని టోక్యో ముస్తాబైంది. ఈ మెగా ఈవెంట్ జపాన్‌లో జరగడం ఇది మూడోసారి. ఇంతకుముందు 1991లో టోక్యో, 2007లో ఒసాకా ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యమిచ్చాయి.

నేటి నుంచి వరల్డ్ చాంపియన్‌షిప్

తొమ్మిది రోజులపాటు పతకాల వేట ● భారత ఆశలన్నీ నీరజ్ చోప్రాపైనే

టోక్యో: ఒలింపిక్స్ క్రీడలు... ఫుట్‌బాల్ ప్రపంచకప్... ఆ తర్వాత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించేది ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్. రెండేళ్లకోసారి జరిగే ఈ మెగా ఈవెంట్‌కు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి తొమ్మిది రోజులపాటు జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మొత్తం 198 దేశాల అథ్లెట్లు 49 ఈవెంట్లలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తొలి రోజు ఐదు ఈవెంట్లలో అథ్లెట్లు మెడల్స్ కోసం బరిలోకి దిగనున్నారు. పురుషుల, మహిళల 35 కిలోమీటర్ల రేస్ వాక్... అనంతరం పురుషుల షాట్‌పుట్, మహిళల 10,000 మీటర్లు, మిక్స్‌డ్ 4–400 మీటర్ల రిలే ఫైనల్ ఈవెంట్లు జరుగుతాయి. పురుషుల, మహిళల 100 మీటర్ల విభాగాల్లో ప్రిలిమినరీ రౌండ్‌లు ఉంటాయి. పురుషుల, మహిళల 100 మీటర్ల సెమీఫైనల్స్, ఫైనల్స్ ఆదివారం జరుగుతాయి.

ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో నిషేధం ఎదుర్కొంటున్న రష్యా అథ్లెట్లు ఈ మెగా ఈవెంట్‌లో 'తటస్థ అథ్లెట్లు'గా పోటీపడనున్నారు. జమైకా దిగ్గజ మహిళా స్ప్రింటర్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ 'టోక్యో'లో తన కెరీర్‌ను ముగించనుంది. ఇప్పటి వరకు ఆమె ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో వ్యక్తిగత, టీమ్ రిలే ఈవెంట్స్‌లో కలిపి మొత్తం 16 పతకాలు సాధించింది. ఇందులో 10 స్వర్ణాలు, 5 రజతాలు, ఒక కాంస్యం ఉన్నాయి. మరోవైపు పురుషుల పోల్ వాల్ట్‌లో స్వీడన్ స్టార్ డుప్లాంటిస్ ప్రధాన ఆకర్షణ కానున్నాడు. ఇప్పటికే 13 సార్లు పోల్‌వాల్ట్‌లో ప్రపంచ రికార్డులు నెలకొల్పిన డుప్లాంటిస్ స్వర్ణం సాధించి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 'హ్యాట్రిక్' నమోదు చేయాలని పట్టుదలతో ఉన్నాడు. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో బంగారు పతకాలు నెగ్గిన డుప్లాంటిస్, 2019లో రజత పతకం సాధించాడు.

నీరజ్ ఈవెంట్ 17న, 18న...

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఈసారి భారత్ నుంచి 19 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. అయితే అందరి దృష్టి మాత్రం జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే ఉంది. ఈ మెగా ఈవెంట్‌లో 2022లో రజతం, 2023లో స్వర్ణం గెలిచిన నీరజ్... మళ్లీ విజేతగా నిలిస్తే... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండుసార్లు బంగారు పతకాలు నెగ్గిన మూడో జావెలిన్ త్రోయర్‌గా గుర్తింపు పొందుతాడు. గతంలో జాన్ జెలెజ్నీ (1993, 1995), అండర్సన్ పీటర్స్ (2019, 2022) మాత్రమే ఈ ఘనత సాధించారు. నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఈవెంట్ రెండు రోజులపాటు జరుగుతుంది. ఈనెల 17న క్వాలిఫయింగ్... 18న ఫైనల్ ఉంటాయి. జావెలిన్ త్రోలో భారత్ నుంచి నీరజ్ చోప్రాతోపాటు సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ బరిలో ఉన్నారు. మహిళల జావెలిన్ త్రోలో భారత స్టార్ అన్ను రాణి ఐదోసారి (2017, 2019, 2022, 2023) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడనుంది. 2019, 2022లో ఫైనల్ చేరిన అన్ను రాణి ఈసారి ఏం చేస్తుందో వేచి చూడాలి.

తొలి రోజు శనివారం భారత్ నుంచి నలుగురు అథ్లెట్లు బరిలో ఉన్నారు. పురుషుల 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో రామ్‌బాబూ, సందీప్ కుమార్... మహిళల 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో ప్రియాంక గోస్వామి... మహిళల 1500 మీటర్ల హీట్స్‌లో పూజ పోటీపడతారు.

ఇదీ భారత బృందం...

పురుషుల విభాగం: నీరజ్ చోప్రా, సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ (జావెలిన్ త్రో), గుల్‌వీర్ సింగ్ (5000, 10000 మీటర్లు), ప్రవీణ్ చిత్రావెల్, అబ్దుల్లా అబూబాకర్ (ట్రిపుల్ జంప్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), సర్వేశ్ కుషారే (హైజంప్), అనిమేశ్ కుజుర్ (200 మీటర్లు), తేజస్ షిర్సే (110 మీటర్ల హర్డిల్స్), సెర్విన్ సెబాస్టియన్ (20 కిలో మీటర్ల రేస్ వాక్), రామ్‌బాబూ, సందీప్ కుమార్ (35 కిలోమీటర్ల రేస్ వాక్). మహిళల విభాగం: అన్ను రాణి (జావెలిన్ త్రో), పారుల్ చౌధరీ, అంకిత దయాని (3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్), పూజ (800, 1500 మీటర్లు), ప్రియాంక గోస్వామి (35 కిలోమీటర్ల రేస్ వాక్).

443 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ చరిత్రలో అమెరికా సాధించిన పతకాలు. ఇందులో 195 స్వర్ణాలు, 134 రజతాలు, 114 కాంస్యాలు ఉన్నాయి. 'ఆల్‌టైమ్ పతకాల పట్టిక'లో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 171 పతకాలతో (65 స్వర్ణాలు, 58 రజతాలు, 48 కాంస్యాలు) కెన్యా రెండో స్థానంలో ఉంది.

3 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు లభించిన పతకాలు. 2003లో అంజూ జార్జి మహిళల లాంగ్‌జంప్‌లో కాంస్యం నెగ్గగా.. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా 2022లో రజతం, 2023లో స్వర్ణం గెలిచాడు. ఆల్‌టైమ్ పతకాల పట్టికలో భారత్... బుర్కినఫాసో, ట్యునీసియాలతో కలిసి సంయుక్తంగా 65వ స్థానంలో ఉంది.





శాసించే స్థితిలో సెంట్రల్ జోన్

రజత్ పాటీదార్, యశ్ రాథోడ్ సెంచరీలు

● సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ 384/5 ● మెరిసిన మాలేవర్, సారాంశ్
● గుర్‌జపనీత్ సింగ్‌కు 3 వికెట్లు ● సౌత్ జోన్‌తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: కెప్టెన్ రజత్ పాటీదార్ (115 బంతుల్లో 101; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు), యశ్ రాథోడ్ (188 బంతుల్లో 137 బ్యాటింగ్; 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదం తొక్కడంతో సెంట్రల్ జోన్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ పటిష్ట స్థితికి చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 50/0తో రెండో రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సెంట్రల్ జోన్ 104 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 384 పరుగులు చేసింది. ఈ టోర్నీలో భీకర ఫామ్‌లో ఉన్న రజత్ పాటీదార్ మరో సెంచరీతో కదంతొక్కగా... యశ్ రాథోడ్ అజేయ శతకంతో జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. దానిశ్ మాలేవర్ (120 బంతుల్లో 53; 5 ఫోర్లు) హాఫ్‌సెంచరీతో రాణించగా... బౌలింగ్‌లో సత్తాచాటిన సారాంశ్ జైన్ (119 బంతుల్లో 47 బ్యాటింగ్; 6 ఫోర్లు) బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ బౌలర్లలో గుర్‌జపనీత్ సింగ్ 3 వికెట్లు పడగొట్టగా... వాసుకి కౌశిక్, నిధీశ్ చెరో వికెట్ పడగొట్టారు. సౌత్ జోన్ జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు అందుబాటులో లేకపోవడంతో సెంట్రల్ జోన్ బ్యాటర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. అక్షయ్ వాడ్కర్ (22), శుభమ్ శర్మ (6), ఉపేంద్ర యాదవ్ (5) ఎక్కువసేపు నిలవలేకపోయారు. అంతకుముందు సౌత్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే ఆలౌట్ కాగా... చేతిలో 5 వికెట్లు ఉన్న సెంట్రల్ జోన్ ప్రస్తుతం 235 పరుగుల ఆధిక్యంలో ఉంది. యశ్ రాథోడ్, సారాంశ్ జైన్ క్రీజులో ఉన్నారు.

ఆడుతూ పాడుతూ...

సౌత్ జోన్ ప్లేయర్లు పరుగులు రాబట్టేందుకు తీవ్రంగా ఇబ్బందిపడిన చోట... సెంట్రల్ జోన్ బ్యాటర్లు సంయమనం కనబర్చారు. ఆరంభంలో కొన్ని కఠిన క్షణాలు ఎదుర్కొన్న సెంట్రల్ జోన్... ఆ తర్వాత ఏమాత్రం ఇబ్బంది పడలేదు. క్రితం రోజు స్కోరుకు మరో ఐదు పరుగులు జతచేసిన వెంటనే అక్షయ్ వాడ్కర్ అవుట్ కాగా... కాసేపటికే శుభమ్ శర్మ, దానిశ్ మాలేవర్ వెనుదిరిగారు. దీంతో సెంట్రల్ జోన్ 93/3తో కష్టాల్లో పడ్డట్లు కనిపించింది. ఈ దశలో పాటీదార్, యశ్ రాథోడ్ సౌత్ జోన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. మంచి బంతులను గౌరవించిన ఈ జంట... చెత్త బంతులపై విరుచుకుపడింది. దీంతో భాగస్వామ్యం బలపడుతూ వెళ్లింది. ఈ క్రమంలో పాటీదార్ 73 బంతుల్లో... రాథోడ్ 84 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. స్పిన్‌కు సహకరిస్తున్న పిచ్‌పై... భాగస్వామ్యాన్ని విడదీయగల బౌలర్ లేక సౌత్ జోన్ ఇబ్బంది పడుతుంటే... సెంట్రల్ జోన్ దాన్ని సొమ్ముచేసుకుంది. చూస్తుండగానే ప్రత్యర్థి స్కోరును దాటేసిన సెంట్రల్ జోన్ ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ వెళ్లింది. రికీ భుయ్ వేసిన ఓవర్‌లో వరుసగా 4, 6, 4తో ఆకట్టుకున్న రజత్...112 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి 50 పరుగులు చేసేందుకు 73 బంతులు తీసుకున్న పాటీదార్... ఆ తర్వాత మరో 39 బంతుల్లోనే మూడంకెల మార్క్ అందుకోవడం విశేషం. నాలుగో వికెట్‌కు 167 పరుగులు జోడించిన అనంతరం పాటీదార్ అవుట్ కాగా... యశ్ రాథోడ్ 132 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఉపేంద్ర విఫలం కాగా... యశ్ రాథోడ్‌కు సారాంశ్ జత కలవడంతో సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ సాఫీగా సాగింది. ఈ జోడీ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 118 పరుగులు జోడించింది.

స్కోరు వివరాలు

సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్: 149; **సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్:** దానిశ్ మాలేవర్ (సి) రికీ భుయ్ (బి) గుర్‌జపనీత్ సింగ్ 53; అక్షయ్ వాడ్కర్ (బి) కౌశిక్ 22; శుభమ్ శర్మ (బి) గుర్‌జపనీత్ సింగ్ 6; రజత్ పాటీదార్ (సి) అజహరుద్దీన్ (బి) గుర్‌జపనీత్ సింగ్ 101; యశ్ రాథోడ్ (బ్యాటింగ్) 137; ఉపేంద్ర యాదవ్ (సి) అజహరుద్దీన్ (బి) నిధీశ్ 5; సారాంశ్ జైన్ (బ్యాటింగ్) 47; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (104 ఓవర్లలో 5 వికెట్లకు) 384. వికెట్ల పతనం: 1–55, 2–74, 3–93, 4–260, 5–266. బౌలింగ్: గుర్‌జపనీత్ సింగ్ 16–2–74–3; అంకిత్ శర్మ 32–2–137–0; నిధీశ్ 15–2–38–1; వాసుకి కౌశిక్ 22–5–55–1; రికీ భుయ్ 19–1–73–0.

క్రీడల్లో టాప్-10లో నిలవడమే లక్ష్యం

● సమాఖ్యల కంటే అథ్లెట్ల ప్రదర్శనపై దృష్టి
● కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికే పెద్దపీట వేస్తోందని, తద్వారా భారత్‌ను ప్రపంచ టాప్–10 క్రీడా దేశాల్లో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. శుక్రవారం ఇక్కడ జరిగిన 'ప్లేకామ్ బిజినెస్ ఆఫ్ స్పోర్ట్స్ సమ్మిట్'లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 'గతంలో క్రీడా సమాఖ్యల్లో తిష్ట వేసుకు కూర్చున్న సమస్యలు, వివాదాలే పతాక శీర్షికలయ్యేవి. ప్రస్తుతం మేం ఈ వివాదాలను పక్కనబెట్టి అథ్లెట్ల ప్రదర్శన మెరుగుపర్చడంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాం. అంతర్జాతీయ క్రీడల్లో భారత ఆటగాళ్లు పోడియంలో నిలిచేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. కొత్తగా తీసుకొచ్చిన క్రీడా బిల్లు కూడా తగవుల్ని పరిష్కరించడంతో పాటు క్రీడాకారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుంది. అథ్లెట్లు రాణించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తున్నాం' అని అన్నారు. దేశంలోని క్రీడా సమాఖ్యలన్నీ క్రీడా బిల్లుకు లోబడే ఉండాలని నిర్ణయించామని, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా కొత్త క్రీడా పాలసీ ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. తద్వారా ప్రతీ సమాఖ్యలోనూ జవాబుదారీతనాన్ని పెంచామని అన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో పురుషులకు దీటుగా భారత మహిళా అథ్లెట్లు పోటీపడాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపట్టిన 'ఫిట్ ఇండియా', 'ఖేలో ఇండియా', టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) కార్యక్రమాలు అథ్లెట్ల కోసమే రూపొందించామని మాండవీయ తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టితో వ్యవహరిస్తున్నారని, భారత క్రీడావికాసం కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. పదేళ్ల ప్రణాళికతో క్రీడాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రతిభాన్వేషణ పోటీలను పెంచుతామని చెప్పారు. కేవలం నగరాలు, అకాడమీలే కాదు... మారుమూల గ్రామాలు, పట్టణాల్లో ఉన్న ప్రతిభావంతులను పాఠశాల స్థాయి పోటీల్లో గుర్తించి నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమని చెప్పారు.

రికర్వ్‌లో మళ్లీ రిక్తహస్తాలే!

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ముగిసిన భారత్ పోరు

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత రికర్వ్ ఈవెంట్ ఆర్చర్ల పతక నిరీక్షణకు ఇప్పట్లో తెరపడేలా లేదు. కొరియాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఒలింపిక్ ఈవెంట్ అయిన రికర్వ్‌లో భారత ఆర్చర్లకు మళ్లీ రిక్త హస్తాలే ఎదురయ్యాయి. శుక్రవారం జరిగిన పోటీల్లో 15 ఏళ్ల గాథ ఖడకే కూడా ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరగడంతో పతకం ఆశలు అడుగంటాయి. ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ లిమ్ సి హ్యోన్ (కొరియా) 6–0తో గాథపై ఘనవిజయం సాధించింది. మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాల విజేత అయిన కొరియన్ ముందు భారత ఆర్చర్ తేలిపోయింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారిగా భారత్ 2019లో పతకం గెలిచింది. తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ప్రవీణ్ జాదవ్‌లతో కూడిన బృందం టీమ్ ఈవెంట్‌లో రజతం నెగ్గింది. తర్వాత ఇప్పటి వరకు మూడు చాంపియన్‌షిప్‌లు జరుగగా... భారత్ కనీసం కాంస్యమైనా గెలువలేకపోయింది.



వెటరన్ ఆర్చర్, నాలుగు ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడ్డ దీపిక కుమారి తొలి రౌండ్లోనే నిష్క్రమించగా, ఆంధ్రప్రదేశ్ ఆర్చర్, పారిస్ ఒలింపియన్ ధీరజ్ బొమ్మదేవర కూడా ఆకట్టుకోలేకపోయాడు. కాంపౌండ్‌లో రిషభ్ యాదవ్, ప్రథమేశ్, అమన్ సైనీల బృందం బంగారు పతకం గెలుపొందగా... ఆంధ్రప్రదేశ్ స్టార్ మహిళా ఆర్చర్ జ్యోతి సురేఖతో కలిసి రిషభ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచాడు.

నాలుగు సెకన్లు.. ఒక్కటే వాక్యం..!

- పాకిస్తాన్ ముఖం మాడిపోయింది
- కడిగిపారేసిన యూఎన్ వాచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్


నోయర్

ఐరాస: ప్రపంచ వేదికపై పాకిస్తాన్‌కు మరోసారి తీవ్ర పరాభయం ఎదురైంది. హమాస్ రాజకీయ నాయకత్వమే లక్ష్యంగా ఖతార్‌పై ఇజ్రాయెల్ ఇటీవల చేపట్టిన దాడిపై ఐరాసలో చర్చ సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మానవ హక్కుల న్యాయవాది, యూఎన్ వాచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన హిల్లెల్ నోయర్ మాట్లాడుతూ..ఖతార్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తోందని ఆరోపించారు. ఆ దేశం ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందన్నారు. అమెరికా ఉగ్ర సంస్థగా ప్రకటించిన హమాస్ రాజకీయ కార్యాలయం ఖతార్‌లో 2012 నుంచి కొనసాగుతుండటంపై హిల్లెల్ నోయర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడిని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఖండించడాన్ని సైతం ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో 2011లో పాకిస్తాన్‌లోని రహస్య స్థావరంలో ఉంటున్న అల్ ఖాయిదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా అంతమొందించినప్పుడు ఐరాస అప్పటి చీఫ్ చివరికి న్యాయం జరిగిందంటూ వ్యాఖ్యానించారన్న విషయాన్ని హిల్లెల్ గుర్తు చేశారు. పాకిస్తాన్, లాడెన్ ప్రస్తావన తేవడంతో ఆ దేశ ప్రతినిధి వెంటనే హిల్లెల్ ప్రసంగానికి అడ్డు తగిలారు. సభ్య దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగించడం ఐరాస సూత్రాలకు విరుద్ధమని వాదించారు. హిల్లెల్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని అభ్యంతరం తెలిపారు. స్పందించిన ఐరాస మానవ హక్కుల కమిటీ చైర్మన్..హిల్లెల్ నోయర్‌కు మైక్‌ను పునరుద్ధరించారు. ప్రసంగం ముగించేందుకు కేవలం నాలుగే సెకన్ల సమయముందని తెల్పి చెప్పారు. దీంతో, ఆ లాయర్ ఆ సమయాన్నే సరిగ్గా వినియోగించుకుంటూ.. మిస్టర్ ప్రెసిడెంట్, పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించే మరో దేశం 'అంటూ ప్రసంగాన్ని ముగించారు. దీంతో, పాకిస్తాన్ ప్రతినిధి తెల్లబోయి చూస్తుండిపోయారు. ఇలాంటి అనుభవమే పాక్‌కు 2020లోనూ ఎదురైంది. ఫ్రాన్స్‌లో ఉపాధ్యాయుడొకరిని ఇస్లామిక్ ఉగ్రవాది తలనరికి చంపిన ఘటనపై పాకిస్తాన్ ప్రభుత్వం..' స్వేచ్ఛ పేరుతో దైవ దూషణకు పాల్పడటం సహించరానిది'అంటూ ఎక్స్‌లో వ్యాఖ్యానించింది. దీనిపై జెనీవాకు చెందిన మానవ హక్కుల సంస్థ యూఎన్ వాచ్ దీటుగా ఇలా స్పందించింది... 'ఐరాస మానవ హక్కుల కౌన్సిల్‌లో మీకు సభ్యత్వం ఇవ్వడం సహించదగిందే'అంటూ బదులిచ్చింది. ఆ సమయంలో పాకిస్తాన్ ఐరాస మానవ హక్కుల కౌన్సిల్‌లో సభ్యురాలిగా ఉండటం గమనార్హం.

ఏడీఆర్ సహ వ్యవస్థాపకుడు జగ్‌దీప్ ఛొకర్ కన్నుమూత

న్యూఢిల్లీ: పారదర్శకమైన ఎన్నికల వ్యవస్థ కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ సహ వ్యవస్థాపకుడు జగ్‌దీప్ ఛొకర్(80)శుక్రవారం కన్నుమూశారు. గురువారం ఆయన గుండెపోటుకు గురయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారని సన్నిహితులు తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ రిటైర్డు ప్రొఫెసర్ అయిన ఛొకర్ తన సహోద్యోగులతో 1999లో ఏడీఆర్‌ను నెలకొల్పారు. గడిచిన రెండు దశాబ్దాల్లో దేశ ఎన్నికల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన అనేక చారిత్రక తీర్పుల వెనుక ఏడీఆర్ కృషి దాగి ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆస్తులు, విద్యార్హతల వివరాలను అఫిడవిట్‌లో తప్పనిసరిగా వెల్లడించాలంటూ సుప్రీంకోర్టు 2002లో ఇచ్చిన తీర్పు ఏడీఆర్ జోక్య ఫలితమే. 2024లో ఎలక్టోరల్ బాండ్ల రద్దు సైతం ఏడీఆర్ ఖాతాలోనే చేరుతుంది. 1944లో జన్మించిన ఛొకర్ రైల్వే శాఖలో ఉద్యోగంతో కెరీర్‌ను మొదలుపెట్టారు. ఢిల్లీ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా, అనంతరం అమెరికాలోని లూసియానా స్టేట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. 1985లో ఐఐఎం-అహ్మదాబాద్‌లో చేరారు. ఛొకర్ మృతిపై వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సంతాపం ప్రకటించారు.



భలే మంచి చౌక బేరము

రూ.3 వేల కోట్ల పడవ రూ.1,000 కోట్లకే

- అమ్మకానికి పెట్టిన అమెరికా ప్రభుత్వం
- రష్యాపై ఆంక్షల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న అమాడెయా

అమాడెయా.. ఓ భారీ విలాసవంతమైన పడవ. దీనిని అమెరికా ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. వాస్తవ ధర సుమారు రూ.3 వేల కోట్లు కాగా, అనేక కారణాలతో దీనిని సుమారు రూ.వెయ్యి కోట్లకే ఇవ్వాలనుకుంటోంది. రష్యాకు చెందిన చమురు వ్యాపారి, అపర కుబేరుడు సులేమాన్ కెరిమోవ్ మోజుపడి తయారు చేయించుకున్న పడవ ఇది. 2017లో నిర్మించిన ఈ పడవలో 6 డెక్కులున్నాయి. ఆధునిక వసతులతో కూడిన ఎనిమిది భారీ గదులు, జిమ్, సినిమా థియేటర్, లాబ్‌స్టర్ ట్యాంక్, పియానో రూం, స్విమ్మింగ్ పూల్, అత్యాధునిక మసాజ్ సెంటర్‌తోపాటు హెలిప్యాడ్ కూడా అమాడెయాలో ఉంది.

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలుపెట్టిన వేళ ఆ దేశంపై అమెరికా మిత్ర దేశాలు తీవ్ర ఆంక్షలు విధించాయి. తమ దేశాల్లోని రష్యా ప్రభుత్వ, బడా పారిశ్రామిక వేత్తలు, వ్యాపార ప్రముఖుల వ్యక్తిగత ఆస్తులను స్వాధీనం చేసుకుంటోంది. ఇలా స్వాధీనం చేసుకున్న ఆస్తుల్ని అమ్మేసి, ఆ డబ్బును ఉక్రెయిన్‌కు అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందులో భాగంగానే అమెరికా ప్రభుత్వం క్లెప్టోక్యాప్చర్ టాస్క్‌ఫోర్స్‌ను 2022లో ఏర్పాటు చేసింది. ఈ విషయం తెలిసిన రష్యా చమురు వ్యాపారి సులేమాన్ కెరిమోవ్ తన అమాడెయా అనే భారీ పడవను సుదూరంగా ఉన్న ఫిజీలోని మారుమూల దీవిలో దాచి ఉంచాడు. అమెరికా నిఘా సంస్థలు, క్లెప్టో క్యాప్చర్ టాస్క్‌ఫోర్స్ దీని జాడను కనిపెట్టాయి. ఫిజీ నుంచి దీనిని అమెరికాకు తీసుకువచ్చాయి. ఇది సుమారు మూడేళ్ల క్రితం ఘటన. అప్పటి నుంచి అమాడెయా శాన్ డియాగో తీరంలో ఉంది. ఫిజీ నుంచి తరలింపు, నిర్వహణ తదితరాలకే అమెరికా ప్రభుత్వం దీనిపై 3.2 కోట్ల డాలర్లు ఖర్చుపెట్టింది. స్వాధీనం చేసుకున్న సమయంలో దీని విలువను సుమారు రూ.2,000 కోట్లుగా నిర్ధారించారు. అయితే, ప్రస్తుత విలువ రూ.700 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు ఉన్నట్లు నిపుణులు మదింపు చేశారు. ప్రపంచంలోని 50 మంది నుంచి 100 మంది వరకు ఉన్న అత్యంత ధనవంతులకే ఇలాంటి బోట్‌ను కొనగలిగే సత్తా ఉందని అంచనా వేశారు.

న్యాయ వివాదం..

అమాడెయా వాస్తవ యజమాని ఎవరనే విషయమై మూడేళ్లుగా న్యాయపోరాటం సాగుతోంది. ఇది తమదేనంటూ అసలు యజమాని, రష్యా బిలియనీర్ అయిన సులేమాన్ కెరిమోవ్‌తోపాటు రష్యా ఇంధన సంస్థ రోస్‌నెఫ్ట్ మాజీ అధికారి ఎడ్వర్డ్ ఖుదైనటోవ్, మిల్లిమారిన్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ న్యూయార్క్ కోర్టులో పిటిషన్లు వేశాయి. అయితే, కెరిమోవ్ అమెరికా ఆంక్షలను ఉల్లంఘించినందుకు ఈ పడవ యాజమాన్య హక్కులు అమెరికాకే ఉంటాయని 2023 మార్చిలో న్యూయార్క్ సర్క్యూట్ కోర్టు జడ్జి డేల్ హో ప్రకటించారు. దీంతో, అమెరికా ప్రభుత్వం ఇటీవల దీనిని వేలానికి పెట్టింది. వేలం పాటలో పాల్గొనే వారు కోటి డాలర్లను డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. కాగా, క్లెప్టోక్యాప్చర్ టాస్క్ ఫోర్స్ ద్వారా స్వాధీనం చేసుకున్న అమాడెయా వంటి అనేక పడవలు, విమానాలు, విలాసవంతమైన ఆస్తుల్లో చాలావరకు ప్రస్తుతం న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటున్నాయి. ఎడ్వర్డ్ ఖుదైనటోవ్ మాత్రం అమెరికా అన్యాయంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. న్యూయార్క్ సర్క్యూట్ కోర్టు తీర్పుపై అప్పీల్ చేశామని, నవంబర్‌లో తీర్పు వచ్చే అవకాశముందని చెబుతున్నారు. తీర్పు తమకు అనుకూలమైతే అమాడెయా పూర్తి విలువను అమెరికా ప్రభుత్వం చెల్లించక తప్పదని స్పష్టం చేస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌పై కుట్రతోనే టారిఫ్‌ల గొడవ

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ మండిపాటు

సాక్షి, న్యూఢిల్లీ: భారత్ ఎదుగుదలను చూసి ఓర్వలేక, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కొన్ని దేశాలపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ నిప్పులు చెరిగారు. మన అభివృద్ధిని అడ్డుకునేందుకే టారిఫ్‌ల రూపంలో ఆర్థిక దాడికి పాల్పడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. అమెరికా, డొనాల్డ్ ట్రంప్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండానే ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. నాగ్‌పూర్‌లో జరిగిన బ్రహ్మకుమారీల కార్యక్రమంలో శుక్రవారం మోహన్ భాగవత్ మాట్లాడారు. 'భారత్ బలపడితే, అభివృద్ధి చెందితే తమ పరిస్థితి ఏంటని కొందరు ఆందోళన చెందుతున్నారు. ఆ భయంతోనే టారిఫ్‌ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. మనం ఏమీ చేయకపోయినా, మనపై ఒత్తిడి పెంచాలన్న దురుద్దేశంతోనే ఇదంతా చేస్తున్నారు. ప్రపంచమంతా 'నేను, నాది'అనే స్వార్థంతోనే నడుస్తోంది. దానివల్లే అన్ని సమస్యలు వస్తున్నాయి'అని అన్నారు. సంకుచితత్వాన్ని వీడి మనం, మనది అనే విశాల దృక్పథంతో ఆలోచించినప్పుడు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ప్రపంచానికి ఇప్పుడు ఇదే అవసరమని భాగవత్ హితవు పలికారు.

కేకలేసుకున్న లాయర్లు

న్యూఢిల్లీ: వ్యాపారవేత్త సంజయ్ కపూర్‌కు చెందిన రూ.30 వేల కోట్ల ఎస్టేట్ వారసత్వ వివాదంపై ఢిల్లీ హైకోర్టులో శుక్రవారం వాదనల సందర్భంగా ఇరుపక్షాల లాయర్ల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. సంజయ్ కపూర్ మొదటి భార్య ప్రియా సచ్‌దేవ కపూర్ లాయర్ రాజీవ్ నాయర్, రెండో భార్య కరిష్మా కపూర్ లాయర్ మహేశ్ జెత్మలానీ పరస్పరం కేకలు వేసుకున్నారు. జెత్మలానీ ఏదో చెబుతుండగా నాయర్ అడ్డుతగిలి మాట్లాడుతున్నారు. దీనిపై జెత్మలానీ..'దయచేసి అడ్డుతగలొద్దు. ఇలాంటివి నాకు అలవాటు లేదు. నా మీద అరవకు. నన్ను అడ్డుకుంటున్నావు. కాస్త మర్యాదగా ఉండు'అని తీవ్ర స్వరంతో అంటున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. తండ్రి ఎస్టేట్‌లో తమ సంతానం సమైరా, కియాన్‌కు కూడా హక్కుంటుందని కరిష్మా కపూర్ కేసు వేశారు. సంజయ్ కపూర్ వీలునామా పూర్తి వివరాలను, ఇతర విలువైన పత్రాలను ప్రియా సచ్‌దేవ దాచిపెట్టిందని ఆమె ఆరోపిస్తున్నారు. అయితే, ఆ ఇద్దరు పిల్లలకు ఇప్పటికే ఫ్యామిలీ ట్రస్ట్ ద్వారా రూ.1,900 కోట్ల ఆస్తులు అందాయని ప్రియా సచ్‌దేవ శుక్రవారం హైకోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని పరిశీలించనున్నట్లు కోర్టు పేర్కొంది.

అహ్మద్‌నగర్ రైల్వేస్టేషన్ ఇక..అహిల్యానగర్

ముంబై: మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ రైల్వే స్టేషన్ పేరు మారింది. దీనిని అహిల్యానగర్ రైల్వే స్టేషన్‌గా మారుస్తూ శుక్రవారం మహారాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. అహ్మద్‌నగర్ జిల్లా పేరును ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం అహిల్యానగర్ జిల్లాగా మార్చడం తెల్సిందే. తాజా పేరు మార్పుపై కేంద్ర హోం శాఖ ఆమోద ముద్ర వేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. పేరు మార్పు ప్రతిపాదనను ఆమోదించినందుకు హోం మంత్రి అమిత్ షా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు. అహిల్యాదేవి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం హర్షణీయమన్నారు. ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పవార్ వెల్లడించారు.

ఊడిపడ్డ స్పైస్‌జెట్ విమానం టైరు

ముంబై: కాండ్లా-ముంబై స్పైస్ జెట్ విమానానికి త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. కాండ్లా ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ క్యూ 400 రకం విమానం టైరు ఒకటి ఊడిపోయింది. కాండ్లా రన్ వేపై టైరు కనిపించడంతో అధికారులు పైలట్‌ను అప్రమత్తం చేశారు. వారి సూచనల మేరకు పైలట్ విమానాన్ని ముంబై విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానం లోపలి వైపు టైరు ఒకటి ఊడిపోగా, ల్యాండింగ్ సమయంలో మరో టైరు పేలింది. అయినప్పటికీ విమానం ఎటువంటి ఇబ్బంది లేకుండా టెర్మినల్ వద్దకు సురక్షితంగా చేరుకోకుంది. ప్రయాణికులంతా మామూలుగానే కిందికి దిగారు. విమానంలోని మొత్తం 64 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్లు స్పైస్ జెట్ తెలిపింది. క్యూ 400 రకం విమానానికి ఆరు టైర్లుంటాయి. టైరు ఊడిన ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

పంజాబ్ 'ఆప్' ఎమ్మెల్యేకు నాలుగేళ్ల జైలుశిక్ష

అమృత్‌సర్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే మంజీందర్ సింగ్ లాల్‌పురాకు తార్న్‌తరణ్ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. 2013లో ఓ దళిత మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆయనపై కేసు నమోదైంది. ఈ ఘటనపై 12 ఏళ్లపాటు సుదీర్ఘంగా విచారణ జరిగింది. రెండు రోజుల క్రితం న్యాయస్థానం ఆయనను దోషిగా నిర్ధారించింది. శుక్రవారం శిక్ష ఖరారు చేసింది. మంజీందర్ సింగ్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ అసెంబ్లీ స్థానం నుంచి 2022లో ఎమ్మెల్యేగా గెలిచారు. లైంగిక వేధింపుల కేసులో మంజీందర్ సింగ్‌తోపాటు మరో ఆరుగురు సైతం దోషులుగా తేలారు. వారికి సైతం నాలుగేళ్ల చొప్పున జైలు శిక్ష పడింది. ఈ మేరకు అదనపు సెషన్స్ జడ్జి ప్రేమ్‌కుమార్ తీర్పు వెలువరించారు. 2013లో నేరం జరిగిన సమయంలో మంజీందర్ సింగ్ ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తుండడం గమనార్హం.

ఢిల్లీ, బాంబే హైకోర్టులకు బాంబు బెదిరింపులు

- కోర్టు రూముల్లో బాంబులు పెట్టినట్లు మెయిల్స్
- ఉరుకులు పరుగులు పెట్టిన పోలీసులు
- కోర్టులను ఖాళీ చేయించి బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు
- ఫేక్ మెయిల్స్ అని తేలటంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

న్యూఢిల్లీ: కొంతకాలం క్రితం ఢిల్లీలోని స్కూళ్లకు వరుసగా బాంబు బెదిరింపు సందేశాలు వచ్చినట్టే తాజాగా ఉన్నత న్యాయస్థానాలకు వచ్చాయి. శుక్రవారం ఒక్కరోజే ఢిల్లీ, బాంబే హైకోర్టులకు గుర్తు తెలియని వ్యక్తులు బాంబు బెదిరింపు మెయిల్స్ పంపారు. దీంతో పోలీసులు కొన్ని గంటలపాటు ఉరుకులు పరుగులు పెట్టారు. చివరకు అవి నకిలీ మెయిల్స్ అని తేలటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఢిల్లీ హైకోర్టులోని న్యాయమూర్తుల చాంబర్లలో బాంబులు పెట్టామని, అవి మధ్యాహ్నం పేలతాయని హైకోర్టు రిజిస్ట్రార్‌కు శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో మెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. కోర్టు కాంప్లెక్స్‌లోని ప్రతి గదిని బాంబ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తేల్చాయి. తనిఖీలు జరుగుతున్నంత సేపు కోర్టు లావాదేవీలను నిలిపివేశారు. ఉదయం 11.30 గంటల సమయంలో కేసుల విచారణ ప్రారంభించిన కొందరు న్యాయమూర్తులు విషయం తెలిసి వెంటనే బయటకు వెళ్లిపోయారు. జడ్జిలతోపాటు న్యాయవాదులు, సామాన్యులను కూడా లోపలికి వెళ్లనివ్వలేదు. చివరకు ఆ మెయిల్ ఫేక్ అని తేలటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ మెయిల్ కారణంగా కొన్ని గంటలపాటు కోర్టు కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత కోర్టు ప్రొసీడింగ్స్ తిరిగి ప్రారంభమయ్యాయి. బెదిరింపు మెయిల్ ఫేక్ అని గుర్తించామని, గతంలో ఢిల్లీ స్కూళ్లకు వచ్చిన మెయిల్‌తో దీనికి సంబంధం లేదని న్యూఢిల్లీ డీసీపీ దేవేశ్ కుమార్ మహ్లా తెలిపారు. బాంబే హైకోర్టుకు కూడా శుక్రవారం మధ్యాహ్నం ఇలాంటి మెయిల్ వచ్చింది. దీంతో కోర్టు భవనాన్ని ఖాళీ చేయించి బాంబు స్క్వాడ్ తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబులు లభించకపోవటంతో అది ఫేక్ మెయిల్ అని తేల్చారు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత కోర్టు కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి.

21 ఏళ్లకే బీర్ తాగొచ్చు.!

- త్వరలో ఢిల్లీ సర్కార్ కొత్త మద్యం పాలసీ
- 25 ఏళ్ల నిబంధనను సడలించాలని నిర్ణయం
- ఆదాయం కోసం ప్రైవేట్ షాపులకు అనుమతులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఇకపై 21 సంవత్సరాలున్న యువత బీరు తాగేందుకు అర్హులవుతారు. అబ్కారీ చట్టం ప్రకారం ఢిల్లీ మినహా దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 25 ఏళ్లున్న వారికి మాత్రమే బీరు తాగేందుకు అనుమమతి ఉంది. తాజాగా ఈ రూల్‌ను మార్చి కొత్త మద్యం విధానాన్ని తెచ్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 21 ఏళ్ల వయస్సు వారిని బీరు తాగేందుకు అనుతించడం వల్ల వీరంతా శివారులోని గురుగ్రామ్, నోయిడా, ఘాజియాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి అక్రమంగా మద్యం తాగడాన్ని నిరోధించవచ్చని భావిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం సంబంధిత వర్గాలు నిపుణులతో చర్చలు జరుపుతోంది. నాలుగైదు నెలల్లో కొత్త మద్యం విధానాన్ని తీసుకువచ్చే అవకాశం ఉంది.

కొత్త విధానం ఎలా ఉండొచ్చు..?

ప్రస్తుతం ఉన్న మద్యం విధానం ప్రకారం ప్రభుత్వ ఆదాయం ఏడాదికి రూ.12 వేల కోట్ల నుంచి రూ.13వేల కోట్ల వరకు ఉండాలి. కానీ, రూ.7 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లు మాత్రమే వస్తోంది. కొత్త విధానం ద్వారా ఆదాయాన్ని బాగా పెంచుకోవడమే ఢిల్లీ ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ప్రైవేటు మద్యం దుకాణాలను కూడా తెరవాలని యోచిస్తోంది. బ్రాండెడ్ మద్యం కొరతను నివారించడంపైనా దృష్టి సారించింది. బ్రాండెడ్ మద్యం కొరత కారణంగా నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్)లో జరుగుతున్న రూ.5 వేల కోట్ల నుంచి రూ.7000 కోట్ల లావాదేవీలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తోంది. ఈ ఆదాయం ప్రధానంగా శివారులోని గురుగ్రామ్, నోయిడా, గాజియాబాద్ వంటి ప్రాంతాలకు వెళుతోంది. నివాస ప్రాంతాలు మినహా షాపింగ్ మాల్స్ తదితర వ్యాపార సముదాయాల్లో మద్యం షాపులను తెరవనున్నారు. కొత్త మద్యం పాలసీ పూర్తిగా ప్రభుత్వం, లేదా ప్రభుత్వం -ప్రైవేట్, లేదా పూర్తిస్థాయి ప్రైవేట్ అనే మూడు మోడళ్లపై చర్చిస్తోంది. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలకు అనుమతిచ్చి విమర్శల పాలైంది. ఆ తర్వాత వాటిని మూసివేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త లిక్కర్ పాలసీపై పూర్తిస్థాయి చర్చల తర్వాతే ప్రభుత్వం తుది నిర్ణయం ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

దిగజారుడు రాజకీయాలు ఇంకెంతకాలం?

ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ ఏఐ ఆధారిత వీడియోపై బీజేపీ ధ్వజం

న్యూఢిల్లీ/పట్నా: ప్రధాని మోదీతోపాటు చనిపోయిన ఆయన తల్లిపై ఏఐ ఆధారిత వీడియో విడుదల చేసిన కాంగ్రెస్ తీరుపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ చర్య సిగ్గు చేటు, ఇంకా ఎంతకాలం దిగజారుడు రాజకీయాలను కొనసాగిస్తుందంటూ కడిగిపారేసింది. బిహార్ కాంగ్రెస్ విభాగం శుక్రవారం 'ఎక్స్'లో ప్రధాని మోదీయే లక్ష్యంగా ఒక వీడియో విడుదల చేసింది. అందులో మోదీ తల్లి ఆయన రాజకీయాలను విమర్శిస్తున్నట్లుగా ఉంది. దీనిపై బీజేపీ సీనియర్ నేత రవి శంకర్ ప్రసాద్ మండిపడ్డారు. 'కాంగ్రెస్ ఇంత నీచానికి దిగజారుతుందా? చనిపోయిన ప్రధాని మోదీ తల్లిని కూడా స్వార్థానికి వాడుకునే స్థాయికి కాంగ్రెస్ చేరుకుందా? దీనిపై సోనియా గాంధీ, రాహుల్‌లు స్వయంగా సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ సిగ్గుమాలిన చర్యపై దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. ప్రజల్లో విశ్వసనీయత, నమ్మకం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికీ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. బీజేపీ విమర్శలపై కాంగ్రెస్ ప్రతిదాడికి దిగింది. 'ఒక తల్లి తన కుమారుడికి ఏది మంచో తెలియజెప్పడంపై అభ్యంతరం దేనికి? ఇందులో అగౌరవపర్చడమనే ప్రశ్నేలేదు. తల్లికి గానీ, ఆమె కుమారుడికి గానీ గౌరవమే ఇచ్చాం'అని కాంగ్రెస్ మీడియా విభాగం చీఫ్ పవన్ ఖేడా పేర్కొన్నారు.

తాళపత్ర ప్రతుల డిజిటైజేషన్‌తో పైరసీకి అడ్డుకట్ట: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: మన ప్రాచీన సంప్రదాయ విజ్ఞానాన్ని కాపీ కొట్టి ఇతరులు పేటెంట్ హక్కులు పొందుతున్నారని ప్రధాని మోదీ తెలిపారు. మన ప్రాచీన గ్రంథాల డిజిటైజేషన్‌తో ఇటువంటి మేధోహక్కుల చౌర్యానికి అడ్డుకట్ట వేయవచ్చని ఆయన చెప్పారు. స్వదేశీ, ఆత్మనిర్భర్ భారత్ భావనతో ముందుకు సాగాలనే మన దేశ సంకల్పానికి ఇది కొనసాగింపు అని తెలిపారు. విజ్ఞానభవన్‌లో శుక్రవారం జ్ఞాన భారతంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మాట్లాడారు. మన ప్రాచీన గ్రంథాల్లో అనేక తరాలుగా నిక్షిప్తమై ఉన్న విజ్ఞాన వారసత్వాన్ని మనం ఇప్పుడు ప్రపంచానికి సగర్వంగా ప్రదర్శించుకోగలుగుతున్నామన్నారు. ఇప్పటికే 10 లక్షలకు పైగా ప్రాచీన గ్రంథాల డిజిటైజేషన్ పూర్తయిందని, ఈ క్రతువులో ప్రభుత్వ విభాగాలతోపాటు అనేక ప్రైవేట్ సంస్థలు సైతం పాలుపంచుకుంటున్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో థాయ్‌లాండ్, వియత్నాం, మంగోలియా వంటి దేశాలను కూడా కలుపుకుని పోతున్నామని ప్రధాని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధికంగా కోటి వరకు ప్రాచీన ప్రతులు మన దగ్గర ఉన్నాయన్నారు. ప్రాచీన రాతప్రతులు మన అమూల్య నిధి, మనకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా 500 ఏళ్లనాటి అరుదైన కౌటిల్యుడి అర్థశాస్త్రం, వాల్మీకి రామాయణంలోని సుందరకాండ తదితర తాళపత్ర గ్రంథాల ప్రతులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ప్రధాని మోదీ తిలకించారు.

రాజకీయాల్లో వారసులదే రాజ్యం!

- దేశంలో ప్రతి ఐదుగురు నేతల్లో ఒకరు రాజకీయ వారసులే
- ఏడీఆర్, ఎన్‌ఈడబ్ల్యూ నివేదికలో సంచలన నిజాలు..

సాక్షి, న్యూఢిల్లీ: భారత ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలు బలంగా పాతుకుపోయాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలలో ప్రతి ఐదుగురిలో ఒకరు (21%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారేనని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్‌ఈడబ్ల్యూ) సమగ్ర విశ్లేషణలో తేటతెల్లమైంది. దేశవ్యాప్తంగా మొత్తం 5,204 మంది ప్రజాప్రతినిధులపై విశ్లేషణ చేయగా, వీరిలో 1,107 మంది వారసత్వ నేపథ్యం ఉన్నవారే కావడం గమనార్హం. లోక్‌సభలో ఈ ప్రభావం అత్యధికంగా 31 శాతంగా ఉంది. ముఖ్యంగా, మహిళా ప్రజాప్రతినిధుల్లో ఈ ధోరణి రెట్టింపు కన్నా ఎక్కువగా ఉంది. దాదాపు సగం మంది (47%) వారసత్వంగానే రాజకీయాల్లోకి అడుగుపెట్టారని నివేదిక వెల్లడించింది. వారసత్వ రాజకీయాల వాటాలో ఆంధ్రప్రదేశ్ (34%) దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

రాష్ట్రాల వారీగా తీరిదే..

దేశంలోని రాష్ట్రాలను పరిశీలిస్తే, సంఖ్యాపరంగా ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 141 మంది (23%) ప్రజాప్రతినిధులు రాజకీయ కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. అయితే, మొత్తం ప్రజాప్రతినిధుల్లో వారసుల శాతం పరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ (34%) మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ ప్రతి ముగ్గురిలో ఒకరికి పైగా వారసులే కావడం గమనార్హం. ఆ తర్వాత మహారాష్ట్ర (32%), కర్ణాటక (29%) ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విశ్లేషించిన 255 మంది ప్రజాప్రతినిధులలో 86 మంది (34%) వారసులే. మహారాష్ట్రలో 403 మందిలో 129 మంది (32%), కర్ణాటకలో 326 మందిలో 94 మంది (29%), తెలంగాణ మహిళా ప్రజాప్రతినిధులలో 64% మంది వారసత్వ నేపథ్యం కలవారేనని వెల్లడైంది.

మహిళల ప్రాతినిధ్యంలో అసమానతలు:

రాజకీయాల్లోకి మహిళల ప్రవేశానికి కుటుంబ నేపథ్యం ఒక ముఖ్యమైన మార్గంగా మారుతోందని ఈ నివేదికలోని గణాంకాలు పేర్కొన్నాయి. మొత్తం మహిళా ప్రజాప్రతినిధులలో 47% మంది వారసత్వ నేపథ్యం ఉన్నవారే. పురుషులలో ఈ సంఖ్య కేవలం 18% మాత్రమే. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో 69% మహిళా ప్రతినిధులు, తెలంగాణలో 64% మంది వారసులే కావడం గమనార్హం. రాష్ట్రాల అసెంబ్లీల (20%) కన్నా లోక్‌సభలో (31%) వారసత్వ ప్రభావం ఎక్కువగా ఉంది. జాతీయ రాజకీయాలపై కుటుంబాల పట్టు బిగుస్తున్నట్లు ఇది సూచిస్తోంది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడం, 'గెలుపు గుర్రం'అనే అంశానికి ప్రాధాన్యత ఇవ్వడం, డబ్బు, కండబలం వంటివి వారసత్వ రాజకీయాలకు కారణమవుతున్నాయి. భారతీయ సమాజంలో కుటుంబ సంప్రదాయాలకు ఉన్న ప్రాధాన్యత కూడా వారసులను ఓటర్లు ఆమోదించడానికి ఒక కారణంగా నిలుస్తోంది.

97 లక్షల తుక్కు వాహనాలతో 40 వేల కోట్ల ఆదాయం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని మొత్తం 97 లక్షల కాలం చెల్లిన, కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలను తుక్కుకిందకు మారిస్తే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ రూపంలో రూ.40 వేల కోట్ల మేర ఆదాయం వస్తుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. అంతేకాదు, కొత్తగా 70 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఈ ఏడాదిలో ఆగస్టు వరకు 3 లక్షల పనికిరాని, కాలుష్య వాహనాలను తుక్కుకింద మార్చామని, వీటిలో 1.41 లక్షల వాహనాలు ప్రభుత్వానివేనన్నారు. నెలకు సరాసరిన 16,830 వాహనాలు తుక్కుగా మారుతున్నాయన్నారు. స్క్రాపింగ్ విధానం ఫలితంగా ఆటోమొబైల్ విడివస్తువుల ధరలు కనీసం 25 శాతం తగ్గుతాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ రూ.78 లక్షల కోట్లతో అగ్ర స్థానంలో ఉండగా, రూ.47 లక్షల కోట్లతో చైనా రెండో స్థానంలో, రూ.22 లక్షల కోట్లతో భారత్ మూడో స్థానంలో ఉందన్నారు.

మృత శిశువును ఆస్పత్రి ఆవరణ నుంచి ఎత్తుకెళ్లిన కుక్క

పిలిభిత్(యూపీ): యూపీలోని జిల్లా వైద్య కళాశాల ఆస్పత్రి వద్ద దారుణం చోటుచేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో ఉన్న మృత శిశువును వీధి కుక్క ఒకటి నోట కరుచుకుని వెళ్లిపోయింది. ఘటన నేపథ్యంలో ఆస్పత్రి వద్ద భద్రత ఏర్పాట్లపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేశ్ కుమార్ ఈ ఘటనను ధ్రువీకరించారు. ఖగ్ సరాయ్ గ్రామానికి చెందిన అజయ్ భార్య రేష్మ(25) గురువారం పురిటి నొప్పులతో ఆస్పత్రిలో జాయినయ్యింది. సర్జరీ అనంతరం మృత శిశువును తీసి వైద్యులు కుటుంసభ్యులకు అప్పగించారు. రాత్రి 9 గంటల సమయంలో శిశువు మృతదేహంతో వారు ఆస్పత్రి వెలుపల ఉన్న పార్కులో కూర్చుని ఉండగా వీధి కుక్క వచ్చి మృతదేహాన్ని నోట కరుచుకుని వెళ్లిపోయింది'అని ఆయన వివరించారు. చుట్టుపక్కల వారి వెంటపడటంతో కుక్క ఆ మృతదేహాన్ని కొద్దిదూరంలో వదిలేసి వెళ్లిపోయిందన్నారు. ఈ ఘటనలో ఉద్యోగులు, సిబ్బంది పాత్ర లేనేలేదన్నారు.

మానవ సేవే.. మాధవ సేవ

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772-1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ, ముస్లిం, క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవకోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్డ్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్‌మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్- ఉల్- అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. విలియం బెంటింగ్ రాయ్ ఘనతను గుర్తించి 'రాజా' బిరుదుతో సత్కరించి ఇంగ్లండ్‌కు పంపాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824-1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషులను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి..

1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూమతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతిరాయ్, లాలా హంసరాజ్ మొదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారో రూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గదాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్పుకూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద (1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్రనాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా? అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.

వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.
6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.





దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు. హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటుపడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మాతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు.

ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం



ద్వీపకల్ప ప్రాంతం.. భారతదేశ నైసర్గిక విభాగాల్లో అతి పెద్దది. పశ్చిమాన సహ్యాద్రి కొండలు, తూర్పున తూర్పు కనుమలు, ఉత్తరాన గంగా మైదానం, సరిహద్దులుగా ఉన్న ద్వీకల్ప ప్రాంతం.. దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. ఇది వివిధ పీఠభూములు, కొండలు, నదీలోయలతో కూడి ఉంది. ద్వీపకల్ప భారతదేశ ఉత్తర భాగాన్ని మధ్యమెట్టభూములుగా, దక్షిణ భాగాన్ని దక్కన్ పీఠభూమిగా వ్యవహరిస్తారు. మధ్య మెట్టభూముల ప్రాంతం.. మాళ్వా, బుందేల్‌ఖండ్, బాగేల్‌ఖండ్, ఛోటా నాగ్‌పూర్, మైకాల పీఠభూములు, వింధ్య, సాత్పూరా, అజంతా, బాలాఘాట్, చందేరి, క్రైమూరు, ఆరావళి మొదలైన కొండలతో కూడి ఉంది!!

ద్వీపకల్ప భారతదేశం - నైసర్గిక స్వరూపం

దక్కన్ పీఠభూమి

మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ల్లో దక్కన్ పీఠభూమి విస్తరించి ఉంది. దక్కన్ పీఠభూమిలో బసాల్ట్ రకానికి చెందిన లావాతో ఉన్న ప్రాంతాన్ని దక్కన్ నాపలు అంటారు. పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణాల్లో దక్కన్ నాపలు విస్తరించి ఉన్నాయి. బసాల్టిక్ లావా ఘనీభవించి ఏర్పడ్డ అగ్నిపర్వత శిలలు శిథిలమవడంతో దక్కన్ నాపల ప్రాంతంలో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

ఆరావళి పర్వత శ్రేణులు

ఇవి ద్వీపకల్ప పీఠభూమికి వాయవ్య సరిహద్దులో నైరుతి-ఈశాన్య దిశలో విస్తరించాయి. ఈ శ్రేణులు గుజరాత్‌లోని పాలంపూర్ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించి ఉన్నాయి. ఆరావళి పర్వతాలు పురాతన ముడుత పర్వతాల కోవకు చెందుతాయి. ఇవి ప్రీ కాంబ్రియన్ భౌమ్యయుగంలో ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఇవి ప్రస్తుత హిమాలయాల కంటే విశిష్టంగా ఉండేవని నిపుణుల అంచనా. తర్వాత ఇవి శిథిలమై.. ప్రస్తుతం అవశిష్ట పర్వతాలకు ఉదాహరణగా మిగిలాయి. వింధ్య-సాత్పూరా పర్వతశ్రేణుల మధ్య ఉన్న విదరణ లోయ (Rift valley) ద్వారా నర్మదా నది ప్రవహిస్తోంది. వింధ్య-సాత్పూరా పర్వతశ్రేణులు భ్రంశ/ఖండ పర్వతాలకు మంచి ఉదాహరణలు. వింధ్య పర్వతశ్రేణులను ఆనుకొని ఉన్న మాళ్వా పీఠభూమి గిరిపద పీఠభూములకు మంచి ఉదాహరణ. మైకాల పీఠభూమిలోని అమర్ ఖంటక్ శిఖర ప్రాంతం నుంచి నర్మదా నది ప్రవహిస్తోంది. పశ్చిమ తీరంలోని పశ్చిమ కనుమలు(సహ్యాద్రి కొండలు) మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళల్లో విస్తరించి ఉన్నాయి. కేరళలోని పాల్‌ఘాట్ కనుమను మినహాయిస్తే ఇవి దాదాపు అవిచ్ఛిన్నంగా విస్తరించి ఉన్నాయి.

పశ్చిమ కనుమలు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అన్నామలై, పళని, ఏలకుల కొండల రూపంలో పశ్చిమ కనుమలు వ్యాపించి ఉన్నాయి. పాల్‌ఘాట్ కనుమ వద్ద నీలగిరి కొండలు, పశ్చిమ-తూర్పు కనుమలను అనుసంధానిస్తున్నట్లుగా కనిపిస్తాయి. ఇవి శంఖు ఆకార శిఖరాలను పోలి ఉంటాయి. ఇవి పశ్చిమాన అరేబియా సముద్రం వైపు నిట్రవాలుగా ఉంటాయి. దక్కన్ పీఠభూమి వైపు మెట్లలా తిన్నని వాలులను కలిగి ఉంటాయి. వీటిని 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా అభివర్ణిస్తారు.

తూర్పు కనుమలు

మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో ఉన్న సన్నని థాల్‌ఘాట్, భోర్‌ఘాట్ కనుమల ద్వారా ముంబై-పుణే, ముంబై-ఇండోర్ రైలు, రహదారి మార్గాలు నిర్మించారు. పశ్చిమ కనుమలతో పోలిస్తే తూర్పు కనుమల సగటు ఎత్తు తక్కువ. తూర్పు కనుమలు కూర్చొని ఉన్న ఏనుగుల ఆకారంలో కనిపిస్తాయి. విస్తారమైన వికోషీకరణం వల్ల వీటి శిఖర భాగాలు బోర్లించిన మూకుళ్ల మాదిరిగా ఉంటాయి. తూర్పు కనుమలు మహానది-కృష్ణానది డెల్టాల మధ్య మాత్రమే అవిచ్ఛిన్న పర్వత శ్రేణిగా వ్యాపించాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతంలో సుమారు 150 కిలోమీటర్ల మేర దాదాపు అదృశ్యమవుతాయి. కృష్ణానది డెల్టాకు దక్షిణంగా నల్లమలై, ఎర్రమలై, వెలికొండ పర్వతాలుగా తూర్పు కనుమలు విస్తరించాయి.

నీలగిరి కొండలకు దక్షిణంగా దక్షిణ తమిళనాడులోని షెవరాయి, జాప్వో కొండలను తూర్పు కనుమల విస్తరణలుగా పరిగణిస్తారు. మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి ఒకప్పుడు ద్వీపకల్ప భారతదేశంలో భాగంగా ఉండేది. గారో- రాజ్ మహల్ కొండల మధ్య భూఅవనతం జరగడంతో ఈ భాగం ద్వీపకల్ప భారత ప్రాంతం నుంచి విడిపోయి ఈశాన్య భారతదేశం వైపు వెళ్లింది. అందువల్ల షిల్లాంగ్ పీఠభూమిని ద్వీపకల్ప భారతదేశ అవుట్‌పోస్ట్ అంటారు. ద్వీపకల్ప భారతదేశ పీఠభూములు ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన శిలలు కలిగి ఉన్నాయి. ఆర్కియన్ (ప్రీ కాంబ్రియన్) భౌమ్య యుగానికి చెందిన శిలలు వీటి పునాదులు. వీటి వయసు దాదాపు 2500 మిలియన్ ఏళ్లకు పైనే. ద్వీపకల్ప పీఠభూముల శిలలు అతి కఠినమైన రూపాంతర, అగ్నిశిలల తరగతికి చెందినవి. ద్వీపకల్ప పీఠభూమి పటలం ఏ రకమైన భౌమ్య చలనాలకు గురికాకుండా సుస్థిరంగా ఉండటంతో ఇక్కడ భూకంప ప్రక్రియ జరగడం అరుదు.

మాదిరి ప్రశ్నలు

1. ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) వావుల్‌మాలా బి) అనైముడి
సి) మహేంద్రగిరి డి) హరిశ్చంద్ర
2. దొడబెట్ట కింది ఏ పర్వతశ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) తూర్పు కనుమలు బి) పళని కొండలు
సి) నీలగిరి కొండలు
డి) అన్నామలై కొండలు
3. రాంచీ పీఠభూమి ఏ నైసర్గిక స్వరూపంలో భాగం?
ఎ) మైకాల పీఠభూమి
బి) మాళ్వా పీఠభూమి
సి) బుందేల్‌ఖండ్ పీఠభూమి
డి) ఛోటానాగపూర్ పీఠభూమి
4. ఆరావళి పర్వతశ్రేణులు ఏయే నదీ లోయలను వేరు చేస్తున్నాయి?
ఎ) గంగా-సింధు బి) గంగా-యమున
సి) గంగా-చంబల్ డి) గంగా-సట్లెజ్
5. దక్కన్ నాపల ప్రాంతం ఏ తరగతికి చెందిన శిలలతో ఉంది?
ఎ) గ్రానైట్ బి) సున్నపురాయి
సి) బసాల్ట్ డి) ఇసుకరాయి
6. పచ్‌మాడి వేసవి విడిది కేంద్రం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) సాత్పురా బి) మహాదేవ
సి) వింధ్య డి) బాలాఘాట్
7. గోదావరి, కృష్ణా నదులు ఏ పర్వతాల్లో ఉద్భవిస్తున్నాయి?
ఎ) తూర్పు కనుమలు
బి) అజంతా కొండలు
సి) నీలగిరి కొండలు
డి) సహ్యాద్రి కొండలు
8. దక్కన్ పీఠభూమి ఏ దిశ వైపు వాలి ఉంది?
ఎ) తూర్పు-ఆగ్నేయ బి) ఉత్తర
సి) ఈశాన్య డి) తూర్పు-ఈశాన్య
9. కింది ఏ పర్వతశ్రేణులు భారతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తాయి?
ఎ) వింధ్య పర్వతాలు
బి) సాత్పురా పర్వతాలు
సి) మైకాల డి) అజంతా కొండలు
10. బస్తర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
ఎ) ఒడిశా బి) మధ్యప్రదేశ్
సి) ఛత్తీస్‌గఢ్ డి) కర్ణాటక
11. ద్వీపకల్ప భారతదేశంలోని ఏ ప్రాంతంలో బ్యాడ్ ల్యాండ్ భూ దృశ్యం ఏర్పడింది?
ఎ) మాళ్వా పీఠభూమి
బి) బీగల్ ఖండ్ పీఠభూమి
సి) చంబల్ లోయ డి) సోన్ లోయ
12. ద్వీపకల్ప భారతదేశంలో తీవ్ర స్థాయిలో భూకంపాలు సంభవించే ప్రాంతం?
ఎ) మరఠ్వాడ బి) విదర్భా
సి) బుందేల్ ఖండ్ డి) కచ్
13. దక్కన్ నాపలు సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి?
ఎ) 100 బిలియన్ సంవత్సరాలు
బి) 150 బిలియన్ సంవత్సరాలు
సి) 200 బిలియన్ సంవత్సరాలు
డి) 250 బిలియన్ సంవత్సరాలు
14. షేన్ కొట్టా కనుమ ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) తూర్పు కనుమలు
బి) పశ్చిమ కనుమలు
సి) బాలాఘాట్ పర్వత శ్రేణులు
డి) అజంతా కొండలు
15. ద్వీపకల్ప భారతదేశంలోకెల్లా నిట్రవాలులు కలిగిన పీఠభూమి?
ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
సి) తెలంగాణ డి) అమరఖంటక్
16. ఆంధ్రప్రదేశ్‌లో సుప్రసిద్ధ శ్రీశైలం పుణ్యక్షేత్రం ఏ కొండల్లో ఉంది?
ఎ) ఎర్రమలై బి) నల్లమలై
సి) శేషాచలం డి) వెలిగొండ
17. గురు శిఖర్ ఏ పర్వత శ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) వింధ్య బి) సాత్పూరా
సి) ఆరావళి డి) తూర్పు కనుమలు
18. భారతదేశంలోని ఏ ప్రాంతంలో అతి పురాతన శిలలు లభ్యమవుతున్నాయి?
ఎ) హిమాలయాలు
బి) పూర్వాంచల్ కొండలు
సి) గంగా మైదానం
డి) ద్వీపకల్ప పీఠభూమి
19. మాళ్వా పీఠభూమి ఏ దిశగా వాలి ఉంది?
ఎ) ఉత్తర బి) దక్షిణ
సి) తూర్పు డి) పడమర
20. పెంద్రా పీఠభూముల్లో ఏ నది ఉద్భవిస్తోంది?
ఎ) చంబల్ బి) సోన్
సి) దామోదర డి) తపతి
21. సహ్యాద్రి కొండల్లో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) అనైముడి బి) త్రయంబక్
సి) వావుల్ మలై డి) హరిశ్చంద్ర
22. రాజమహల్ కొండలు ఏ పీఠభూమిలో భాగం?
ఎ) ఛోటా నాగపూర్ బి) దక్కన్
సి) షిల్లాంగ్ డి) బస్తర్

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) ఎ; 5) సి; 6) డి; 7) డి; 8) ఎ; 9) ఎ; 10) సి; 11) సి; 12) డి; 13) ఎ; 14) బి; 15) ఎ; 16) బి; 17) సి; 18) డి; 19) ఎ; 20) బి; 21) సి; 22) ఎ.

అష్ట సూత్ర పథకం నుంచి తెలంగాణ ఏర్పాటు దాకా..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

కాంగ్రెస్ పార్టీ



కాంగ్రెస్ పార్టీ 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించింది. దేశంలోనే పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ భారత్‌ను ఎక్కువ కాలం పాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 38 ఏళ్లపాటు పరిపాలన సాగించారు.

- జవహర్‌లాల్ నెహ్రూ 16 సంవత్సరాల 286 రోజులు, ఇందిరా గాంధీ 15 సంవత్సరాల 350 రోజులు(రెండు పర్యాయాలు), రాజీవ్ గాంధీ 5 సంవత్సరాల 32 రోజులు ప్రధానిగా పనిచేశారు.
- కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ సుమారు 42 ఏళ్లపాటు (1956-83, 1989-94, 2004-14) అధికారంలో ఉంది.
- 1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈయనే తెలంగాణకు చెందిన తొలి ముఖ్యమంత్రి. పీవీ తర్వాత మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరెవరూ పూర్తి కాలం పదవిలో కొనసాగలేదు.

ఉద్యమంలో కాంగ్రెస్ పాత్ర

- 1956-83 వరకు ఏపీ కాంగ్రెస్‌లో వైరివర్గాల ఆధిపత్యమే కొనసాగింది. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆ ప్రాంత కాంగ్రెస్ నేతలు కీలక పాత్ర పోషించారు.
- ఉద్యమాన్ని శాంతింపజేసేందుకు 1969 ఏప్రిల్ 11న ఢిల్లీలో అష్టసూత్ర పథకాన్ని ప్రకటించారు. 1971లో చెన్నారెడ్డి అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రజాసమితి పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించింది. తెలంగాణలోని 14 పార్లమెంట్ స్థానాల్లో పదింటిని టీపీఎస్ అభ్యర్థులు గెలుచుకున్నారు. కాంగ్రెస్ దారుణంగా ఓటమి పాలైంది.
- ముల్కీ నిబంధనలు చెల్లుబాటు అవుతాయని 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ప్రారంభమైంది.

కాంగ్రెస్ (ఐ) ఏర్పాటు

- ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని 1972 నవంబర్ 27న ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించారు. వెంటనే పంచసూత్ర పథకాన్ని విడుదల చేశారు. అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కాసు బ్రహ్మానందరెడ్డికి ఇందిరా గాంధీతో అభిప్రాయభేదాలు వచ్చాయి. పార్టీని చీల్చేందుకు ప్రయత్నించారు. ఇందిరా గాంధీ 1978 జనవరి 1న కాంగ్రెస్ (ఐ)ను స్థాపించారు.
- అదే సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి 'రెడ్డి కాంగ్రెస్'ను స్థాపించారు.
- 2000లో జి.చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియా గాంధీకి వినతిపత్రం ఇచ్చారు.
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్, వామపక్ష పార్టీలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని చేర్చింది. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలోనూ యూపీఏ ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది.
- 2004 జూన్ 7న రాష్ట్రపతి ప్రసంగించారు. యూపీఏ ప్రభుత్వం ఆ ప్రసంగంలోనూ తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణపై విస్తృత అంగీకారం కోసం ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన 2004 నవంబర్‌లో కేంద్రం ఒక ఉపసంఘాన్ని నియమించింది.
- ఉద్యమం తీవ్రం కావడంతో తెలంగాణ ఏర్పాటుపై అభిప్రాయాలు స్వీకరించడానికి వైఎస్ ప్రభుత్వం 2008లో రోశయ్య కమిటీని నియమించింది.
- 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలో దిగింది. అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తామని ఆ పార్టీ ప్రచారం చేసింది.
- ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 156 స్థానాల్లో విజయం సాధించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తూ 2009 సెప్టెంబర్ 2న నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మరణించారు.
- 2009 సెప్టెంబర్ 3న రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 2009 అక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో తెలంగాణవాదుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 2009 అక్టోబర్ 13న రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.
- 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారు. తెలంగాణలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. 2009 డిసెంబర్ 7న సచివాలయంలో రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం, ఎంఐఎం తప్ప ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన పార్టీలన్నీ తెలంగాణకు మద్దతిచ్చాయి.

అఖిలపక్ష సమావేశం

- 2009 డిసెంబర్ 9న రాత్రి 11.30 గంటలకు హోంమంత్రి చిదంబరం తెలంగాణపై ప్రకటన చేశారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారు' అని చిదంబరం పేర్కొన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాతే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని డిసెంబర్ 23న మరో ప్రకటనలో పేర్కొన్నారు.
- రెండో ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు మొదలయ్యాయి.
- తెలంగాణకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు రాజీనామా చేయకపోవడం పట్ల ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు, జేఏసీ నేతలు 2010 ఫిబ్రవరి 14న మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇళ్లపై దాడి చేశారు.
- కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ తరఫున ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆంధ్రా తరఫున కావూరి సాంబశివరావు హాజరయ్యారు.

శ్రీకృష్ణ కమిటీ



- 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించారు. 2010 ఫిబ్రవరి 19న రాజకీయ జేఏసీ నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చింది. రాష్ట్రంలో ఆందోళనల నేపథ్యంలో కేంద్రం రోశయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించింది. 2010 నవంబర్‌లో ఆయన స్థానంలో స్పీకర్ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించింది.
- విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 2010 డిసెంబర్ 26న గన్‌పార్క్ వద్ద దీక్ష చేశారు. అదే నెల 30న శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్ర హోంశాఖకు సమర్పించింది.
- 2011 జనవరి 6న కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ నివేదికను బహిర్గతం చేసింది.
- శ్రీకృష్ణ కమిటీ సమైక్యాంధ్రకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చింది. దీంతో తెలంగాణలో ఆందోళనలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పాటుపై ఆలస్యానికి నిరసనగా జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 3న మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2011 జూన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా డి. శ్రీనివాస్ స్థానంలో బొత్స సత్యనారాయణను నియమించారు. ఈ ఘటనతో సీఎం, స్పీకర్, పీసీసీ అధ్యక్షుడి లాంటి మూడు కీలక పదవులు ఆంధ్రా ప్రాంతానికే దక్కాయి.
- 2011 అక్టోబర్ 1న నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2012 డిసెంబర్ 28న హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. 2013 జూన్ 30న హైదరాబాద్‌లో తెలంగాణ సాధన సభ పేరుతో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించింది.

ఎంఐఎం



- హైదరాబాద్ కేంద్రంగా ఎంఐఎం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
- ప్రస్తుత అసెంబ్లీలో ఈ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.
- తెలంగాణ ఉద్యమానికి ఎంఐఎం దూరంగానే ఉంది.
- 2010 జనవరి 5న ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఎంఐఎం అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.
- తెలంగాణ ఏర్పడితే మతతత్వ శక్తులు విజృంభిస్తాయనే భయాన్ని వారు వెలిబుచ్చారు.
- 2013 నవంబర్ 12, 13 తేదీల్లో రాష్ట్ర విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి ఎంఐఎం తన సూచనలు, సలహాలు అందజేసింది.
- 2014 జనవరి 20న ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ విభజన బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో కోస్తాంధ్ర పాత్ర ఏమీలేదని, నిజాం కాలం నుంచే హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గణాంకాలతో సహా వివరించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు మొగ్గు చూపారు.

రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

- 2013 జూలై 11న ఢిల్లీలో కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తెలంగాణపై చర్చ జరిగింది. 2013 జూలై 30న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2013 ఆగస్టు 5న చిదంబరం పార్లమెంటులో ప్రకటించారు. ఆగస్టు 6న ఆంటోని నేతృత్వంలో అంతర్గతంగా విభజన కమిటీ ఏర్పాటైంది. దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అహ్మద్ పటేల్ ఈ కమిటీలో సభ్యులు. 2013 అక్టోబర్ 8న ఎ.కె. ఆంటోనీ చైర్మన్‌గా కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు.
- 2013 డిసెంబర్ 5న 'తెలంగాణ ముసాయిదా బిల్లు 2013'ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు డిసెంబర్ 12న రాష్ట్రానికి చేరింది. డిసెంబర్ 15న బిల్లు ప్రతులను ఎమ్మెల్యేలకు అందజేశారు. తర్వాతి రోజు చర్చ ప్రారంభమైంది. 2014 జనవరి 22న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.
- సభలో 87 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. మిగతా సభ్యులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై చర్చ ముగిసిందంటూ 2014 జనవరి 30న స్పీకర్ ప్రకటించారు.
- పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఫిబ్రవరి 9న ఆంధ్రాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసానికి కారణమైన పదకొండు మంది ఎంపీలను ఫిబ్రవరి 11న కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఫిబ్రవరి 14న కాంగ్రెస్ ఎంపీ లగడపాటి రాజగోపాలరెడ్డి లోక్‌సభలో పెప్పర్ స్ప్రేతో దాడిచేశారు.
- ఈ సందర్భంగా 16 మంది ఆంధ్రప్రదేశ్ ఎంపీలను స్పీకర్ మీరాకుమార్ లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. 2014 ఫిబ్రవరి 13న యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- 2014 ఫిబ్రవరి 18న తెలంగాణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఫిబ్రవరి 20న యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఆ రోజే బిల్లు ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేశారు. మార్చి 2న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.
- జూన్ 2ను అపాయింటెడ్ డేగా కేంద్రం 2014 మార్చి 4న ప్రకటించింది.
- దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

Another term for hyperlink is..



BANK EXAMS

COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
   1) Folder 2) Pod 3) Version
   4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
   1) System menu
   2) Address bar 3) Menu bar
   4) Tool bar
   5) None of the above
3. A ______ is a set of computer instructions that carry out a task on the computer.
   1) Program 2) Database
   3) Memory file4) Folder
   5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
   1) Home Edition
   2) Media Center Edition
   3) Tablet PC Edition
   4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
   1) user-happy 2) user-simple
   3) user-friendly 4) Interface
   5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
   1) Right-clicking
   2) Left-clicking
   3) Either 1 or 2
   4) All of the above
   5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
   1) Link 2) Source
   3) Bar 4) All of the above
   5) None of the above
8. A graphical user interface displays________
   1) Graphics 2) Text
   3) Both 1 and 2
   4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
   1) Win Zip 2) Win Shrink
   3) Win Style 4) Win small
   5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is ________.
    1) Queue 2) Linked list
    3) Doubly linked list
    4) Binary tree
    5) None of the above
11. Caps lock, Num-lock are known as _______.
    1) Modifier key2) Toggle key
    3) Function key 4) Numeric key
    5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
    1) Static RAM
    2) Dynamic RAM 3) EPROM
    4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in _____
    1) China 2) USA 3) India
    4) England 5) None of these
14. A result of a computer virus can not lead to_______.
    1) Disk Crash
    2) Mother Board Crash
    3) Corruption of program
    4) Deletion of files
    5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
    1) Begin the line with a # sign
    2) Begin the line with double slashes (/ /)
    3) Begin and end the line with double hyphens (-_-)
    4) Indent the line
    5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
    1) 4GLs 2) Macro languages
    3) Procedure-oriented languages
    4) Visual programming languages
    5) None of these
17. Firewalls are used to protect against _______.
    1) Unauthorized Attacks
    2) Virus Attacks
    3) Data Driven Attacks
    4) Fire Attacks
    5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
    1) Management 2) Processing
    3) Utility 4) Application
    5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
    1) Factory 2) Operating room
    3) Waiting room
    4) Planning room
    5) None of these
20. The CPU and memory are located on the ________.
    1) Expansion board
    2) Motherboard
    3) Storage device
    4) Output device
    5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
    1) Application software
    2) System software
    3) Operating system software
    4) Platform software
    5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
    1) <ahref> 2) <a> 3) <link>
    4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
    1) Insert 2) Format 3) Edit
    4) Tools 5) None of these
24. A half byte is known as_______.
    1) Data 2) Bit 3) Half byte
    4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
    1) Modern 2) Interface
    3) Clue 4) Data bus
    5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
    1) POS 2) RFID 3) PPS
    4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
    1) HTML 2) MP3 3) MPEG
    4) MIDI 5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1	5) 3
6) 1	7) 1	8) 3	9) 1	10) 3
11) 2	12) 2	13) 3	14) 2	15) 2
16) 4	17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 4	25) 2
26) 2	27) 4			